

ఈనాడు




విజయవాడ 14-10-2024 సోమవారం సిటీ సంపుటి 51 . సంచిక 64
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 12
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

డిజిటల్‌గా దోపిడీ

- 'కోర్టు రూమ్ డ్రామా'తో దందా
- కేసుల పేరుతో బెదిరింపులు
- రూ.కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లు
- రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఘటనలు
- అవగాహన, అప్రమత్తతతోనే అడ్డుకట్ట

'అరెస్టు' పేరిట దగా



విజయవాడలో ఓ వైద్యురాలికి కొన్ని రోజుల కిందట ముంబయి పోలీసు పేరిట ఓ ఫోన్‌కాల్ వచ్చింది. 'మీ బ్యాంకు ఖాతా ద్వారా పెద్ద మొత్తంలో మోసపూరిత లావాదేవీలు జరిగాయి. మీపై మనీ లాండరింగ్ కేసు నమోదైంది. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం. ఈ క్షణం నుంచి మీరు వీడియోకాల్‌లో మా నిఘాలోనే ఉండాలి. ఈ విషయం ఎవరికైనా చెప్పినా, మా అనుమతి లేకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లినా మిమ్మల్ని అరెస్టు చేయటానికి మీ ఇంటి చుట్టూ పోలీసులు సిద్ధంగా ఉన్నారు. ఈ కేసు నుంచి బయటపడాలంటే మీ ఖాతాల్లో ఎంత సొమ్ము ఉందో మాకు పంపించండి' అంటూ బెదిరించారు. ఇదంతా నిజమేనని నమ్మిన ఆ వైద్యురాలు.. తన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు ఖాతాల్లో ఉన్న సొమ్ము దాదాపు రూ.85 లక్షలు సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాలకు వేశారు. ఆ తర్వాత వారి ఫోన్లు స్విచాఫ్ కావటంతో మోసపోయానని గ్రహించారు.

ఈనాడు - అమరావతి

గత రెండు, మూడు నెలల్లో రాష్ట్రంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగాయి. ప్రధానంగా వైద్యులు, న్యాయవాదులు, పారిశ్రామికవేత్తలు, బ్యాంకు ఖాతాల్లో ఎక్కువ నిల్వలున్న వారిని అందులోనూ ప్రధానంగా వృద్ధుల్ని లక్ష్యంగా చేసుకుని ఈ మోసాలకు తెగబడుతున్నారు. నిజంగానే ఏ సీబీఐ అధికారో, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారో కాల్ చేసి మాట్లాడుతున్నట్లుగానే నమ్మించి.. ఒక్క క్షణం కూడా ఆలోచించేందుకు అవకాశమివ్వకుండా కేసులు, డిజిటల్ అరెస్టులు, కోర్టు విచారణల పేరిట భయపెట్టి, బెదిరించి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ... వివరాలు 3లో

నకిలీ పోలీసుస్టేషన్లు.. కోర్టు హాల్ సెట్లతో బురిడీ

- సీబీఐ, ఈడీ, పోలీసు అధికారులమని నమ్మించేందుకు సైబర్ నేరగాళ్లు నకిలీ పోలీసుస్టేషన్ల సెట్లు వేస్తున్నారు. పోలీసు యూనిఫాం ధరించి వాటిలో కూర్చొంటున్నారు. అక్కడి నుంచి బాధితులకు వీడియోకాల్స్ చేసి డిజిటల్ అరెస్టులు చేశామని బెదిరిస్తున్నారు. దీంతో బాధితులు వారు పోలీసులేనని నమ్మేసి అడిగినంత సొమ్ము చెల్లించేస్తున్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని వీడియోకాల్స్‌లో నకిలీ పోలీసుస్టేషన్‌ను చూపించి ఓ వైద్యుడి నుంచి రూ.2 కోట్లు దోచేశారు.
- మరికొందరు సైబర్ నేరగాళ్లు ఏకంగా కోర్టు హాల్ సెట్ వేసేస్తున్నారు. నిజంగానే అక్కడ విచారణ జరుగుతున్నట్లు సృష్టిస్తున్నారు. బాధిత వ్యక్తిని డిజిటల్ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు.. వీడియోకాల్‌లోనే విచారణ చేసినట్లు, బెయిల్ తిరస్కరించినట్లు హంగామా సృష్టిస్తున్నారు. కోర్టు పేరుతో నకిలీ ఆదేశాలు సృష్టించి దోచుకుంటున్నారు. ప్రఖ్యాత వర్ధమాన్ గ్రూపు సంస్థల సీఎండీ ఎస్పీ ఓస్వాల్ ఇటీవల ఇలాంటి మోసం బారిన పడి రూ.7 కోట్లు సైబర్ నేరగాళ్లకు చెల్లించారు.

డిజిటల్ అరెస్టు.. పక్కా మోసం

'ఏ నేరంలోనైనా సరే డిజిటల్ అరెస్టు ఉండదు. అలా ఎవరైనా చెబుతుంటే అది పక్కా మోసం. అలాంటి వారి ఉచ్చులో చిక్కుకోవద్దు. వారు చెప్పిన ఖాతాల్లోకి నగదు బదిలీ చేయొద్దు. వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయండి' అని ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) చెబుతోంది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

4 రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలకు అవకాశం

రాయలసీమలోని పలు ప్రాంతాలకు అత్యంత భారీ వర్ష సూచన

ఈనాడు - విశాఖపట్నం

ఆగ్నేయ బంగాళాఖాతం, పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో సోమవారం నాటికి దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకులు స్టెల్లా తెలిపారు. రెండు రోజుల్లో తీవ్ర అల్పపీడనంగా బలపడి.. ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా (ఏపీ) వైపు పయనిస్తుందన్నారు. ఇది తుపానుగా బలపడే అవకాశముందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో సోమవారం నుంచి గురువారం వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలకు అవకాశముందని పేర్కొంది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. పిడుగులు పడే అవకాశం ఉండటంతో పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల (మిగతా 2లో)



సోమవారం: కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం

మంగళవారం: బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, శ్రీసత్యసాయి జిల్లాలకు భారీ నుంచి అతిభారీ వర్ష సూచన

బుధవారం: బాపట్ల, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్, నెల్లూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు

గురువారం: విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, ప్రకాశం, కర్నూలు, నెల్లూరు, వైఎస్సార్, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు



3 ప్రధాన కేసులు సీఐడీకి బదిలీ

- తెదేపా కార్యాలయం, చంద్రబాబు ఇంటిపై దాడి
- సినీనటి కాదంబరీ జెత్వానీ కేసు కూడా..
- ఆదేశాలు జారీ చేసిన డీజీపీ ద్వారకా తిరుమలరావు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పోలీసుల దర్యాప్తులో ఉన్న మూడు ప్రధానమైన కేసులను సీఐడీ చేతికి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వైకాపా అధికారంలో ఉన్న సమయంలో మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంపై, ఉండవల్లిలోని చంద్రబాబు ఇంటిపై జరిగిన దాడి ఘటనలతో పాటు.. సంచలనం సృష్టించిన సినీనటి కాదంబరీ జెత్వానీ కేసునూ సీఐడీకి అప్పగిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలు జారీచేశారు. ఈ మూడు కేసులనూ ఇప్పటివరకు స్థానిక పోలీసులే దర్యాప్తు చేస్తున్నారు. డీజీపీ ఆదేశాలతో ఈ కేసులకు సంబంధించిన రికార్డులు అన్నింటినీ సీఐడీకి అప్పగించనున్నారు. తెదేపా కార్యాలయంపై, చంద్రబాబు ఇంటిపై జరిగిన దాడుల కేసులపై వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించగా.. కూటమి అధికారంలోకి వచ్చాక విచారణ వేగం పుంజుకుంది. మరోవైపు కాదంబరీ జెత్వానీ కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారుల ప్రమేయం ఉన్నట్లు తెలియడం, సీఎంఓలోనే కుట్రకు ప్రణాళిక రచించినట్లు ఆరోపణలు రావడంతో దీనివెనుక సూత్రధారులను కనిపెట్టాలంటే సీఐడీ దర్యాప్తు అవసరమని ప్రభుత్వం భావించింది. ... వివరాలు 3లో

గ్రామాల అభివృద్ధికి నేడు తొలి అడుగు



ఈనాడు - అమరావతి


రాష్ట్రంలో గత ఐదేళ్లూ తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గ్రామాల అభివృద్ధికి సోమవారం అడుగు పడనుంది. 'పల్లెపండగ' వారోత్సవాల్లో భాగంగా రూ.4,500 కోట్లతో చేపట్టే 30 వేల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. కృష్ణా జిల్లా కంకిపాడులో నిర్వహించే కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్ కల్యాణ్ పాల్గొననున్నారు. కంకిపాడులోని ప్రభుత్వ ఆసుపత్రి పక్కన మైదానంలో జరిగే

రూ.4,500 కోట్లు.. 30 వేల పనులు

కంకిపాడులో 'పల్లెపండగ'కు ఉపముఖ్యమంత్రి పవన్ హాజరు

ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. మిగిలిన అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 20 వరకు కొనసాగే ఈ వారోత్సవాల్లో 30 వేల పనులకు శంకుస్థాపనలు చేయించి, సంక్రాంతి లోగా పనులు పూర్తి చేయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉపాధిహామీ పథకంలోని మెటీరియల్ నిధులతో గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై గత ఆగస్టు 23న 13,326 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేయించిన విషయం తెలిసిందే. 3 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, మరో 500 కిలోమీటర్ల తారు రోడ్లు, 25 వేల గోకులాలు, 10 వేల వాన నీటి సంరక్షణ కందకాలకు పల్లెపండగ వారోత్సవాల్లో శంకుస్థాపనలు చేయనున్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత



- నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి
- పలువురు నేతలు, ప్రజాసంఘాల ప్రతినిధుల సంతాపం
- నేడు గాంధీ ఆసుపత్రికి భౌతికకాయం అప్పగింత

ఈనాడు, హైదరాబాద్: విద్యావేత్త, మానవ హక్కుల కార్యకర్త, ప్రొఫెసర్ గోకరకొండ నాగ(జీఎన్) సాయిబాబా(57) శనివారం కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా గత నెల 19న ఆయన నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. పిత్తాశయం(గాల్‌బ్లాడర్)లో రాళ్లు ఉన్నాయని గుర్తించిన వైద్యనిపుణులు సెప్టెంబరు 26న శస్త్రచికిత్స చేసి.. వాటిని తొలగించారు. ఆసుపత్రిలోనే ఉన్న ఆయన ఆరోగ్యం శనివారం అకస్మాత్తుగా క్షీణించింది. రాత్రి 8.30 గంటలకు మృతి చెందారని వైద్యులు ప్రకటించారు. సాయిబాబా కోరిక మేరకు హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యవిజ్ఞాన సంస్థకు ఆయన కళ్లను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఆయన భౌతికకాయాన్ని సోమవారం సాయంత్రం 4 గంటలకు గాంధీ ఆసుపత్రి అధికారులకు అప్పగిస్తామని సాయిబాబా సోదరుడు రాందేవ్ తెలిపారు. 'జైల్లో అక్రమ నిర్బంధం కారణంగానే సాయిబాబా తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. చికిత్స చేయించాలని జైలు అధికారులను ప్రాధేయపడినా వినలేదు. అందుకే ఆయనకు పిత్తాశయంలో రాళ్లు ఏర్పడ్డాయి. మెదడులో చిన్న కణితి ఏర్పడింది. ఎడమ చేయి నరాలు దెబ్బతిన్నాయి. జైలు నుంచి విడుదలయ్యాక పిత్తాశయంలో రాళ్ల కారణంగా రెండుసార్లు తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. చికిత్స అందించి.. (మిగతా 2లో)

నింగిలోకి దూసుకెళ్లి.. లాంచ్‌ప్యాడ్‌కే తిరిగొచ్చి..

స్టార్‌షిప్ రాకెట్ బూస్టర్‌ను సురక్షితంగా ఒడిసిపట్టిన భారీ మరహస్తాలు

చరిత్ర సృష్టించిన స్పేస్‌ఎక్స్

టెక్సాస్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్పేస్‌ఎక్స్' సంస్థ అంతరిక్ష ప్రయోగ రంగంలో సరికొత్త ఘనత సాధించింది. ఆ సంస్థ తాజాగా ప్రయోగించిన భారీ స్టార్‌షిప్ రాకెట్ బూస్టర్ నింగిలోకి దూసుకెళ్లి.. ఆ తర్వాత లాంచ్‌ప్యాడ్(లాంచ్ టవర్)కే సురక్షితంగా చేరుకుంది. ఇదో ఇంజినీరింగ్ అద్భుతమంటూ సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. (మిగతా 2లో)



నింగిలోకి దూసుకెళ్తున్న స్టార్‌షిప్ రాకెట్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రత్న, పోలీసు అధికారులు

వలస కూలీలపై కామాంధుల పైశాచికం

- తండ్రీకుమారులను బెదిరించి అత్తాకోడళ్లపై అత్యాచారం
- శ్రీసత్యసాయి జిల్లాలో అర్ధరాత్రి ఘాతుకం
- నిందితులు ఆరుగురు.. వారిలో ముగ్గురు మైనర్లు?

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, హిందూపురం, చిలమత్తూరు: పొట్టకూటి కోసం కర్ణాటక నుంచి వచ్చిన వలస కూలీలపై కామాంధులు పైశాచికత్వం చూపించారు. అర్ధరాత్రి వేళ కత్తులతో బెదిరించి అత్తాకోడళ్లపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరులో దసరా పండగ రోజు జరిగిన ఈ అమానవీయ ఘటనపై పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. కర్ణాటకలోని బళ్లారికి చెందిన ఓ కుటుంబం ఉపాధి కోసం 5 నెలల కిందట చిలమత్తూరు మండలంలోని నల్లబొమ్మనపల్లికి వచ్చింది. తల్లిదండ్రులు, కుమారుడు, కోడలు నిర్మాణంలో ఉన్న ఓ పేపర్ మిల్లులో పనిచేస్తున్నారు. మిల్లు పక్కనే తాత్కాలికంగా రేకుల షెడ్డు వేసుకుని నివసిస్తున్నారు. శుక్రవారం పని ముగించుకొని షెడ్డులో (మిగతా 2లో)

కవరైపెట్టై రైలు ప్రమాదంలో కుట్ర కోణం?

- భాగమతి ఎక్స్‌ప్రెస్‌కు ముందు సరిగానే వెళ్లిన మరో రైలు
- విడివిడిగా విచారణ చేపట్టిన ఎన్ఐఏ, రైల్వే విభాగాలు

ఈనాడు - చెన్నై

తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా కవరైపెట్టై రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రైలు ప్రమాదంపై భిన్న కోణాల్లో విచారణ మొదలైంది. సాంకేతిక లోపమా? సిగ్నలింగ్ వైఫల్యమా? కుట్ర కోణమా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా.. అన్నది తేల్చేందుకు ఎన్ఐఏ, రైల్వే భద్రతా విభాగాలు విచారణ చేపట్టాయి. కర్ణాటకలోని మైసూరు నుంచి బిహార్‌లోని దర్భంగాకు బయల్దేరిన భాగమతి ఎక్స్‌ప్రెస్ (12578) కవరైపెట్టై సమీపంలో ప్రధాన లైన్‌లో కాకుండా, లూప్‌లైన్‌లోకి వెళ్లి గూడ్స్‌రైలును ఢీకొన్న ఈ దుర్ఘటనలో ప్రాణనష్టం జరగకపోయినా, పలువురు గాయపడ్డారు. 12 బోగీలు గాల్లోకి లేచి చెల్లాచెదురుగా పడ్డాయి.



ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిన బోగీలు

విచారణ నిమిత్తం రంగంలోకి దిగిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు శని, ఆదివారాల్లో ఘటనాస్థలిని పరిశీలించారు. జాగిలాలను రప్పించి, ఆధారాలు సేకరించారు. గతేడాది ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన ప్రమాదం కూడా ఇదే తరహాలోనే ఉండటంతో తాజా దుర్ఘటన వెనుక ఎవరి ప్రమేయమైనా ఉందా అన్న కోణంలో కూపీ లాగుతున్నారు. రైల్వేస్టేషన్‌లో రికార్డయిన డేటా లాగర్‌ను తీసుకొని, ప్రమాదానికి ముందు, తర్వాత ఏం జరిగిందో పరిశీలించారు. ప్రమాదానికి 7 నిమిషాల ముందు పొన్నేరి నుంచి కవరైపెట్టై స్టేషన్ మీదుగా గుమ్మిడిపూండి వైపు ఓ రైలు వెళ్లింది. అది ఎక్కడా లూప్‌లైన్‌లోకి వెళ్లలేదు. తర్వాత వచ్చిన భాగమతి ఎక్స్‌ప్రెస్ మాత్రం ప్రధాన లైనులో గ్రీన్ సిగ్నల్ ఉన్నా, లూప్‌లైన్‌లోకి వెళ్లి, గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఈ 7 నిమిషాల్లో లోపం ఎక్కడ జరిగిందో (మిగతా 2లో)

(c) eenadu

నింగిలోకి దూసుకెళ్లి.. లాంచ్‌ప్యాడ్‌కే తిరిగొచ్చి..

(మొదటి పేజీ తరువాయి)

తాజా ప్రయోగంలో భాగంగా- టెక్సాస్‌లో మెక్సికో సరిహద్దుకు సమీపం నుంచి ఆదివారం ఉదయం రెండు దశల (బూస్టర్, వ్యోమనౌక) స్టార్‌షిప్ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. దాని పొడవు 121 మీటర్లు. అందులోని బూస్టర్ పొడవు 71 మీటర్లు. నింగిలోకి ఎగిరిన 7 నిమిషాల తర్వాత బూస్టర్ కిందకు దిగుతూ లాంచ్‌టవర్‌కు తిరిగొచ్చింది. చాప్‌స్టిక్స్‌లా పని చేసే తన భారీ మరహస్తాలతో లాంచ్‌టవర్ దాన్ని పదిలంగా ఒడిసిపట్టి చరిత్ర సృష్టించింది. ఆ ప్రక్రియ విజయవంతంగా పూర్తవగానే స్పేస్‌ఎక్స్ ఉద్యోగులు ఆనందంతో కేరింతలు కొట్టారు. మరోవైపు- స్టార్‌షిప్ రాకెట్‌తో నింగిలోకి దూసుకెళ్లిన వ్యోమనౌక తన ప్రయాణాన్ని కొనసాగించి, హిందూ మహాసముద్రంలో విజయవంతంగా దిగింది.


బూస్టర్‌ను మరహస్తాలతో సురక్షితంగా ఒడిసిపడుతున్న లాంచ్‌ప్యాడ్

భలే ఆదా..

స్పేస్‌ఎక్స్ సంస్థ తమ బూస్టర్లను తిరిగి సేకరించడం కొత్తేమీ కాదు. ఫ్లోరిడా లేదా కాలిఫోర్నియాల నుంచి నింగిలోకి దూసుకెళ్లి.. ఉపగ్రహాలు/వ్యోమగాములను కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత భూమికి తిరిగొచ్చే ఫాల్కన్-9 రాకెట్ల బూస్టర్లను తొమ్మిదేళ్లుగా అది రికవరీ చేస్తూనే ఉంది. అయితే మహాసముద్రాల్లో ఏర్పాటుచేసిన తేలియాడే ప్లాట్‌ఫాంలపై లేదా కాంక్రీటు స్లాబ్‌లపై అవి ల్యాండయ్యేవి. ఆ ప్లాట్‌ఫాంలు లాంచ్‌ప్యాడ్‌లకు అనేక మైళ్ల దూరంలో ఉంటాయి. బూస్టర్ నేరుగా లాంచ్‌ప్యాడ్‌కే తిరిగిరావడం మాత్రం ఇదే తొలిసారి. ఫాల్కన్ బూస్టర్లను రీసైక్లింగ్ చేయడం ద్వారా స్పేస్‌ఎక్స్ తన ప్రయోగాల వేగం పెంచింది. రూ.కోట్ల కొద్దీ డబ్బును ఆదా చేసుకుంది. స్టార్‌షిప్ రాకెట్ల విషయంలోనూ అలాగే చేయాలని మస్క్ యోచిస్తున్నారు. స్టార్‌షిప్ ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత శక్తిమంతమైన రాకెట్. చంద్రుడిపైకి, అంగారకుడిపైకి వ్యోమగాములు, అవసరమైన సరకులను పంపించేందుకు స్టార్‌షిప్ రాకెట్‌ను ఉపయోగించుకోవాలని స్పేస్‌ఎక్స్ భావిస్తోంది.

సేవల కోసం ఎగిరొస్తున్న డ్రోన్లు

- అందుబాటులోకి అత్యుత్తమ సాంకేతికత
- వివిధ శాఖలకు ఈ సేవల అనుసంధానంపై ప్రభుత్వం దృష్టి
- అంతర్జాతీయ డ్రోన్ సమిట్ నిర్వహణ లక్ష్యం

☛ రాష్ట్రంలో వివిధ పంటల సాగు పరిస్థితి ఏంటి? తెగుళ్లు ఏ స్థాయిలో ఉన్నాయి? తదితర అంశాలపై రియల్‌టైం విధానంలో తెలుసుకుంటే నష్టాన్ని నివారించవచ్చు.

☛ ఇటీవల విజయవాడ వరదల్లో సహాయక చర్యల్లో ఆహారం, మందులను పంపేందుకు ప్రభుత్వం డ్రోన్లను వినియోగించడం ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరింది.

ఈనాడు, అమరావతి: డ్రోన్ల తయారీ.. విస్తరణ.. సేవల వినియోగానికి సహకారం. సృజనాత్మకత పెంపొందించడమే లక్ష్యంగా ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడలో 'అమరావతి డ్రోన్ సమిట్-2024'ను ప్రభుత్వం నిర్వహిస్తోంది. పౌర సేవల్లో డ్రోన్ సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. డ్రోన్ల రంగంలో అత్యాధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని.. ఇందుకు వీటిని ఒక వేదికపైకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం కొన్ని విభాగాలకే పరిమితమైన డ్రోన్ సేవలను ఇతర శాఖలకూ విస్తరించనుంది. ఈ రంగంలో సాంకేతికంగా వస్తున్న మార్పులు ఏంటి? కృత్రిమ మేధను అనుసంధానం చేయడం ద్వారా మెరుగైన సేవలు పొందడానికి ఉన్న అవకాశాలు ఏంటి? తదితర అంశాలపై చర్చించనుంది. అంతర్జాతయ డ్రోన్ సమ్మిట్‌ను నిర్వహించడం ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షించాలని భావిస్తోంది. కృష్ణానదీ తీరంలో 5 వేల డ్రోన్లతో ప్రదర్శనను ఏర్పాటు చేసింది.



సాంకేతికత అందిపుచ్చుకోవడమే లక్ష్యం

డ్రోన్ల రంగంలో ఆవిష్కర్తలు, టెక్నాలజీ నిపుణులు, స్టార్టప్‌లు, పరిశ్రమల నిర్వాహకులు తమ సామర్థ్యాలను ప్రదర్శించడానికి సదస్సును ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పట్టణ ప్రణాళిక, శాంతిభద్రతలు, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించడంలో డ్రోన్లు ఏ మేరకు ఉపయోగపడతాయనే దానిపై ఒక దార్శనిక పత్రాన్ని ప్రభుత్వం తయారు చేయబోతోంది.

- **ఆలోచింపజేసే చర్చలు:** పరిశ్రమల రంగంలో నిపుణులతో లోతైన ప్యానెల్ చర్చలు, వర్క్‌షాపులు, పరిశ్రమల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి డ్రోన్ల రంగంలో వస్తున్న తాజా పరిణామాలు.. ఉత్తమ విధానాలపై అవగాహన కల్పించడం

డ్రోన్ సేవల విస్తరణకు అవకాశాలు

ప్రస్తుతం కేవలం వ్యవసాయంలో పురుగుమందులను చల్లడానికి మాత్రమే డ్రోన్లను వాడుతున్నారు. ఇక మీద వాటి సేవలను విస్తృతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టింది.

- వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో డ్రోన్ల భాగస్వామ్యాన్ని విస్తృత పరచడం
- విపత్తుల సమయంలో సహాయ చర్యల్లో డ్రోన్ల వినియోగం
- డ్రోన్ల ద్వారా శాంతిభద్రతల పర్యవేక్షణ
- అత్యవసర వ్యాక్సిన్లు, మందులను మారుమూల ప్రాంతాలకు చేరవేయడం
- పర్యావరణ పరిరక్షణ, వివిధ ప్రాంతాల్లో నీరు, గాలి నాణ్యతలను తెలుసుకునేందుకు డ్రోన్ల వినియోగం
- రోడ్లు.. వంతెనల నిర్మాణ సందర్భంలో డ్రోన్ల ద్వారా సర్వే

- **సహకార అవకాశాలు:** డ్రోన్ టెక్నాలజీలో వస్తున్న మార్పులను గమనించి.. ఉత్తమ ఆవిష్కరణలను అందించే భాగస్వామ్యాన్ని రాష్ట్రానికి అందించడం
- **డెడికేటెడ్ డ్రోన్ ఎగ్జిబిషన్:** ఈ ప్రదర్శన ద్వారా వివిధ శాఖలకు అవసరమైన డ్రోన్ సాంకేతికతను గుర్తించే వెసులుబాటు కలుగుతుంది. ఆయా శాఖల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక సేవలను ఎంచుకునే సౌకర్యం ఏర్పడుతుంది.

నిర్దోషిత్వం ఖరీదు.. జైలులో పదేళ్ల నరకం

- కన్నతల్లి చివరి చూపులకూ లభించని అనుమతి
- కారాగారం నుంచి విడుదలైన ఏడు నెలలకే కన్నుమూత
- ఆంగ్ల ఆచార్యులుగా సుదీర్ఘ అనుభవం.. హక్కుల కార్యకర్తగా పోరాటం
- ప్రొఫెసర్ సాయిబాబా నేపథ్యం

ఈనాడు, హైదరాబాద్, కాకినాడ-న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం, కలెక్టరేట్: తొంభై శాతం అంగవైకల్యం.. పదేళ్ల కారాగార వాసం.. కన్నతల్లి చివరి చూపులకు నోచుకోలేని దైన్యం.. రెండుసార్లు నిరూపితమైన నిర్దోషిత్వం.. ఇదీ ప్రొఫెసర్ గోకరకొండ నాగ(జీఎన్) సాయిబాబా(57) నేపథ్యం. సాయిబాబా, మరో ఐదుగురిపై మోపిన అభియోగాలకు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) వర్తించదని ముంబయి హైకోర్టు తుదితీర్పు ఇచ్చేలోపు ఆయన పదేళ్లపాటు కఠిన కారాగారం అనుభవించాల్సి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం నల్లమిల్లిలో రైతు కుటుంబంలో సాయిబాబా 1967లో జన్మించారు. తల్లిదండ్రులు గోకరకొండ సత్యనారాయణ మూర్తి, సూర్యావతి. సాయిబాబాకు సోదరి భవానీ, సోదరుడు రామ్‌దేవ్ ఉన్నారు. ఐదేళ్ల వయసులో సాయిబాబాకు పోలియో సోకి రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నా.. చదువులో వెనుకబడలేదు. అమలాపురంలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తిచేశారు. ఒకవైపు చదువుకుంటూ మరోవైపు పేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు చెప్పేవారు. అమలాపురంలో డిగ్రీ చదువుతున్న కాలంలోనే వామపక్ష రాజకీయాల వైపు ఆకర్షితుడయ్యారు. 1990లో వారి కుటుంబం హైదరాబాద్‌కు తరలివెళ్లింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. ఇంగ్లిష్ చదివారు. హైదరాబాద్‌లోని ఆంగ్ల, విదేశీ భాషల విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్. చేశారు. 2003లో దిల్లీ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల రామ్‌లాల్ ఆనంద్ కళాశాలలో ఆంగ్లభాష సహాయ ఆచార్యుడిగా బాధ్యతలు చేపట్టారు. 2013లో దిల్లీ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 1992లో హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరమ్‌లో ఆయన సభ్యులుగా చేరారు. అప్పటి నుంచి మానవ హక్కుల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. కాగా, ఉపా కేసు నేపథ్యంలో సాయిబాబాను దిల్లీ విశ్వవిద్యాలయం 2021లో ఉద్యోగం నుంచి తొలగించింది.

మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో..

మావోయిస్టు పార్టీకి చెందినవారితో కలిసి రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్(ఆర్‌డీఎఫ్) తరఫున సమావేశం ఏర్పాటు చేశారన్న ఆరోపణలపై 2014 మే నెలలో సాయిబాబాను మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఆయనతో పాటు జేఎన్‌యూ విద్యార్థి హేమ్ కేశవాదత్త మిశ్ర, ఉత్తరాఖండ్‌కు చెందిన పాత్రికేయుడు ప్రశాంత్ రాహి, మహేష్ కరిమన్ టిర్కీ, నారాయణ్ సాంగ్లీకర్, విజయ్ టిర్కీలనూ జైలుపాలు చేశారు. వైకల్యం, ఇతర సమస్యల కారణంగా సాయిబాబా ఆరోగ్యం క్షీణిస్తుండటంతో 2015 జూన్‌లో ముంబయి హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అదే ఏడాది డిసెంబరులో బెయిల్ రద్దు కావడంతో మళ్లీ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. 2016 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు మరోమారు బెయిల్ మంజూరు చేసింది. కానీ, 2017 మార్చిలో ఉపా చట్టం కింద సాయిబాబాను దోషిగా ప్రకటించి.. జీవితఖైదు విధిస్తూ మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. దాంతో సాయిబాబాతోపాటు ఇతర నిందితులను నాగ్‌పుర్ కేంద్ర కారాగారానికి తరలించారు. గడ్చిరోలి కోర్టు తీర్పుపై విచారణ జరిపిన ముంబయి హైకోర్టు.. 2022 అక్టోబరు 14న ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. ఈ తీర్పును మర్నాడే సుప్రీంకోర్టు నిలిపివేసింది. పునర్విచారణ జరపాలని హైకోర్టును ఆదేశించింది. మళ్లీ విచారణ జరిపిన ముంబయి హైకోర్టు.. 2024 మార్చి 5న సాయిబాబా తదితరులను నిర్దోషులుగా ప్రకటించింది. కేసులో సమర్పించిన సాక్ష్యాలు నమ్మశక్యంగా లేవని పేర్కొంది. మార్చి 7న నాగ్‌పుర్ కేంద్ర కారాగారం నుంచి ఆయన విడుదలయ్యారు. కోర్టు తీర్పు నేపథ్యంలో సాయిబాబా.. హైదరాబాద్‌లో భార్య వసంత, కుమార్తె మంజీరాతో కలిసి నివాసం ఉంటున్నారు. తమ్ముడు రామ్‌దేవ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నారు.

కరోనా కాలంలో అండా సెల్‌లో..

కరడు కట్టిన నేరగాళ్లను జైళ్లలోని అండా సెల్‌లో ఉంచుతారు. ఎవరినీ కలవనీయకుండా అలా చేస్తారు. వీల్‌ఛైర్‌కే పరిమితమై.. ఇతరుల సాయం లేకుండా దైనందిన కార్యకలాపాలూ నిర్వహించుకోలేని సాయిబాబాను కరోనా సమయంలో అలాంటి అండా సెల్ ఉంచారు. దీంతో ఆయన నరకం అనుభవించారు. తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఎడమవైపు శరీరమంతా చచ్చుబడిపోయినా చికిత్స చేయించలేదని, నొప్పి నివారణ మాత్రలతో సరిపెట్టారని ఆయన ఆరోపించారు. అంగవైకల్యం, కరోనా ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని ఆయనకు బెయిల్ ఇవ్వాలంటూ కుటుంబ సభ్యులతోపాటు పలు పౌరహక్కుల సంఘాలు ప్రభుత్వానికి లేఖలు రాసినా ఫలితం లేకపోయింది. జైల్లో ఉండగానే 'నేను చావును నిరాకరిస్తున్నాను', 'వై డు యూ ఫియర్ మై వే సోమచ్' పేరుతో కవితలు, లేఖలతో సాయిబాబా సంకలనం రచించారు. పుట్టుకతోనే వైకల్యం ఉన్న తనను ఎంతో జాగ్రత్తగా పెంచిన తల్లికి అనారోగ్యంగా ఉందని, ఆమెను చూసేందుకు వెళ్లడానికి పెరోల్ ఇవ్వాలని వేడుకున్నా ఎవరూ పట్టించుకోలేదని, చివరికి కన్నతల్లి చనిపోయిన తర్వాత చివరి చూపులకు, కర్మకాండలకు హాజరయ్యేందుకూ అనుమతి లభించలేదని జైలు నుంచి విడుదలైన తర్వాత ఓ సందర్భంలో ఆయన వాపోయారు.

సామాజిక సమస్యలపై స్పందించేవారు..

అన్నయ్య సాయిబాబా చిన్నతనం నుంచి చదువులో చురుగ్గా ఉండేవారు. సామాజిక సమస్యలపై స్పందిస్తుండేవారు. హైదరాబాద్‌లో పీజీ చదివే రోజుల్లో విద్యార్థి సంఘాల ఉద్యమాల వైపు ఆకర్షితుడయ్యారు. ఈ క్రమంలోనే పలు రచనలు చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించే అధికారం ఎవ్వరికీ లేదని వాదించేవారు. జైల్లో ఉన్నా.. పేదల సమస్యలపైనే మాట్లాడేవారు.

– డాక్టర్ రామ్‌దేవ్, సాయిబాబా సోదరుడు


ప్రొఫెసర్ సాయిబాబా


భార్య వసంత, కుమార్తె మంజీర

ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

కోలుకుంటున్న స్థితిలో హఠాత్తుగా మరణించారు' అని సాయిబాబా భార్య వసంత పేర్కొన్నారు.

పలువురి సంతాపం: సాయిబాబా మృతికి పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. పౌరహక్కుల సంఘాల ప్రతినిధులు ఆదివారం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. రాజకీయ కక్షపూరిత చర్యలకు సాయిబాబా బలైపోయారని తెలంగాణ నిర్బంధ వ్యతిరేక వేదిక కన్వీనర్ జి.హరగోపాల్, కో-కన్వీనర్లు జి.లక్ష్మణ్, ఎం.రాఘవాచారి, కె.రవిచందర్‌లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

(మొదటి పేజీ తరువాయి)

కాపరులు చెట్ల కింద, స్తంభాల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు.

రెండు రోజుల్లో 'నైరుతి' తిరోగమనం: గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, అస్సాం, మేఘాలయ, అరుణాచల్, నాగాలాండ్, మణిపుర్, మిజోరం, త్రిపుర, మహారాష్ట్ర సహా ఉత్తర బంగాళాఖాతం నుంచి నైరుతి రుతుపవనాలు వైదొలుగుతున్నాయి. రాబోయే రెండు రోజుల్లో ఏపీ సహా దేశంలోని మిగిలిన ప్రాంతాల నుంచి నిష్క్రమించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆ సమయంలో దక్షిణ భారతదేశం మీదుగా తూర్పు, ఈశాన్య గాలులు వీచే అవకాశాలున్నాయి. దీంతో ఈశాన్య రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. వీటి ప్రభావంతో దక్షిణాది రాష్ట్రాలతోపాటు మధ్య బంగాళాఖాతంలో వర్షపాతం నమోదయ్యే అవకాశముంది.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో పోలీసు, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి అనిత ఆదేశించారు. కంట్రోలు రూమ్, హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేసి, సిద్ధంగా ఉండాలని సూచించారు. కలెక్టర్లతో హోం మంత్రి శనివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'దక్షిణ కోస్తా, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురవనున్న నేపథ్యంలో గండ్లు పడే అవకాశమున్న కాలువలు, గట్లను గుర్తించి పర్యవేక్షించాలి. ఏలూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి, పల్నాడు, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యలు తీసుకోవాలి. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రాణ, ఆస్తినష్టాలు సంభవించకుండా చూడాలి' అని అన్నారు.


తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం


పైపులు పగిలి లీకవుతున్న నీరు


తుప్పుపట్టిన ఇనుప షట్టర్లు

వైకాపా పాపం.. రైతులకు శాపం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయనడానికి ఇదొక నిదర్శనం. కాకినాడ జిల్లాలో మెట్ట ప్రాంతాలైన జగ్గంపేట, గండేపల్లి మండలాలకు సాగునీరు అందించాలని 2003లో అప్పటి తెదేపా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం గండేపల్లి మండలం తాళ్లూరు వద్ద 'తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం' నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు శంకుస్థాపన కూడా చేసింది. అనంతరం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణం పూర్తిచేసింది. పురుషోత్తపట్నం నుంచి పుష్కర కాలువ ద్వారా వచ్చిన నీటిని మోటార్లతో రెండు మండలాల్లోని 37,028 ఎకరాలకు అందిస్తారు. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న ఈ పథకాన్ని గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చింది. కనీస నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. నీటిని తరలించడానికి గండేపల్లి మండలం తాళ్లూరు నుంచి జగ్గంపేట మండలం సీతారామపురం వరకు మూడు కి.మీ మేర వేసిన సిమెంటు పైపులు పలుచోట్ల పగిలిపోయాయి. దీంతో ఎక్కడికక్కడ లీకేజీలు అవుతున్నాయి. మరమ్మతులు చేయడానికి రూ.50 కోట్లు ఖర్చవుతాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిసారించి, వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

– ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

వలస కూలీలపై కామాంధుల పైశాచికం

(మొదటి పేజీ తరువాయి)

నిద్రకు ఉపక్రమించారు. తండ్రి, కుమారుడు ఆరుబయట నిద్రిస్తుండగా.. అత్త, కోడలు షెడ్డు లోపల పడుకున్నారు. శనివారం తెల్లవారుజామున 2.40 గంటలకు కొందరు దుండగులు రెండు ద్విచక్ర వాహనాలపై అక్కడికి వచ్చారు. ఆ శబ్దానికి నిద్రలేచిన తండ్రీకుమారులు.. 'ఎవరు మీరు' అని ప్రశ్నించగా, చంపుతామంటూ వారిని కత్తులతో బెదిరించారు. లోపల నిద్రిస్తున్న అత్త, కోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం వాహనాలపై పారిపోయారు. బాధితులు శనివారం చిలమత్తూరు ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి బాధితులను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీసీ కెమెరాలు ధ్వంసం చేసి..

నిందితులు గతంలో దారిదోపిడీలకు పాల్పడేవారని తెలుస్తోంది. ఆ క్రమంలోనే ఊరిబయట పేపరు మిల్లు వద్ద ఒంటరిగా ఉన్న కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ముఠా మొదట రేకుల షెడ్డు వద్దకు వెళ్లి, అక్కడున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసింది. తర్వాత బాధితులను బెదిరించి దారుణానికి ఒడిగట్టింది. సీసీ కెమెరాలను ధ్వంసం చేసే క్రమంలో ఓ నిందితుడి దృశ్యాలు వాటిలో రికార్డయ్యాయి. పోలీసుల దర్యాప్తునకు అవే ఆధారంగా మారాయి. ఈ ఘటన వెలుగులోకి రాగానే శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న కర్ణాటక, ఏపీ సరిహద్దుల్లోని పోలీసుస్టేషన్లను అప్రమత్తం చేశారు. గతంలో దారిదోపిడీలు, ఇతర నేరాలకు పాల్పడిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఇప్పటివరకు ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులను గుర్తించగా, వారందరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో కొందరు గంజాయికి అలవాటు పడ్డారని, ముగ్గురు మైనర్లు ఉన్నారని సమాచారం. గంజాయి మత్తులోనే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారా లేక, దొంగతనానికి వెళ్లి ఘోరానికి పాల్పడ్డారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కఠిన చర్యలకు సీఎం ఆదేశాలు

సామూహిక అత్యాచారం ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. శనివారం ఉదయం జిల్లా ఎస్పీ రత్నతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఆదేశించారు. వారికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత మహిళలకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని సూచించారు. హోంమంత్రి వంగలపూడి అనిత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా ఎస్పీతో వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు.

కవరైపెట్టై రైలు ప్రమాదంలో కుట్ర కోణం?

(మొదటి పేజీ తరువాయి)

తేల్చే పనిలో ఎన్ఐఏ నిమగ్నమైంది.

ట్యాంపరింగ్ జరిగిందా?

కవరైపెట్టై స్టేషన్‌మాస్టర్ మునిప్రసాద్‌బాబు ఫిర్యాదు మేరకు రైల్వే అధికారులు రంగంలోకి దిగారు. రైలు ట్రాక్ మారడానికి వాడే సిగ్నలింగ్ గేర్, స్విచ్ పాయింట్‌ను ట్యాంపర్ చేసినట్లు వారు అనుమానించినట్లు తెలుస్తోంది. ఇక్కడికి సమీపంలోని పొన్నేరి రైల్వేస్టేషన్‌లో ఇటీవలే పట్టాల ఇంటర్ లాకింగ్ వ్యవస్థను ట్యాంపరింగ్ చేసినట్లు బయటపడటం ఇందుకు బలాన్నిస్తోంది. బెంగళూరు నుంచి వచ్చిన దక్షిణ సర్కిల్ పరిధి రైల్వే భద్రతా కమిషనర్ ఎ.ఎం.చౌదరి బృందం లోతుగా తనిఖీ చేసింది. ఆర్‌పీఎఫ్ సైతం విచారణ చేపట్టింది. ఘటనా స్థలంలో పట్టాలకు సంబంధించిన బోల్టులు, నట్లు కొన్ని మాయమైనట్లు గుర్తించారు. సిగ్నల్ వైఫల్యం ఉందా.. అని ఆరా తీశారు. మరోవైపు ప్రమాద స్థలంలో దెబ్బతిన్న కోచ్‌లన్నింటినీ తొలగించి శనివారం రాత్రికి ఒక లైన్, ఆదివారం ఉదయానికి మరో లైన్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పుడీ మార్గంలో రైళ్లు యథావిధిగా నడుస్తున్నాయని దక్షిణ రైల్వే ప్రకటించింది. భాగమతి రైల్లోని ప్రయాణికులను మరునాడు ఉదయాన్నే చెన్నై నుంచి ప్రత్యేక రైలులో దర్భంగాకు పంపించారు. ఇందులో బిహార్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రయాణికులూ ఉన్నారు.


వర్షంలో సహాయక చర్యల్లో నిమగ్నమైన సిబ్బంది


కవరైపెట్టై రైల్వేస్టేషన్‌లో కంట్రోల్ ప్యానెల్ వ్యవస్థను పరిశీలిస్తున్న సీఆర్‌ఎస్ అధికారి ఎ.ఎం.చౌదరి, తదితరులు

గ్రహం అనుగ్రహం

14-10-2024 సోమవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం

ద్వాదశి: రా. 12-23 తదుపరి త్రయోదశి

శతభిష: రా. 10-28 తదుపరి పూర్వాభాద్ర

వర్జ్యం: ఉ. 6-34 నుంచి 8-05 వరకు తిరిగి తె. 4-28 నుంచి

అమృత ఘడియలు: మ. 3-39 నుంచి 5-10 వరకు

దుర్ముహూర్తం: మ. 12-10 నుంచి 12-57 వరకు తిరిగి 2-30 నుంచి 3-17 వరకు

రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు

సూర్యోదయం: ఉ. 5.56; **సూర్యాస్తమయం:** సా.5.38

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	38.0	25.0
నిజామాబాద్	35.6	23.9
కర్నూలు	35.4	24.7
అనంతపురం	35.3	24.7
నరసాపురం	35.2	27.0
నెల్లూరు	35.0	26.9
ఖమ్మం	34.5	25.0
ఆదిలాబాద్	34.3	23.7
కడప	34.0	25.0
తాడేపల్లిగూడెం	34.0	24.0
విశాఖపట్నం	33.8	26.2
తిరుపతి	33.6	24.6
ఒంగోలు	33.2	25.9
విజయవాడ	33.2	25.3
శ్రీకాకుళం	33.0	26.0
గుంటూరు	32.0	25.0
హైదరాబాద్	31.7	23.3
కరీంనగర్	31.0	22.0
విజయనగరం	30.0	26.0



అసూయ, అభద్రతాభావంతో మరింత చేటు

మీ తోటివారు లేదా పోటీదారులు మీకన్నా గొప్పగా పనిచేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారని తెలిస్తే వెంటనే అసూయ, అభద్రతాభావం కలుగుతాయి. కానీ వాటి వల్ల మీరు మరింత నష్ట పోతారు. మిమ్మల్ని అధిగమించినవారికి మీకన్నా మెరుగైన నైపుణ్యాలున్నట్లు ముందుగా అంగీకరించండి. ఆ తర్వాత వారికి దీటుగా నైపుణ్యాలను నేర్చుకోవడం మొదలుపెట్టండి. అప్పుడే మీరు వారితో పోటీపడేందుకు అర్హులు.

– అలెక్స్ హార్మోజీ, బిజినెస్ గ్రోత్ మెంటార్

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము
ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి) ఏలూరు జిల్లా-పిన్‌కోడ్ - 534426.
WEB SITE: www.dwarakatirumala.org email: endow-eodtiru-ap
Phones: 08829 - 271427, Cell: +919390065888.
NIT No.EE/06/2024-25, Dt.13/10/2024.
శ్రీ స్వామి వారి దేవస్థానము నందు పారిశుధ్య నిర్వహణ పనులు చేయుటకు (Mechanized Sanitation) Man & Materials తో రెండు సంవత్సరాల కాల పరిమితికి టెండర్లు ఆహ్వానించడమైనది.
❖ టెండర్లు దాఖలు చేయుటకు ఆఖరు తేది & సమయము : 28/10/2024 04.00 pm
For Further details please visit e-procurement market place at www.apeprocurement.gov.in
యస్.వి.యస్.యస్.మూర్తి, కార్యనిర్వహణాధికారి

APPGECET-2024-Admissions
APSCHE and SRI VENKATESWARA UNIVERSITY
REGISTRATION OF GPAT CANDIDATES - 2nd & FINAL PHASE and ADMISSIONS COUNSELLING OF 2nd & FINAL PHASE FOR GPAT & APPGECET-2024 (PHARMACY)
NOTIFICATION
For 2nd & FINAL PHASE M.Pharmacy & Pharm-D (PB) courses in University and Affiliated Private Pharmacy Colleges in the State of AP Online Registration & Web Counselling Schedule:
1) Registration for GPAT candidates Commences on: 15-10-2024 to 17-10-2024.
Registration Fee for SC/ST candidates is Rs.300/- and for others Rs.600/-.
2) Web Counselling for GPAT & APPGECET-2024 Pharmacy candidates only:
GPAT Commences from : 19-10-2024 & 20-10-2024
APPGECET (Pharmacy) Commences from : 19-10-2024 to 24-10-2024
Web Counselling Fee for SC/ST candidates is Rs.500/- and others Rs.1000/-.
Visit for full details: https://cets.apsche.ap.gov.in
Place : Tirupati
Date : 14-10-2024
CONVENER (Admissions) APPGECET-2024

UNIVERSITY OF HYDERABAD
(A Central University established in 1974 by an Act of Parliament)
P.O. Central University, Gachibowli, Hyderabad - 500 046, Telangana.
Employment Notification No.UH/Rectt./NT/2024-04, Dated 03/10/2024
Applications are invited from eligible Citizens of India for Group 'A' Non-Teaching positions on Direct Recruitment/ Deputation Basis/ Short Term Contract basis.
Finance Officer – 1 Post | Controller of Examinations – 1 Post
Both the above posts are in Level – 14 (Rs.1,44,200 – 2,18,200)
Last date for submission of online application: 24/10/2024
Last date for receiving of hardcopy of application by post/courier is 28/10/2024.
For complete details, visit: https://uohyd.ac.in/non-teaching-project-staff/
Link for submitting online application: https://uohydnt.samarth.edu.in
Place: Hyderabad, Date: 08/10/2024
Sd/- REGISTRAR

(c) eenadu

వైభవంగా చక్రస్నానం




చక్రస్నానం సందర్భంగా పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు ★ శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

ముగిసిన తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తిరుమల, న్యూస్‌టుడే: తొమ్మిది రోజుల పాటు జరిగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు.. శనివారం రాత్రి బంగారు తిరుచ్చి ఉత్సవంతో పరిసమాప్తమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీవారి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు స్వామివారికి పల్లకీ ఉత్సవం జరిగింది. 6 నుంచి 9 గంటల నడుమ శ్రీభూవరాహస్వామి ఆలయ ముఖమండపంలో శ్రీ మలయప్ప స్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా చేపట్టారు. జీయర్లు, అర్చకుల నేతృత్వంలో సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. మంగళ వాయిద్యాలు, వేద ఘోష మధ్య అర్చకులు సుదర్శన చక్రాన్ని పవిత్ర పుష్కరిణీ జలంలో ముంచి స్నానం చేయించారు. పెదజీయర్, చినజీయర్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ రవినాథ్ తిల్హరి, తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవోలు సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సినీ నటుడు బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తితిదే సౌకర్యాలపై భక్తుల సంతృప్తి: ఈవో జె.శ్యామలరావు

శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించామని తితిదే ఈవో జె.శ్యామలరావు తెలిపారు. తితిదే ఏర్పాటు చేసిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. స్థానిక అన్నమయ్య భవనంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరితో కలిసి ఈవో శనివారం మీడియాతో మాట్లాడారు. 'బ్రహ్మోత్సవాల్లో 6 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. వాహన సేవలను 15 లక్షల మంది వీక్షించారు. 30 లక్షల లడ్డూలను కొనుగోలు చేశారు. 26 లక్షల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. బ్రహ్మోత్సవాల్లో 40 టన్నుల పుష్పాలు, 3.50 లక్షల కట్ ఫ్లవర్స్, 80 వేల సీజనల్ ఫ్లవర్స్ వినియోగించాం' అని ఈవో శ్యామలరావు వివరించారు. సమావేశంలో అదనపు ఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





ఇంద్రకీలాద్రిపై శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు ★ కనకదుర్గానగర్‌లో భవానీ భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రిపై ముగిసిన దసరా సంబరాలు

ఈనాడు, అమరావతి: విజయదశమి రోజున శనివారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీరాజరాజేశ్వరీదేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకూ లక్ష మందికిపైగా భక్తులు దర్శనానికి తరలివచ్చారు. శనివారం నుంచి భవానీ భక్తుల రద్దీ పెరిగింది. సాయంత్రం వేళ కృష్ణా నదిలో తెప్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వరద ఉద్ధృతి ఎక్కువగా ఉండడంతో నదీ విహారాన్ని రద్దు చేసి నిలకడగా దుర్గాఘాట్‌లోనే హంస వాహనాన్ని ఉంచి శ్రీగంగా పార్వతీ సమేత దుర్గామల్లేశ్వరుల ఉత్సవమూర్తులకు పూజలు చేశారు.

శ్రీశైలంలో..

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు శనివారం ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు భక్తులకు భ్రమరాంబాదేవి నిజరూప అలంకారంలో దర్శనమిచ్చారు. నంది వాహనంపై కొలువైన స్వామి అమ్మవార్లకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవం నిర్వహించారు. అర్చకులు శమీ వృక్షం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పుష్కరిణిలో ఉత్సవమూర్తులకు కన్నుల పండువగా తెప్పోత్సవం నిర్వహించారు.



నిజరూప అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

ఇంటిల్లిపాదికీ కష్టం.. ఆదుకుంటున్న దాతృత్వం

ఇంట్లో ఒకరికి కష్టం వస్తేనే తల్లడిల్లిపోతాం. అలాంటిది ఇంటిల్లిపాదీ నిరాశ్రయులుగా మారితే.. ఉభయతెలుగు రాష్ట్రాలను ముంచెత్తిన వరదలు వేల మందిని కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. వ్యాపారాలు, జీవనోపాధి కోల్పోయిన ఆ అభాగ్యులకు మానవతామూర్తులు చేయూతనిస్తున్నారు. మళ్లీ బతుకుబండి లాగేలా ఆపన్నహస్తం అందిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయ నిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..



బి.వి.రమణ (ఎండుబాబు), ఛైర్మన్, బొగ్గారపు వెంకట రమణయ్య అండ్ కాళికాంబ ట్రస్టు, అనకాపల్లి
విరాళం: రూ.1,50,116

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
ఇందిరానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ 68 మంది సభ్యులు, కొత్తపేట, హైదరాబాద్	1,04,000
పూళ్ల రమణమ్మ (గ్రూప్ కెప్టెన్ (రిటైర్డ్) పీవీ రమణ గారి సతీమణి), సికింద్రాబాద్	50,000
కోనేరు భీమేశ్వరరావు, కోనేరు శివాజీ, విజయవాడ	20,000
చైతన్య మహిళా డిగ్రీ కళాశాల, విశాఖపట్నం	11,111
చైతన్య మహిళా పీజీ కళాశాల, విశాఖపట్నం	11,111
దాట్ల శ్రీరామమూర్తిరాజు, బృందం, చేబ్రోలు, ఏలూరు జిల్లా	10,116
గడ్డిపాటి సుబ్బారావు, గూడవల్లి, బాపట్ల జిల్లా	10,000
డా.గొరిట్యాల లక్ష్మీనారాయణ, బాలసముద్రం, హనుమకొండ	10,000
డా.కొల్లి నరసింహారావు, బెంగళూరు	10,000
వెల్దుర్తి జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సేవా సంఘం, కర్నూలు	6,500
పెండెం వెంకటరమణ, హైదరాబాద్	6,116
సి.శంకర్, హైదరాబాద్	5,116
పులిపాటి శ్రీరాములు, తిరుపతి	5,116
టి.పట్టిసీమ, తిరుపతి	5,011
కాకర్ల శ్రీ వెంకటేశ్వర్లు, హైదరాబాద్	5,001
వైట్ల వెంకట రాయుడు, విశాఖపట్నం	5,000
డి.గోపాలకృష్ణంరాజు, హైదరాబాద్	5,000
చితిరాల రాజారావు, రామలింగాపురం, నెల్లూరు	5,000
వాసం రాజమల్లయ్య, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు(పోచంపాడు), నిజామాబాద్ జిల్లా	5,000
వి.రవీంద్రకుమార్, విజయవాడ	5,000
మన్నం సింగయ్య, టంగుటూరు, ప్రకాశం జిల్లా	5,000
మూర్తి నాగరాజు, సికింద్రాబాద్	5,000
కొల్లి కృష్ణకుమారి, పోతర్లంక, గుంటూరు జిల్లా	5,000
రాజేశ్వరి కృష్ణమోహన్, సికింద్రాబాద్	5,000

భరోసా ఇద్దాం.. మానవత్వం చాటుదాం..!

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
● ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు
ఈనాడు రిలీఫ్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

తెదేపా కార్యాలయం, చంద్రబాబు ఇంటిపై దాడి కేసులు సీఐడీకి

ఆదేశాలు జారీ చేసిన డీజీపీ ద్వారకా తిరుమలరావు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తెదేపా కేంద్ర కార్యాలయంపైన, తెదేపా అధినేత చంద్రబాబు ఇంటిపైన జరిగిన దాడి కేసుల విచారణను ప్రభుత్వం తాజాగా సీఐడీకి అప్పగించింది. ఈ మేరకు డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలు జారీచేశారు. మంగళగిరి రూరల్, తాడేపల్లి స్టేషన్లలో ఈ కేసులు నమోదు చేసినా, నాటి వైకాపా ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు విచారణను అటకెక్కించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ కేసుల విచారణను తిరిగి ప్రారంభించారు. ఈ కేసుల్లో కీలక నిందితులు కొందరు సుప్రీంకోర్టు, హైకోర్టును ఆశ్రయించడంతో వాటిపై కౌంటర్లు దాఖలు చేయడానికి ఇక్కడి పోలీసులు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాల్సి వస్తోంది. దీన్ని గుర్తించిన ఉన్నతాధికారులు దర్యాప్తు వేగవంతం చేయాలని.. ఆ కేసులను సీఐడీకి అప్పగించారు.

పట్టించుకోని వైకాపా ప్రభుత్వం

తెదేపా కార్యాలయంపై వైకాపా అల్లరిమూకలు 2021 అక్టోబరు 19న, ఉండవల్లిలోని చంద్రబాబు ఇంటిపై అప్పటి పెడన ఎమ్మెల్యే జోగి రమేష్ తన అనుచరులతో కలిసి 2021 సెప్టెంబరు 17న దాడికి తెగబడ్డారు. నాడు మొక్కుబడిగా కేసులు నమోదు చేసి దర్యాప్తును విస్మరించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఉన్నతాధికారులు దృష్టిసారిస్తే అనేక లోపాలు బయటపడ్డాయి. ఈ రెండు కేసుల్లో పలువురిని అరెస్టుచేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా కోర్టు వారికి రిమాండ్ విధించింది. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో వైకాపాకు చెందిన బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ నెల రోజులు రిమాండ్‌లో ఉన్నారు. ఇదే కేసులో విజయవాడ డిప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాసరెడ్డి రిమాండ్‌కు వెళ్లొచ్చారు. ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, విజయవాడ తూర్పు సమన్వయకర్త దేవినేని అవినాష్, జోగి రమేష్ తదితరులు అరెస్టు కాకుండా సుప్రీంకోర్టు, హైకోర్టు, గుంటూరు జిల్లా కోర్టుల నుంచి తాత్కాలిక ఉపశమనం పొందారు.



నాడు తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడికి వెళ్తున్న వైకాపా మూకలు

● తెదేపా కార్యాలయంపై దాడి కేసులో ఇప్పటిదాకా మంగళగిరి రూరల్ పోలీసులు 28 మందిని అరెస్టుచేశారు. ఇంకా 79 మందిని అరెస్టు చేయాలి. ఆధారాలను బట్టి ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

● చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో 30 మందిని గుర్తించగా 14 మందిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపారు. 8 మంది బెయిల్‌పై విడుదల కాగా ఆరుగురు లోపలే ఉన్నారు. 11 మందికి సుప్రీంకోర్టు నుంచి ముందస్తు రక్షణ లభించింది. ఐదుగురు నిందితులు పట్టుబడలేదు. కొన్ని అరెస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. దర్యాప్తు తుదిదశలో ఉంది.

జెత్వానీ కేసు సీఐడీకి బదిలీ

గన్నవరంలోని తెదేపా కార్యాలయంపై దాడి కేసు కూడా..

ఈనాడు, అమరావతి: సంచలనం సృష్టించిన సినీ నటి కాదంబరీ జెత్వానీ కేసు దర్యాప్తు బాధ్యతలను సీఐడీకి అప్పగిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలు జారీచేశారు. ఇప్పటివరకు ఈ కేసును విజయవాడ పోలీసులు దర్యాప్తుచేశారు. అప్పటి సీఎం కార్యాలయంలో జెత్వానీ అక్రమ అరెస్టు కుట్రకు ప్రణాళిక రచించడం.. సీనియర్ ఐపీఎస్ అధికారుల ప్రమేయం ఉండడంతో దీని వెనుక సూత్రధారులను కనిపెట్టేందుకు లోతైన దర్యాప్తు అవసరమని ప్రభుత్వం భావించింది. దీంతో ఈ కేసులకు సంబంధించిన అన్ని దస్త్రాలను సీఐడీకి అప్పగించాలని డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

ప్రాథమిక దర్యాప్తులో కీలక ఆధారాలు

అప్పటి నిఘా విభాగం అధిపతి సీతారామాంజనేయులు ఆదేశాల మేరకు సినీ నటి కాదంబరీ జెత్వానీపై విజయవాడలో కేసు నమోదుచేశారు. వైకాపా నేతపై జెత్వానీ నమోదుచేసిన కేసు ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేసేందుకే తప్పుడు కేసు పెట్టారు. నాటి విజయవాడ సీపీ కాంతిరాణా, డీసీపీ విశాల్ గున్నీలను సీఎంఓకు సీతారామాంజనేయులు పిలిపించి వైకాపా నేత కుక్కల విద్యాసాగర్‌తో కలసి ప్రణాళిక రచించారు. విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం స్టేషన్‌లో కాదంబరీ జెత్వానీతో పాటు ఆమె తల్లి ఆశా జెత్వానీ, తండ్రి నరేంద్రకుమార్, సోదరుడు అంబరీష్‌లపై ఈ ఏడాది ఫిబ్రవరి 2న ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. ఫిబ్రవరి 3న ముంబయిలో కాదంబరి, ఆమె తల్లిదండ్రులను అరెస్టు చేసి విజయవాడ తెచ్చారు. ఆమె పెట్టిన కేసు విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. ఇది ఆగస్టు 26న వెలుగుచూసింది. అనంతరం జెత్వానీ విజయవాడ వచ్చి సీపీ రాజశేఖర్‌బాబును కలిశారు. ఈ వ్యవహారంపై ఏసీపీ స్రవంతి రాయ్ విచారణలో పలు కీలక అంశాలు వెలుగుచూశాయి. కేసు నమోదుచేయక ముందే విశాల్ గున్నీ, పలువురు పోలీసు అధికారులు ముంబయి వెళ్లారు. తప్పుడు పత్రాలను సృష్టించి కోర్టునూ తప్పుదారి పట్టించారని తేలింది. దర్యాప్తు ఆధారంగా ఐపీఎస్‌లు సీతారామాంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీ, ఏసీపీ హనుమంతరావు, సీఐ సత్యనారాయణలను సస్పెండ్ చేశారు. కాదంబరి ఫిర్యాదు ఆధారంగా గతనెల 14న ఇబ్రహీంపట్నం స్టేషన్‌లో వైకాపా నేత విద్యాసాగర్, ఐపీఎస్ అధికారులపై కేసు నమోదు చేశారు. ఇప్పుడు ఈ రెండు కేసులనూ సీఐడీకి బదిలీ చేశారు.

గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసు

2023 ఫిబ్రవరి 20న అప్పటి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు గన్నవరం తెదేపా కార్యాలయంపై మూకుమ్మడిగా దాడిచేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలతో పాటు, పోలీసులకు సైతం గాయాలయ్యాయి. అక్కడే ఉన్న ఇన్నోవా కారుపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. మరో మూడు కార్లనూ ధ్వంసం చేశారు. దాదాపు గంటపాటు ఈ విధ్వంసకాండ కొనసాగినా, పోలీసులు అడ్డుకోలేదు సరికదా.. అప్పటి సీఐ కనకారావు ఫిర్యాదుతో తెదేపా వర్గీయులపైనే ఎదురు కేసులు పెట్టారు. కూటమి అధికారంలోకి వచ్చాక కేసును రీ ఓపెన్ చేసిన పోలీసులు.. ఈ ఏడాది జులై 9 నుంచి అరెస్టులు ప్రారంభించారు. వంశీతో పాటు 71మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు 27 మందిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చారు. తాజాగా ఈ కేసునూ సీఐడీకి బదిలీచేశారు.

డిజిటల్‌గా దోపిడీ

● ఫెడెక్స్ పార్శిల్, కొరియర్ సర్వీసెస్ నుంచి మాట్లాడుతున్నానంటూ నెల్లూరు జిల్లాకు చెందిన భాజపా నాయకుడు వాకాటి నారాయణరెడ్డికి కొన్ని రోజుల కిందట ఓ వ్యక్తి కాల్ చేశారు. 'మీ పేరుతో థాయలాండ్‌కు ఒక పార్శిల్ వెళ్లింది. అందులో నకిలీ పాస్‌పోర్టులు, మాదకద్రవ్యాలు, దుస్తులు, అమెరికా డాలర్లు ఉన్నాయి. ఇది నేరం' అని ఆయనతో చెప్పారు. అలాంటిదేమీ తాను పంపించలేదని నారాయణరెడ్డి సమాధానమివ్వగా.. అయితే 'మీ ఆధార్ నంబరుతో ఎవరో పంపించి ఉంటారు. దీనిపై ముంబయి సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయండి. వారికి ఈ కాల్ కనెక్ట్ చేస్తాం' అని అవతలి వ్యక్తి చెప్పాడు. వెంటనే తనను ముంబయి సైబర్ క్రైమ్ అధికారిగా పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి వాట్సప్ కాల్ చేసి ఫిర్యాదివ్వాలని సూచించాడు. నారాయణరెడ్డి వాట్సప్ కాల్ చేయగా.. 'మీపై సీబీఐ, ఈడీ కేసులున్నాయి. మీరు ఎక్కడికి వెళ్లటానికి వీల్లేదు. మా వీడియో నిఘాలోనే ఉండాలి' అంటూ ఆరున్నర రోజులపాటు ఆయన్ను ఎక్కడికీ కదలనీయకుండా డిజిటల్ అరెస్టు చేశారు. రూ.15 కోట్లు చెల్లించి కేసు సెటిల్ చేసుకోవాలని చెప్పారు. ఇదేదో మోసమని గుర్తించిన వాకాటి.. బయటకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● 'నేను ఈడీ అధికారిని మాట్లాడుతున్నా. ఆదాయానికి మించిన ఆస్తులు ఉండటంతో మీపై మనీ లాండరింగ్ కేసు నమోదైంది. ఓ బాలికతో మసాజ్ చేయించుకున్న కేసు కూడా మీపై ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మిమ్మల్ని అరెస్టు చేయటానికి వస్తున్నాం' అంటూ అనకాపల్లికి చెందిన ఓ న్యాయవాదికి ఇటీవల ఫోన్‌కాల్ వచ్చింది. ఈ విషయం ఎవరికైనా చెప్పినా, బయటకు వెళ్లినా వెంటనే తమ వాళ్లు అదుపులోకి తీసుకుంటారని ఫోన్‌లోనే బెదిరించారు. వాట్సప్ వీడియో కాల్‌లోనే ఉండాలని హెచ్చరించారు. సెటిల్‌మెంట్ చేసుకోవాలంటే డబ్బులివ్వాలని బెదిరించారు. ఆ న్యాయవాది వారు చెప్పిన ఖాతాల్లో రూ.29 లక్షలు జమ చేశారు.

ఒక్కోసారి ఒక్కో తరహాలో మోసం

మోసం 1



'మేం ఫలానా కొరియర్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. మీ పేరుతో విదేశాల నుంచి ఒక పార్శిల్ వచ్చింది. అందులో మాదకద్రవ్యాలు, ఆయుధాలు, పాస్‌పోర్టులు ఉన్నాయి. దీనిపై ముంబయి క్రైమ్ విభాగం పోలీసు అధికారికి కాల్ కనెక్ట్ చేస్తున్నాం. ఆయనతో మాట్లాడండి' అంటూ కాల్ చేసి భయపెడతారు. అంతలోనే మరో వ్యక్తి ఫోన్‌కాల్‌లోకి వచ్చి తనను తాను సీబీఐ/ ఈడీ/ నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో అధికారిగా పరిచయం చేసుకుని మరింతగా బెదిరిస్తారు. మాదకద్రవ్యాల ముఠాలతో మీకు సంబంధాలున్నాయని, ఇది తీవ్రమైన నేరమని చెబుతూ హడలెత్తిస్తారు. వీడియోకాల్ చేసి విచారణ, అరెస్టు అంటూ హడావుడి చేస్తారు. కేసు నుంచి బయటపడాలంటే తాము అడిగినంత డబ్బులు ఇవ్వాలంటూ ఒత్తిడి తెస్తారు. ఇదంతా నిజమేనని నమ్మి, భయపడి వారు అడిగినంతా సొమ్ము బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేస్తూ అనేక మంది మోసపోతున్నారు.

మోసం 2



మీ సిమ్ కార్డు లేదా బ్యాంకు ఖాతాను ఈకేవైసీ చేయించుకోవాలని, లేకపోతే అవి రద్దయిపోతాయంటూ ఆటోమేటిక్ రికార్డుతో కూడిన ఓ కాల్ వస్తుంది. దీని కోసం తాము సూచించిన నంబర్ నొక్కాలని నిర్దేశిస్తారు. ఆ ఆదేశాలు పాటిస్తే చాలు వెంటనే సైబర్ నేరగాళ్లు లైన్‌లోకి వస్తారు. మీ బ్యాంకు ఖాతాతో పెద్ద ఎత్తున అక్రమ లావాదేవీలు జరిగాయని, మీ ఫోన్ నంబర్ కూడా అనేక మోసపూరిత బ్యాంకు ఖాతాలతో లింకయిందని చెబుతారు. దీనిపై ఆదాయపు పన్ను, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులతో మాట్లాడాలంటూ మరో సైబర్ నేరగాడికి కనెక్ట్ చేస్తారు. అతను బెదిరించి, డిజిటల్ అరెస్టు చేసి, ఆర్బీఐకు సొమ్ము చెల్లిస్తే కేసు నుంచి బయటపడేస్తామని చెబుతారు. ఓ బ్యాంకు ఖాతా ఇచ్చి దానిలోకి నగదు బదిలీ చేయించుకుంటారు.

మోసం 3



'మీ పేరుతో విదేశాలకు అక్రమంగా డబ్బులు తరలుతున్నాయి. మాదకద్రవ్యాలు సరఫరా అవుతున్నాయి. మిమ్మల్ని విచారించాలి' అంటూ కాల్ చేస్తారు. వాటితో తమకెలాంటి సంబంధమూ లేదని సమాధానమిస్తే... విచారణ పేరిట వీడియో కాల్ చేస్తారు. విచారణ పూర్తయ్యే వరకూ ఇంటి నుంచి కదలకూడదని, ఈ విషయం పోలీసులు సహా ఎవరికీ చెప్పకూడదని బెదిరిస్తారు. మీ ఇంటి బయటే సీబీఐ, ఈడీ అధికారులున్నారని వారు అరెస్టు చేసేస్తారని భయపెడతారు. వీడియోకాల్‌లో విచారణ పేరిట అడుగు కదలనీయకుండా చేసి బ్యాంకు ఖాతాలు సహా ఇతర వివరాలు తీసుకుని వాటిలో నుంచి నగదు తమ ఖాతాల్లోకి మళ్లించుకుంటారు. మరికొన్ని సందర్భాల్లో 'మీరు అశ్లీల వెబ్‌సైట్లు చూస్తున్నారు. మిమ్మల్ని అరెస్టు చేసేందుకు వారంట్‌తో వస్తున్నాం' అని బెదిరించి డబ్బులు గుంజేస్తున్నారు.

ఇలా చేస్తుంటే.. వారు సైబర్ నేరగాళ్లే!

మీకు నేరంతో సంబంధం లేదని చెప్పినా వినిపించుకోరు. బెదిరిస్తూనే ఉంటారు. ముంబయి క్రైమ్ బ్రాంచ్‌కు ఫోన్‌కాల్ బదిలీ చేస్తున్నామని చెప్పి మరో వ్యక్తిని వీడియో కాల్‌లోకి తెస్తారు. ఆ వ్యక్తి తనను తాను సైబర్ క్రైమ్ ఎస్పీగా, ఉన్నతాధికారిగా పరిచయం చేసుకుంటారు. మీరు డిజిటల్ అరెస్టయ్యారని, విచారణకు సహకరించాలని, నేరంలో మీ ప్రమేయం లేదని తేలితే కేసు నుంచి విముక్తి కల్పిస్తామని నమ్మబలుకుతారు. విచారణ పూర్తయ్యేవరకూ వీడియో కాల్ ఆఫ్ చేయొద్దని, మరెవరితోనూ మాట్లాడొద్దని, బాత్‌రూమ్‌కు వెళ్లినా సరే కాల్‌లోనే ఉండాలని షరతులు విధిస్తారు. మీ ఇంటి బయట పోలీసుల నిఘా ఉందని, వీడియో కాల్ ఆపిన మరుక్షణంలో బయట ఉన్న పోలీసులు అరెస్టు చేసి ముంబయికి తీసుకొస్తారని హెచ్చరిస్తారు. నేరం చేయలేదని, నిరూపించుకోవాలంటే ఆర్బీఐ ఏర్పాటు చేసిన ఖాతాలోకి మీ సొమ్మంతా బదిలీ చేయాలంటారు.. ఇలా మాట్లాడారంటే వారు సైబర్ నేరగాళ్లే!

ఏ దర్యాప్తు సంస్థా వీడియోకాల్‌లో విచారించదు

● గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్, వీడియో కాల్స్‌కు స్పందించొద్దు.
● కస్టమ్స్, సీబీఐ, ఈడీ, నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో ఇలా రకరకాల సంస్థల నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా చెబితే కచ్చితంగా అనుమానించాల్సిందే.
● మిమ్మల్ని నమ్మించేందుకు మీ వ్యక్తిగత వివరాలు చాలా చెబుతారు. అయినా చలించొద్దు.
● దేశంలో ఏ దర్యాప్తు సంస్థ కూడా వీడియో కాల్‌లో విచారించదు. అలా ఎవరైనా మిమ్మల్ని బెదిరిస్తే వెంటనే పోలీసుల్ని ఆశ్రయించాలి.
● మీ పేరిట వచ్చిన పార్శిళ్లు, కొరియర్లలో మాదకద్రవ్యాలు ఉన్నాయని బెదిరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడొద్దు.
● ఆ ఫోన్ నంబర్ సహా వివరాలన్నీ నమోదు చేసుకుని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయండి.
● ఎవరెంత అడిగినా మీ బ్యాంకు ఖాతాల వివరాలు చెప్పొద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు బదిలీ చేయొద్దు.
● కొన్ని వీడియో కాల్స్‌కు స్పందించకపోయినా పదే పదే కాల్స్ చేస్తుంటారు. అలాంటి వాటిని బ్లాక్ చేయాలి.

1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు ఇవ్వచ్చు

● సైబర్ నేరాల బాధితులు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.
● కేంద్ర హోం శాఖ నిర్వహించే జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లోకి వెళ్లి ఫిర్యాదు ఇవ్వచ్చు.
● స్థానిక పోలీసుస్టేషన్లతో పాటు సైబర్ నేరాల పోలీసుస్టేషన్లలోనూ ఫిర్యాదు అందించవచ్చు.

- ఈనాడు, అమరావతి





(c) eenadu


ఈనాడు

అలక్ష్యమే పెను విపత్తు!

ట్రాకులూ సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలు, మానవ తప్పిదాలు, అవసరాలకు తగినట్లు ఏర్పాటుకాని మౌలిక వసతులు తదితరాల వల్ల దేశీయంగా రైళ్లు తరచూ ప్రమాదాల బారినపడుతున్నాయి. నిరుడు ఒడిశాలో వందల మందిని పొట్టనపెట్టుకున్న ఘోర దుర్ఘటనకు తప్పుడు సిగ్నలే ప్రధాన కారణం. ఆపరేటింగ్ విభాగం తప్పిదాల వల్లే గత జూన్‌లో పశ్చిమ్‌బెంగాల్‌లో కంచన్‌జంగా రైలు ప్రమాదం చోటుచేసుకుంది. నిరుడు విజయనగరం దుర్ఘటన సైతం వ్యవస్థాగత అసమర్థత వల్లే సంభవించింది. యంత్రాంగం నిర్లక్ష్యం, నిష్పూచీతనాలకు తోడు ఆకతాయిలు, విధ్వంసక శక్తుల ఆగడాలూ కొన్నాళ్లుగా పెచ్చుమీరుతున్నాయి. పట్టాలపై ప్రత్యక్షమవుతున్న గ్యాస్ సిలిండర్లు, ఇనుము, సిమెంట్ దిమ్మెలు వంటివి ప్రయాణికుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. నిరుడు జూన్ నుంచి గత నెల తొలి వారం వరకు అలాంటివి 24 ఉదంతాలు వెలుగుచూశాయి. తాజాగా తమిళనాడులో భాగమతి ఎక్స్‌ప్రెస్ గూడ్స్ రైలును ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. దీనిపై రైల్వే శాఖ ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. కానీ, ప్రమాదాలు జరిగినప్పుడల్లా మొక్కుబడి తంతు అవుతున్న దర్యాప్తులూ నివేదికలతో ఒనగూడుతున్నదేంటి?

గత ఆర్థిక సంవత్సరం మొదటి ఏడునెలల్లో దేశవ్యాప్తంగా రైళ్లలో 390 కోట్ల మంది ప్రయాణించారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే- ప్రయాణికుల సంఖ్య 41 కోట్లు పైబడింది. అందుకే భారతీయ రైల్వేను దేశానికి జీవనాడిగా అభివర్ణిస్తారు. అటువంటి దాన్ని బలోపేతం చేయడంలో అంతులేని అలక్ష్యం రాజ్యమేలుతోంది. అధికారిక లెక్కల ప్రకారం- గడచిన ఎనిమిదేళ్లలో 678 రైలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వాటి మూలంగా వందల సంఖ్యలో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మొన్న జనవరి నుంచి జులై మధ్యలోనే 19 రైళ్లు పట్టాలు తప్పాయి. దేశీయంగా చాలా వరకు ట్రాక్‌లు బ్రిటిష్ కాలం నాటివి. వాటి ఆధునికీకరణకు అందించాల్సిన నిధుల్లో ప్రభుత్వం కోత పెట్టడాన్ని 'కాగ్' గతంలోనే తప్పుబట్టింది. 2017-21 మధ్యకాలంలో 26శాతం ప్రమాదాల పాపం కాలంచెల్లిన ట్రాకులదేనని తేలినా, సర్కారులో చలనం కరవైంది. రెండు రైళ్లు ఒకేసారి ఒకే పట్టాలపైకి రాకుండా 'కవచ్' నిలువరిస్తుంది. కానీ, అరకొర నిధుల విదిలింపులతో ఆ ప్రాజెక్టు నత్తనడకన సాగుతోంది. భద్రతా విభాగంలో లక్షన్నరకు పైగా పోస్టులు ఖాళీగా పడిఉన్నాయి. దాంతో ప్రయాణికుల రక్షణ గాలిలో దీపమవుతోంది!

చవకైన, సౌకర్యవంతమైన ప్రయాణ సాధనమంటే మొదట గుర్తుకొచ్చేది రైలే. కానీ, కొన్నేళ్లుగా ఆ పరిస్థితి మారిపోయింది. ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చడం, జనరల్ బోగీలను కుదించేస్తుండటంతో సామాన్యులు నరకం అనుభవిస్తున్నారు. పెరుగుతున్న వ్యాపార ధోరణులకు తోడు భద్రతకు పెద్దపీట వేయకపోవడం భారతీయ రైల్వే ప్రతిష్ఠను మసకబారుస్తోంది. అరవై ఏళ్ల కిందటే బుల్లెట్ రైలును పట్టాలకెక్కించిన జపాన్- ఆధునిక సాంకేతికత ఆలంబనగా ప్రమాదాలకు ఏమాత్రం ఆస్కారం లేకుండా ప్రయాణికులను సురక్షితంగా సకాలంలో గమ్యస్థానాలకు చేరుస్తోంది. చైనా, అమెరికా, దక్షిణ కొరియా, సింగపూర్ వంటివీ అలాంటి మేలిమి విధానాలనే అనుసరిస్తున్నాయి. దేశీయంగానేమో అనేక రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుంటాయి. అపరిశుభ్ర బోగీలతో పాటు అనేక సమస్యలు ప్రయాణికులకు పీడకలలు మిగిలిస్తుంటాయి. భారతీయ రైల్వేలో భద్రత, ప్రజా సౌకర్యాలు తదితరాల అధ్యయనానికి పార్లమెంటరీ సంఘం తాజాగా నిశ్చయించింది. పరిశీలనలతోనే సరిపుచ్చకుండా లోటుపాట్ల సరిచేతకు పటిష్ఠ చర్యలు సాకారమైతేనే మన రైల్వే స్థితిగతులు మారేది!



భవిష్యత్తులో ప్రజల ప్రవర్తన ఎలా ఉంటుందన్న దానిపైనే రాజ్యాంగం పనితీరు ఆధారపడి ఉంటుంది. అంతేతప్ప, శిక్షల మీద కాదు. అంటరానితనం అనే అమానవీయ విధానం కాలగతిలో పూర్తిగా కనుమరుగు కావాలని ఆశిస్తున్నాను.

-దాక్షాయని వేలాయుధన్, రాజ్యాంగ సభ సభ్యురాలు

భక్తి యోగ సారం

సచ్చిదానంద స్వరూపమైన పరమాత్మ సర్వ కారణ కారణం. కర్త, భర్త, ధాత, విధాత, అంతర్యామి, సర్వవ్యాప్తి... అన్నీ ఆయన స్వరూప స్వభావాలే. స్థూలంగా భక్తి రెండు విధాలు. ఒకటి వైధీభక్తి, రెండోది రాగభక్తి. శాస్త్రాలు, గురువులు చెప్పిన విధివిధానాలకు కట్టుబడింది వైధీభక్తి. క్రియాశీల భక్తి ప్రేమానురక్తితో కూడినప్పుడు అది రాగానురాగ భక్తిగా మారుతుంది. బాహ్యం నుంచి భావగతం అయినప్పుడు రస ప్రసవమై పరాకాష్ఠ చెందుతుంది. శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మాధుర్య, రసోల్లాసం వెరసి రాగాత్మిక భక్తి అంటారు. ఇందులో ఎలాంటి ప్రతికూల భావాలకు అంటే కామం, క్రోధం, మొదలైన అరిషడ్వర్గాలతో సంబంధ బాంధవ్యాలు ఉండవు.



అంతర్యామి

శాశ్వతమైన పరంధామానికి రాజమార్గం లాంటిది రాగభక్తి. దీంతో సద్యోముక్తి సాధించవచ్చు. భగవంతుడు భక్తిసులభుడు అనడానికి ఇదే కారణం. ప్రహ్లాద కుమారుడు వల్లించిన నవవిధ భక్తులు- శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం- కేవలం మార్గదర్శకాలు. వీటిని 'అభిధేయములు' అంటారు. ఇవి భగవంతుడి పట్ల ప్రేమను పెంచుతాయి. భగవంతుడు శుద్ధ భక్తుల హృదయంలోనే ఉంటాడు. 'భక్తి యోగేనమానసి' అని భాగవతం చెబుతోంది. శుద్ధ భక్తుల భక్తి భావభరితం. ప్రేమాన్వితం అయిన వారి నేత్రాలు హృదయాంతరాళాలలోని భగవత్ స్వరూపాన్ని చూడగలుగుతాయి. నిర్గుణ నిరాకార బ్రహ్మం- సచ్చిదానంద దేహకాంతి పుంజమేనంటుంది వీరవైష్ణవం. భగవంతుడి చతుర్ వ్యూహ విలాసం చతుర్వేదాల్లో, నాలుగు పురుషార్థాల్లో నిక్షిప్తమై ఉంది. రుగ్వేదం వాసుదేవుడికి, యజుర్వేదం సంకర్షణుడికి, సామవేదం ప్రద్యుమ్నుడికి, అధర్వణ వేదం అనిరుద్ధుడికి అన్వయించుకోవచ్చు. కృష్ణావతారం లీలామానుషరూప విలాసం. పరబ్రహ్మ పూర్ణావతారం. నాగలిని ఆయుధంగా ధరించిన బలరాముణ్ని ప్రస్తావిస్తూ, దశావతారాలలో అష్టమ అవతారంగా ప్రస్తుతించాడు జయదేవ మహాకవి.

వాస్తవంగా, వాసుదేవుడికి మాయతో ఎలాంటి సంబంధం లేదంటారు భక్తి వేదాంత ప్రభుపాదులు. రుగ్వేదంలోని పురుషసూక్తం పరమాత్మ అస్తిత్వాన్ని చాటుతోంది. ఉపనిషత్తులు ఆ పరాత్పరుడికి ఊపిరులూదుతున్నాయి. సర్వోపనిషత్తు పరమాత్మ మహిమలను వర్ణిస్తోంది. ఎవరు ఏ విధంగా చూడాలనుకుంటే ఆ రూపంలోనే పరమాత్మ కనిపిస్తాడు. అన్ని రూపాలు, అన్ని గుణాలు ఆయనవేనని తెలిసినవాడే జ్ఞాని. జ్ఞాని అంటే తనకు ఇష్టమని భగవానుడే స్వయంగా చెప్పాడు. ఆర్తి జిజ్ఞాసుగా, జిజ్ఞాసు అర్థార్థిగా, అర్థార్థి జ్ఞానిగా ఎదగాలన్నది భగవానుడి అభిలాష. తండ్రి తనయుడి ఎదుగుదల కోరుకుంటాడు. తండ్రి ద్వారా కర్మ మార్గంలో గమించి, జ్ఞానం సంపాదించి తరించడమే ముఖ్యం. తాదాత్మ్యమే భక్తి యోగ సారం.

– ఉప్పు రాఘవేంద్రరావు

పంథా మార్చిన ముయిజ్జు

భారత్, మాల్దీవుల సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి. చైనా అనుకూల వైఖరిని కనబరుస్తూ వచ్చిన మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు ఇటీవల భారత్‌లో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. హిందూ మహాసముద్రంలో తనకు అత్యంత చేరువలో ఉన్న ఇండియాతో సంబంధాలను కాపాడుకోవడం చాలా అవసరమని ఆయన గ్రహించారు.



మాల్దీవుల అధ్యక్షుడిగా మహమ్మద్ ముయిజ్జు 2023 నవంబరులో పదవీ స్వీకారం చేసినప్పుడు భారతదేశంపై తీవ్ర వ్యతిరేకత ప్రదర్శించారు. అయితే, ఈనెల 6-10 తేదీల్లో ఇండియాకు వచ్చిన ఆయనను చూస్తే ఈయన పాత ముయిజ్జుయేనా అని సందేహం కలిగింది. ఇంతలోనే ఎంత మార్పు! మాల్దీవుల నుంచి భారత్‌ను సాగనంపుతానంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన ఆయన- పదవిని చేపట్టిన వెంటనే తన వాగ్దానాన్ని నెరవేరుస్తున్నట్లు కనిపించక తప్పలేదు. అందుకే తమ ద్వీపం నుంచి భారతీయ సైనిక సిబ్బంది వెనక్కు వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. ఆ సిబ్బంది మాల్దీవులకు భారత్ బహూకరించిన హెలికాప్టర్‌నూ, విమానాన్నీ నిర్వహిస్తున్నారు. వైద్య చికిత్సల కోసం వ్యక్తులను తరలించడానికీ, మాల్దీవుల భద్రత నిమిత్తం పరిసర హిందూ మహాసముద్ర జలాల్లో పహరాకూ వాటిని ఉపయోగిస్తున్నారు. అయినాసరే, భారతీయ సైనిక సిబ్బంది తిరిగి వెళ్లిపోవాల్సిందేనని ముయిజ్జు పట్టుబట్టారు. తనకు ముందున్న ప్రభుత్వాలు ఇండియాతో కుదుర్చుకున్న ఒప్పందాలను సమీక్షించసాగారు.

మొదట్లో డ్రాగన్ పాట

ముయిజ్జు అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక భారత్ కన్నా చైనాకు ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టారు. అధ్యక్షుడి హోదాలో తన మొట్టమొదటి విదేశీ యాత్రకు చైనానే ఎంచుకున్నారు. డ్రాగన్‌తో సైనిక సహకార ఒప్పందాలూ కుదుర్చుకున్నారు. ఫలితంగా భారత్‌తో మాల్దీవుల సంబంధాలు ఒత్తిడికి లోనయ్యాయి. అయితే, ఈ ప్రతికూల వాతావరణం ఎంతోకాలం కొనసాగలేదు. ముయిజ్జు చైనా అనుకూలతను, భారత్ వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నప్పటికీ దిల్లీ సంయమనం కోల్పోలేదు. పరిణత దృక్పథంతో ముందుకు సాగింది. ముయిజ్జు కోరినట్లు మాల్దీవుల నుంచి సైనిక సిబ్బందిని ఉపసంహరిస్తూనే, వారి స్థానంలో పౌర సిబ్బందిని పంపడానికి ఆయన్ను ఒప్పించగలిగింది. భారతీయ సైనిక సిబ్బందిని మాత్రమే తిప్పిపంపి విమానం, హెలికాప్టర్లను అట్టిపెట్టుకోవాలని ముయిజ్జు అనుకొన్నందువల్ల ఈ ప్రతిపాదనకు ఒప్పుకొన్నారు. హిందూ మహాసముద్రంలో తనకు అత్యంత చేరువలో ఉన్నది భారతదేశమే కాబట్టి, మంచి ఇరుగుపొరుగు సంబంధాలను కాపాడుకోవడం ముఖ్యమని ఆయన గ్రహించారు. సైనిక సిబ్బందిని వెనక్కు పంపేసిన తరవాత భారత్‌తో సంబంధాలను దెబ్బతీసే మరే నిర్ణయాన్నీ, చర్యనూ తీసుకోకుండా ముయిజ్జు జాగ్రత్త వహించారు. అంతేకాదు, భారత ప్రధాని నరేంద్ర మోదీపై అప్రతిష్ఠాకర వ్యాఖ్యలు చేసిన ఇద్దరు మంత్రులను కూడా ఆయన బర్తరఫ్ చేశారు. 2023 డిసెంబరులో దుబాయ్‌లో 'కాప్-28'సభ జరిగినప్పుడు మోదీతో ముయిజ్జు సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాల పటిష్ఠతకు ఒక కోర్ బృందాన్ని నెలకొల్పాలని నిర్ణయించారు. భారత విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఈ ఏడాది ఆగస్టులో మాల్దీవులకు వెళ్లినప్పుడు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. జైశంకర్ పర్యటనలోనే ముయిజ్జు జరపబోయే భారతదేశ యాత్ర గురించి చర్చించుకున్నారు. తదనుగుణంగా అక్టోబరులో ముయిజ్జు చేపట్టిన ఇండియా సందర్శన పలు విధాలుగా ప్రయోజనకరమైంది. భారత్-మాల్దీవుల సంబంధాలు మళ్లీ గాడిలో పడ్డాయని ముయిజ్జు పర్యటన చాటిచెప్పింది. భారతదేశ భద్రతకు ముప్పు తెచ్చే పనులేమీ మాల్దీవులు చేయదని ఆయన హామీ ఇచ్చారు. ఇతర దేశాలతో (అంటే చైనాతో) తమ సంబంధాలు భారత్‌కు వ్యతిరేకంగా ఎక్కుపెట్టినవి కావనీ స్పష్టం చేశారు. ఆర్థిక రంగంలో రెండు దేశాల మధ్య సహకారాన్ని వృద్ధి చేసుకోవాలని, హిందూ మహాసముద్రంలో పరస్పర భద్రతను ఇనుమడింప చేసుకోవాలని మోదీ, ముయిజ్జు నిశ్చయించారు. కీలకమైన ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఆ ప్రకారం- మాల్దీవుల్లో రేవులు, విమానాశ్రయాలు, గృహవసతి, ఆస్పత్రులు, రహదారులు, పాఠశాలలు, క్రీడా సౌకర్యాలు, తాగునీరు, మురుగునీటి వ్యవస్థల నిర్మాణానికి తోడ్పడటం ద్వారా భారత్ తన సహకారాన్ని కొనసాగిస్తుంది. రాజధాని మాలెని పొరుగు ద్వీపాలతో కలిపే 6.74 కిలోమీటర్ల వంతెన నిర్మాణానికి ఉద్దేశించిన గ్రేటర్ మాలె ప్రాజెక్టుకు భారత్ ఆర్థికంగా, సాంకేతికంగా, నిర్మాణపరంగా సాయం చేస్తుంది. ఇది మాల్దీవుల్లో అతిపెద్ద ప్రాజెక్టు. ఆ దేశానికి ఆర్థిక జీవరేఖ కానున్నది. మాల్దీవుల వాణిజ్య లోటును అధిగమించడానికి భారతీయ రిజర్వు బ్యాంకు విదేశ మారక ద్రవ్యాన్ని సమకూరుస్తుంది. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కడానికి తోడ్పడుతుంది.

బహుళ ధ్రువ ప్రపంచం కోసం...

హిందూ మహాసముద్రంలో భద్రతాపరంగా కీలక స్థానంలో ఉన్న మాల్దీవులతో బంధాన్ని పటిష్ఠపరచుకోవడానికి ఇండియా ప్రాధాన్యమిస్తోంది. భారత్ చేపట్టిన పొరుగు దేశాలకు ప్రాధాన్యం, సాగర్ (ప్రాంతీయ భద్రత, ప్రగతి) విధానాలను అనుసరించి మాల్దీవులతో సహకారాన్ని భారత్ వృద్ధి చేసుకుంటోంది. గతంలో ప్రపంచం అమెరికా, సోవియట్ కూటముల మధ్య చీలిపోయింది. ఈసారి రెండు అగ్రదేశాలకే పరిమితం కాకుండా బహుళ ధ్రువ ప్రపంచం ఏర్పడాలని భారత్ కోరుకుంటోంది. అందువల్ల మాల్దీవులు తనతోపాటు చైనాతోనూ, ఇతర దేశాలతోనూ సంబంధాలను బలపరచుకున్నా దిల్లీకి ఆమోదనీయమే. అయితే ఆ సంబంధాలు తనకు హాని చేయకుండా ఉండాలని మాత్రమే భారత్ ఆశిస్తోంది. తదనుగుణంగా మాల్దీవుల విషయంలో దిల్లీ సంయమనం పాటిస్తోంది. నేర్పుగా వ్యవహరిస్తోంది. మాల్దీవులు కూడా వాస్తవాలను గ్రహించి భారత్‌తో సంబంధాలను తిరిగి గాడిన పెట్టుకోవడం సంతోషదాయకం. ఇది దక్షిణాసియాకూ, హిందూ మహాసముద్ర ప్రాంతానికీ ఎంతో మేలు చేసే పరిణామం.



అచల్ మల్హోత్రా
అర్మీనియా, జార్జియాల్లో భారత మాజీ రాయబారి



అందరిలో మంచీచెడూ!

'మానవ జీవితమే ఒక మహాభారతం. అది మంచి చెడుల రెంటి నడుమ నిత్య ఘర్షణం' అన్నారు ఓ సినీగీతంలో మహాకవి శ్రీశ్రీ. మనం మనుషుల్ని మంచివారు, చెడ్డవారు అంటూ ముద్రలు వేస్తాం కానీ నిజానికి ప్రతి వ్యక్తిలోనూ మంచి చెడులు రెండూ ఉంటాయనిపిస్తుంది కొన్ని సంఘటనలను చూస్తుంటే!

అది పండుగ సమయం. ప్రయాణికులతో రైళ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. రిజర్వేషన్ బోగీ కూడా కిక్కిరిసి ఉంది. రైలు కదలబోతుండగా ఇద్దరు మహిళలు హడావుడిగా తోసుకుంటూ ఎక్కారు. ఒకరి వెంట అయిదారేళ్ల పిల్లాడు కూడా ఉన్నాడు. అప్పటికే ముగ్గురు కూర్చున్న సీటు దగ్గరకు చేరి కూర్చున్నవాళ్లను జరగమని దబాయించారు. ఆ కాస్త జాగాని ఆక్రమించడానికి 'నేను ముందొచ్చా'నంటే 'నేను ముందొచ్చా'నంటూ పోట్లాటకు దిగారు. ఆ సీటుకోసం ఏం చేయడానికైనా సిద్ధమే అన్నంత ఆవేశంగా పోట్లాడుకున్నారు. తోటి ప్రయాణికులు కలగజేసుకుని పిల్లాడున్న ఆమెకి సీటు ఇప్పించారు. ఆ రద్దీలో ఎవరికి రిజర్వేషను ఉందో ఎవరికి లేదో తెలియక, అడిగితే ఏం గొడవలవుతాయోనని భయపడి ఎవరికి వారు ఇరుక్కుని కూర్చునో నిలబడో సర్దుకుపోతున్నారు. ఓ రెండు గంటల తరవాత టీసీ వచ్చి టికెట్ల ప్రకారం సీట్లు ఇచ్చి మిగిలినవారిని ఖాళీ చేయించాడు. అప్పుడు అందరూ ఊపిరి పీల్చుకుని ఎవరి బెర్త్ వాళ్లు ఎక్కి పడుకున్నారు.

అర్ధరాత్రి రైలు ఎందుకో కుదుపులకు లోనవడంతో అందరికీ మెలకువ వచ్చింది. అంతలో సడెన్ బ్రేక్ వేసినట్లు ఒకేసారి పెద్ద కుదుపుతో ఆగింది రైలు. దాంతో పై బెర్త్ మీద తల్లి పక్కన పడుకున్న పిల్లాడు జారి పడబోయాడు. ఆ... అని కింద కూర్చున్నవాళ్లు నోరెళ్లబెట్టారు. కింది బెర్తు మీదున్న ఆవిడ గబుక్కున చేతులు చాచి పిల్లాణ్ని పట్టుకుంది. ఒడిలో కూర్చోబెట్టుకుని సముదాయించింది. కళ్లు మూసి తెరిచేలోపల జరిగిపోయిందా సంఘటన. పిల్లాడి తల్లి గబగబా కిందికి దిగి బిడ్డను పడకుండా పట్టుకున్న ఆమెకు కృతజ్ఞతలు చెప్పింది. బిడ్డను అక్కున చేర్చుకుంది. ఆ తరవాత ఇద్దరూ కాసేపు పక్కపక్కనే కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. మళ్లీ రైలు బయల్దేరాక ఈసారి కింది బెర్త్ ఆమె పైకి వెళ్లగా తల్లీబిడ్డా కింది బెర్తుమీద పడుకున్నారు. ఎంతలో ఎంత మార్పు... కొద్ది గంటల క్రితం హోరాహోరీగా పోట్లాడుకుంది వారిద్దరే.

స్వార్థం అనే మబ్బుకమ్మి కాసేపు కోపతాపాలు ప్రదర్శిస్తారు కానీ మనుషులంతా స్వతహాగా మంచివాళ్లే కదా! 'మాట కలుపుకొన్న కోపమే చెలిమి అవునులే' అన్న కవి మాట గుర్తొచ్చి ఆ సంఘటన తలచుకున్నప్పుడల్లా పెదవులపై చిరునవ్వు ఒకటి మెరుస్తుంది!

– గంటగారి నవనీత



ఆసియాన్‌తో అనుబంధం

ప్రధాని మోదీ తాజాగా 21వ భారత్-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. సమగ్ర భాగస్వామ్య బలోపేతానికి 10 సూత్రాల ప్రణాళికను ప్రకటించారు. ఆసియాన్ దేశాలు చిన్నవే అయినా వాటి నుంచి వంటనూనెలు, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తదితరాలను ఇండియా భారీగా దిగుమతి చేసుకుంటోంది. ఆయా సంవత్సరాల్లో ఆసియాన్ దేశాల నుంచి భారతదేశ దిగుమతుల విలువ.. (కోట్ల డాలర్లలో)

2016–17	4062
2017–18	4713
2018–19	5932
2019–20	5537
2020–21	4742
2021–22	6808
2022–23	8757

(ఆధారం: కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ వెబ్‌సైట్)

వచ్చేస్తున్నాడు... మర మానవుడు!

హోటల్‌లో మనం కోరిన ఆహార పదార్థాలను రోబో ప్లేట్లో పెట్టుకుని టేబుల్ దగ్గరికి తెస్తే తెగ సంబరపడిపోతుంటాం. అది మరింత నాజూకైన రూపంలో మనలాగే చిరునవ్వులు చిందిస్తూ, జోకులు చెబుతుంటే ఇంకెంత బావుంటుందో కదా? ఇంటి పనులన్నీ చేసిపెట్టి, మన కష్టసుఖాలు విని మంచి సలహాలిస్తేనో? పోయినవారి రూపంలో, అచ్చం వారిలాగే హావభావాలు ప్రదర్శిస్తూ, అదే స్వరంతో మాట్లాడే రోబో ఇంట్లో తిరుగాడుతుంటే- ఆప్తులను కోల్పోయిన బాధాతప్త హృదయులకు ఊరట లభించదూ? మనిషిలాంటి మరమనిషి తయారీకి దశాబ్దకాలంగా జరుగుతున్న పరిశోధనల పుణ్యమే- ఈ 'సిక్స్త్ సెన్స్ రోబో'లు! వీటినే హ్యూమనాయిడ్ రోబోలనీ అంటున్నారు. ఇప్పటికే ఇలాంటివి కొన్ని అందుబాటులోకి వచ్చాయి.





మనిషిని పోలిన మనుషులు మనకు ఎక్కడో ఒక చోట తారసపడుతుంటారు. అయితే, మైనం బొమ్మలాగా అచ్చుగుద్దినట్టు మనిషిని పోలిన మర మనుషులు తయారు కావడానికి ఇక ఎంతోకాలం పట్టేలా లేదు! విభిన్నమైన అత్యాధునిక సాంకేతికతల మేళవింపుతో దీన్ని సాకారం చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు ఊపందుకున్నాయి.

నాజూకైన స్పర్శ...

టోక్యో విశ్వవిద్యాలయ పరిశోధకులు ఇటీవల మనిషి చర్మపు కణాలతో 'లివింగ్ స్కిన్'ను తయారుచేసి రోబో ముఖానికి అమర్చారు. అదేమో అచ్చం మనిషిలా నవ్వులు చిందించింది. అలా నవ్వేటప్పుడు కణతల భాగంలో ముడతలు ఏర్పడ్డాయి. పరిశోధకులు మరో రకమైన కృత్రిమ చర్మాన్ని చేతి వేలికి తొడిగి చూస్తే, అది కూడా మనిషిలాగే స్పర్శించి, స్పందించింది. లివింగ్ స్కిన్‌కు దెబ్బ తగిలినా దానంతట అదే బాగయిపోతుందంటున్నారు పరిశోధకులు. దీన్ని మరింతగా అభివృద్ధిచేసి, రోబోలకు అచ్చం మనిషి చర్మంలాంటి దాన్ని అద్దడానికి ప్రయత్నిస్తున్నారు.

నిజానికి రోబోలన్నీ మనిషి రూపంలోనే ఉండవు. చేయాల్సిన పనికి అనువుగా వాటికి ఆకృతినిస్తారు. ఏ రూపంలో ఉన్నాసరే, కంప్యూటర్ ప్రోగ్రాం ప్రకారం అవి ఆటోమేటిక్‌గా పనిచేస్తాయి. సెన్సర్ల ద్వారా గ్రహించిన సమాచారాన్ని విశ్లేషించుకుని నడుచుకుంటాయి. మరికొన్ని ఏమో వ్యక్తులు ఇచ్చిన సూచనలను 'అలెక్సా' మాదిరిగా పాటిస్తాయి. విద్య, వినోదం, రక్షణ, వైద్యారోగ్య రంగాలతో పాటు ప్యాకేజింగ్-రవాణా, వ్యవసాయ, పారిశ్రామిక కార్యకలాపాలు, ఇంటి పనుల్లోనూ రకరకాల రోబోలను వినియోగిస్తున్నారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం సర్వీస్ రోబోలకు డిమాండ్ అధికంగా ఉంటోంది. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రోబోటిక్స్ విడుదల చేసిన 'వరల్డ్ రోబోటిక్స్-2024' నివేదిక ప్రకారం- అత్యధికంగా ఆరోగ్య రంగంలో 36శాతం, ప్యాకేజింగ్-రవాణా రంగంలో 35శాతం, వైద్య రంగంలో 31శాతం, వ్యవసాయంలో 21శాతం సర్వీసు రోబోలు పనిచేస్తున్నాయి. అందులోనూ చైనా, జపాన్, అమెరికా, కొరియా, జర్మనీల్లోనే రమారమి 80శాతం రోబోలున్నాయి. ఈ జాబితాలో ఏడో స్థానాన్ని ఆక్రమించిన ఇండియా- సమీప భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇంగితజ్ఞానం మాటేంటి?

విభిన్నమైన సెన్సర్లు, ఎలక్ట్రానిక్ పరికరాల సాయంతో రోబోలు చూడటం, వినడం, రుచినీ వాసననూ గ్రహించడం, స్పర్శించడం చేయగలవు. కానీ, అవి మనిషిలా ఆలోచించి నిర్ణయాలు మాత్రం తీసుకోలేవు. అయితే, అత్యాధునిక హ్యూమనాయిడ్ రోబోలకు ఇంగిత జ్ఞానాన్ని మప్పాలని... తద్వారా అవి ఆయా సమాజాలకు, సందర్భాలకు తగినట్లు ప్రజలతో మమేకం కాగలవని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇందుకోసం అత్యాధునిక సెన్సర్లతో పాటు కెమెరాలు, ప్రాసెసర్లు, మైక్రోఫోన్లు, స్పీకర్లు వినియోగిస్తున్నారు. వీటికి కృత్రిమ మేధను జోడిస్తున్నారు. ఇది రోబోలు అత్యంత క్లిష్టమైన డేటాను చిటికెలో విశ్లేషించడమే కాకుండా... ఎదుటి మనిషి మాటలను, హావభావాలను సరిగ్గా అర్థం చేసుకుని పరిస్థితులకు అనుగుణంగా మానవ రీతిలో ప్రతిస్పందించడానికి తోడ్పడుతుందంటున్నారు. మనం సాధారణంగా మాట్లాడే భాషను రోబోలు అర్థం చేసుకోవడానికి వీలుగా 'నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పీ)'ని కూడా మేళవిస్తున్నారు. అంతేకాదు, మనిషిలాగే భావోద్వేగాలను ముఖ కవళికలు, భంగిమల ద్వారా వ్యక్తపరచేందుకు బాడీ లాంగ్వేజ్‌ను అలవర్చాలని చూస్తున్నారు. మెషీన్ లెర్నింగ్‌తో పాటు ఆకృతి రూపకల్పన కోసం ఆర్ట్, డిజైన్ టెక్నాలజీలను ఉపయోగిస్తున్నారు. అందుకనే ఏఐ, ఎంఎల్, ఎన్ఎల్‌పీ వంటి సాంకేతిక నిపుణులకు రోబోటిక్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు ఆహ్వానం పలుకుతున్నాయి. మనం చూస్తూ ఉండగానే ఏదో ఒకరోజు కోరుకున్న వ్యక్తి రూపంలో హ్యూమనాయిడ్‌ను తయారుచేసిచ్చే కంపెనీలు పుట్టుకురావచ్చు. అయితే, ఇటువంటి మరమనుషుల తయారీ, వినియోగం ఎంతవరకు సురక్షితమన్నది- ఇంకా తేలని ప్రశ్నే!

– టి.రఘుబాబు

హాయ్! బుజ్జీ!!

పంజరంలో చిలుక

'సిద్ధూ! నీ పుట్టినరోజుకు బట్టలు కొనడానికి వెళ్దాం పద' అంటూ పిలిచాడు వాళ్ల తాతయ్య రామం. కొత్త డ్రెస్సు అనగానే సిద్ధు హుషారుగా బయలుదేరాడు. అలా బజార్లో నడుచుకుంటూ వెళ్తుంటే ఒక దగ్గర.. రామచిలుకను పంజరంలో పెట్టి అమ్మడం చూశాడా అబ్బాయి. వెంటనే.. 'తాతయ్యా! నాకు ఆ చిలుకను కొనిపెట్టవా?' అని అడిగాడు. 'నీకు డ్రెస్ కొనడానికని వచ్చాం. అయినా.. చిలుక ఎందుకు నీకు? వెళ్లేటప్పుడు చూద్దాంలే!' అన్నాడు తాతయ్య. 'లేదు తాతా! ముందు చిలుకే.. కొందాం. తర్వాతే.. డ్రెస్' అని మొండిగా వాదించాడు సిద్ధు. ఇక చేసేదేంలేక.. రామచిలుకని కొన్నాడు రామం. తర్వాత కొత్త బట్టలు తీసుకొని ఇంటికి బయలుదేరారు. ఇంటికి వచ్చాక.. 'చిలుకను జాగ్రత్తగా చూసుకో. ఆ పంజరం తలుపు తీయకు. ఆహారం.. పైనున్న కన్నంలో నుంచి వేయు' అని చెప్పాడు తాతయ్య. అలాగేనంటూ బదులిచ్చాడు సిద్ధు.




ఆరోజు సిద్ధు పుట్టినరోజు. ఉదయాన్నే నిద్రలేచి.. తలస్నానం చేసి, కొత్త డ్రెస్ వేసుకున్నాడు. అమ్మానాన్నలు, తాతయ్య ఆశీర్వాదం కూడా తీసుకున్నాడు. తర్వాత పంజరాన్ని బయటకు తీసుకెళ్లి.. అందరూ చూస్తుండగానే చిలుకను గాల్లోకి వదిలాడు. అది ఎంచక్కా ఎగురుకుంటూ వెళ్లి చెట్టు మీద వాలింది. 'కొనేంత వరకు మారాం చేశావు. కానీ ఇప్పుడు.. దాన్ని ఎందుకలా వదిలేశావు?' అని ఆశ్చర్యంగా అడిగాడు రామం. 'ఎగరడమే.. చిలుక సహజ లక్షణం కదా తాతయ్య.. అలాంటిది దాన్ని బంధించడం తప్పు. నిన్ననే వదిలేద్దాం అనుకున్నాను కానీ చీకటి పడటంతో.. ఆగిపోయాను. అందుకే ఇప్పుడు వదిలేశాను' అని బదులిచ్చాడు సిద్ధు. తన ఆలోచనా విధానానికి ఇంట్లో వాళ్లంతా ఎంతో సంతోషించారు.

– మొర్రి గోపి

కనిపెట్టండి

కింద ఇచ్చిన ఆధారాలతో వచ్చే పదాలను రాయండి.



జవాబు: 1.WISH 2.GOOD 3.LEFT

(c) eenadu



ప్రణమిల్లె పుడమి.. ప్రభవిల్లె ప్రణవి



విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. శనివారం దుర్గమ్మ శ్రీరాజరాజేశ్వరిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. తెల్లవారుజామున 2.30 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు దర్శనాలు కొనసాగాయి. విజయదశమి కావడంతో మూలానక్షత్రం స్థాయిలో భక్తులు పోటెత్తారు. 10 రోజుల్లో 9 లక్షల మంది భక్తులు వచ్చారు. శనివారం సాయంత్రం కృష్ణా నదిలో గంగా పార్వతీ సమేత దుర్గామల్లేశ్వరుల తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈవో రామారావు, వేదపండితులు కలిసి మంగళవాయిద్యాలు, కోలాటం మధ్య ఉత్సవమూర్తులను ఊరేగింపుగా దుర్గాఘాట్‌కు తెచ్చారు. ఉత్సవ మూర్తులకు హారతులు ఇచ్చి, పూజలు చేసి.. విద్యుత్తు కాంతులతో అలంకరించిన హంస వాహనంపైకి తీసుకెళ్లారు. దుర్గగుడి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ జి.సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు. ఆపై ఉత్సవ మూర్తులను పన్‌టూన్ రాణాకు తెచ్చి.. పూజలు చేశారు. సాధారణ భక్తులు భారీగా తరలివచ్చి.. తెప్పోత్సవం తిలకించారు. దుర్గాఘాట్, ప్రకాశం బ్యారేజీ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

కిక్కిరిసిన భవానీలు...

శనివారం భవానీలు భారీగా పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి వేలాదిగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. క్యూలైన్లు కిక్కిరిసిపోవడంతో.. కొందరు ఘాట్‌రోడ్డు పక్కనున్న ఇంద్రకీలాద్రి కొండపై నుంచి అడ్డదారిలో పైకి చేరుకునేందుకు ప్రయత్నించారు.

ఈనాడు, డిజిటల్ - అమరావతి - న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి, చిట్టినగర్, భవానీపురం, కృష్ణలంక

10 రోజులు 9 లక్షల మంది భక్తులు

ఈనాడు, అమరావతి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిది రోజుల్లో తొమ్మిది లక్షల మంది భక్తులు దుర్గగుడికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల కోసం అధికారులు భారీగా సౌకర్యాలను కల్పించారు. ఉత్సవాలలో 18.11 లక్షల మంచినీటి ప్యాకెట్లు, 19.58 లక్షల నీటి బాటిళ్లను భక్తులకు అందజేశారు.

- మజ్జిగ ప్యాకెట్లు: 3.12 లక్షలు
- చిన్నారులకు పాలు: 13,700 లీటర్లు
- అన్నప్రసాదం: 2 లక్షల మందికి
- రూ.500 టిక్కెట్ల అమ్మకాలు: 38,027
- రూ.300 టిక్కెట్ల అమ్మకాలు: 16,848
- రూ.100 టిక్కెట్ల అమ్మకాలు: 38,384
- విక్రయించిన లడ్డూలు: 21.01 లక్షలు
- తలనీలాలు సమర్పించిన భక్తులు: 62,329



దసరా మహోత్సవాల ముగింపును పురస్కరించుకొని యాగశాలలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఉమాకాంత శర్మ నిర్వహించారు. స్థానాచార్య శివప్రసాదశర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాసశాస్త్రి, ప్రసాద్ పాల్గొన్నారు.

పల్లె పండగకు వేళాయె...

నేడు కంకిపాడులో శ్రీకారం చుట్టనున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

కంకిపాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'పల్లె పండగ' వారోత్సవాలను ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం కంకిపాడులో శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను చేయనున్నారు. అనంతరం స్థానిక తెదేపా మండల కార్యాలయం సమీపంలో జరిగే బహిరంగ సభలో మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో సభ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. 200 మంది కార్మికులు, భారీ యంత్రాలతో పనులు చేపట్టారు. కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, పంచాయతీరాజ్ కమిషనర్, ఎస్ఈ, ఈఈ, డీఈలు, పశు సంవర్ధక, వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు, ఎమ్మెల్యే బోడే ప్రసాద్, కూటమి నాయకులు, సభాస్థలాన్ని ఆదివారం పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపుపై స్థానిక పోలీస్ అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. పంచాయతీ రాజ్, పశు సంవర్ధక, డీఆర్‌డీఏ, వైద్య, ఆరోగ్య శాఖల జిల్లాస్థాయి అధికారులు, సిబ్బంది ఆదివారం ఉదయం నుంచి కంకిపాడులోనే ఉండి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు.


విద్యుత్తు వెలుగుల్లో సభా ప్రాంగణం


అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

పవన్‌కల్యాణ్ పర్యటన ఇలా...

- కంకిపాడులో సీసీ రహదారులు, స్థానిక సీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణం తదితర పనులకు శంకుస్థాపన చేస్తారు. 'మినీ గోకులం' ప్రారంభిస్తారు. వీటి శిలాఫలకాన్నీ సీహెచ్‌సీ ఆవరణలోనే అమర్చారు. మండల తెదేపా కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రాంగణంలో సభ నిర్వహిస్తారు. ఈ వేదిక నుంచి రాష్ట్ర స్థాయిలో 'పల్లె పండగ'కు ఉప ముఖ్యమంత్రి శ్రీకారం చుడతారు.

బస్సులు.. రైళ్లు కిటకిట


బస్టేషన్‌లో

విజయవాడ బస్టేషన్: దసరా సెలవులు ముగియడం.. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు, భవానీ దీక్షాధారులు, ఇతర రాష్ట్రాల నుంచి స్వగ్రామాలకు వచ్చినవారు తిరుగు ప్రయాణం కావడంతో శని, ఆదివారాల్లో పండిట్ నెహ్రూ బస్టేషన్ కిటకిటలాడింది. ప్రయాణికులతో ప్లాట్‌ఫాంలు నిండుగా కనిపించాయి. హైదరాబాద్, రాజమహేంద్రవరం ప్రాంతాలకు రద్దీ ఎక్కువగా కనిపించింది. ఆదివారం ఒక్కరోజే 113 అదనపు బస్సులను నడిపారు. రాజమహేంద్రవరం 80, హైదరాబాద్‌కు 33 బస్సులను నడిపామనీ.. అర్ధరాత్రి ప్రయాణికుల సంఖ్య పెరిగే వీలుండడంతో హైదరాబాద్‌కు అదనంగా మరో 34 బస్సులు సిద్ధం చేసినట్లు అధికారి నర్రా శ్రీనివాసరావు తెలిపారు.

రైల్వేస్టేషన్: విజయవాడ నుంచి సికింద్రాబాద్, బెంగళూరు, హావ్‌డా వైపు రాకపోకలు సాగించే రైళ్లన్నీ కిక్కిరిసి నడిచాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచే విజయవాడ ప్లాట్‌ఫారాలన్నీ ప్రయాణికులతో నిండాయి. సాధారణ, ప్రత్యేక రైళ్లలో రిజర్వేషన్ బెర్తులు నిండడంతో తత్కాల్ టికెట్లకు గిరాకీ పెరిగింది. సికింద్రాబాద్ వెళ్లే ఇంటర్‌సిటీ, నర్సాపూర్, మచిలీపట్నం, సింహపురి, గోదావరి హావ్‌డావైపు వెళ్లే ఫలక్‌నుమా, యశ్వంత్‌పూర్, హావ్‌డా, కోరమండల్, బెంగళూరు వెళ్లే శేషాద్రి, ప్రశాంతి, యశ్వంత్‌పూర్, చెన్నై వెళ్లే సర్కార్, మెయిల్, జీటీ, చార్మినార్, తమిళనాడు, నవజీవన్ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లన్నీ రద్దీగా నడిచాయి.


రైల్వే స్టేషన్‌లో

ఆదర్శప్రాయునికి అశ్రునివాళి



శ్రీ చుండూరి సురేష్‌బాబు గారు
(లేటు చుండూరి నాగేశ్వరరావు (ఫకీరయ్య) గారి కుమారుడు)
జననం: 1960 - మరణం: 02-10-2024
తరతరాలకు తరగని మంచితనం, మధురిమలను పంచి ఇచ్చిన మానవతామూర్తి, కుటుంబ శ్రేయస్సుతోపాటు సమాజసేవకై నిరంతరం శ్రమించిన మహోన్నత వ్యక్తి. మీరు మానుండి దూరమవడం మాకు తీరనిలోటు. మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
భార్య: రోహిణీ కుమారి
కుమారుడు: చుండూరి సీతారామ్ కోడలు: శ్రీవల్లి మనుమరాలు: చుండూరి ఈషాని మనుమడు: బండి యువాన్
కుమార్తె : బండి అనూష అల్లుడు: అభిలాష్ రెడ్డి సోదరుడు : చుండూరి సాయిబాబు మరియు బంధుమిత్రులు
పెద్దకర్మ: ది. 14-10-2024 సోమవారం విజయవాడ కానూరు 'మన కళ్యాణ వేదిక' నందు జరుపబడును. ఫోన్: 98668 52333

శ్రద్ధాంజలి



జననం 01-06-1957
మరణం 02-10-2024
కీ॥శే॥ దోనేపూడి మహేశ్వరి గారు
దివికేగిన వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ.. శ్రద్ధాంజలి ఘటిస్తూ..
భర్త: దోనేపూడి చంద్రశేఖరరావు
కుమారులు: దోనేపూడి సత్య సురేష్, దోనేపూడి సతీష్ కుమార్తె: వేములపల్లి సుధారాణి
మరియు కుటుంబసభ్యులు
Management & Staff
Capitalize Ventures LLC
Dallas, USA

R.V. TOURS AND TRAVELS PVT. LTD.
Bengaluru | Hyderabad | Visakhapatnam | Tirupati | Vijayawada | Varanasi
దీపావళి బంపర్ ఆఫర్
ఆస్ట్రేలియా & న్యూజిలాండ్ 15 Nights / 16 Days ప్రయాణపు తేదీ : 01.12.2024 Rs.5,30,000/- +5% GST +5% TCS
సింగపూర్ & మలేషియా 5 Nights / 6 Days ప్రయాణపు తేదీ : 15.11.2024 Rs.1,06,000/- +5% GST +5% TCS
బ్యాంకాక్ - పట్టాయా 4 Nights / 5 Days స్పెషల్ ఆఫర్ కేవలం Rs.32,999/- మాత్రమే + 5% GST + 5% TCS Per Person *Limited Seats Only
కాశీ - అయోధ్య 3 Nights / 4 Days స్పెషల్ ఆఫర్ (ఫ్లైట్ ప్యాకేజీ) (హైదరాబాద్ నుండి) కేవలం Rs.19,999/- మాత్రమే + 5% GST Per Person *Limited Seats Only
దేశీయ టూర్ ప్యాకేజీలు
కాశీ - అలహాబాద్ - గయా ఫ్లైట్ ప్యాకేజీ 9 Nights / 10 Days (హైదరాబాద్ నుండి) Rs.58,000/-
కాశీ రైలు ప్యాకేజీ 12 Days (హైదరాబాద్ నుండి) Rs.46,000/-
కాశీ - అలహాబాద్ అయోధ్య (ఫ్లైట్ ప్యాకేజీ) 4 Nights / 5 Days (హైదరాబాద్ నుండి) Rs.42,500/-
నైమిశారణ్యం - అయోధ్య కాశీ (ఫ్లైట్ ప్యాకేజీ) 5 Nights / 6 Days (హైదరాబాద్ నుండి) Rs.43,000/-
గుజరాత్ - మధ్య ప్రదేశ్ ఫ్లైట్ ప్యాకేజీ 11 Nights / 12 Days (హైదరాబాద్ నుండి) Rs.62,500/-
తమిళనాడు ఫ్లైట్ ప్యాకేజీ 7 Nights / 8 Days (హైదరాబాద్ నుండి) Rs.46,500/-
కర్ణాటక బస్సు ప్యాకేజీ 6 Nights / 7 Days (హైదరాబాద్ నుండి) Rs.39,000/-
మహారాష్ట్ర స్పెషల్ ప్యాకేజీ 7 Nights / 8 Days (హైదరాబాద్ నుండి) Rs.42,000/-
R.V. టూర్స్ & ట్రావెల్స్ Pvt. Ltd. విజయవాడ ఆఫీసులో పని చేయుటకు డిగ్రీ అర్హత కలిగిన యువతి మరియు యువకులు కావలెను.
సంప్రదించండి: 9100090873
ప్యాకేజీ యొక్క పూర్తి వివరముల కొరకు క్రింది నంబర్లను సంప్రదించండి
R.V. TOURS AND TRAVELS PVT. LTD.
9100090873 | 9121143959
9100090940

దసరా శుభాకాంక్షలు
vijayawada MUNICIPAL CORPORATION
రూ. 5 లకే భోజనం
★ పేదల ఆకలి బాధలు తీర్చుతున్న అన్న క్యాంటీన్లు
★ పూటకు రూ. 5కే ఆహారం. రూ. 15కే మూడు పూటలకూ కలిపి నాణ్యమైన ఆహారం
★ పరిశుభ్రమైన వాతావరణంలో, వేడి వేడి ఆహార పదార్థాలు అందిస్తూ.. పేదల మన్ననలు అందుకుంటున్న అన్న క్యాంటీన్లు
★ రోజూ లక్షలాది మంది పేదల ఆకలి బాధలు దూరం చేస్తున్న అన్న క్యాంటీన్లు
విజయవాడ నగర పరిధిలో 11 అన్న క్యాంటీన్లలో.. ఆదివారం సెలవు


ట్రక్సర్ మెషిన్‌తో మనుషులు వెళ్లలేని ప్రదేశాలలో కాలువల్లో లేటెస్ట్ టెక్నాలజీ ఉపయోగించి పూడిక తీయుట.


లేటెస్ట్ టెక్నాలజీతో ఉపయోగించి ఎం.ఎల్. ఆయిల్‌ను డ్రోన్ ద్వారా స్ప్రే చేసి దోమల నిర్మూలన

దోమల నియంత్రణ గురించి వ్యాధులను అరికట్టేందుకు ఇచ్చే అవగాహన


అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమా, కలెక్టర్ సృజన, కమిషనర్ ధ్యానచంద్ర


అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ సృజన, కమిషనర్ ధ్యానచంద్ర

అన్న క్యాంటీన్ ఆహార పట్టిక
ANNA CANTEEN FOOD MENU

	బ్రేక్ ఫాస్ట్ రూ. 5/-		లంచ్/డిన్నర్ రూ. 5/-
సోమవారం	ఇడ్లీ చట్నీ/పొడి, సాంబార్ (లేదా)	పూరి కుర్మా	వైట్ రైస్ కూర, పప్పు/సాంబార్, పెరుగు, పచ్చడి
మంగళవారం	ఇడ్లీ చట్నీ/పొడి, సాంబార్ (లేదా)	ఉప్మా చట్నీ/పొడి, సాంబార్, మిక్చర్	వైట్ రైస్ కూర, పప్పు/సాంబార్, పెరుగు, పచ్చడి
బుధవారం	ఇడ్లీ చట్నీ/పొడి, సాంబార్ (లేదా)	పొంగల్ చట్నీ/పొడి, సాంబార్, మిక్చర్	వైట్ రైస్ కూర, పప్పు/సాంబార్, పెరుగు, పచ్చడి
గురువారం	ఇడ్లీ చట్నీ/పొడి, సాంబార్ (లేదా)	పూరి కుర్మా	వైట్ రైస్ కూర, పప్పు/సాంబార్, పెరుగు, పచ్చడి
శుక్రవారం	ఇడ్లీ చట్నీ/పొడి, సాంబార్ (లేదా)	ఉప్మా చట్నీ/పొడి, సాంబార్, మిక్చర్	వైట్ రైస్ కూర, పప్పు/సాంబార్, పెరుగు, పచ్చడి
శనివారం	ఇడ్లీ చట్నీ/పొడి, సాంబార్ (లేదా)	పొంగల్ చట్నీ/పొడి, సాంబార్, మిక్చర్	వైట్ రైస్ కూర, పప్పు/సాంబార్, పెరుగు, పచ్చడి

బ్రేక్‌ఫాస్ట్ 7:30 - 10:00 | లంచ్ డిన్నర్ 7:30 - 9:00
ఆదివారం సెలవు. వారానికి ఒకరోజు స్పెషల్ రైస్
ఇడ్లీ, పూరి-3 PCS | ఉప్మా, పొంగల్ - 250 గ్రా. | వైట్‌రైస్ - 400 గ్రా.
చట్నీ/పొడి - 15 గ్రా. - సాంబార్ - 150 గ్రా. మిక్చర్ 25 గ్రా.
కూర - 100 గ్రా. | పప్పు/సాంబార్ 120 గ్రా. పచ్చడి 15 గ్రా. పెరుగు 75 గ్రా.
vijayawada MUNICIPAL CORPORATION
విజయవాడ నగరపాలక సంస్థ

(c) eenadu



ఘాట్ వద్ద ఎటుచూసినా భవానీలే..



కిక్కిరిసిన క్యూ లైన్లు



అడుగులన్నీ అమ్మవైపే..



కొండలుదాటి.. కోనలు దాటి.. దుర్గమ్మను చూడాలని

అఖిల జగములు మురిసెనమ్మ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

దసరా ఉత్సవాల ముగింపు రోజున మూలా నక్షత్రం రోజు వచ్చిన భక్తులను మించి దుర్గమ్మ దర్శనానికి భవానీ దీక్షాదారులు పోటెత్తారు. సీతమ్మ వారి పాదాల సెంటరు నుంచి దుర్గగుడి ఘాట్ రోడ్డు పైవరకు భవానీ దీక్షాదారులతో కిక్కిరిసిపోయింది. క్యూలైన్లోకి ప్రవేశించిన భక్తుడికి దర్శనానికి 10 గంటల సమయం పట్టింది. దీంతో దీక్షాదారులతోపాటు వచ్చిన వృద్ధులు, మహిళలు చిన్నారులు ఇబ్బంది పడ్డారు. సీపీ రాజశేఖర్ బాబు సిబ్బందిని అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్ సృజనతో కలిసి సీపీ పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చుని పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

★ దుర్గగుడిలో విధులు ముగించుకొని అర్చక స్వామి ఇంటికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై సీతమ్మవారి పాదాల సెంటరు సమీపంలోకి వచ్చేసరికి పోలీసులు తాడుపెట్టి ఆపుతున్నా వినకుండా భవానీ దీక్షాధారులు తోసుకువచ్చారు. దీంతో ద్విచక్ర వాహనం పడిపోయి అర్చకుడు గాయపడ్డారు. పలువురు భవానీ దీక్షాదారులు తోపులాటలో కిందపడిపోయారు. వెంటనే తేరుకుని విషయాన్ని నగర పోలీసు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యేక దళాలను పంపి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. మరోవైపు పోలీసుల ఆంక్షలతో కొందరు భవానీ దీక్షాదారులు, సామాన్య ప్రత్యామ్నాయ మార్గాల్లో వచ్చేందుకు ప్రయత్నించారు. ప్రమాదకరంగా కొండెక్కి ఎక్కారు.



నగరోత్సవం శోభాయమానం

★ భవానీల ఉత్సవాలు ముగిసిన తరువాత కూడా తండోపతండాలుగా తరలివచ్చారు. దీక్షాదారులు అనూహ్యంగా పెరగడంతో బందోబస్తు విధులకు వచ్చిన సాధారణ పోలీసులకు తోడు అదనంగా, పారామిలటరీ దళాలు, ఆక్టోపస్, ఏపీఎస్పీ దళాలను రంగంలో దింపి నియంత్రించారు. రెండు రోజుల్లో మూడు లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు భావిస్తున్నారు. ప్రసాదాల విక్రయ కేంద్రం, క్యూలైన్లు, హోల్డింగ్ పాయింట్ల వద్ద వీరు అత్యవసర సేవలను అందించడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా పోటెత్తిన భవానీ దీక్షాధారులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో ప్రణాళిక ప్రకారం శాశ్వత ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.



భళా.. నృత్యాభినయం

ఉపాధి కోసం వచ్చి ఉసురు తీసి..

నిందితుడిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే : విజయవాడలో సంచలనం సృష్టించిన రైల్వే లోకో పైలెట్ హత్య కేసు మిస్టరీ వీడింది. రూ. 750 కోసం నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాడు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రైల్వే పోలీసులు హత్య చేసిన గంటల వ్యవధిలోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. డబ్బు కోసమే ఈ హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ సందర్భంగా రైల్వే ఎస్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ రత్నరాజు వివరాలు వెల్లడించారు. బిహార్‌కు చెందిన దేవకుమార్‌సాహు ఉపాధి కోసం పది రోజుల కిందట విజయవాడ వచ్చాడు. ఎక్కడా పని దొరకలేదు. తెచ్చుకున్న డబ్బులు అయిపోవడంతో తీవ్ర ఒత్తిడికి లోనయ్యాడు. ఏదైనా నేరానికి పాల్పడాలని భావించాడు. ఇంద్రకీలాద్రి వద్ద దసరా ఉత్సవాలు జరుగుతున్న ప్రాంతంలో ఈ నెల 10వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో మద్యం, గంజాయి మత్తులో హంగామా సృష్టించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలో వదిలేశారు. అక్కడి నుంచి వెళ్తూ ఆటోలో నిద్రిస్తున్న డ్రైవర్‌పై రాయితో దాడి చేశాడు. అనంతరం రైల్వే ట్రాక్ వెంట స్టేషన్ పరిసరాలకు చేరుకున్నాడు. అక్కడ గూడ్స్ బోగీలను ప్లాట్‌ఫాంపైకి షంటింగ్ చేస్తున్న లోకో పైలెట్ డి.ఎబలేజర్‌ను డబ్బులు అడిగాడు. ఇచ్చేందుకు నిరాకరించడంతో పక్కనే ఉన్న ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. ఆయన జేబులో ఉన్న రూ.750 తీసుకున్నాడు. ట్రాక్‌పై విధులు నిర్వహిస్తున్న కీమెన్ గమనించి కేకలు వేయడంతో పారిపోయాడు. అనంతరం లోకోపైలెట్‌ను ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. నిందితుడి కోసం రైల్వే పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు ఆదే రోజు నైజాం గేటు వద్ద ఒక వ్యక్తిని ఇదే తరహాలో ఇనుపరాడ్డుతో బెదిరించి డబ్బులు డిమాండ్ చేయగా అతను అక్కడి నుంచి పారిపోయాడు. ఫోర్‌మెన్ బంగ్లా వస్తూ ఒకతన్ని డబ్బులు అడిగాడు. ఇవ్వకపోవడంతో రాయితో కొట్టడానికి ప్రయత్నించగా తప్పించుకున్నాడు. అక్కడి నుంచి రైల్లో గుడివాడ, మచిలీపట్నం తిరిగాడు. ఐదు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి రైల్వే పరిసరాలను జల్లెడపట్టారు. సీసీ కెమరాల దృశ్యాల ఆధారంగా దోసపాడు రైల్వేస్టేషన్ సమీపంలోని లెవల్ క్రాసింగ్ గేటు వద్ద నిందితుడిని ఈ నెల 12న అదుపులోకి తీసుకున్నారు. కేవలం డబ్బు కోసమే నిందితుడు హత్య చేసినట్లు డీఎస్పీ రత్నరాజు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన వెల్లడించారు. విలేకరుల సమావేశంలో జీఆర్పీ సీఐ జె.వి.రమణ, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ రత్నరాజు

ఉపాధి చూపే సంస్థలకు ప్రోత్సాహం

పటమట, న్యూస్‌టుడే: నైపుణ్యం గల స్థానిక యువతకు ఉపాధి కల్పించి ప్రోత్సహించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శనివారం ప్రఖ్యాత గ్లోబల్ టెక్నాలజీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సంస్థ డిపోల్ గ్రూప్ విజయవాడ పటమటలో ఏర్పాటు చేసిన 'ఇండియా' కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక యువతకు ఉపాధి కల్పించే సంస్థలకు సీఎం చంద్రబాబు తగిన ప్రోత్సాహం అందిస్తున్నారని పేర్కొన్నారు. డిపోల్ సంస్థ తమ ఇండియా కార్యాలయాన్ని విజయవాడ కేంద్రంగా ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు రవి నెక్కలపూడి, ఎండీ సాగర్ చాప్కే మాట్లాడుతూ... స్థానిక యువతకు సాధికారత కల్పించి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలనే లక్ష్యంతో తమ కంపెనీని విజయవాడలో ఏర్పాటు చేశామని తెలిపారు. వచ్చే మూడేళ్లలో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని పేర్కొన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె, పక్కన రవి, సాగర్ చాప్కే తదితరులు

అనురాగ వేదిక.. ఆత్మీయ కలయిక

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు మండలం శనగపాడులో దసరా మరింత శోభను సంతరించుకుంది. ఈ గ్రామం నుంచి వెళ్లి ఎక్కడో స్థిరపడిన వందలాది మంది స్వగ్రామం తరలివచ్చారు. నాలుగు తరాల వారు కలుసుకొని గ్రామంతో తమకు ఉన్న అనుబంధం, జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పెద్దలను సత్కరించారు. వీరందరి రాకతో గ్రామంలో సందడి నెలకొంది.



ఇంద్రకీలాద్రిపై ప్రముఖుల సందడి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మను శనివారం పలువురు ప్రముఖులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రముఖ నటుడు పృథ్వీరాజ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాక్ వేర్వేరుగా అమ్మవారి సన్నిధిలో సందడి చేశారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు వారికి ఆశీర్వచనం చేశారు. అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



సురేఖకు అమ్మవారి చిత్రపటం అందజేత



ఆశీర్వచన మండపంలో నటుడు పృథ్వీరాజ్ కుటుంబం

జగన్మాత దుర్గమ్మకు బంగారు హారం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు రూ. 10లక్షల విలువైన బంగారు హారాన్ని శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన వ్యాపారవేత్త పంకజ్ రెడ్డి బహూకరించారు. దాత కుటుంబానికి సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆలయ ఈవో రామారావు వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



ఈవో రామారావుకు బంగారు ఆభరణాన్ని అందజేస్తున్న పంకజరెడ్డి కుటుంబం

సాంస్కృతిక సౌరభం

ముగిసిన శక్తి విజయోత్సవం

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే : ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ.. కళాకారుల నృత్యాలతో కృష్ణానదీ తీరంలో సందడి నెలకొంది. ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని పున్నమి ఘాట్ వద్ద మూడు రోజులుగా నిర్వహించిన శక్తి విజయోత్సవం కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శని, ఆదివారాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు నగర వాసులను అలరించాయి. గిరిజన సాంప్రదాయ కొమ్ము నృత్యం, పోతురాజుల విన్యాసాలు, జానపద డప్పు నృత్యం, తదితర కార్యక్రమాలు జరిగాయి. హస్తకళలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. బాణసంచా కాల్చడంతో నదీతీరం వెలుగులతో నిండిపోయింది.



అందెల రవళి



థింసా నృత్యం చేస్తూ సంప్రదాయ వాయిద్య ప్రదర్శన



ఉట్టిపడిన కళా వైభవం

ఘుల్లుమంది గ్లాసు.. కిక్కుచూడు బాసు!



నేడు లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు

ఎన్టీఆర్ జిల్లాలో 113, కృష్ణాలో 123 షాపులకు డ్రా

ఈనాడు - అమరావతి

మద్యం దుకాణాల కోసం ఎక్సైజ్ శాఖ సోమవారం డ్రా తీయనుంది. వచ్చిన దరఖాస్తుల నుంచి ఒకరికి డ్రా ద్వారా కేటాయించనుంది. ఈ కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచే ప్రారంభం కానుంది. కొత్త మద్యం విధానంలో భాగంగా ప్రభుత్వ షాపులను రద్దు చేసి, ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

ఈనెల 1న ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలను నోటిఫై చేస్తూ గెజిట్ విడుదల చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 113, కృష్ణా జిల్లాలో 123 దుకాణాలకు ప్రైవేటు వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. డ్రా ప్రక్రియ కోసం ఎక్సైజ్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లాకు విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో, కృష్ణా జిల్లాకు మచిలీపట్నం హిందూ కళాశాలలో ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ తీయనున్నారు. ఇవి కాకుండా మరికొన్ని షాపులను కల్లుగీత కార్మికులకు కేటాయించనున్నారు. దీని ప్రకటన త్వరలో జారీ కానుంది.

ఎన్టీఆర్ జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్ల వారీగా దరఖాస్తుల వివరాలివీ..

స్టేషన్	ఆన్‌లైన్	ఆఫ్‌లైన్	మొత్తం
విజయవాడ తూర్పు, విజయవాడ పశ్చిమ, విజయవాడ (భవానీపురం)	1,654	876	2,530
నందిగామ	276	556	832
మైలవరం	352	217	569
కంచికచర్ల	92	223	315
జగ్గయ్యపేట	502	210	712
తిరువూరు	350	517	867
మొత్తం	3,226	2,599	5,825

టాప్ 5 ఇలా..

	దుకాణం సంఖ్య	వచ్చిన దరఖాస్తులు
1. వత్సవాయి	96	132
2. వత్సవాయి	97	120
3. పెనుగంచిప్రోలు	81	110
4. పెనుగంచిప్రోలు	83	87
5. పెనుగంచిప్రోలు	84	86



గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో ఏర్పాట్లు

ఆన్‌లైన్‌కే ఎక్కువ మంది మొగ్గు...

నగరపాలికలు, పురపాలికలు, మండలాల్లో జనాభా ఆధారంగా దుకాణాల సంఖ్య నిర్ణయించారు. ఈసారి ఆన్‌లైన్‌తో పాటు ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ, ఈస్ట్, వెస్ట్ స్టేషన్లతోపాటు మైలవరం, నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, తిరువూరు.. కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, బంటుమిల్లి, అవనిగడ్డ, మొవ్వ, గుడివాడ, నందివాడ, ఉయ్యూరు, గన్నవరం ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులు తీసుకున్నారు. ఎక్కువ మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ప్రతి దరఖాస్తుకు విధిగా రూ.2 లక్షల నాన్- రిఫండబుల్ రుసుము చెల్లించాలి. ఈ ఫీజు ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. మొత్తం కలిపి ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా 5,825, కృష్ణా జిల్లాలో 2,942 దరఖాస్తులు అందాయి. వీటి ద్వారా ఎన్టీఆర్‌లో రూ.116.50 కోట్లు, కృష్ణాలో రూ.58.84 కోట్ల రాబడి వచ్చింది. ఈనెల 11న సాయంత్రంతో దరఖాస్తుల సమర్పణ గడువు ముగిసింది. ఆరోజు అర్ధరాత్రికి కానీ కచ్చితమైన వివరాలు తేలలేదు.

డ్రా ద్వారా ఎంపిక

ఒక్కో వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చనే నిబంధనతో ఎన్టీఆర్ జిల్లాలో భారీగా స్పందన వచ్చింది. ముఖ్యంగా తెలంగాణతో సరిహద్దు ఉన్న ప్రాంతాల్లోని దుకాణాలకు ఎక్కువ మంది ఆసక్తి చూపించారు. అటు తెలంగాణలో వారితో పాటు, ఇటు స్థానికులు కూడా భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఈసారి అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉంచడంతోపాటు క్వార్టర్ సీసా రూ.99కే విక్రయించనున్నట్లు ప్రకటించడంతో ఎక్కువ మంది ఎగబడ్డారు. వచ్చిన వాటిల్లో నుంచి దుకాణం వారీగా డ్రా ద్వారా ఒకరికి కేటాయించనున్నారు. షాపు కేటాయించిన రోజే మొదటి విడత రిటైల్ ఎక్సైజ్ పన్నును చెల్లించాలి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రిటైల్ ఎక్సైజ్ పన్నును నాలుగు శ్లాబుల్లో నిర్ణయించారు. రెండో ఏడాది 10 శాతం మేర పన్ను పెంచారు. సోమవారం మొదటి విడత చెల్లించిన తర్వాత తాత్కాలిక లైసెన్సు జారీ చేయనున్నారు. దుకాణదారు ప్రాంగణాన్ని సిద్ధం చేసుకుని.. బ్యాంకు హామీలు సమర్పించిన తర్వాత రెండేళ్ల కాలానికి లైసెన్సు ఇవ్వనున్నారు. ఈ దుకాణాలు 16 నుంచి ప్రారంభించుకోవచ్చు.

దసరా ఉత్సవాలు విజయవంతం: సుజనా

మొగల్రాజపురం(విజయవాడ సిటీ): స్థానిక ఎమ్మెల్యేగా తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తూ కలెక్టర్, సీపీ, ఈవో సమన్వయంతో దుర్గమ్మ దసరా ఉత్సవాలను విజయవంతంగా ముగించామని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి అన్నారు. దేవాదాయశాఖ మంత్రి రోజూ పర్యవేక్షించడంతో పాటు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనలు వేడుకలు విజయవంతం కావడానికి తోడ్పడ్డాయని పేర్కొన్నారు. విజయవాడ పాలీక్లినిక్ రోడ్డులోని ఓ హోటల్లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి నిర్వహించిన ఉత్సవాల్లో కొన్ని లోపాలు గుర్తించామని, వచ్చే ఏడాది అవి పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు. క్యూలైన్లు శాశ్వతంగా ఉండేలా చూస్తామని, ఒక వైపు నుంచి కొండ ఎక్కి దర్శనం తరువాత మరోవైపు దిగేలా ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని తెలిపారు. కొండపైకి అనవసర వాహనాలు రాకుండా ఆపడం, వీఐపీ, వీవీఐపీలకు ప్రత్యేక సమయం కేటాయించడంతో సామాన్య భక్తులకు ఇబ్బంది కలగలేదన్నారు. భక్తులు సూచనలు, సలహాలు రాసిస్తే.. పరిగణనలోకి తీసుకొని దుర్గగుడి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి

విజయ డెయిరీ పునఃప్రారంభం

చిట్టినగర్, న్యూస్‌టుడే : బుడమేరు ముంపుతో దాదాపు 40 రోజుల పాటు మూతపడిన విజయ డెయిరీని దసరా పండగ రోజున పునఃప్రారంభించామని కృష్ణా పాల సమితి ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. విజయ డెయిరీ ప్రాంగణంలో మీడియా ప్రతినిధుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపునకు గురై ఫ్యాక్టరీ పనిచేయక పోయినప్పటికీ వినియోగదారులకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వీరవల్లిలోని కామధేనువు పేరుతో నిర్మించిన కొత్త ఫ్యాక్టరీ ఆదుకుందన్నారు. అక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహించామన్నారు. డెయిరీకి జరిగిన నష్టాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీడీబీ వారికి ఆర్థిక సాయం అందించాల్సిందిగా సిఫార్సు చేశారని తెలిపారు. విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి ఆంజనేయులు చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. రైతులకు బోనస్ రూ.250 కోట్లకు పైగా చెల్లించారని వివరించారు. పాలసేకరణ పెరిగిందన్నారు. సమావేశంలో పలువురు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణా పాల సమితి ఛైర్మన్ ఆంజనేయులు, పక్కనే ఎండీ ఈశ్వరబాబు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.98/-.

151 బస్సులపై కేసులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: దసరా పండగ రద్దీని పురస్కరించుకుని ప్రయాణికుల నుంచి అధిక ధరలను వసూలు చేసిన ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ నెల 3 నుంచి 12 వరకు జిల్లా వ్యాప్తంగా ఉప రవాణా కమిషనర్ ఎ.మోహన్ పర్యవేక్షణలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల నుంచి అధిక ధరలను వసూలు చేయడంతో పాటు బస్సుల్లో ప్రయాణించే వారి వివరాలు సిబ్బంది వద్ద లేకపోవడం గుర్తించారు. దీంతోపాటు సరైన రికార్డులు లేని బస్సులు, పన్నులు చెల్లించని వాహనాలను సైతం గుర్తించారు. నిబంధనలను ఉల్లంఘించిన మొత్తం 151 బస్సులపై కేసులు నమోదు చేశారు. పన్నులు చెల్లించని వాహనాలకు రూ.28.24 లక్షల అపరాధ రుసుం విధించారు. వీటిలో 16 బస్సులను సీజ్ చేశారు. డీటీసీ మోహన్ మాట్లాడుతూ రవాణా శాఖ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న రవాణాశాఖ అధికారులు

91.9 FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 91699 22299.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు, షుగర్‌కు. విజయవాడ:- శ్రీ శరణం లాడ్జి పాత బస్టాండ్ ఎదురుగా, బందర్ రోడ్, ప్రతీ నెల 2, 16 తేదీల్లో మందులు.

REAL ESTATE

PLOT FOR SALE

హరివిల్లు వారి 15వ 50ఎకరాల మెగా హౌసింగ్ ప్రాజెక్ట్ VJA 20 ని|| దూరంలో న్యూ బైపాస్‌కి 1kmలో ఇంటి నిర్మాణానికి అనువైనది. నెప్పలి కంకిపాడులో. ✆ 95507 63551.

విజయవాడ గుణదల ఇన్నర్‌రింగు రోడ్డుకి దగ్గరగా ప్రైమ్ ఎవెన్యూ గేటెడ్ కమ్యూనిటీ నందు తూర్పు ఫేసింగ్‌తో 828 & 828 చ||గ||ల స్థలములు - 2 అమ్మకం (నోబ్రోకర్స్) ✆ 87905 99799.

VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బందరు రోడ్డు, బెంజిసర్కిల్ కి 5 కి.మీ|| నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP & APCRDA ప్లాట్స్ చ||గ||1,900 /- నుండి 12,900/- సంప్ర: ✆ 90328 90357.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

PROPERTY FOR SALE

5 ఫ్లోర్స్ బిల్డింగ్ అమ్మకం కరెన్సీనగర్‌లో
12000 చ||అ||, 35 రూములు కల్గి ఉన్న 5 ఫ్లోర్స్ బిల్డింగ్ ఆఫీసులకు, హాస్పిటల్స్‌కు, కాలేజీలకు అనుకూలమైన బిల్డింగ్ అమ్మకం
✆ 99124 84646

TO LET

3BHK Flat, Beside Ratnadeep Stores, Near Ayush Hospital, Currency Nagar, Vijayawada. Ph: 9440087461

JOBS

Wanted Experienced Teachers for Pre-Primary & Primary, Female Spoken English Trainer, Video Editor, Payakapuram, VJA. ✆ 83091 22705.

VJA నందు పనిచేయుటకు అనుభవం కలిగిన తంధూరి & సౌత్ ఇండియన్ మాస్టర్స్, అన్ని వెరైటీలు చేయగల టిఫిన్ మాస్టర్, పిండి వంటలు (స్వీట్స్ / హాట్స్) మాస్టర్ కావలెను. ✆ 92904 40579.

విజయవాడ పటమట UZVIS గ్రూప్ ఆఫ్ కంపెనీలకు 2 వీలర్ కలిగిన డెలివరీ బాయ్స్, ప్యాకింగ్ బాయ్స్, మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. ✆ 99632 71477.

ప్రముఖ బ్యాంక్ సంస్థలో పనిచేయుటకు లేడీ టెలీకాలర్స్ + టీం లీడర్స్ కావలెను. జీతం: 10K - 20K + ఇన్సెంటివ్స్. ✆ 96764 44705, 99482 00299.

సైట్ ఇంజనీర్స్ కావలెను. విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి ఏరియాలలో కన్‌స్ట్రక్షన్ కంపెనీ నందు పనిచేయుటకు ఆసక్తిగలవారు సంప్ర|| Ph: 97016 89312.

హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను / పేషెంట్స్ను / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 96405 28899, 96406 48899

ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గం|| డ్యూటీ, జీతం: 10,000/- సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాలవారు సంప్ర: ✆ 98668 13429.

కారు డ్రైవరు కావలెను. విజయవాడలో ఇన్నోవా కారు నడుపుటకు ఫుల్‌టైమ్ డ్రైవర్ హైవేలో కారు నడిపిన అనుభవం కనీసం 3సం|| -5సం|| ఉండాలి. వయస్సు : 30సం||లోపు. ✆ 96184 24888.

విజయవాడ, ఆటోనగర్‌లో ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గం|| డ్యూటీ, జీతం: 12,000, PF+ESI. ✆ 98664 07345.

విజయవాడ మెట్రోపాలిటిన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. ఎలక్ట్రీషియన్ ★ డ్రైవర్స్ ★ సెక్యూరిటీ గార్డ్స్ ★ హౌస్ కీపింగ్ బాయ్స్ ★ వెయిటర్స్ ★ ఆకర్షణీయమైన జీతం. సంప్ర. ✆ 72888 85598.

VJA సూర్యారావుపేటలో పనిచేయుటకు ఇంటర్ చదివిన స్త్రీ / పు. రిసెప్షనిస్ట్స్ మరియు దోస్తు డ్రైవర్, హెల్పర్స్ కావలెను. ✆ 98484 46622.

Homoeo క్లినిక్‌లో పనిచేయుటకు స్టాఫ్ (Ladies - BEL 35yrs; Q:10th P/F) కావలెను. Duty Timings (9AM to 2PM ; Sal : 9K and 5PM to 9.30 PM Sal: 9K) Cure Homoeo Clinic; ఆయుష్ హాస్పిటల్, మెయిన్ రోడ్, భారతీనగర్, VJA. ✆ 98660 06080.

వర్క్ ఫ్రం హోమ్ డేటాఎంట్రీ : ప్రముఖ ఔట్ సోర్సింగ్ సంస్థ నందు ఇంటి వద్ద ఉండి పార్ట్ / ఫుల్ టైం ప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop / Desktop, స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 87128 36572.

1గ్రామ్ జ్యూయలరీ షాపులో పూసలు దండలు తయారు చేయుటకు లేడీస్ కావలెను. శాలరీ : 10వేలు వ: 18-30 Yrs Time: 10Am to 7 Pm (దండల తయారీ నేర్పబడును, అనుభవం అవసరం లేదు) సాయి శ్రీనివాస పెరల్స్, స్వర్ణలోక్ కాంప్లెక్స్, గవర్నరుపేట, VJA -2. ✆ 93937 79999.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. విజయవాడ, ఏలూరు రోడ్డు దగ్గర 12 గం|| డ్యూటీ 45 సం||లోపు వయసు ఉండాలి. మగవారు మాత్రమే. ✆ 72880 04466

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

(c) eenadu

తిరువూరు
• తిరువూరు • మైలవరం

954 క్యూసెక్కుల సాగర్ జలాల విడుదల



గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్ ఆదివారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 954 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ తెలిపారు. మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 411 క్యూసెక్కులు చేరాయి. దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు 60, పెదకొమిర 25, మధిర 55, నిడానపురం 60 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదు

అనుముల్లంక(గంపలగూడెం): మండలంలోని అనుముల్లంకలో ఆదివారం తెదేపా నాయకులు సీహెచ్.నరసింహ, వి.శ్రీరామ్, జి.నాగేంద్రబాబు ఆధ్వర్యంలో పట్టభద్రులైన 50 మంది యువకులతో ఆన్‌లైన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓట్లు నమోదు చేయించారు. ఏదైనా డిగ్రీ పూర్తయిన విద్యార్థులు కూడా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని వివరించారు.



అనుముల్లంకలో ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకున్న యువతతో తెదేపా నాయకులు

స్నేహితుడి కుమార్తె పెళ్లికి రూ.1.15 లక్షల ఆర్థిక సాయం

తిరువూరు, న్యూస్‌టుడే: నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడు పేట సాంబశివరావు కుమార్తె కుసుమశ్రీ వివాహానికి రూ.1.15 లక్షలు ఆర్థిక సాయం అందించి తమ సహృదయతను చాటారు. తిరువూరులో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న సాంబశివరావుకు రెండేళ్ల కిందట గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయగా స్పందించిన స్నేహితులు రూ.లక్ష సాయం చేశారు. ఆదివారం తిరువూరు మండలం మునుకుళ్లలో ముచ్చింతల భాస్కర్‌తో సాంబశివరావు కుమార్తె కుసుమశ్రీ వివాహం సందర్భంగా ఈ నగదు అందజేశారు. దేవత మురళి, గద్దె ఈశ్వర్, రామిశెట్టి శ్రీను, కె.నాగభూషణం, నరసింహారావు, రెహమాన్, శివరామకృష్ణ, ఎ.శ్రీను, కె.వెంకటేశ్వరరావు తదితరులు కల్యాణ మండపంపై వధువు తల్లిదండ్రులకు అందజేశారు. కుమార్తె వివాహ సమయంలో, తనకు ఆర్థిక చేయూత అందించిన స్నేహితులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



సాయం అందించిన వారితో సాంబశివరావు దంపతులు, నవ వధూవరులు

కాలువలు ఇలా.. నీరు పారేదెలా?

కనీస మరమ్మతులు కరవు
దుర్భరంగా ఎన్నెస్పీ మైనర్లు

మైలవరం, న్యూస్‌టుడే

సాగర్ కాలువల ఆధునికీకరణపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం సాగునీటి సరఫరాపై ప్రభావం చూపుతోంది. ఐదేళ్లలో మైనర్లు, సబ్ మైనర్ల మరమ్మతుల ఊసెత్తకపోవడంతో, వాటి ఉనికే మాయమవుతున్నాయి. మూడో జోన్‌కు నీటి విడుదల షెడ్యూల్ సమయం సమీపిస్తుంటే, పిచ్చి చెట్లతో నిండిన కాలువలు ఆయకట్టు రైతుల్లో గుబులు పెంచుతున్నాయి.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ మూడో జోన్ పరిధిలో మైలవరం, తిరువూరు నియోజక వర్గాల ఆయకట్టు భూములున్నాయి. మైలవరం బ్రాంచి కాలువ, నూజివీడు బ్రాంచి ప్రధానంగా ఉండగా, ప్రతి ఏటా నవంబరులో నీటి విడుదల అధికారిక షెడ్యూల్ ఉంది. ఈ ఏడాది అధిక వర్షాలతో మెట్ట పంటలకు సైతం ఇప్పటి వరకు సాగునీటి అవసరం రాకపోవడంతో రైతులు కాలువల ఊసెత్తలేదు. నవంబరు నుంచి తప్పనిసరిగా ఆరు తడి పంటలకు సాగర్ కాలువల్లో సరఫరాపైనే ఆధారపడి ఉంటుంది. నీటి విడుదల సమయానికి కాలువలను సిద్ధంగా ఉంచాల్సి ఉన్నా, ఆ శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పత్తి, మిర్చి, మొక్కజొన్న వంటి ప్రధాన వాణిజ్య పంటలు ఆయకట్టున సాగవుతున్నాయి. వాటన్నింటికీ వివిధ దశల్లో సాగునీటిని అందించాల్సి ఉంటుంది.



మైలవరంలో పిచ్చి చెట్లతో పూడుకున్న సాగర్ కాల్వ

ఆలనాపాలనా కరవు

గతంలో ఎన్నెస్పీ ఓ అండ్ ఎం మైలవరం డివిజన్ కార్యాలయంలో అధికారులతో పాటు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పనిచేశారు. వారి పదవి విరమణ తర్వాత కొత్తగా పోస్టుల భర్తీ లేకపోవడంతో, ప్రస్తుతం డివిజన్ కార్యాలయంలో నలుగు రైదుగురు సిబ్బందే ఉన్నారు. కాలువలపై తిరిగే లస్కర్ల కొరత ప్రభావం చూపుతోంది. ఉన్న కొద్దిపాటి సిబ్బంది, ఆయకట్టు రైతుల శిక్షణ కేంద్ర భవనంలోనే, కార్యాలయంగా నిర్వహిస్తూ కాలం గడుపుతున్నారు.



కార్యాలయంగా నిర్వహిస్తున్న శిక్షణ కేంద్ర భవనం

మాయమవుతోన్న మైనర్లు

కాలువలు కనుమరుగైనా సంబంధిత శాఖాధికారులకు పట్టకపోవడంతో, మేజర్లు సైతం కొన్ని చోట్ల రూపు కోల్పోతున్నాయి. మైలవరం బ్రాంచి కాలువ పరిధిలో వెల్వడం, జమలాపురం, చెవుటూరు, మూలపాడు మేజర్లు ఉన్నాయి. వాటికి అనుబంధంగా ప్రతి గ్రామంలో ఆయకట్టుకు నీరందించేందుకు మైనర్లు, సబ్ మైనర్లను నిర్మించారు. వాటికి సాగునీటి సరఫరా మిథ్యగా మారింది.

★ మైలవరం పూరగుట్ట సమీపంలో పెద్ద ఎత్తున భూములున్న రైతులు సైతం కాలువలను దున్నేసి పొలాల్లో కలిపేసున్నారు. వెల్వడం మేజర్ పరిధిలోని పలు మైనర్లు ఆక్రమణలకు గురయ్యాయి.

★ కుంటముక్కల మైనర్‌లో వృక్షాలు పెరుగుతున్నా కంప తొలగించే ప్రయత్నాలు చేయడం లేదు. చెవుటూరు మేజరుగా ఉన్నా మొర్సుమిల్లి నుంచి ప్రారంభమయ్యే కాలువ చివరి భూములకు నీరందడం గగనంగా మారింది.

నిత్యావసర సరకుల పంపిణీ

మైలవరం, న్యూస్‌టుడే: మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో 20 మంది పేద ఆర్యవైశ్యులకు నిత్యావసర సరకులను స్థానిక పెద రామాలయంలో సంఘం నాయకులు సోమవారం అందజేశారు. నాయకులు జె.ప్రసాద్, సీహెచ్ ప్రసాద్, హరిబాబు, మధు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఉమేష్‌బాబు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని కవులూరులో ఆదివారం ధన్వంతరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 95 మంది రోగుల హాజరు కాగా, డాక్టర్ ఉమేష్‌బాబు వైద్య సేవలు అందించారు. సిబ్బంది మధుమేహ రక్త పరీక్షలు, రక్తపోటు, సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ జువ్వా వెంకటేశ్వరరావు మందులు అందజేశారు. జువ్వా మహీధర్, కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయానికి విరాళం

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం కడవకొల్లు గ్రామానికి చెందిన యాదమరెడ్డి హరికృష్ణ ప్రసాద్, కృష్ణజ్యోతి దంపతులు ఆదివారం రూ.40 వేలు విరాళంగా అందించారు.

మాలధారులకు అన్నప్రసాద వితరణ ప్రారంభం



అయ్యప్ప మాలధారులకు సద్ది వడ్డిస్తున్న సేవా సమితి సభ్యులు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: అయ్యప్ప సేవా సమితి కొటికలపూడిలో ఆదివారం మాల ధరించిన అయ్యప్ప భక్తులకు నిత్య అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం మాలధారులు అయ్యప్ప సుప్రభాత పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ.. భక్తులకు నిత్య పూజలతో పాటు వసతి తదితరాలను ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. నవంబరు 22 వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం రెండు గంటల వరకు భక్తులకు గ్రామానికి చెందిన దాసాంజనేయ స్వామి దేవస్థానంలో అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు వివరించారు.

16 నుంచి తిరువూరు అయ్యప్ప గుడిలో..

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని స్వామి అయ్యప్ప సహిత పంచముఖ హనుమత్ క్షేత్రంలో ఈ నెల 16 నుంచి అయ్యప్ప, భవానీ తదితర దేవతామూర్తుల దీక్షలు తీసుకున్న భక్తులకు అన్నప్రసాదం (సద్ది) కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు కె.సుబ్బారావు, ఎస్.రాజారావు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు అన్నప్రసాదంలో పాల్గొనే భక్తులకు టోకెన్లు అందిస్తామన్నారు.

మహిళలకు చీరల అందజేత



కోలాట బృందం మహిళలకు చీరలు పంపిణీలో కృష్ణారెడ్డి దంపతులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని రామచంద్రాపురం శివారు కోమటికుంట్లలో కోలాటం ఆడుతున్న మహిళలకు తెదేపా మండలాధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, రోజారాణి దంపతులు రూ.30 వేలు విలువైన 50 చీరలను బహుమతిగా అందజేశారు. భక్తిశ్రద్ధలతో బతుకమ్మల వద్ద ఉత్సాహంగా కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలను ప్రోత్సహించేందుకు ఏకరూప చీరలను అందజేసినట్లు కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు.

ముక్కపాటికి నెట్టెం నివాళి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: కాకతీయ సేవాసమితి, కమ్మ సంఘాలకు రాష్ట్ర నాయకుడిగా వ్యవహరించిన జగ్గయ్యపేట సమితి మాజీ అధ్యక్షుడు ముక్కపాటి జానకిరామయ్యకు తెదేపా జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం నివాళి అర్పించారు. ఆదివారం స్థానిక శుభమస్తు కల్యాణ మండపంలో జరిగిన ముక్కపాటి సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. సంఘం పెద్దలు సూరపనేని సుబ్బారావు, రాము, కనపర్తి వెంకటేశ్వరరావు, అత్తలూరి జగన్నాథరావు, మైనేని రాధ పాల్గొన్నారు.

వైభవంగా దసరా సంబరాలు



మైలవరంలో అమ్మవారి ఊరేగింపు



ఇబ్రహీంపట్నం గ్రామీణం: కొటికలపూడిలో..



ఎన్టీటీపీఎస్ అభయసాయి మందిరంలో..



మైలవరంలో..



కొండపల్లిలో..

మైలవరం: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కోటమహాలక్ష్మమ్మ ఆలయం వద్ద నిర్వహించిన విశేష పూజల అనంతరం సంబరాలను వైభవంగా నిర్వహించారు.

గంపలగూడెం: గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లోని పలు గ్రామాల్లో 10 రోజుల పాటు పూజించిన జగన్మాత ప్రతిమలను ఆదివారం గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు.

జి.కొండూరు: స్థానిక బీసీ కాలనీలో శ్రీకనకదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో దసరా వేడుకలు పురస్కరించుకొని నిర్వాహకులు ఆదివారం అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



గంపలగూడెం: ఆయుధ పూజలో ఎస్సై శ్రీను దంపతులు



విస్సన్నపేట: ఎస్సై రామకృష్ణ దంపతులు



రెడ్డిగూడెం: శ్రీరాజగోపాలస్వామి దేవాలయంలో...



గంపలగూడెం: ఊటుకూరులో..



గంపలగూడెం: నిమజ్జనానికి తరలిస్తున్న బతుకమ్మలు



నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శమీపూజలో అధికారులు, అర్చకులు



రెడ్డిగూడెం: కుదపలో ఏర్పాటు చేసిన శ్రీకనకదుర్గా మాత అమ్మవారి ఊరేగింపు

‘పల్లె పండగ’ కు శ్రీకారం

4 మండలాల్లో రూ. 22.30 కోట్ల పనులు ● సీసీ రోడ్లు, గోకులాలకు శంకుస్థాపనలు

విస్సన్నపేట, గంపలగూడెం, న్యూస్‌టుడే

ఎన్డీయే కూటమి ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ‘పల్లె పండగ’ అభివృద్ధి కార్యక్రమం నియోజకవర్గంలో సోమవారం నుంచి శనివారం వరకు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం విస్సన్నపేట మండలంలో ‘పల్లె పండగ’ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీకారం చుడతారు. గంపలగూడెం మండలంలో 15, 18, 19 తేదీల్లో, తిరువూరు మండలంలో 16, 18, 19 తేదీల్లో, ఎ.కొండూరు మండలంలో 17, 19 తేదీల్లో అమలు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రహదారులు, గోకులాలు నిర్మించేందుకు ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించింది. ఉపాధి హామీ పథకం నిధులతో నియోజకవర్గంలో రూ.20 కోట్లు విలువైన 117 సిమెంట్ రహదారులు, రూ.2.30 కోట్లు విలువైన 100 గోకులాలు నిర్మాణానికి గత నెలలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు పనుల మంజూరుకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపారు. మండలానికి రహదారులకు రూ.5 కోట్లు, గోకులాల నిర్మాణాలకు రూ.57.50 లక్షలు మంజూరయ్యాయి.



ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో సీసీ రోడ్డు నిర్మించే అంతర్గత రహదారి ఇదే



గంపలగూడెం మండలం మేడూరులో..

రహదారులకు మోక్షం

గ్రామాల్లో వారం రోజులపాటు సాగే పల్లె పండగను ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సీసీ రహదారులు గ్రామాల్లో ఎక్కడ నిర్మించాలో స్థానిక నాయకులు అధికారులకు స్పష్టం చేశారు. ఒక్కో గ్రామానికి సీసీ రహదారుల నిర్మాణానికి రూ.10 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు కేటాయించారు. నియోజకవర్గంలో 77 గ్రామ పంచాయతీలు ఉండగా పలు గ్రామాల్లోని అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఆ రహదారులను అభివృద్ధి చేయాలని, సీసీ రోడ్లు నిర్మించాలని ప్రజలు వేడుకున్నా గత వైకాపా పాలనలో స్పందన కొరవడింది. కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో కొన్ని వీధులకు మోక్షం కలుగుతోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా ఎన్నిక

రెడ్డిగూడెం: సీపీఎం మండల పార్టీ కార్యదర్శిగా తుమ్మల వీరాస్వామి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆదివారం బూరగగూడెంలోని కామ్రేడ్ కిన్నెర మారయ్య నగర్‌లో సీపీఎం పార్టీ 8వ మహాసభ కామ్రేడ్ చాట్ల విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఏడుగురు సభ్యులతో మండల నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



వీరాస్వామి

రాజ్యాధికారానికి కాన్షీరాం కృషి

నందిగామ, న్యూస్‌టుడే : దేశంలో బహుజనుల రాజ్యాధికారానికి బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం కృషి చేశారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చులకూర పుష్పరాజ్ కొనియాడారు. స్థానిక బహుజన సేవా సమితి కార్యాలయంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు ప్రత్తిపాటి సూర్యం ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతిని నిర్వహించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

42 క్వింటాళ్ల చౌక బియ్యం స్వాధీనం

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: యాకమూరు పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 42 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని శనివారం పట్టుకున్నామని ఎస్సై అర్జునరాజు తెలిపారు. మైలవరానికి చెందిన వలస గంగరాజు తోట్లవల్లూరు పరిసర ప్రాంతాల నుంచి చౌక బియ్యం కొనుగోలు చేసి టాటా వ్యాన్‌లో ఉయ్యూరుకు చెందిన కంతేటి నిరంజన్‌కు చెందిన 42 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని యాకమూరు నుంచి నూజివీడుకు చెందిన సోల రాముకు తరలిస్తుండగా పోలీసులు, పౌర సరఫరాల ఉప తహసీల్దార్, పీడీఎస్, రెవెన్యూ వారి సమక్షంలో దాడులు నిర్వహించి పట్టుకున్నామని తెలిపారు. బియ్యంతోపాటు వాహనాన్ని సీజ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆదివారం తెలిపారు.



పట్టుకున్న వాహనంతో పోలీసులు

కోడి పందేల శిబిరాలపై దాడులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చినలంక, రాయనపాడు ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించిన కోడి పందేల శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. పందెం కాసేవారు పరారీ కావడంతో శిబిరాల వద్ద ఉన్న ద్విచక్ర వాహనాలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వాముకుంట్ల(తిరువూరు): మండలంలోని ముష్టికుంట్ల వాగు నుంచి వాముకుంట్లకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వాముకుంట్లకు చెందిన ట్రాక్టర్ యజమాని పురంశెట్టి రంజిత్, డ్రైవర్ పున్నం శివసాయి రామకృష్ణపై వాల్టా చట్టం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

తిరువూరు, న్యూస్‌టుడే: దసరా సెలవులు సందర్భంగా పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో అధికారిణి కె.పద్మావతి ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన కుర్చీలాట, చిత్రలేఖనం, స్కిప్పింగ్ ఆటలు నిర్వహించి, విజ్ఞానదాయకమైన పుస్తకాలు, కథలు చదివించారు. ఆయా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు డి.వెంకటేశ్వరరావు అందించిన ఆర్థిక సౌజన్యంతో ఆదివారం బహుమతులు అందజేసినట్లు పద్మావతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

భవానీపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మహిళ గాయపడినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. ఇబ్రహీంపట్నంలో బి.అలివేలు కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటోంది. ఆమె విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్నారు. ఈ నెల 11న విధులకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గొల్లపూడి వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన వ్యక్తి ఢీకొట్టాడు. క్షతగాత్రురాలిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

లెక్క తేలింది.. అదృష్టం ఎవరికో...

16 దుకాణాలకు 867 దరఖాస్తులు ★ రూ.17.34 కోట్ల ఆదాయం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే:

నియోజకవర్గంలోని మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు దరఖాస్తు చేసిన వారి భవితవ్యం సోమవారం తేలనుంది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ప్రభుత్వమే మద్యం విక్రయించింది. తాజాగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం మద్యం విక్రయాలను ప్రయివేటు వ్యాపారులకు అప్పగిస్తోంది. మద్యం దుకాణాల నిర్వహణకు లైసెన్స్ దారులను సోమవారం జిల్లా అధికారులు లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో మద్యం దుకాణాల లాటరీ తీసేందుకు సదరు అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి లాటరీ నిర్వహించే మండపానికి దరఖాస్తుదారులను అనుమతిస్తారు. నియోజకవర్గ సరిహద్దునే ఉన్న తెలంగాణ నుంచి కూడా దరఖాస్తులు అధిక సంఖ్యలో అందాయని తెలుస్తోంది. మహిళలు కూడా మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు. దరఖాస్తుదారులు విజయవాడలో సోమవారం ఉదయాన్నే లాటరీ నిర్వహించే కల్యాణ మండపానికి చేరుకోవాలని స్థానిక ఎక్సైజ్ సీఐ వీవీవీ సత్యనారాయణదుర్గ, ఎస్సైలు సీహెచ్ వెంకట్ కుమార్, వి.కృష్ణవేణి సూచించారు.



తిరువూరు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్

వివరాలిలా ఉన్నాయి.

మండలం	దుకాణాలు	దరఖాస్తులు	ఆదాయం (రూ.కోట్లలో)
తిరువూరు పట్టణం	4	182	3.64
తిరువూరు గ్రామీణం	2	99	1.98
గంపలగూడెం	4	269	5.38
ఎ.కొండూరు	2	140	2.80
విస్సన్నపేట	4	177	3.54
మొత్తం	16	867	17.34

(c) eenadu

బెంగాల్ జూడాలకు మద్దతుగా రేపు నిరశన : ఐఎంఏ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ జూడాలకు మద్దతుగా అక్టోబరు 15న దేశవ్యాప్తంగా నిరాహారదీక్షలు చేపట్టనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రకటించింది. ఐఎంఏ జూనియర్ డాక్టర్స్ నెట్‌వర్క్ (జేడీఎన్) ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఆరింటి నుంచి సాయంత్రం ఆరింటి దాకా ఈ దీక్షలు జరుగుతాయని పేర్కొంది. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో మహిళా జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచార ఘటన పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కుదిపేస్తోంది. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, వైద్యులకు రక్షణ కల్పించాలన్న డిమాండ్లతో జూడాలు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు ఆదివారం తొమ్మిదోరోజుకు చేరాయి. వీరి దీక్షలకు మద్దతుగా సోమవారం నుంచి అత్యవసరేతర వైద్యసేవలను నిలిపివేయాలని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్ (ఎఫ్ఏఐఎంఏ) పిలుపునిచ్చింది. శనివారం సమావేశమైన ఈ సంఘం ఎమర్జెన్సీ సేవలను మాత్రం నిరంతరాయంగా కొనసాగించాలని తీర్మానించింది. జూడాల డిమాండ్లను పరిష్కరించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కోరుతూ రాష్ట్రానికి చెందిన దాదాపు 30 మంది మేధావులు ఆదివారం ప్రభుత్వానికి లేఖ రాశారు.

90 సెకన్లలోనే గమ్యస్థానానికి..

ప్రపంచంలో అతితక్కువ దూరం ప్రయాణించే విమానమిదే



ఇంటర్నెట్ డెస్క్: విమానాలు కేవలం సుదూర ప్రాంతాలకే సేవలు అందిస్తాయనుకుంటే పొరపడినట్టే! స్కాట్లాండ్‌లో కొన్ని విమానాలు కేవలం ఒకటిన్నర నిమిషాల్లోనే తమ ప్రయాణాన్ని పూర్తిచేస్తున్నాయి!! వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. ఇది నిజం. ఓర్క్‌నీ దీవుల్లో వెస్ట్‌రే, పాపా వెస్ట్‌రే ప్రాంతాల మధ్య దూరం కేవలం 1.7 మైళ్లు. వాటి మధ్య వంతెన లేకపోవడంతో లోగాన్ ఎయిర్ సంస్థ అక్కడ విమాన సేవలు అందిస్తోంది. విమానం టేకాఫ్ నుంచి ల్యాండింగ్ వరకు 90 సెకన్లు (ఒకటిన్నర నిమిషాలు) మాత్రమే పడుతుంది. ఇందుకోసం వాడే చిన్న విమానాల్లో కేవలం పది ప్యాసింజర్ సీట్లు ఉంటాయి. పైలట్ ఆపరేషన్‌ను ముందు వరుసలో కూర్చొనే ప్రయాణికులు వీక్షించొచ్చు. వెస్ట్‌రే, పాపా వెస్ట్‌రే ప్రాంతాల మధ్య దూరం స్కాట్లాండ్ రాజధాని ఎడిన్‌బరో విమానాశ్రయంలో ఉన్న రన్‌వే పొడవంత.

మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికలకు ఈ వారం షెడ్యూలు?


ఇంటర్నెట్‌డెస్క్: మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తేదీల (షెడ్యూల్)ను భారత ఎన్నికల సంఘం(ఈసీ) ఈ వారం ప్రకటించే అవకాశం ఉందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. నవంబరు రెండు లేదా మూడో వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. వీటితో పాటు వివిధ రాష్ట్రాల్లోని 45 అసెంబ్లీ, రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు సైతం జరపనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇందులో రాహుల్ గాంధీ రాజీనామా చేసిన కేరళలోని వయనాడ్ పార్లమెంటు నియోజకవర్గం కూడా ఉంది. పశ్చిమబెంగాల్‌లోని బసిర్‌హట్ నియోజకవర్గ ఎంపీ, తృణమూల్ కాంగ్రెస్ నేత షేక్ నూరల్ ఇస్లాం మృతి చెందడం వల్ల ఆ స్థానంలో కూడా ఉపఎన్నిక జరగాల్సి ఉంది.

జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేత

దిల్లీ: కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా అక్కడ రాష్ట్రపతి పాలనను తక్షణం ఎత్తివేస్తూ కేంద్రం ఆదివారం గెజిట్ ప్రకటన జారీచేసింది. దీనిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంతకం చేశారు. 2019 అక్టోబరు 31న రాష్ట్రపతి పాలన విధించారు.

అయ్యప్ప దర్శనానికి స్పాట్ బుకింగ్ లేదు

తిరువనంతపురం: శబరిమల అయ్యప్ప దర్శనానికి వచ్చే భక్తులకు స్పాట్ బుకింగ్ ఉండబోదని కేరళ దేవాదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ స్పష్టం చేశారు. అయితే వార్షిక మండలం-మకరవిళక్కు సీజన్‌లో వచ్చే అయ్యప్ప భక్తులందరికీ స్వామి దర్శనం లభిస్తుందని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) ఇటీవల హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. దైవ దర్శన నిమిత్తం భక్తులు వర్చువల్ క్యూ విధానంలో శబరిమల ఆలయ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ దర్శన టికెట్లు, ప్రసాదాలను ఆన్‌లైన్లో బుక్ చేసుకోవాలని సూచించారు. భక్తులందరికీ సురక్షితమైన తీర్థయాత్ర జరిగేలా కేరళ ప్రభుత్వం, టీడీబీ రోజుకు 80 వేల మంది యాత్రికులను దర్శనానికి అనుమతించనున్నట్లు మంత్రి తెలిపారు. అయితే ఎలాంటి ఆన్‌లైన్ బుకింగ్ లేకుండానే అయ్యప్ప దర్శనం లభించేలా ఏర్పాట్లు చేయాలని, లేకుంటే నిరసనలు తెలుపుతామని ప్రతిపక్ష భాజపా తాజాగా హెచ్చరించింది.



అందరూ ధనవంతులైతేనే అది అర్థమవుతుంది

ఈ ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ ఉన్నపళంగా ధనవంతులవ్వాలని, అందరికీ తమ పేరు తెలిసేంత ప్రముఖులవ్వాలని, వారు కలలు కన్న ప్రతి పనీ చేసే స్వేచ్ఛ లభించాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే అప్పుడే వారికి అసలైన ఆనందం డబ్బుతోనో, పేరుతోనో, స్వేచ్ఛతోనే లభించదని, అది ఓ మానసిక భావన అన్న విషయం అర్థమవుతుందని నా ఆశ.

– జిమ్ క్యారీ, సినీ నటుడు

ఉలిక్కిపడిన ముంబయి

- ఎన్సీపీ నేత బాబా సిద్దిఖీ దారుణ హత్య

ముంబయి: ఎన్సీపీ కీలక నేత, బాలీవుడ్ మిత్రుడు, మాజీ మంత్రి బాబా సిద్దిఖీ (66) శనివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. ముంబయి బాంద్రా ప్రాంతంలో ఉన్న ఖేర్ నగర్‌లో తన కుమారుడైన ఎమ్మెల్యే జీషన్ సిద్దిఖీ కార్యాలయంలో ఉండగా ముగ్గురు దుండగులు వచ్చి ఆయనపై ఆరు రౌండ్ల కాల్పులు జరిపారు. వెంటనే ఆయనను లీలావతి ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకుండాపోయింది. రాత్రి 11.30 గంటల సమయంలో ఆయన మరణించినట్లుగా వైద్యులు ప్రకటించారు. సిద్దిఖీ హత్యతో ముంబయి ఉలిక్కి పడింది. ఆయన హత్యను రాజకీయ పార్టీలు ఖండించాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని.. ప్రభుత్వం వైదొలగాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. కేసును దర్యాప్తు చేసేందుకు 15 టీంలను మహా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మరోవైపు నిందితుల్లో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. సహకుట్రదారుగా పేర్కొంటూ పుణెలో ప్రవీణ్ లోంకర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

దశాబ్దాల తర్వాత రాజకీయ హత్య

దాదాపు 3 దశాబ్దాల తర్వాత ముంబయిలో రాజకీయ హత్య చోటుచేసుకోవడంతో తీవ్ర కలకలం రేగింది. బాబా సిద్దిఖీ విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. గత ఫిబ్రవరి వరకూ కాంగ్రెస్‌లోనే కొనసాగారు. ఫిబ్రవరిలో అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరారు. సిద్దిఖీ.. బాంద్రా వెస్ట్ నుంచి మూడుసార్లు కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. కొంత కాలం మంత్రిగా పని చేశారు. బాలీవుడ్‌లో బాబా సిద్దిఖీ అందరికీ సుపరిచితుడు. సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్, సంజయ్‌దత్ ఆయనకు మంచి మిత్రులు. ఆయన ఇచ్చే రంజాన్ ఇఫ్తార్ విందులకు బాలీవుడ్‌సహా అనేక మంది రాజకీయ ప్రముఖులు హాజరవుతుంటారు.



బాలీవుడ్ నటులు సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్‌లతో బాబా సిద్దిఖీ (పాత చిత్రం)

■ ముంబయిలో ముస్లిం ప్రముఖుడిగా ఉన్న సిద్దిఖీ హత్య తీవ్ర సంచలనం సృష్టించింది. 3 దశాబ్దాల తర్వాత ఓ ప్రముఖ నాయకుడు హత్యకు గురికావడం కలకలం రేపింది.

■ సిద్దిఖీ హత్య ప్రణాళిక ప్రకారమే జరిగిందని పోలీసులు వెల్లడించారు. ఇది కిరాయి హత్యని, వ్యాపార లావాదేవీల్లోగానీ, మురికివాడ అభివృద్ధి ప్రాజెక్టులో విభేదాలవల్లగానీ జరిగి ఉండవచ్చని వారు అనుమానిస్తున్నారు. సిద్దిఖీని తామే చంపామని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. దీనిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

■ సిద్దిఖీ హత్య కేసులో హరియాణాకు చెందిన గుర్మైల్ బల్జీత్ సింగ్ (23), ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ధర్మరాజ్ రాజేశ్ కాశ్యప్ (19) అనే నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు శివ కుమార్ అలియాస్ శివ గౌతం కోసం గాలిస్తున్నారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

బాణసంచా శబ్దంలో..

దుండగులు సిద్దిఖీపై కాల్పులు జరుపుతున్న సమయంలో నవరాత్రి ఊరేగింపులో బాణసంచా కాలుస్తుండటంతో కాల్పుల శబ్దం బయటకు వినిపించలేదు. శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో సిద్దిఖీని లీలావతి ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే ఆయన తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్నారు. రెండు గంటలపాటు వైద్యులు శ్రమించినా ఫలితం లేకపోయింది.

ఐరాస శాంతి సేనలపై

ఇజ్రాయెల్ దాడులు

- 15 మంది సైనికులకు గాయాలు

టెహ్రాన్/టెల్‌అవీవ్: లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు సంబంధించి ఆదివారం కీలక పరిణామం చోటు చేసుకుంది. దక్షిణ లెబనాన్‌లోని ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళాల(యూనిఫిల్)పై ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) చేసిన దాడుల్లో 15 మంది ఐరాస సైనికులు గాయపడ్డారు. రమియాలో ఈ ఘటన చోటు చేసుకుంది. రెండు ఇజ్రాయెలీ ట్యాంకులు శాంతి దళాల శిబిరంలోకి వెళ్లి.. అక్కడ ప్రధాన ద్వారాన్ని ధ్వంసం చేశాయి. లోపలకు చొచ్చుకువెళ్లాయి. కొంత సమయం తర్వాత అదే శిబిరంపై ఐడీఎఫ్ భారీస్థాయిలో పొగను విరజిమ్మింది. దీంతో 15 మంది సైనికులు ఆ ప్రభావానికి లోనయ్యారు. శాంతి పరిరక్షక దళానికి సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక ప్రకటన చేశారు. ప్రమాదకర ప్రాంతాల నుంచి, హెజ్‌బొల్లాకు పట్టున్న ప్రాంతాల నుంచి తక్షణమే ఐరాస దళాలు వైదొలగాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌ను ఉద్దేశించి నెతన్యాహు ఓ వీడియో విడుదల చేశారు.



ఇజ్రాయెల్ దాడిలో లెబనాన్‌లోని నబాతియే పట్టణంలో ధ్వంసమైన వాణిజ్య సముదాయం

టెల్ అవీవ్‌కు ‘థాడ్’ రక్షణ వ్యవస్థ

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థ థాడ్ (టెర్మినల్ హైఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్)ను ఇజ్రాయెల్‌కు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ వ్యవస్థను ఆపరేట్ చేయడానికి దాదాపు 3 వేల మంది అమెరికా సైనికులు ఇజ్రాయెల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అమెరికా నిర్ణయంపై ఇరాన్ స్పందించింది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఇజ్రాయెల్‌కు సాయం చేస్తే ఇరాన్‌పై దాడికి పాల్పడినట్లేనని హెచ్చరించింది.

■ దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లాతో జరుగుతున్న పోరులో ఆదివారం 25 మంది ఇజ్రాయెల్ సైనికులకు గాయాలయ్యాయి. గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడిలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్‌పై ఆదివారం హెజ్‌బొల్లా జరిపిన డ్రోన్ దాడిలో 40 మంది పౌరులు గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.

ఆయుష్మాన్ భారత్‌లో వృద్ధులకు మరిన్ని ప్యాకేజీలు!

దిల్లీ: ‘ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ-పీఎంజేఏవై)’లో వృద్ధుల కోసం మరిన్ని ప్యాకేజీలు చేర్చాలని కేంద్రం భావిస్తోంది. 70 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్నవారికి రూ.5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా అందించే పథకాన్ని ఈ నెలాఖరులో కేంద్రం ప్రారంభించే అవకాశాలున్నాయి. జనరల్ మెడిసిన్, సర్జరీ, ఆంకాలజీ, కార్డియాలజీ వంటి 27 స్పెషాలిటీ వైద్యాలతో పాటు 1,949 వైద్య సేవలను ఈ పథకంలో ఇప్పటికే చేర్చారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత 15 రోజుల వరకు సరిపడే ఔషధాల్ని అందించడం, ఆసుపత్రిలో చేరడానికి మూడు రోజుల ముందు వరకు నిర్వహించుకున్న వ్యాధి నిర్ధారణ పరీక్షల ఖర్చునూ పరిగణనలో తీసుకోవడం వంటివి ఈ పథకంలో ఉన్నాయి. ఆహారం, బసతో సహా ఆసుపత్రి సేవలు లబ్ధిదారులకు ఉచితంగా అందుతాయి.

గుజరాత్‌లో రూ.5 వేల కోట్ల డ్రగ్స్ స్వాధీనం

దిల్లీ: గుజరాత్, దిల్లీ పోలీసులు గుజరాత్‌లో రూ.5 వేల కోట్ల విలువైన 518 కేజీల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంకలేశ్వర్‌లోని ఓ ఔషధ తయారీ పరిశ్రమ నుంచి ఈ డ్రగ్స్‌ను పట్టుకున్నారు. ఈ ఘటనలో ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఇటీవల దిల్లీ, గుజరాత్‌లలో రూ.13 వేల కోట్ల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం రిజిస్ట్రేషన్లు షురూ

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం 2024 బడ్జెట్‌లో ప్రకటించిన ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కింద అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. మన దేశంలోని 500 అగ్రగామి కంపెనీల్లో 12 నెలలపాటు ఇంటర్న్‌షిప్ చేసేందుకు ఈ పథకం అవకాశం కల్పిస్తుంది. దానివల్ల అభ్యర్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకొని ఉపాధి పొందడం సులువవుతుంది. www.pminternship.mca.gov.in అనే ఆన్‌లైన్ పోర్టల్‌లో ఈ ఇంటర్న్‌షిప్ కోసం ఆధార్, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఎంపికైనవారికి 12 నెలలపాటు రూ.5 వేల చొప్పున అందిస్తారు. ఏకకాల గ్రాంటు కింద రూ.6 వేలు కూడా ఇస్తారు. ఇంటర్న్‌షిప్‌లు డిసెంబరు 2న ప్రారంభమవుతాయి. 21-24 ఏళ్లవారే ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులు. ఈ పథకానికి ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు 1.55 లక్షల మంది నమోదు చేసుకున్నారు.

మహారాష్ట్రలో సీఎం అభ్యర్థిని

అధికార కూటమి ప్రకటించాలి

- ఎంవీఏ నేతల డిమాండ్

ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబరులో జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించే విషయమై శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్‌ఠాక్రే కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలో ఉన్న మహాయుతి కూటమి తర్వాతే తమ మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) సీఎం అభ్యర్థిని ప్రకటిస్తుందని తెలిపారు. మహావికాస్ అఘాడీ నాయకులతో కలిసి ఆదివారం ముంబయిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఉద్ధవ్‌ఠాక్రే ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే ఈ వాదనను సమర్థించారు. మహారాష్ట్ర ప్రజలు మార్పు కోరుకొంటున్నారని, త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అది కనిపిస్తుందని శరద్ పవార్ అన్నారు. బంజారా వర్గానికి కాంగ్రెస్ పార్టీ ఏమీచేయలేదని ఇటీవల ప్రధాని మోదీ చేసిన విమర్శలను ఆయన తిప్పికొట్టారు. బంజారా వర్గానికి చెందిన వసంతరావ్ నాయక్ మహారాష్ట్రకు అత్యధిక కాలం సీఎంగా పనిచేశారన్న విషయాన్ని ప్రధాని మరిచిపోయారన్నారు. మహారాష్ట్రలో ఎవరూ సురక్షితంగా లేరని ఎన్సీపీ (అజిత్ పవార్) నేత బాబా సిద్దిఖీ హత్యను ప్రస్తావిస్తూ నానా పటోలే విమర్శించారు. సిద్దిఖీ హత్య కేసులో ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలపై అనుమానాలు తలెత్తుతున్నాయని ఉద్ధవ్‌ఠాక్రే తెలిపారు. హరియాణాలో భాజపా, కాంగ్రెస్‌ల నడుమ ఓట్ల తేడా 0.6 శాతం మాత్రమే ఉన్నా, భాజపా అన్ని సీట్లు ఎక్కువగా ఎలా గెలిచిందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పొరుగున ఉన్న గుజరాత్ రాష్ట్రం కోసం మహారాష్ట్రకు అన్యాయం చేస్తున్నారంటూ ఎంవీఏ నేతలు ఈ సందర్భంగా ఒక పత్రాన్ని విడుదల చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న శరద్ పవార్ చిత్రంలో నానా పటోలే, ఉద్ధవ్‌ఠాక్రే

భాజపా సీనియర్ నేతలను గౌరవించదు: పవార్

కొల్హాపూర్: భాజపా సీనియర్ నాయకులకు గౌరవం ఇవ్వదని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో పవార్ సమక్షంలో మాజీ ఎమ్మెల్యే చరణ్ వాఘ్మారే ఎన్సీపీలో చేరారు. ఈ సందర్భంగా శరద్‌పవార్ మాట్లాడుతూ.. జన్‌సంఘ్ రోజుల నుంచి పార్టీ బలోపేతానికి కృషిచేసిన కేడర్‌ను భాజపా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

సైన్యానికి ‘బాక్ట్రియన్’ అండ

- రవాణా అవసరాలకు రెండు మూపురాల ఒంటెలు
- జడల బర్రెల వినియోగంపైనా కసరత్తు

ఇంటర్నెట్ డెస్క్: ఎత్తైన పర్వత ప్రాంతాలు.. ఏ క్షణాన ఎలా మారిపోతుందో తెలియని వాతావరణం.. సరైన సదుపాయాలూ కల్పించలేని దుస్థితి.. ఇవీ లద్దాఖ్‌లో భారత సైన్యం ఎదుర్కొంటున్న సవాళ్లు..! ఈ పరిస్థితుల నడుమ సరిహద్దుల్లో పహరా కాసేందుకు, సామగ్రిని మోసుకెళ్లేందుకు మరిన్ని ప్రత్యామ్నాయ మార్గాలపై సాయుధ బలగాలు దృష్టి సారించాయి. వాటిలో రెండు మూపురాల (బాక్ట్రియన్) ఒంటెలు ముందువరుసలో ఉన్నాయి. బందోబస్తుకు ఉపయోగపడేలా, బరువులు మోసేందుకు సహకరించేలా లేహ్‌లోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై ఆల్టిట్యూడ్ రీసెర్చ్ (డీఐహెచ్ఏఆర్) ఈ ఒంటెలకు ఇస్తున్న శిక్షణ సత్ఫలితాలనిస్తోందని అధికారులు తెలిపారు. లద్దాఖ్‌లో రోడ్డు సౌకర్యాలు ఎంతో మెరుగుపడినప్పటికీ.. పర్వతాల్లోని మారుమూల ప్రాంతాలకు చేరుకునేందుకు ఇప్పటికీ మనుషులు, జన్స్‌కర్ వంటి గుర్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. డ్రోన్లు, ఆల్-టెరైన్ వాహనాల వంటివాటిని వినియోగించాలంటే.. వాతావరణం, పర్యావరణ అంశాలు, భూభాగాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పైగా శత్రుదేశాల జామర్ల వంటి సాంకేతికతలు వాటిపై ప్రభావం చూపొచ్చు. అదే జంతువులయితే ఈ ఇబ్బందులు ఉండవని, సరకు రవాణాలో మెరుగ్గా పనిచేస్తాయని సైనిక వర్గాలు తెలిపాయి. ఆర్మీ రవాణా అవసరాలకు, ముఖ్యంగా మారుమూల ప్రాంతాలకు చేరుకునేందుకు ఈ ఒంటెలు ఉపయోగపడతాయని ‘డీఐహెచ్ఏఆర్’ పేర్కొంది.



బాక్ట్రియన్ ఒంటెలతో సైనికులు

బెదరకుండా..ఆదేశాలకు అనుగుణంగా..

లద్దాఖ్ సెక్టార్‌లో సామగ్రి చేరవేతకు 1999 కార్గిల్ యుద్ధం నుంచి జన్స్‌కర్‌లను విస్తృతంగా ఉపయోగించారు. ఇదే అవసరాల కోసం చైనా సరిహద్దున తూర్పు లద్దాఖ్‌లో బాక్ట్రియన్ ఒంటెలతో నిర్వహించిన ప్రాథమిక పరీక్షలు విజయవంతమయ్యాయి. “పెట్రోలింగ్, బరువులు మోయడం వంటి పనుల కోసం బాక్ట్రియన్ ఒంటెలపై ట్రయల్స్ చేపట్టగా.. సత్ఫలితాలు వచ్చాయి” అని డీఐహెచ్ఏఆర్ తెలిపింది. సాధారణ పనులతో పోలిస్తే సైనిక అవసరాలకు సంబంధించిన శిక్షణ భిన్నంగా ఉంటుందని, యుద్ధ సమయాల్లోనూ బెదరకుండా.. సిబ్బంది ఆదేశాలకు అనుగుణంగా అవి పనిచేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. జడల బర్రెలను ఉపయోగించడంపై ప్రయోగాత్మక శిక్షణలు జరుగుతున్నాయని తెలిపారు.

ఈ ఒంటెల విశిష్టతలు

బాక్ట్రియన్ ఒంటెలు చాలా దృఢంగా ఉంటాయి. ఎత్తైన ప్రాంతాల్లో జీవించగలవు. దాదాపు రెండు వారాల పాటు ఆహారం తీసుకోకుండా ఉండగలవు. 150 కిలోలకు పైగా బరువును సులభంగా మోయగలవు. మరోవైపు జడల బర్రెలు కూడా ఎత్తైన ప్రదేశాల్లో 100 కిలోలకుపైగా బరువులను మోసేందుకు అనువుగా ఉంటాయి. అతిశీతల ఉష్ణోగ్రతలను తట్టుకోగలవు.

అందరు సైనికుల జీవితాలు ఒకటి కాదా!

అగ్నివీర్ పథకంపై ప్రధానిని ప్రశ్నించిన రాహుల్ గాంధీ

దిల్లీ: ఒక సైనికుడి జీవితం మరో సైనికుడి జీవితం కంటే ఎందుకు విలువైనదో చెప్పాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. మరణించిన ఇద్దరు అగ్నివీరుల కుటుంబసభ్యులకు అమరులైన ఇతర సైనికుల కుటుంబాల మాదిరిగా పింఛను, ఇతర ప్రయోజనాలు ఎందుకు లభించవని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌లను నిలదీశారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా తాను పోరాటం సాగిస్తానని స్పష్టంచేశారు. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఫైరింగ్ సాధన చేస్తుండగా ఇండియన్ ఫీల్డ్ గన్‌లోని షెల్ పేలి అగ్నివీరులు గోహిల్ విశ్వరాజ్‌సింగ్, సైఫత్‌లు మృతిచెందిన నేపథ్యంలో ఆయన ఈ ప్రశ్నలు సంధించారు. వారిద్దరి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. “ఈ ఘటన అగ్నివీర్ పథకంపై మరోమారు ప్రశ్నలను లేవనెత్తుతోంది. వాటికి బదులివ్వడంలో భాజపా విఫలమవుతోంది. గోహిల్, సైఫత్ కుటుంబాలు ఇతర అమర సైనికుల కుటుంబాల మాదిరిగా నిర్ణీత సమయంలో పరిహారాన్ని అందుకుంటాయా?” అని ప్రశ్నిస్తూ రాహుల్ సామాజిక మాధ్యమాల్లో హిందీలో ఓ పోస్టు పెట్టారు. సైనికులకు బాధ్యతలు, త్యాగాలు ఒకేలా ఉన్నప్పుడు మరణానంతరం అగ్నివీరులపై వివక్ష ఎందుకని నిలదీశారు. అగ్నిపథ్ పథకం ధైర్యవంతులైన మన అమర సైనికులకు అవమానకరమని వ్యాఖ్యానించారు. “ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ఒక్కటవుదాం. భాజపా ప్రభుత్వ అగ్నివీర్ పథకాన్ని తొలగించి దేశ భవిష్యత్తు, సైన్యం భవిష్యత్తుకు భద్రత కల్పించేందుకు జైజవాన్ ఉద్యమంలో చేరండి” అని రాహుల్ విజ్ఞప్తి చేశారు.



నాకు అత్యంత సన్నిహితుడు మోదీ

- ‘అన్‌లీష్‌డ్’ పుస్తకంలో బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్
- రిషి సునాక్ తనకు ద్రోహం చేశారని వెల్లడి

లండన్: ప్రపంచదేశాల్లో మార్పును తీసుకువచ్చే ఉన్నతమైన వ్యక్తి మోదీ అని బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి నేత ఎంతో అవసరమని చెప్పారు. ఈ మేరకు ‘అన్‌లీష్‌డ్’ పేరిట బోరిస్ రాసిన తాజా పుస్తకంలో తన అభిప్రాయాలను వెల్లడించారు. త్వరలో యూకేలో విడుదల కానున్న ఈ పుస్తకంలో ఆయన తన రాజకీయ జీవితం గురించి ప్రస్తావిస్తూ.. ప్రధాని మోదీతో సమావేశమైన వివిధ సందర్భాల గురించి వివరించారు. మోదీతో తన మొదటి సమావేశాన్ని వివరిస్తూ.. ఆయనను కలిసినప్పుడు తాను అలౌకిక భావనకు గురవుతానని పేర్కొన్నారు. తనకున్న అత్యంత సన్నిహిత మిత్రుల్లో మోదీ ఒకరని తెలిపారు. ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా-వాణిజ్య ఒప్పందానికి(ఇదింకా అమల్లోకి రాలేదు) ఆయనే పునాది వేశారన్నారు.



ఆయన కారణంగా నాకు పలువురు దూరమయ్యారు

“2022లో నేను పలు వివాదాల్లో చిక్కుకున్నాను. వీటిపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ప్రధాని పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. కానీ.. రిషి సునాక్ నాకు ద్రోహం చేశారు. ఆయన కారణంగానే సొంత పార్టీ నేతలు కూడా నాకు దూరమయ్యారు” అని బోరిస్ జాన్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక తన మాజీ భార్య మెరీనా వీలర్ సిక్కు వారసత్వ కుటుంబానికి సంబంధించిన వారని ఆయన వెల్లడించారు.

భారత్‌లో ఆందోళనకరంగా ఆకలి బాధలు

సూచీలో 105వ స్థానం..

లండన్: పోషకాహార లోపం, శిశు మరణాల ఆధారంగా ఆకలి బాధను అంచనా వేసే ప్రపంచ ఆకలి సూచీ (జీహెచ్ఐ).. భారత్‌ను ఆందోళనకర దేశాల జాబితాలో చేర్చింది. 127 దేశాలకు జీహెచ్ఐ ర్యాంకులు ఇవ్వగా 27.3 స్కోర్‌తో భారత్ 105వ స్థానంలో నిలిచింది. 2024 జీహెచ్ఐ నివేదికను కన్సర్న్ వరల్డ్‌వైడ్, వెల్ట్‌హంగర్‌హిల్ఫే ఇటీవల ప్రచురించాయి. ఆ నివేదిక ప్రకారం.. ఆకలి బాధలు ఆందోళనకరంగా ఉన్న 42 దేశాలలో పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌ల సరసన భారత్ నిలిచింది. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక దేశాలు ఓ మాదిరి ర్యాంకులతో మధ్యస్థ కేటగిరీలో చోటు దక్కించుకోవడం గమనార్హం. భారత్ జనాభాలో 13.7 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, ఐదేళ్లలోపు చిన్నారుల్లో 35.5 శాతం మంది వయసుకు తగ్గ ఎత్తు కంటే తక్కువగా ఉన్నారని, 18.7 శాతం మంది ఎత్తుకు తగ్గ బరువు లేరని ఈ నివేదిక వెల్లడించింది. చిన్నారుల్లో 2.9 శాతం మంది తమ ఐదో జన్మదిన వేడుకను చూసుకోకుండానే కన్నుమూస్తున్నారని ఆక్షేపించింది. ఈ ఫలితాల నేపథ్యంలో 2030 నాటికి ఆకలి లేని సమాజాన్ని సాధించాలన్న ఐరాస లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమేనని జీహెచ్ఐ నివేదిక అభిప్రాయపడింది.


ఎక్స్‌ప్రెస్ రైలుపెట్టెలో మంటలు

- ప్రయాణికులు సురక్షితం

ఛతర్‌పుర్: నడుస్తున్న రైల్లో మంటలు చెలరేగిన ఘటన మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పుర్ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. కురుక్షేత్ర నుంచి ఖజురహో వెళ్తున్న గీతాజయంతి ఎక్స్‌ప్రెస్ డి-5 పెట్టె నుంచి పొగలు వస్తున్నట్లు సిబ్బంది గమనించి రైలును నిలిపివేశారు. వెంటనే మంటల్ని అదుపుచేశారు. రైలుపెట్టె కిందిభాగంలో రబ్బరు వేడెక్కి మంటలు వచ్చాయని భావిస్తున్నారు. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

పట్టాలపై గ్యాస్ సిలిండర్

హరిద్వార్: ఉత్తరాఖండ్‌లోని రూర్కీ సమీపంలో రైలుపట్టాలపై మూడు కిలోల ఎల్‌పీజీ సిలిండర్ పడి ఉండటం కలకలం రేపింది. రూర్కీ-లక్సర్ మార్గంలో శనివారం ఉదయం ఈ సిలిండర్‌ను.. పక్కనున్న మార్గంలో వెళ్తున్న గూడ్సురైలు గార్డు గమనించి రైల్వే పోలీసులను అప్రమత్తం చేశారు. ఆ సమయంలో ఆ మార్గంలో ఏ రైలు నడవడం లేదు. సిలిండర్ ఖాళీదేనని తేలింది. గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



రూర్కీ సమీపంలో రైలుపట్టాలపై ఉన్న సిలిండర్

రతన్ టాటా.. భారత్ గర్వించదగ్గ ముద్దుబిడ్డ: నెతన్యాహు

టెల్‌అవీవ్: రతన్ టాటా.. భారత్ గర్వించదగ్గ ముద్దుబిడ్డ అని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. టాటా మృతికి సంతాపం తెలుపుతూ భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ‘ఎక్స్’ వేదికగా పోస్ట్ పెట్టారు. భారత్-ఇజ్రాయెల్ స్నేహబంధంలో టాటా కృషిని కొనియాడారు. “నేను, ఇజ్రాయెల్‌లోని అనేక మంది ప్రజలు రతన్ టాటా మృతికి సంతాపం తెలుపుతున్నాం. ఆయన భారత్ గర్వించదగ్గ ముద్దుబిడ్డ. ఇరు దేశాల స్నేహబంధంలో ఆయనొక ఛాంపియన్. రతన్ కుటుంబానికి నా సంతాపం తెలియజేయండి” అని ప్రధాని మోదీని నెతన్యాహు కోరారు.

మధ్యప్రదేశ్‌లో భారీగా మెపెడ్రోన్ పట్టివేత

విలువ రూ.168 కోట్లు

ఇందౌర్: మధ్యప్రదేశ్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ ఓ మాదకద్రవ్యాల ముఠా గుట్టును రట్టు చేసింది. ఝబువా జిల్లాలో అక్రమంగా తయారు చేస్తున్న 36 కిలోల పొడి రూప, 76 కేజీల ద్రవరూప మెపెడ్రోన్ సహా మరికొంత ముడి పదార్థం, తయారీ పరికరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ అంతర్జాతీయ మార్కెట్లో రూ.168 కోట్లు ఉంటుందని వారు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in

పదవీ విరమణ తరవాత నచ్చినవన్నీ చేయాలి... మనవలు మనవరాళ్లతో ఆనందంగా గడిపేయాలి... చాలామంది ఇలా ఎన్నో ప్రణాళికలు వేసుకుంటారు. ఈ ముగ్గురు అక్కాచెల్లెళ్లు మాత్రం చిన్నప్పుడు వదిలిన ఆటలపై దృష్టిపెట్టారు. 600కుపైగానే పతకాలు సాధించడమే కాదు... గోల్డెన్ సిస్టర్స్‌గానూ గుర్తింపు తెచ్చుకున్నారు... రాజేశ్వరి, పద్మిని, భవాని. ఈ విజయరహస్యం వారి మాటల్లోనే..!

అక్కాచెల్లెళ్లు... 600 పతకాలు!



వ్యవసాయమూ వచ్చు: ఈడుపుగంటి రాజేశ్వరి

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ధూళిపూడి మాది. నాన్న టీచర్, వ్యవసాయమూ చేసేవారు. బ్యాడ్మింటన్ ఆడేవారు. మమ్మల్నీ ఆటల్లో ప్రోత్సహించారు. 1958లో ఎస్ఎస్ఎల్‌సీ రాశాక వివాహమైంది. మావారు రామ్మోహన్‌రావు పీఈటీ. మా ముగ్గురు పిల్లలూ స్కూల్లో చేరాక భాషా ప్రవీణ, పండిట్స్ శిక్షణ తీసుకున్నాను. 1977లో అవనిగడ్డ లోని గర్ల్స్ హైస్కూల్‌లో తెలుగు పండిట్‌గా చేరి 2000లో రిటైరయ్యాను. తెలుగులో ఎంఏ కూడా చేశా. రిటైరయ్యాక ఖాళీగా ఉండాలనిపించలేదు. అప్పటికే పెద్ద చెల్లెలు పద్మిని అథ్లెటిక్స్‌లో రాణిస్తోంది. నేను, నా చెల్లెళ్లు చిన్నప్పుడు కబడ్డీ, ఖోఖో, రింగ్ టెన్నిస్ తెగ ఆడేవాళ్లం. మళ్లీ ఆడాలనిపించింది. అప్పటికే 60ఏళ్లు నిండినా విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి పోటీల్లో 5కి.మీ. నడక, 100మీ. పరుగు పందెంలో పాల్గొని గెలిచాను. ఆపై డిస్కస్ త్రో, లాంగ్ జంప్, రిలే పరుగులనూ మొదలుపెట్టాను. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. 2018లో ఇండోనేషియాలో 100 మీ. పరుగు, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, రిలేల్లో బంగారు పతకాలొచ్చాయి. అరక తప్ప వ్యవసాయ పనులన్నీ వచ్చు. ఇప్పుడు నాకు 82ఏళ్లు. చిన్న అనారోగ్య సమస్యా లేదు. పెయింటింగ్, ఎంబ్రాయిడరీ చేస్తా. ఇద్దరు పేదపిల్లల్నీ చదివిస్తున్నా.



కలిసే వెళతాం: దాసరి భవాని

నేను ఐటీఐ మెకానికల్ చేసి... డ్రిల్లింగ్ యంత్రాలకు సంబంధించి బిట్‌లు తయారుచేసే విభాగంలో కొన్నాళ్లు పనిచేశాను. మావారు వెంకట నారాయణ వర ప్రసాద్ విద్యుత్‌శాఖలో పనిచేసేవారు. 2011లో ఆయన మరణించాక విద్యుత్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరా. డిస్కం తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో డిస్కస్‌త్రోలో పాల్గొని కాంస్యం గెలుచుకున్నా. ఆ ఉత్సాహంతో నేనూ అక్కలను అనుసరించా. ముగ్గురం కలిసే పోటీలకు వెళతాం. చాలావరకూ బంగారు పతకాలతోనే తిరిగొస్తాం. హై జంప్, హర్డిల్స్, ట్రిపుల్ జంప్ పోటీల్లో పాల్గొంటున్నాను. 2018లో ఇండోనేషియాలో హై జంప్, హర్డిల్స్‌లో బంగారు పతకాలు సాధించడం మరువలేని అనుభూతి. నేను హై జంప్ చేస్తుంటే నిర్వాహకులే కంగారు పడుతుంటారు. 200 పతకాలు సాధించా. అక్కలిద్దరూ చాలా పెద్ద. అయినా వాళ్లు సాధిస్తోంటే గర్వంగా ఉండటమేకాదు... స్ఫూర్తిగానూ తీసుకుంటా. ఉత్తరాదిన మాకు గుర్తింపు ఎక్కువ. ట్రెక్కింగ్ చేస్తా. 60ఏళ్లు దాటాయని శ్రీఖండ్ కైలాస్ ట్రెక్కింగ్‌కు అనుమతించలేదు. నాకేమైనా అయితే నాదే బాధ్యత అని లేఖ రాసిచ్చి మరీ ఎక్కా. 61ఏళ్లు వచ్చినట్టే అనిపించదు.




నేనే పరిచయం చేశా: కనకమేడల పద్మిని

అక్కాచెల్లెళ్లిద్దరికీ నేనే తిరిగి ఆట పరిచయం చేశా. బీహెచ్ఈఎల్ ఉద్యోగినిని. 2010లో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా రిటైరయ్యా. మావారు నర్సింహారావు కూడా బీహెచ్ఈఎల్ ఉద్యోగే. 1992లో ఉమెన్స్ డేకి క్రీడాపోటీలు నిర్వహిస్తే... క్రికెట్, డిస్కస్‌త్రో, క్యారమ్స్‌ల్లో గెలిచా. అది చూసిన ఒకరు 40 ఏళ్లు దాటినవారు అథ్లెటిక్స్‌లో పాల్గొనేలా అసోసియేషన్ ఉంది... 100 ఏళ్లు వచ్చేవరకూ ఆడొచ్చని చెప్పారు. అప్పటికే పిల్లలూ పెద్దవాళ్లయ్యారు. దీంతో చేరిపోయా. నాకిష్టమైన ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్, డిస్కస్‌త్రోల్లో పాల్గొంటున్నా. మూడే ఆడాలన్న నిబంధన ఉంది కానీ లేదంటే మిగతావీ ప్రయత్నించేదాన్ని. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలన్నింటిలో పాల్గొంటున్నా. 250కిపైగా పతకాలొచ్చాయి. నాకు 73ఏళ్లు. ఇప్పటికీ 5కి.మీ. నడకతోపాటు గుంజీళ్లు తీస్తుంటా. పోటీలకు వెళ్లేప్పుడు కుక్కర్, పచ్చళ్లు, నెయ్యి, ఉలవచారు వగైరా తీసుకెళ్లి స్వయంగా వంట చేసుకుంటాం. పోటీ పూర్తయ్యాక దగ్గర్లోని పుణ్యక్షేత్రాలనూ సందర్శిస్తాం.



– బి.కిరణ్ కుమార్, హైదరాబాద్

మీకు తెలుసా?



పద్మశ్రీ అవార్డు పొందిన మొదటి భారతీయ మహిళా శాస్త్రవేత్త కేరళకి చెందిన జానకీ అమ్మాళ్. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ది బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా పదవీ చేపట్టారీమె. 1900ల్లోనే వృక్షశాస్త్రాన్ని ఎంచుకుని, చెరకు, వంగ మొక్కలు.... లాంటి వాటిపై కీలక పరిశోధనలు చేశారు అమ్మాళ్.

3 నెలలు... 5 ప్రణాళికలు!



రాజీకి రోజంతా పని అలసట ఉన్నా...ఫోన్‌తో సమయం తెలియక, అర్ధరాత్రి నిద్రలోకి జారుతుంది. పొద్దెక్కిన తర్వాత లేచి కాలేజీకి పరుగెడుతుంది. క్రమం తప్పిన నిద్ర, ఆహారపుటలవాట్లు...అధికబరువు, పీసీఓడీ వంటివాటికి దారితీశాయి. మరి, ఇలా కాకుండా ఉండాలంటే మూడునెలలపాటు అయిదు ప్రణాళికలను పాటించి అలవాట్లుగా మార్చుకుంటే మంచి మార్పు సాధించొచ్చట.

1 ఉదయాన్నే నిద్ర లేవడం అలవరుచుకోవాలి. పొద్దున్న ఎండలో బ్రీతింగ్ ఎక్సర్‌సైజెస్, పావుగంట నడక మంచిది. కండరాలు బలోపేతమవుతాయి. మెరుగైన రక్తప్రసరణతోపాటు శరీరానికి డి విటమిన్ పుష్కలంగా అందుతుంది. ఆ తర్వాత చేసే చన్నీటి స్నానం శరీరంలో జీవక్రియల పనితీరును మెరుగుపరుస్తుంది. అంతేకాదు, చన్నీటి స్నానంవల్ల డోపమైన్, సెరోటోనిన్ విడుదలవుతాయని పలు అధ్యయనాలు కూడా గుర్తించాయి. వీటివల్ల అందే ఉత్సాహం, సంతోషం, చురుకుదనంతో రోజంతా మానసిక ఉల్లాసం పొందొచ్చు.

2 మరుసటి రోజు చేయాల్సిన పనులను ఓ ప్రణాళికగా ముందురోజు రాత్రి సిద్ధం చేసుకోవాలి. దీనివల్ల మంచి నిద్ర పడుతుంది. అలాగే మరుసటి రోజు ఉదయాన్నే పనులు పూర్తికావనే ఆందోళన, ఒత్తిడి దరికి చేరవు.

3 ప్రాసెస్డ్ ఫుడ్ కాకుండా పోషక విలువలున్న ఆహారానికి పెద్దపీట వేయాలి. రోజంతా శరీరానికి తగినంత నీటిని అందించి డీహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తపడాలి. దీంతో రోజంతా ఉత్సాహంగా ఉండొచ్చు.

4 మధ్యాహ్నం, రాత్రి భోజనం తర్వాత పదినిమిషాల నడక జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. జీవక్రియలు వేగంగా జరగడమే కాకుండా శరీరంలో శక్తి స్థాయులను పెంచుతాయి.

5 రాత్రి సమయాల్లో నిద్ర అత్యంత ముఖ్యం. ఆలస్యంగా నిద్ర, ఉదయం లేట్‌గా లేచి ఎక్కువ గంటలు నిద్రపోయామనే భావన సరైనది కాదు. రాత్రిపూట త్వరగా నిద్రకు ఉపక్రమించడం, ఉదయం త్వరగా లేవడం శరీరానికీ, మనసుకీ మంచిది. అలాగే నిద్రపోవడానికి కనీసం గంట ముందు నుంచే ఫోన్, టీవీ లేదా ల్యాప్‌టాప్‌లకు దూరంగా ఉండాలి. మూడు గంటల ముందు నుంచే కాఫీ, టీలను తీసుకోకపోవడం వంటివన్నీ నిద్రలేమికి గురికానివ్వవు.

నాకు పెళ్లయి రెండేళ్లు అవుతోంది. ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నాం. ఉద్యోగం వచ్చిన వెంటనే పెళ్లి కావడంతో పూర్తిగా పుట్టింటి బాధ్యతలు నెరవేర్చలేకపోయా. అందుకే, ఇప్పుడు వాటిని కొనసాగిస్తున్నా. కానీ, ఆయన మాత్రం ఇందుకు అంగీకరించడం లేదు. తనలాగే నాకూ బాధ్యతలు ఉంటాయని నా భర్త ఎందుకు అర్థం చేసుకోవడం లేదు. తనని మార్చేదెలా? - ఓ సోదరి

పెళ్లయితే బాధ్యత ఉండదా?

డియర్... వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

సాధారణంగా అమ్మాయికైనా, అబ్బాయికైనా సరే... కుటుంబ బాధ్యతలు ఉంటాయి. పెళ్లయినంత మాత్రాన వాటిని పూర్తిగా పక్కన పెట్టేయాలని లేదు. అయితే, ఇటువంటి విషయాల్ని చాలామంది పెళ్లికి ముందే మాట్లాడుకుంటారు. తద్వారా భవిష్యత్తులో సమస్యలు రాకుండా ఉంటాయి. మరి మీరు ఆ విధంగా ఒప్పందం చేసుకున్నారో లేదో తెలియడం లేదు. ఏది ఏమైనా ఇది నైతిక విలువలకు సంబంధించినది. ఈ పరిస్థితుల్లో మీరు అతనితో వాగ్వాదానికి దిగే కంటే కంటే సామరస్యంగా మాట్లాడి, ఒప్పించే ప్రయత్నం చేయండి. మీ పుట్టింట్లో కూడా మీ బాధ్యతను మరెవరైనా చేపట్టగలరేమో చూడండి. ఆ అవకాశం లేకపోతే మీరు బాధ్యతలు తీసుకోవాల్సిన అవసరం ఎంత ఉందో ఆయనకు వివరించండి. అయితే, దీనివల్ల మీ వివాహ బంధాన్ని పాడుచేసుకునే పరిస్థితి రాకుండా చూసుకోండి. ఒకరికొకరు సాయం చేసుకుంటేనే బంధాలు నిలబడతాయి. తనకు మీరెలా మద్దతు ఇస్తున్నారో తనూ అలా ఇవ్వగలిగితే ఏ సమస్యా ఉండదు. పైగా అతని వైపు ఒత్తిళ్లు ఎలా ఉన్నాయో తెలీదు. కాబట్టి, ఇద్దరూ కలిసి మాట్లాడుకుని లోటుపాట్లు చర్చించుకుంటే పరిష్కారం దొరుకుతుంది.

ఆరోగ్యానికి సుగంధాల లావెండర్



పురాతన ఈజిప్టు కాలం నుంచీ వాడే సుగంధ నూనెల్లో లావెండర్ ఒకటి. దీనిలో ఔషధ గుణాలు పుష్కలంగా ఉండటం వల్ల రోమన్లు వైద్య చికిత్సల్లో వాడేవారు. స్నానాలకూ, సౌందర్య పోషణకూ వినియోగించేవారట. లావెండర్ నూనె ఆందోళనల్ని, ఒత్తిడిని తగ్గిస్తుంది. సువాసన నిద్ర నాణ్యతను పెంచడంతో పాటు డిప్రెషన్ లక్షణాల్నీ తగ్గిస్తుందట. ఇక, దీనికి ఉన్న అనాల్జిసిక్ లక్షణాలు తల, కండరాల నొప్పుల్ని తగ్గించగలదంటున్నాయి పలు అధ్యయనాలు. ముఖ్యంగా చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుందట. ముఖ్యంగా లావెండర్ నూనెకి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీసెప్టిక్ గుణాలు ఎక్కువ. ఇవి బ్యాక్టీరియాతో పోరాడతాయి. ముఖంపై మొటిమలు, వాటి తాలూకు మచ్చల్ని తగ్గిస్తాయి. గాయాల్ని నయం చేస్తాయి. మెనోపాజ్‌లో ఉన్నవారికి లావెండర్ ఆయిల్‌తో మసాజ్ మేలు చేస్తుంది. ముఖ్యంగా వేడి ఆవిర్లను తగ్గిస్తుందట. అయితే, దీన్ని తప్పనిసరిగా బాదం, కొబ్బరి...వంటి క్యారియర్ ఆయిల్‌లో రెండు చుక్కలు కలిపి మాత్రమే వాడాలి.

'నా రాత ఎలాగూ బాగోలేదు, నువ్వు అయినా చేతిరాతను అందంగా తీర్చిదిద్దుకో' అంటూ పిల్లలతో దగ్గరుండి ప్రాక్టీసు చేయించే అమ్మల మాటలు వింటుంటాం. కానీ ఈ తల్లి మాత్రం తాను సైతం అంటూ... స్వీయ సాధనతో ప్రపంచ చేతిరాత పోటీల్లో విజేతగా నిలిచింది. బెంగళూరుకు చెందిన రోజ్లిన్ రిచర్డ్ సాధించిన ఈ విజయం వెనుక ఎనిమిదేళ్ల కఠోరదీక్ష ఉందట.

చేతిరాతతో... ప్రపంచ విజేతగా!

'స్కూల్, కాలేజీలో ఉన్నప్పుడు నా చేతిరాత బాగుండేది. అక్షరాలను పొందికగా తీర్చిదిద్దేదాన్ని' అని చెప్పే రోజ్లిన్‌కు పెళ్లై, పిల్లలు ఎదుగుతున్నప్పుడు ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే చేతిరాత పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి వచ్చింది. న్యూయార్క్‌కు చెందిన 'హ్యాండ్‌రైటింగ్ ఫర్ హ్యూమానిటీ' గ్రూపు ఏటా వరల్డ్ హ్యాండ్‌రైటింగ్ పోటీలు జరుపుతుంది. ఇందులో పెద్దవాళ్ల విభాగంలో 'ఫంక్షనల్ హ్యాండ్‌రైటింగ్(కర్సీవ్)' క్యాటగిరీలో పాల్గొనాలనుకొని 2017 నుంచి రోజ్లిన్ తన ప్రయత్నాలతో పాటు పోటీకి వెళ్లడం మొదలుపెట్టింది. దీని కోసం ఇంటిపని, పిల్లల బాధ్యతలన్నీ పూర్తిచేసిన తర్వాత రాత్రి సమయాల్లో రెండుగంటలపాటు సాధన చేసేది. తల్లి నుంచి స్ఫూర్తి పొందిన 12 ఏళ్ల ఆమె కొడుకు రేమన్ స్మిత్ రిచర్డ్ 'ప్రీ-టీన్స్' క్యాటగిరీ -2020లో పోటీపడి కర్సీవ్ హ్యాండ్‌రైటింగ్‌లో ప్రథమ బహుమతినీ... అందుకున్నాడు.





సాధనతో సాధించి...

'2017 నుంచి పోటీలో పాల్గొంటున్నాను. వైఫల్యం చెందినా కూడా సాధన మాత్రం ఆపలేదు. ఎనిమిదేళ్ల నుంచి పట్టుదలగా ప్రయత్నిస్తూ, ఈ ఏడాది విజేతగా నిలిచా. జనవరి నుంచి జూన్ వరకు జరిగే ఈ పోటీలో నిర్వాహకులు పంపించే టెక్స్ట్‌ను ఏ4 షీట్‌లో రాసి పంపాలి. అలా నేను 112 పదాలను 60 నిమిషాల్లో రాసి పంపించా. ప్రతి వాక్యానికి సమాన దూరం, అక్షరాల తీరు, ఆయా అక్షరాలు రాసేటప్పుడు ప్రతిసారీ ఒకేలా ఉండాలనే నియమాన్ని పరిగణనలోకి తీసుకుని విజేతను నిర్ణయిస్తారు. ఓడిన ప్రతిసారీ కొత్తపాఠాలు నేర్చుకుంటూ, నైపుణ్యాలను సాధించడానికి చాలా సహనంగా సాధన చేశా. అలసట, వేళ్ల నొప్పులు వంటివన్నీ ఉండేవి. విరామం తీసుకుంటూ చిన్నచిన్న వ్యాయామాలతో వేళ్ల కండరాలు బలోపేతం చేసుకొని తిరిగి సాధన చేసేదాన్ని. అలా చివరకు లక్ష్యాన్ని చేరుకోగలిగా'నంటున్న 46 ఏళ్ల రోజ్లిన్ కాలిగ్రఫీ, గ్రాఫాలజీలో ప్రొఫెషనల్ ట్రైనర్‌గా, విద్యార్థులకు కౌన్సెలింగ్ సైకాలజిస్ట్‌గా పనిచేస్తోంది. అందమైన రాత మంచి మార్కులు తెచ్చిపెట్టడమే కాదు, విద్యార్థుల్లో సహనాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ నింపుతుందని చెప్పే రోజ్లిన్ విద్యారంగంలో అందిస్తున్న సేవలకుగాను ఈ ఏడాది 'విమెన్ పవర్ ఇండియా'అవార్డునూ అందుకుంది.

బకెట్టే పూలవాజుగా...

స్వీట్ హోమ్





ఇంట్లో మొక్కలు, పూలు ఉంటే వచ్చే అందమే వేరు కదా! వాటిని చూస్తుంటే వాతావరణం ప్రశాంతంగా అనిపించడమే కాదు, ఆకర్షణీయంగానూ ఉంటుంది. అందుకోసమే... ఇంట్లోనూ, ఆఫీసుల్లోనూ భిన్న ఆకృతుల్లో ఉండే వాజుల్ని ఎంచుకుని వాటిల్లో పూల కొమ్మల్ని అందంగా సర్దేస్తారు. అలాగని అందులో వైవిధ్యం కనిపించకపోతే ఏం బాగుంటుంది అంటోంది ఈతరం. ఇంట్లో ఉండే ప్రతి వస్తువూ ఓ అందమైన కళాఖండంగా ఉండాలని కోరుకుంటోంది. ఫ్లవర్ వాజుల్ని ఎంచుకునే విషయంలో తమ సృజనాత్మకతకు పదునుపెడుతోంది. స్టీలు, ఇత్తడి బకెట్లను ఇందుకోసం ఎంచుకోవడంతో... ఇప్పుడు ఈ 'బకెట్ వాజు'లే ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఆ మధ్య సోనమ్ కపూర్ తన 'హోమ్ టూర్'లో భాగంగా స్టీల్ బాల్టీ(బకెట్) గురించి ప్రత్యేకంగా చెప్పుకొచ్చింది. వీటిలో పూలు, మొక్కలను ఉంచి టేబుల్ మీద ఉంచితే చాలు. అటు సంప్రదాయం, ఇటు ఆధునికత కలబోతగా కనిపిస్తుంది. ఇత్తడి, స్టీలువి అంటే ఖరీదేమో అని ఆలోచించక్కర్లేదు. ప్రత్యేకించి కొనకున్నా, ఇంట్లో ఉన్న వాటినే ఇందుకు ఉపయోగించుకోవచ్చు. భలే చూడముచ్చటగా ఉన్నాయి కదూ...



పేరెంటింగ్

అఖిల తన ఎనిమిదేళ్ల కొడుకుని స్నేహితులు, బంధువుల దగ్గరకు తీసుకెళ్లినప్పుడు తల్లిని కొట్టడం, అవమానంగా మాట్లాడటం చేస్తాడు. ఇంటికెవరైనా వచ్చినప్పుడూ అంతే అసహజంగా ఉంటాడు. తోటిపిల్లలతోనూ పేచీలే. అయితే, మిగతా సమయాల్లో సాధారణంగానే ఉంటూ, ఇతరుల ముందు మాత్రమే ఇలా వ్యవహరించడానికి పలు కారణాలు ఉన్నాయి అంటున్నారు నిపుణులు.

అదీ కారణమే...

చిన్నారులకు కొత్త ప్రాంతం, వాతావరణం అసౌకర్యంగా అనిపించినా లేదా కొత్తవాళ్లు నచ్చకపోయినా ఇబ్బందిపడతారు. దాంతో కారణం లేకుండానే గట్టిగా అరుస్తూ తమ అసంతృప్తిని బయటపెట్టాలనుకుంటారు. అప్పటికీ తల్లిదండ్రులు పట్టించుకోకపోతే తమకు తెలిసినవీ, ఎప్పుడైనా విన్నవీ లేదా ఇంట్లో అమ్మానాన్న ఒకరినొకరు నిందించుకునేటప్పుడు ఉపయోగించిన పదాలనూ ప్రయోగిస్తారు. కొందరు పిల్లలైతే ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు కూడా తల్లిదండ్రులను విసిగిస్తుంటారు. వాళ్ల ఏకాగ్రతను తమవైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తారు. అలానే కొందరు తల్లిదండ్రులు తమ బిడ్డలను తీవ్ర క్రమశిక్షణ విధానలతో సరిదిద్దాలనుకోవడమూ ఇందుకు కారణమే. అంతేకాదు, తమకు నచ్చినట్లుగా చేయనివ్వకపోయినా చిన్నారుల్లో దుందుడుకు ప్రవర్తన కనిపిస్తుంది. చదువులో, కొత్త విషయాలు నేర్చుకోవడంలో లేదా మరే ఇతర కారణాలైనా వారికి సవాళ్లుగా మారినప్పుడు... తమ లక్షాలు సాధించలేకపోతున్నామనే నిరాశ, అశక్తత అసంతృప్తికి దారితీస్తాయి. ఇవన్నీ తీవ్ర ఒత్తిడిగా మారి వాళ్ల ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి.

పిల్లల ప్రవర్తన బాలేదా?

ప్రేమతో సాధించాలి...

పిల్లలకెప్పుడూ తల్లిదండ్రులు ఓ భరోసాగా నిలబడాలి. తమ సమస్యకు పెద్దవాళ్లవద్ద పరిష్కారం దొరుకుతుందనే నమ్మకాన్ని కలిగించాలి. వాళ్లలో దూకుడు కనిపించినప్పుడు అది వారి ఒత్తిడిగా గుర్తించాలి. వారికిష్టమైన రంగాన్ని అభిరుచిగా పరిచయం చేసి అందులోకి అడుగుపెట్టేలా ప్రోత్సహించాలి. అందులో విజయాలు సాధించడం మొదలుపెడతారు. అలాగే ఇతరపిల్లలతో పోల్చకూడదు. వాళ్లలో ప్రత్యేకతలను గుర్తించి ప్రశంసిస్తే చాలు. ఆత్మవిశ్వాసంతో అడుగులేస్తారు. అతిగా భావోద్వేగాలను ప్రదర్శించకుండా నిబ్బరంగా ముందుకు నడుస్తారు.





(c) eenadu

చాంపియన్స్

సంజు సాధించాడు


సంజు శాంసన్

సంజు శాంసన్.. ప్రతిభావంతుడైన ఆటగాడే కానీ అవకాశాలే రాలేదనే అభిప్రాయాలు ఎక్కువగా వినిపిస్తాయి. వచ్చిన అవకాశాలనూ అతను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. 2015లోనే టీ20ల్లో అరంగేట్రం చేసిన శాంసన్ ఇప్పటివరకూ ఆడింది 33 టీ20లే. బంగ్లాతో మూడో టీ20కు ముందు అతను పొట్టి ఫార్మాట్లో 19.32 సగటుతో చేసింది 483 పరుగులే. ఈ కేరళ ఆటగాడికి ప్రతిభ లేదని కాదు. కానీ అది ప్రదర్శించాల్సిన సమయంలో విఫలమవుతూ వచ్చాడు. కానీ ఇన్నాళ్లకు స్థాయికి తగ్గ ప్రదర్శన చేశాడు. బంగ్లాతో చివరి టీ20లో శతకంతో సత్తా చాటాడు. ఓ రకంగా చూసుకుంటే ఈ సిరీస్ శాంసన్‌కు పరీక్షగా నిలిచింది. ఐపీఎల్‌లో 531 పరుగులతో రాణించినప్పటికీ.. జింబాబ్వేతో సిరీస్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. చివరి టీ20లో 58 పరుగులు చేసినా అందుకు 45 బంతులాడాడు. ఇక శ్రీలంకతో రెండు టీ20ల్లోనూ డకౌటయ్యాడు. ఇప్పుడు బంగ్లాతో సిరీస్‌లోనూ తొలి రెండు మ్యాచ్‌ల్లో వరుసగా 29, 10 పరుగులే చేశాడు. ఈ నేపథ్యంలో చివరి మ్యాచ్‌లో శతకంతో శాంసన్ జట్టులో చోటు కాపాడుకోవడమే కాకుండా.. తన క్రికెట్ కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడని చెప్పొచ్చు. ఇప్పుడు టీ20ల్లో యువకులకే బీసీసీఐ ప్రాధాన్యతనిస్తోంది. దీంతో ఇదే నిలకడ కొనసాగిస్తే శాంసన్‌కు తిరుగుండదు.

మనోడు మురిపించాడు


నితీశ్

పేస్ ఆల్‌రౌండర్‌తో జట్టుకు సమతూకం వస్తుంది. ప్రస్తుతం టీమ్‌ఇండియా టీ20 జట్టులో హార్దిక్ పాండ్య, శివమ్ దూబె ఆ బాధ్యత పోషిస్తున్నారు. కానీ వీళ్లకు తరచూ గాయాలవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వీళ్లకు ప్రత్యామ్నాయంగా మరో ఆల్‌రౌండర్ ఎవరు? అనే ప్రశ్నకు సమాధానంగా కనిపిస్తున్నాడు మన విశాఖ కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి. బంగ్లాదేశ్‌తో సిరీస్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన 21 ఏళ్ల నితీశ్.. బ్యాటింగ్‌లో, బౌలింగ్‌లో జట్టుకు భవిష్యత్‌పై అంచనాలు మరింత పెంచేశాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున అతను 142.92 స్ట్రైక్‌రేట్‌తో 303 పరుగులు చేశాడు. పేస్ బౌలింగ్‌తోనూ జట్టుకు ఉపయోగపడ్డాడు. భారత జట్టుకు ఆడుతూ ఇప్పుడు బంగ్లాదేశ్‌తో సిరీస్‌లో తనేంటో చాటిచెప్పాడు. బంగ్లాతో రెండో టీ20లో జట్టు 41/3తో ఉండగా నితీశ్ 34 బంతుల్లోనే 74 పరుగులతో అదరగొట్టాడు. ఇందులో ఏడు సిక్సర్లున్నాయి. బౌలింగ్‌లో రెండు వికెట్లు తీశాడు. నిజానికి జింబాబ్వేతో సిరీస్ కోసం ముందే నితీశ్ జట్టుకు ఎంపికైనా.. అప్పుడు గాయంతో దూరమయ్యాడు. ఇప్పుడు అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. నితీశ్‌కిది ఆరంభమే. అగ్రశ్రేణి పేస్ ఆల్‌రౌండర్‌గా ఎదిగే లక్షణాలు అతనిలో ఉన్నాయి.



పండుగ చేసుకున్నారు

ఉప్పల్‌లో దసరా రోజు భారత్ వీరవిహారం

టీ20 క్రికెట్ అంటేనే.. బాదుడుకు పెట్టింది పేరు. భారీ షాట్లు.. మెరుపు ఇన్నింగ్స్‌లు ఉంటేనే అసలైన మజా. ఆ కిక్కును అందించడంలో.. అభిమానులను ఉర్రూతలూగించడంలో మన ఉప్పల్ స్టేడియం తగ్గేదేలేదన్నట్లు అలరిస్తోంది. ఈ ఏడాది ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్ల ఊచకోతకు వేదికైన ఈ స్టేడియం.. తాజాగా టీమ్‌ఇండియా రికార్డుల మోతకు సాక్షిగా నిలిచింది. శనివారం దసరా.. ప్రజలంతా పండగ సందడిలో మునిగిపోయారు. ఆ విజయ దశమి ఆనందాన్ని రెట్టింపు చేస్తూ.. భారత ఆటగాళ్లు ఉప్పల్ స్టేడియంలో బంగ్లాదేశ్‌ను ఆటాడుకున్నారు.

ఈనాడు - హైదరాబాద్

ఏమా.. బాదుడు! ఏమా.. బ్యాటింగ్ విధ్వంసం! బంగ్లాదేశ్‌ను అనామక జట్టుగా.. ఆ బౌలర్లను గల్లీ బౌలర్లుగా మార్చేస్తూ భారత బ్యాటర్లు పరుగుల పండగ చేసుకున్నారు. శనివారం చివరి టీ20లో బ్యాటర్ల ఊచకోతతో చెలరేగిన టీమ్‌ఇండియా 133 పరుగుల తేడాతో బంగ్లాను చిత్తుచేసి సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సంజు శాంసన్ (111; 47 బంతుల్లో 11×4, 8×6) ఎట్టకేలకు తన ప్రతిభకు న్యాయం చేకూర్చేలా మెరుపు సెంచరీ బాదాడు. కెప్టెన్ సూర్యకుమార్ (75; 35 బంతుల్లో 8×4, 5×6), హార్దిక్ పాండ్య (47; 18 బంతుల్లో 4×4, 4×6), రియాన్ పరాగ్ (34; 13 బంతుల్లో 1×4, 4×6) కూడా వీర విహారం చేయడంతో మొదట భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 297 పరుగుల భారీస్కోరు చేసింది. లక్ష్యాన్ని చూసి ముందే డీలా పడ్డ బంగ్లా ఛేదనలో 20 ఓవర్లలో 7 వికెట్లకు 164 పరుగులకే పరిమితమైంది. తౌహిద్ హృదయ్ (63 నాటౌట్; 42 బంతుల్లో 5×4, 3×6), లిటన్ దాస్ (42; 25 బంతుల్లో 8×4) ఇన్నింగ్స్‌లు ఓటమి అంతరాన్ని తగ్గించేందుకు కాస్త ఉపయోగపడ్డాయి. రవి బిష్ణోయ్ (3/30), మయాంక్ యాదవ్ (2/32) ప్రత్యర్థిని కట్టడి చేశారు. హార్దిక్ 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు.

70 బంతుల్లోనే 173: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరఫున ఈ స్టేడియంలో హెడ్‌తో కలిసి రెచ్చిపోయిన అభిషేక్ (4) ఈ మ్యాచ్‌లో మాత్రం మూడో ఓవర్లోనే పెవిలియన్ చేరాడు. మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌కు కాస్త యిన ఆనందం కలిగింది అప్పుడే. ఆ తర్వాత శాంసన్, సూర్య దంచుడుతో బంగ్లా బేజారెత్తింది. సూర్య క్లాస్ బ్యాటింగ్‌తో.. శాంసన్ మాస్ బాదుడుతో సాగిపోయారు. ఫీల్డర్లకు పనే లేకుండా చేశారు. బంతి గాల్లో లేదంటే ఖాళీల్లో దూసుకెళ్లింది. అయితే ఫోర్ లేదంటే సిక్సర్. తనదైన శైలిలో స్క్వేర్ లెగ్‌కు బంతిని పుల్ చేయడం, క్రీజులో కదులుతూ సూర్య కొట్టిన షాట్లు చూడటానికి రెండు కళ్లు సరిపోలేవు. ఇక తానేం తక్కువ కాదన్నట్లు పవర్, టైమింగ్‌తో శాంసన్ సిక్సర్లు కొడుతుంటే అభిమానులు కేరింతలు కొట్టారు. ముస్తాఫిజుర్ స్లో డెలవరీని బ్యాక్‌ఫుట్‌పై ఎక్స్‌ట్రా కవర్ సిక్సర్‌గా శాంసన్ మలచిన తీరు చూడాల్సిందే. రిషద్ వేసిన ఇన్నింగ్స్ పదో ఓవర్లో శాంసన్ వరుసగా అయిదు సిక్సర్లు బాదడం విశేషం. శాంసన్, సూర్య దూకుడుతో స్కోరు 10 ఓవర్లలోనే 150 దాటింది. శాంసన్ 40 బంతుల్లోనే సెంచరీ చేశాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు 70 బంతుల్లోనే 173 పరుగులు జతచేసింది. వీళ్లు వరుస ఓవర్లలో ఔటైనా.. హార్దిక్, పరాగ్ కలిసి క్లైమాక్స్‌నూ అదరగొట్టారు. నాలుగో వికెట్‌కు 26 బంతుల్లోనే 70 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. చివరి ఓవర్లో రెండు వికెట్లు పడటంతో భారత్ 300 స్కోరును చేరుకోలేకపోయింది. అనంతరం ఛేదనలో బంగ్లా చేతులెత్తేసింది. ఇన్నింగ్స్ తొలి బంతికే పర్వేజ్ (0)ను ఔట్ చేసి మయాంక్ ప్రత్యర్థి పతనాన్ని ఆరంభించాడు. మరో వైపు యువ లెగ్‌స్పిన్నర్ బిష్ణోయ్ బంగ్లాను తిప్పేశాడు. చివరి టీ20 ఆడిన మహ్మదుల్లా (8) రాణించలేకపోయాడు. తౌహిద్, లిటన్ దాస్ మాత్రమే కాస్త జట్టు పరువు కాపాడారు.

1 అంతర్జాతీయ టీ20ల్లో సెంచరీ సాధించిన తొలి భారత వికెట్ కీపర్ బ్యాటర్ శాంసన్.

22 ఈ మ్యాచ్‌లో భారత్ కొట్టిన సిక్సర్లు. ఓ టీ20 ఇన్నింగ్స్‌లో తమ అత్యధిక సిక్సర్ల రికార్డు (2017లో శ్రీలంకపై 21)ను తిరగ రాసింది. ఓవరాల్‌గా మూడో స్థానంలో ఉంది.

37 టీ20ల్లో భారత్ 200కు పైగా పరుగులు చేసిన ఇన్నింగ్స్‌లు. అన్ని టీ20ల్లో కలిపి ఇదే ప్రపంచ రికార్డు. సోమర్‌సెట్ (36)ను భారత్ దాటేసింది.

40 సెంచరీకి శాంసన్ ఆడిన బంతులు. టీ20ల్లో రోహిత్ (2017లో శ్రీలంకపై 35 బంతుల్లో) తర్వాత అత్యంత వేగంగా శతకం చేసిన భారత బ్యాటర్ అతడే.

232 ఈ మ్యాచ్‌లో ఫోర్లు, సిక్సర్లతో భారత్ సాధించిన పరుగులు. ఏ టీ20ల్లోనైనా ఇదే ప్రపంచ రికార్డు. గతేడాది ఆంధ్రపై పంజాబ్ సాధించిన 216 పరుగుల రికార్డు బద్దలైంది.

297/6 బంగ్లాతో టీ20లో భారత్ స్కోరు. పురుషుల టీ20ల్లో ఇది రెండో అత్యధిక స్కోరు. నేపాల్ (2023లో మంగోలియాపై 314/3) అగ్రస్థానంలో ఉంది. ఐసీసీ పూర్తి స్థాయి సభ్య దేశాల పరంగా చూస్తే భారత్ ప్రపంచ రికార్డు స్కోరు సాధించింది.

భారత్ ఇన్నింగ్స్: శాంసన్ (సి) మెహదీ (బి) ముస్తాఫిజుర్ 111; అభిషేక్ (సి) మెహదీ (బి) తంజిమ్ 4; సూర్యకుమార్ (సి) రిషద్ (బి) మహ్మదుల్లా 75; పరాగ్ (సి) లిటన్ దాస్ (బి) తస్కిన్ 34; హార్దిక్ (సి) రిషద్ (బి) తంజిమ్ 47; రింకు నాటౌట్ 8; నితీశ్‌కుమార్ (సి) మెహదీ (బి) తంజిమ్ 0; సుందర్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **297; వికెట్ల పతనం:** 1-23, 2-196, 3-206, 4-276, 5-289, 6-289; **బౌలింగ్:** మెహదీ హసన్ 4-0-45-0; తస్కిన్ అహ్మద్ 4-0-51-1; తంజిమ్ హసన్ 4-0-66-3; ముస్తాఫిజుర్ 4-0-52-1; రిషద్ 2-0-46-0; మహ్మదుల్లా 2-0-26-1

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: పర్వేజ్ (సి) పరాగ్ (బి) మయాంక్ 0; తంజిద్ (సి) వరుణ్ (బి) సుందర్ 15; శాంటో (సి) శాంసన్ (బి) బిష్ణోయ్ 14; లిటన్ దాస్ (సి) తిలక్ (బి) బిష్ణోయ్ 42; తౌహిద్ నాటౌట్ 63; మహ్మదుల్లా (సి) పరాగ్ (బి) మయాంక్ 8; మెహదీ హసన్ (సి) పరాగ్ (బి) నితీశ్ 3; రిషద్ (సి) అభిషేక్ (బి) బిష్ణోయ్ 0; తంజిమ్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **164; వికెట్ల పతనం:** 1-0, 2-35, 3-59, 4-112, 5-130, 6-138, 7-139; **బౌలింగ్:** మయాంక్ యాదవ్ 4-0-32-2; హార్దిక్ 3-0-32-0; సుందర్ 1-0-4-1; నితీశ్ 3-0-31-1; రవి బిష్ణోయ్ 4-1-30-3; వరుణ్ 4-0-23-0; అభిషేక్ 1-0-8-0

టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై గెలిచిన చరిత్రే లేదు భారత అమ్మాయిలకు. ఈసారి సెమీస్ చేరాలంటే ఆ జట్టును ఓడించాల్సిన స్థితిలో నిలిచింది హర్మన్‌ప్రీత్ సేన. దీంతో ఈసారైనా కథను మార్చగలదా అన్న అనుమానాలు! కానీ హర్మన్‌ప్రీత్ సేన గట్టిగానే పోరాడింది. బౌలర్లు రాణించారు. బ్యాటింగ్‌లో కెప్టెన్ గొప్ప ఇన్నింగ్స్ ఆడింది. దీప్తి శర్మ కూడా ఓ చేయి వేసింది. ఆశలేని స్థితి నుంచి.. భారత్ విజయానికి అత్యంత చేరువగా వెళ్లింది. 19వ ఓవర్లో 14 పరుగులొచ్చాయి. అవే 14 పరుగులు చివరి ఓవర్లోనూ సాధిస్తే మనమ్మాయిలదే విజయం. కానీ ఆ ఓవర్లో 4 పరుగులే చేసి 4 వికెట్లు కోల్పోయిన భారత్ ఓటమి మూటగట్టుకుని సెమీస్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది. ఇక హర్మన్‌ప్రీత్ సేన సెమీస్ చేరేది లేనిది పాకిస్థాన్ చేతుల్లోనే ఉంది.

పాక్ గెలిస్తే మనకు బెర్తు

పాకిస్థాన్ ఆడుతుంటే భారత అభిమానులు ఆ జట్టు విజయాన్ని కోరుకోవడం ఎప్పుడైనా జరుగుతుందా? సోమవారం అదే దృశ్యాలు చూడబోతున్నాం. గ్రూప్-ఎ చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడనున్న పాక్.. ఇందులో విజయం సాధిస్తే భారత్ సెమీస్ చేరే అవకాశముంటుంది. ఆస్ట్రేలియా నాలుగు విజయాలతో సెమీస్‌కు దూసుకెళ్లింది. భారత్ 4 మ్యాచ్‌ల్లో 2 విజయాలతో రెండో స్థానంలో ఉంది. కివీస్ 3 మ్యాచ్‌ల్లో 2 విజయాలతో మూడో స్థానంలో కొనసాగుతోంది. నెట్ రన్‌రేట్‌లో భారత్ (+0.322) కంటే న్యూజిలాండ్ (+0.282) వెనుకబడి ఉండడం భారత్‌కు కలిసొచ్చే అంశం. పాక్ చేతిలో కివీస్ ఓడితే.. భారత్ రెండో స్థానంతో ముందంజ వేస్తుంది. అయితే పాక్ గెలిచినా.. తేడా మరీ ఎక్కువ ఉండకూడదు. ప్రస్తుతం పాక్ నెట్ రన్‌రేట్ -0.488. నెట్ రన్‌రేట్‌లో తమను అధిగమించని స్థాయిలో పాక్ గెలిస్తే.. భారత్ సెమీస్ చేరుతుంది.

చేరువై.. దూరమై

- త్రుటిలో భారత్ చేజారిన విజయం
- హర్మన్‌ప్రీత్ పోరాటం వృథా
- కంగారూల ముందంజ


రేణుక


హర్మన్‌ప్రీత్

షార్జా

భారత్‌కు తీవ్ర నిరాశ! మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై గెలిచి సెమీఫైనల్ అవకాశాలను మెరుగుపరచుకోవాలనుకున్న హర్మన్‌ప్రీత్ సేన ఆశలకు బ్రేక్ పడింది. ఆదివారం ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆసీస్ 9 పరుగుల తేడాతో టీమ్‌ఇండియాను ఓడించింది. మొదట ఆస్ట్రేలియా 151/8 స్కోరు చేసింది. గ్రేస్ హారిస్ (40; 41 బంతుల్లో 5×4), తాలియా మెక్‌గ్రాత్ (32; 26 బంతుల్లో 4×4), ఎలీస్ పెర్రీ (32; 23 బంతుల్లో 2×4, 1×6) రాణించారు. ఛేదనలో భారత్ 142/9కే పరిమితమైంది. హర్మన్‌ప్రీత్ కౌర్ (54 నాటౌట్; 47 బంతుల్లో 6×4) పోరాటం ఫలితాన్నివ్వలేదు. అనాబెల్ సదర్లాండ్ (2/22), సోఫీ మోలనూ (2/32) ఆసీస్ విజయంలో కీలకపాత్ర పోషించారు.

వాళ్లిద్దరూ పోరాడినా..: ఛేదనలో భారత్ ఆట ఆసీస్ ఇన్నింగ్స్‌కు భిన్నంగా సాగింది. ఓపెనర్ షెఫాలి వర్మ (20; 13 బంతుల్లో 2×4, 1×6) మెరుపులతో 3.2 ఓవర్లలో 26/0తో లక్ష్యం దిశగా దూసుకెళ్తున్నట్లు కనిపించింది. కానీ ఉన్నట్టుండి ఇన్నింగ్స్ కుదుపునకు లోనైంది. ఆరంభం నుంచి నెమ్మదిగా ఆడిన మరో ఓపెనర్ స్మృతి మంధాన (6; 12 బంతుల్లో)ను స్పిన్నర్ మోలనూ ఎల్బీగా ఔట్ చేసింది. ఆ వెంటనే మరో షాక్! షెఫాలి కూడా ఔటైపోయింది. ఉన్నంతసేపు ధాటిగా ఆడిన జెమీమా (16; 12 బంతుల్లో) కూడా ఆ నిలవలేదు. దీంతో భారత్ 6.5 ఓవర్లకు 47/3తో ఇబ్బందుల్లో చిక్కుకుంది. ఈ స్థితిలో దీప్తిశర్మ (29)తో కలిసి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వికెట్ల పతనాన్ని ఆపింది. ఈ జంట షాట్లకు పోకుండా సింగిల్స్, రెండు పరుగులతోనే స్కోరు పెంచడంతో టీమ్‌ఇండియా 14 ఓవర్లకు 90/3తో కోలుకుంది. కానీ సమీకరణం (36 బంతుల్లో 62) క్లిష్టంగా మారింది. షాట్లు కొట్టే క్రమంలో దీప్తి వెనుదిరగడంతో భారత్‌పై ఒత్తిడి ఇంకా పెరిగింది. చివరి మూడు ఓవర్లలో 40 పరుగులు అవసరమైన స్థితిలో హర్మన్‌ప్రీత్ బ్యాట్ ఝుళిపించింది. దీంతో రెండు ఓవర్లలో (18, 19) 26 పరుగులు లభించడంతో చివరి ఓవర్లో భారత్‌కు 14 పరుగులు అవసరమయ్యాయి. కానీ అనాబెల్ వేసిన ఆఖరి ఓవర్ తొలి బంతికి హర్మన్‌ప్రీత్ సింగిల్ తీయగా.. తర్వాత పూజ (9), అరుంధతి (0, రనౌట్), శ్రేయాంక (0, రనౌట్), రాధ (0) క్యూ కట్టడంతో భారత్ పనైపోయింది.

రేణుక విజృంభించినా..: 2.5 ఓవర్లలో 17/2... టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు లభించిన ఆరంభమిది! చక్కని లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేసిన పేసర్ రేణుక సింగ్ (2/24) ప్రత్యర్థికి కళ్లెం వేసింది. వరుస బంతుల్లో బెత్ మూనీ (2), వేర్‌హామ్ (0)లను ఔట్ చేసింది. ఈ స్థితిలో మరో ఓపెనర్ గ్రేస్ హారిస్‌తో కలిసి తాత్కాలిక కెప్టెన్ తాలియా మెక్‌గ్రాత్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. దీంతో ఆసీస్ 11.4 ఓవర్లలో 79/2తో మెరుగైన స్థితిలో నిలిచింది. కానీ తాలియా, గ్రేస్ కొద్ది విరామంలో వెనుదిరగడంతో కంగారూ జట్టు ఇబ్బందుల్లో చిక్కుకున్నట్లు కనిపించింది. కానీ సమయోచితంగా ఆడిన ఎలీస్ పెర్రీ ఆసీస్ పోరాడే స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించింది. ఆఖర్లో లిచ్‌ఫీల్డ్ (15 నాటౌట్) దూకుడుగా ఆడి స్కోరు 150 దాటించింది.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: గ్రేస్ (సి) స్మృతి (బి) దీప్తి 40; బెత్ (సి) రాధ (బి) రేణుక 2; వేర్‌హామ్ ఎల్బీ (బి) రేణుక 0; తాలియా (స్టంప్డ్) రిచా (బి) రాధ 32; పెర్రీ (సి) సజన (బి) దీప్తి 32; ఆష్లీ (సి) రాధ (బి) పూజ 6; లిచ్‌ఫీల్డ్ నాటౌట్ 15; అనాబెల్ (బి) శ్రేయాంక 10; మోలనూ రనౌట్ 0; షట్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 14 **మొత్తం:** (20 ఓవర్లలో 8 వికెట్లకు) **151; వికెట్ల పతనం:** 1-17, 2-17, 3-79, 4-92, 5-101, 6-134, 7-145, 8-145; **బౌలింగ్:** రేణుక 4-0-24-2; శ్రేయాంక 4-0-32-1; పూజ 3-0-22-1; అరుంధతి 3-0-24-0; దీప్తి 4-0-28-2; రాధ 2-0-14-1

భారత్ ఇన్నింగ్స్: షెఫాలి (సి) సదర్లాండ్ (బి) ఆష్లీ 20; మంధాన ఎల్బీ (బి) మోలనూ 6; జెమీమా (సి) గార్డ్‌నర్ (బి) షట్ 16; హర్మన్‌ప్రీత్ నాటౌట్ 54; దీప్తి శర్మ (సి) వేర్‌హామ్ (బి) మోలనూ 29; రిచా రనౌట్ 1; పూజ (బి) సదర్లాండ్ 9; అరుంధతి రనౌట్ 0; శ్రేయాంక రనౌట్ 0; రాధా ఎల్బీ (బి) సదర్లాండ్ 0; రేణుక నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **142; వికెట్ల పతనం:** 1-26, 2-39, 3-47, 4-110, 5-111, 6-139, 7-139, 8-141, 9-141; **బౌలింగ్:** షట్ 4-0-25-1; ఆష్లీ 4-0-32-1; సదర్లాండ్ 4-0-22-2; మోలనూ 4-0-32-2; వేర్‌హామ్ 3-0-22-0; డార్సీ 1-0-8-0

సెమీస్ దిశగా ఇంగ్లాండ్

మహిళల టీ20 ప్రపంచకప్‌లో వరుసగా మూడో విజయంతో ఇంగ్లాండ్ సెమీస్ దిశగా సాగుతోంది. ఆదివారం గ్రూప్-బి మ్యాచ్‌లో ఆ జట్టు 10 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తుచేసింది. మొదట స్కాట్లాండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 109 పరుగులే చేసింది. కేథరిన్ బ్రైస్ (33; 28 బంతుల్లో 4×4) టాప్‌స్కోరర్. సోఫీ ఎకిల్‌స్టన్ (2/13) రెండు వికెట్లు పడగొట్టింది. స్వల్ప ఛేదనను ఇంగ్లాండ్ ఒక్క వికెట్ కోల్పోకుండా 10 ఓవర్లలోనే పూర్తిచేసింది. ఓపెనర్లు మయా బౌచియర్ (62 నాటౌట్; 34 బంతుల్లో 12×4), డానీ వ్యాట్ (51 నాటౌట్; 26 బంతుల్లో 7×4) అజేయ అర్ధశతకాలతో చెలరేగారు.

డబుల్స్‌లోనూ కంచు మోత

ఆసియా టీటీ

ఆస్తానా (కజకిస్థాన్): ఆసియా టేబుల్ టెన్నిస్‌లో చరిత్రాత్మక ప్రదర్శనను కొనసాగిస్తూ భారత క్రీడాకారులు మరో పతకాన్ని సొంతం చేసుకున్నారు. మహిళల డబుల్స్‌లో ఐహిక ముఖర్జీ, సుతీర్థ ముఖర్జీ జంట కంచు సొంతం చేసుకుంది. సెమీఫైనల్లో ఐహిక-సుతీర్థ ద్వయం 4-11, 9-11, 8-11తో మివా హరిమోటో-మియూ కిహారా (జపాన్) జోడీ చేతిలో ఓడింది. అంతకుముందు క్వార్టర్స్‌లో కిమ్ నెయింగ్-యున్‌హి (కొరియా)పై గెలిచిన భారత జంట కాంస్యం ఖరారు చేసింది. ఆసియా టేబుల్ టెన్నిస్ చరిత్రలో మహిళల డబుల్స్‌లో భారత్‌కు దక్కిన తొలి పతకమిదే. 1972లో ఈ టోర్నీ మొదలయ్యాక మహిళల డబుల్స్, టీమ్ విభాగాల్లో పతకాలు నెగ్గడం ఇదే తొలిసారి. పురుషుల టీమ్ విభాగంలోనూ భారత్ కాంస్యం గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో మానవ్ ఠక్కర్, మనుష్ షా ప్రిక్వార్టర్స్‌లో నిష్క్రమించారు. మానవ్ 4-11, 4-11, 8-11తో బాల్బవిన్ (కొరియా) చేతిలో ఓడగా.. మనుష్ 8-11, 5-11, 11-7, 11-6, 12-14తో లిన్ యున్ (చైనీస్ తైపీ)కి తలొంచాడు.

ఐఓఏకు నిధులు బంద్

చెల్లింపులు నిలిపివేసిన ఐఓసీ



దిల్లీ: భారత ఒలింపిక్ సంఘానికి అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నిధులు నిలిపివేసింది. ఐఓఏలో అంతర్గత కుమ్ములాటలకు తెరపడే సూచనలు కనిపించకపోవడంతో ఐఓసీ ఈ నిర్ణయం తీసుకుంది. భారత సంఘానికి అన్ని రకాల చెల్లింపులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. "ఐఓఏ ప్రస్తుత పరిస్థితిని మరోసారి సమీక్షించాం. సంఘంలో అంతర్గత వివాదాలు నడుస్తున్నాయి. పాలనపరమైన ఇబ్బందులున్నాయి. పాలకవర్గ సభ్యులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. దీంతో చాలా అనిశ్చితి నెలకొంది. స్పష్టత అవసరం. ఈ నేపథ్యంలో ఒలింపిక్ స్కాలర్‌షిప్స్ నుంచి అథ్లెట్లకు నేరుగా అందే చెల్లింపులు మినహా తదుపరి నోటీసు వరకు ఐఓసీ, ఒలింపిక్ సాలిడారిటీ.. ఐఓఏకు ఎలాంటి చెల్లింపులు చేయవు" అని ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉషకు రాసిన లేఖలో ఐఓసీ డైరెక్టర్ జేమ్స్ మెక్లాయిడ్ పేర్కొన్నాడు. ఒలింపిక్స్ గేమ్స్ ప్రసార హక్కుల ద్వారా వచ్చే ఆదాయం నుంచి జాతీయ ఒలింపిక్ సంఘాలకు ఒలింపిక్ సాలిడారిటీ నిధులు అందిస్తూ ఉంటుంది. ఈ నిధులను అథ్లెట్ల కోసం ఉపయోగించాలి. ఉష, ఐఓఏ పాలకవర్గ సభ్యుల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. అనేక అంశాలపై వాళ్ల మధ్య విభేదాలు ఉన్నాయి. స్పాన్సర్‌షిప్ ఒప్పందం సరిగా లేకపోవడంతో ఐఓఏకు రూ.24 కోట్ల నష్టం వచ్చిందని సంఘం కోశాధికారి సహదేవ్ యాదవ్ ఆరోపించగా.. ఆ ఆరోపణలను ఉష తోసిపుచ్చింది.

హైదరాబాద్ లక్ష్యం 296

ఈనాడు, హైదరాబాద్: గుజరాత్‌తో రంజీ ట్రోఫీ ఎలీట్ గ్రూప్-బి మ్యాచ్‌లో హైదరాబాద్ ముందు 296 పరుగుల లక్ష్యం నిలిచింది. అనికేత్‌రెడ్డి (5/36) విజృంభించడంతో గుజరాత్ రెండో ఇన్నింగ్స్‌లో 201 పరుగులకే ఆలౌటైంది. తనయ్ త్యాగరాజన్ (2/59) కూడా రాణించాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 222/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 248 పరుగులకు ఆలౌటైంది. హిమతేజ (66) సత్తా చాటాడు. తొలి ఇన్నింగ్స్‌లో గుజరాత్ 343 పరుగులు చేసింది.

లక్ష్యం 318.. ఆంధ్ర 79/1

విదర్భతో రంజీ ట్రోఫీ ఎలీట్ గ్రూప్-బి మ్యాచ్‌లో ఆంధ్ర ముందు 318 పరుగుల లక్ష్యం నిలిచింది. విజయ్ (4/98), లలిత్ మోహన్ (3/114), సత్యనారాయణ రాజు (2/50) విజృంభించడంతో విదర్భను రెండో ఇన్నింగ్స్‌లో 366 పరుగులకు కట్టడి చేసిన ఆంధ్ర.. విజయవకాశాలను సృష్టించుకుంది. ఛేదనలో మూడో రోజు ఆట చివరికి ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 79/1తో నిలిచింది. గెలవాలంటే ఆ జట్టు ఇంకా 239 పరుగులు చేయాలి. అభిషేక్ రెడ్డి (38 బ్యాటింగ్), షేక్ రషీద్ (18 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 192/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ అనూహ్యంగా కుప్పకూలింది. ఒక దశలో 303/5తో ఉన్న ఆ జట్టు.. 63 పరుగుల తేడాతో మిగిలిన అయిదు వికెట్లు కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 118.. ఆంధ్ర 167 పరుగులు చేశాయి.

బాబర్‌పై వేటు!



బాబర్

లాహోర్: పాకిస్థాన్ క్రికెట్లో సంచలనం! ఈ తరం అగ్రశ్రేణి బ్యాటర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్న బాబర్ అజామ్‌పై వేటు పడింది. ఇంగ్లాండ్‌తో తొలి టెస్టులో పాక్ ఇన్నింగ్స్ ఓటమి చవిచూసిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో బాబర్ 30, 5 పరుగులే చేశాడు. దీంతో ఇంగ్లాండ్‌తో మిగతా రెండు టెస్టుల కోసం ప్రకటించిన పాకిస్థాన్ జట్టులో ఈ మాజీ కెప్టెన్‌కు చోటు దక్కలేదు. బాబర్‌కు సెలక్టర్లు విశ్రాంతినిచ్చారని పీసీబీ చెబుతోంది.

మళ్లీ త్రివేణి కింగ్స్‌కే పట్టం

లండన్: డిఫెండింగ్ ఛాంపియన్ త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ గ్లోబల్ చెస్ లీగ్ (జీసీఎల్) టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఫైనల్లో అలాస్కన్ నైట్స్‌ను త్రివేణి ఓడించింది. మొదట తెల్లపావులతో ఆడిన 9-7తో గెలిచిన త్రివేణి.. ఆ తర్వాత తెల్లపావులతో 13-7తో నైట్స్‌ను ఓడించింది. ఫైనల్ తొలి మ్యాచ్‌లో త్రివేణి విజయంలో అలీరెజా, అలెగ్జాండ్రా కొస్తెన్యుక్ కీలక పాత్ర పోషించారు. అనిష్ గిరిపై అలీరెజా నెగ్గగా.. జోంగ్యిని కొస్త్యునెక్ ఓడించింది. వీ యి (త్రివేణి)పై నోదిర్‌బెక్ విజయం సాధించాడు. షఖ్రియార్ (నైట్స్)తో గేమ్‌ను తైముర్, నిహాల్ సరీన్‌తో గేమ్‌ను జవోఖిర్ డ్రాగా ముగించారు. రెండో గేమ్‌లో త్రివేణి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. నోదిర్‌బెక్ (నైట్స్)పై వీ యి, జోంగ్యి (నైట్స్)పై కొస్త్యునెక్, ఎలినాపై వాలెంటినా (త్రివేణి) నెగ్గారు. అలాస్కన్ తరఫున అనిష్ గిరి, షఖ్రియార్ నెగ్గారు. అలీ రెజాపై అనిష్, తైమూర్‌పై షఖ్రియార్ పైచేయి సాధించారు. నిహాల్ సరీన్ (నైట్స్), జవోఖిర్ మధ్య గేమ్ డ్రాగా ముగిసింది.

తొలి టీ20లో విండీస్ విజయం

దంబుల్లా: బ్రెండన్ కింగ్ (63) చెలరేగడంతో శ్రీలంకతో ఆదివారం జరిగిన తొలి టీ20లో వెస్టిండీస్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అసలంక (59), కమిందు మెండిస్ (51) మెరవడంతో మొదట లంక 7 వికెట్లకు 179 పరుగులు చేసింది. కింగ్‌తో పాటు ఎవిన్ లూయిస్ (50) చెలరేగడంతో లక్ష్యాన్ని వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో విండీస్ 1-0 ఆధిక్యం సంపాదించింది.

(c) eenadu

తుపాన్ల కాలం.. అప్రమత్తత అవసరం

- రాష్ట్రానికి పొంచి ఉన్న ముప్పు
- ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరి

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో తుపాను ముప్పు పొంచి ఉంది. సాధారణంగా అక్టోబరు, నవంబరు నెలల్లో రాష్ట్రానికి తుపాను ముప్పు ఎక్కువగా ఉంటుంది. ఏటా అక్టోబరులో నైరుతి రుతుపవనాలు తిరోగమించి, ఈశాన్య రుతుపవనాలు ప్రవేశిస్తాయి. ఈశాన్య రుతుపవనాల సమయంలో సముద్ర ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. ఈ సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడటానికి పరిస్థితులు అనుకూలిస్తాయి. అవి క్రమేపీ వాయుగుండాలు, తుపాన్లుగా మారతాయి. సోమవారం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. ఇది తీవ్ర వాయుగుండం, తర్వాత తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. గత పదేళ్లలో అక్టోబరు-డిసెంబరు మధ్యకాలంలో 11 తుపాన్లు ఏర్పడగా.. అందులో ఆరు రాష్ట్రంలోనే తీరం దాటాయి.

సెప్టెంబరులో మాదిరిగా వర్షాలు

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం నెలకొన్న ప్రాంతం నుంచి చెన్నై తీరం వరకు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. వీటి ప్రభావంతో ఒక్కసారిగా తీవ్రత పెరిగే ప్రమాదముంది. అరేబియా సముద్రంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది సోమవారం నాటికి వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ తెలిపింది. అక్కడి నుంచి బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం వరకు ద్రోణి కొనసాగుతోంది. సెప్టెంబరులో ఇదే మాదిరిగా బంగాళాఖాతంలో వాయుగుండం, అరేబియా సముద్రంపై కదులుతున్న తుపాను ప్రభావంతో రుతుపవన ద్రోణి ఏర్పడి విజయవాడలో కుంభవృష్టి కురిసింది. మరోసారి అలాంటి వర్షాలు కురిసే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు.

లోతట్టు ప్రాంతాలకు ముంపు ముప్పు

ఇటీవల కురిసిన వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండల్లా మారాయి. వాయుగుండం లేదా తుపాను ప్రభావంతో కొన్ని చోట్ల ఒక రోజులో కనీసం 15 నుంచి 20 సెం.మీ. వర్షం కురిసే అవకాశముంది. ఇటీవల విజయవాడలో నెలకొన్న పరిస్థితి పునరావృతం కాకుండా ముందు నుంచే అప్రమత్తం కావాలి. కాలువలు, వంకలు, వాగులు ఎక్కడెక్కడ బలహీనంగా ఉన్నాయో పరిశీలించి పటిష్ఠం చేయాలి. కోస్తాతీరంలో వరి పంట చేతికి రానున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదముంది. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– డా.కేవీ రమేష్, మాజీ డీజీ, భారత వాతావరణశాఖ

అక్టోబరు-డిసెంబరు మధ్యలో రాష్ట్రంపై ప్రభావం చూపిన కొన్ని తుపాన్లు

సంవత్సరం	తీరం దాటిన ప్రాంతం	ప్రభావితమైన జిల్లాలు
2014 అక్టోబరు (హుద్‌హుద్)	విశాఖపట్నం	విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం
2016 డిసెంబరు (వార్దా)	చెన్నై సమీపంలో	నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, కడప
2018 అక్టోబరు (తిత్లీ)	పలాస సమీపంలో	శ్రీకాకుళం, విజయనగరం
2018 డిసెంబరు (పెథాయ్)	కాకినాడ సమీపంలో	కృష్ణా, తూర్పు, పశ్చిమగోదావరి
2021 సెప్టెంబరు (గులాబ్)	కళింగపట్నం	విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం
2022 డిసెంబరు (మాండస్)	మహాబలిపురం సమీపంలో	చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్
2023 డిసెంబరు (మిచౌంగ్)	బాపట్ల	చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలు





వధువు కావలెను

Kamma Rich 29 5'10" MCH Surgical Oncology 30 5'11" MCH Surgical Oncology 31 6'1" MCH Neuro Surgeon ✆ 99481 29111 Jagadhatri (B).

Kamma Rich 28 6' IIT Mumbai MBA IIM AHM 1CR PA 30 6' IIT Kanpur MBA IIM Cal 1.5 CR 30 5'10" IIT KGP 80L PA ✆ 99481 29222 (B).

Kamma Rich 30 6'1" MS Harvord 350K$ 29 5'11" MS Stanford 300K$ 30 6' MS 280K$ 30 5'10" MS 260K$ ✆ 98488 97778 Jagadhatri (B).

Kamma US Doctors 29 5'11" MCH Surgical Oncology 30 6' MCH Neuro Surgeon 350K$ 34 6' MCH Surgical Oncology 500K$ ✆ 96666 58789 (B).

'పెళ్లిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

కమ్మ/29Y, 5'10" Fair B.Tech B.lore 32L P/A ★ 27Y 5'8" Fair MBA 12L P/A Hyd. వధువు కావలెను. ✆ 73863 38574, 80196 58575 (B).

ఆర్యవైశ్య, Age: 33, 5'10", ప్రాపర్టీ 1 Cr. Job: గవర్నమెంట్ టీచర్ తగిన వరుడుకి వధువు కావలెను. ✆ 9392729192, 9441824262 (A)



వరుడు కావలెను

బ్రాహ్మణ 23/5'4"/ డిగ్రీ ★ 33/5'2"/ ఇంటర్/ 2nd మ్యాచ్ ★ 45/5'4"/ Govt. జాబ్. వధువులకు వరులు కావలెను. కట్నం ఆశించని & పురోహితం OK ✆ 8341101996 (A)

Kamma US Doctors 30 5'6" MCH Surgical Oncology 400K$ 32 5'5" DM Neurology 450K$ 30 5'6" MD Radialogy 350K$ ✆ 96429 57888 (B).

Kamma Rich 29 5'7" MS OBG IVF 60L PA 30 5'6" MS OBG IVF 50L PA 30 5'5" MD Radialogy 40L PA 30 5'4" DM Nephrology ✆ 99481 29111 (B).


Kamma 27 5'6" MS Stanford 280K$ 27 5'7" MS Harvord 270K$ 28 5'4" MS 200K$ 29 5'5" MS 170K$ ✆ 99481 29222 Jagadhatri (B).

ఆస్తి, కులపట్టింపులేదు/ రెడ్డి/ 24Y/ 5'3"/ B.Tech. మంచి స్థిరాస్తి, పేరెంట్స్ లేని వధువుకు వరుడు కావలెను. మీ ఫోటో బయోడేటా వాట్సప్‌లో పంపించండి. ✆ 8142060040 (A)

★ ★ ★

కమ్మ డైవర్సీ 34 5'5" B.Tech V.Fair సాఫ్ట్‌వేర్ 20 లక్షలు P/A 15 కోట్ల ప్రోపర్టీ గల అందమైన రూపవతికి తగిన సాఫ్ట్‌వేర్ వరుడు కావలెను. డైరెక్టుగా సం॥ ✆ 63010 07808 (B).

కుమ్మరి 40 వయసు, 5'2" ఎత్తు BSc BEd Fair 2nd మ్యాచ్ ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ 40వేలు P/M అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Cont: ✆ 94904 32406 (B).



వివాహ వేదిక

కేవలం కమ్మ వారికి మాత్రమే. దేశ, విదేశ, డాక్టర్, సాఫ్ట్‌వేర్ & హై రిచ్, 1వ, 2వ, లేటు వధువు, వరుల కోసం సంప్ర: గడ్డిపాటి ప్రభాకరరావు, BE. వాట్సప్: 7893841849 (A)

ఫ్రీ రిజిస్ట్రేషన్ కేవలం NRI, PG, Doctors, Software Govt/ గెజిటెడ్/ VIP/ బిజినెస్ ఇండస్ట్రీ 1వ, 2వ లేట్, రిటైర్డ్, క్యాస్ట్ నో బార్. అన్ని కులాల వారికి. ✆ 8712384555 (A)

గమనిక

పెళ్లిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాలు లేదా రిజిస్ట్రేషన్ కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునేముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కేవలం యాదవ/ కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్, www.gokulmarriage.com Hyd: 9440831748, GNT/ VIZ: 9440759945, BGL: 8332926034. (A)

క్రిస్టియన్ పెళ్లిసంబంధాలకై సంప్ర॥ Verified ప్రొఫైల్స్ & నమ్మకమైన సంస్థ ★ Shyam ✆ 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd., (A)

కులపట్టింపులేని అన్నికులాల వారికి 1వ/ 2వ/ లేట్/ విడో/ విడోయర్స్/ పెన్షనర్స్, వ॥ 21-80 సం॥ త్వరగా సంబంధాలు చూడబడును. స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్. ✆ 9676916491 (A)

★ ★ ★

అన్ని కులాలకు నమ్మకమైన పెళ్లిసంబంధాలు కుదర్చబడును. ముఖ్యంగా పద్మశాలి, కాపు, బలిజ, యాదవ, మాదిగలకు మరియు 2nd మ్యాచ్ సంబంధాలు చూడబడును. ✆ 88972 79173 (B).



దేవరగట్టులో కర్రలతో తలపడుతున్న భక్తులు

దేవరగట్టులో సంప్రదాయబద్ధంగా కర్రల సమరం

హొళగుంద, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా హొళగుంద మండలంలో దసరా పండుగ సందర్భంగా 'దేవరగట్టు జైత్రయాత్ర'ను భక్తులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గట్టుపైనున్న మాళమల్లేశ్వరస్వామి కల్యాణం అనంతరం పరిసర గ్రామాల ప్రజలు కర్రలతో సమరం సాగించి ఉత్సవమూర్తులను దక్కించుకోవడం ఇక్కడ దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీ. శనివారం రాత్రి నెరణికి, కొత్తపేట, నెరణికి తండా గ్రామాల పెద్దలు దేవరగట్టులో బన్ని ఉత్సవ నిర్వహణకు ఉన్నతాధికారుల అనుమతి పొందారు. అర్ధరాత్రి 12:15కు ఈ మూడు గ్రామాల వారు గట్టుపైకి చేరుకుని స్వామి, అమ్మవారికి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను కొండపై నుంచి కింద నున్న సింహాసనం కట్టకు చేర్చి పూజలు చేశారు. తర్వాత స్వామివార్ల జైత్రయాత్ర ప్రారంభం కాగా, అరికెర, బిలేహాలు, సుళువాయి, ఎల్లార్తి, ముద్దనగేరి గ్రామాల భక్తులు కర్రలు చేతపట్టి వచ్చారు. వారిని దాటుకుని వెళ్లేందుకు నెరణికి, నెరణికి తండా, కొత్తపేటకు చెందినవారు కర్రలు, దివిటీలు తిప్పారు. ఈ క్రమంలో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఉత్సవమూర్తులకు పూజల అనంతరం చెరువుకట్ట, బసవన్నగుడి మీదుగా సింహాసనం కట్టకు చేర్చడంతో జైత్రయాత్ర ముగిసింది. కొంత మంది ఆకతాయిలు వేడుకలో కర్రలతో దాడులకు పాల్పడటం వల్ల పలువురు గాయపడ్డారు. ప్రథమ చికిత్స అందించి, కొందరిని బళ్లారి, కర్నూలు ఆసుపత్రులకు తరలించారు. ఉత్సవాలను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎస్పీ బిందుమాధవ్ అధికారులు పర్యవేక్షించారు.



దీక్షలో కోపూరి శ్రీలక్ష్మి, సభ్యులు

వైకాపా నాయకుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

గుంటూరులో మహిళల నిరాహార దీక్ష

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: గత ఐదేళ్ల పాలనలో అనేక అక్రమాలకు పాల్పడిన వైకాపా నాయకులపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరి శ్రీలక్ష్మి డిమాండ్ చేశారు. వైకాపా గూండాల అక్రమాలు అరికట్టి న్యాయం చేయాలని కోరుతూ ఆదర్శ మహిళా మండలి ఆధ్వర్యంలో గుంటూరు వికాస్‌నగర్‌లో ఆదివారం స్వీయ గృహనిర్బంధ నిరాహార దీక్ష చేపట్టారు. శ్రీలక్ష్మితోపాటు సభ్యులు దోమతోటి బుజ్జి, పల్లపు వెంకట పద్మావతి, గరిపాటి తులసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ గుంటూరు రూరల్ మండలం స్వర్ణభారతీనగర్, కృష్ణతులసినగర్, స్వర్ణాంధ్రనగర్, జన్మభూమి నగర్‌లలో వైకాపా గూండాలు పేదల నుంచి దౌర్జన్యంగా లాక్కొన్న ప్లాట్లు స్వాధీనం చేసుకుని బాధితులకు ఇప్పించాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని అన్నారు. వైకాపా గూండాల అక్రమాలపై సీఎంకు ఫిర్యాదు చేశామని మహిళా మండలి సభ్యులపై యాసిడ్ దాడులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, పోలీసు అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా దీక్ష చేపట్టామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేవరకు కొనసాగిస్తామని ఆమె పేర్కొన్నారు.





జస్టిస్ మల్లికార్జునరావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేదపండితుడు ★ ఆశీర్వచన మండపంలో జస్టిస్ శ్యామ్‌సుందర్ కుటుంబం

జగన్మాత సేవలో న్యాయమూర్తులు

విజయవాడ (ఇంద్రకీలాద్రి), న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు, ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్ సుందర్ వేర్వేరుగా శనివారం దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి వారు దర్శనానికి వచ్చారు.

నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు చర్యలు

- ప్రజలపై భారం పడకుండా చూడాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

ఈనాడు, అమరావతి: నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా సాధ్యమైనంత వరకూ ప్రజలపై భారం పడకుండా చూడాలని సూచించారు. డిమాండు-సరఫరా మధ్య వ్యత్యాసానికి గల కారణాలు విశ్లేషించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో శనివారం పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ మూడు శాఖలు సమన్వయం, నిరంతర పర్యవేక్షణ ద్వారా నిత్యావసర ధరల పెరుగుదలను ముందే అంచనా వేసి నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టే విషయంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం క్రియాశీలకంగా పనిచేయాలని, వ్యాపారులు కూడా సహకరించేలా చూడాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పామాయిల్, కూరగాయలు, పప్పుల ఉత్పత్తులు పెంచేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. నిత్యావసరాల ధరల విషయంలో ప్రజలకు వెంటనే ఉపశమనం కలిగేలా ప్రణాళికలు అమలుచేయాలని సూచించారు. ఆన్‌లైన్ విధానంలో సమావేశానికి హాజరైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ.. పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, కందిపప్పు, టమాటా, ఉల్లిపాయలు రైతుబజార్లలో చౌక ధరలకు విక్రయిస్తున్నట్లు వివరించారు. సమీక్షలో మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యక్షంగా పాల్గొనగా, అచ్చెన్నాయుడు ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారు.



పౌరసరఫరాలపై సమీక్ష సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ఏపీకి రూ.988 కోట్ల ఆర్థిక సంఘం నిధులు

ఈనాడు, దిల్లీ: పదిహేనో ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ ఏపీ గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.988.773 కోట్లు విడుదల చేసింది. ఇందులో అన్‌టైడ్ గ్రాంట్స్ కింద రూ.395.5091 కోట్లు, టైడ్‌గ్రాంట్స్ కింద రూ.593.2639 కోట్లు ఇచ్చింది. ఈ మొత్తం 9 జడ్పీలు, 615 మండల పంచాయతీలు, రూ.12,853 గ్రామపంచాయతీలకు దక్కుతాయి. అన్‌టైడ్ గ్రాంట్స్‌ను రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్‌లో పొందుపరిచిన 29 అంశాల ఆధారంగా స్థానిక అవసరాలు పరిష్కరించుకోవడానికి ఉపయోగించాల్సి ఉంటుంది. వ్యవసాయం, గ్రామీణగృహనిర్మాణం, విద్య, పారిశుద్ధ్యంవంటి పనుల కోసం ఈ నిధులు వెచ్చించవచ్చు. జీతాలు, పరిపాలన ఖర్చుల కోసం ఉపయోగించకూడదు. టైడ్‌గ్రాంట్స్‌ని పారిశుద్ధ్యం, ఓడీఎఫ్, నీటి యాజమాన్యం, వాననీటి సంరక్షణ, మురికినీటి రీసైక్లింగ్, ఇళ్ల నుంచి వెలువడిన వ్యర్థాల శుద్ధికి ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ నిధులు అత్యవసర సౌకర్యాలు, మౌలిక వసతులను కల్పించుకోవడానికి పంచాయతీలకు ఉపయోగపడతాయని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ తెలిపింది.

ఫోర్టో ఛైర్మన్‌గా కరణం హరికృష్ణ

ఈనాడు, అమరావతి: రిజిస్టర్డ్ టీచర్ల సంఘాల ఫోరం (ఫోర్టో) ఛైర్మన్, ప్రధాన కార్యదర్శులుగా కరణం హరికృష్ణ, అంకాల కొండయ్య ఎన్నికయ్యారు. వర్చువల్‌గా ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా బలివాడ ధనుంజయ్‌రావు, కోశాధికారిగా చల్లగుండ్ల శ్రీనివాసరావు, మీడియా కన్వీనర్‌గా బోనేల రమేష్, కోఛైర్మన్లుగా బృందబాన్ డొలై, సోమరౌతు శ్రీనివాసరావు, విజయలక్ష్మి, దుర్గారావు, షేక్ కరీముల్లాను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గం అనుసంధానకర్తలుగా ధనంజయ్‌రావు, బృందబాన్ డొలై, కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం అనుసంధానకర్తగా మాగంటి శ్రీనివాసరావు, ఉభయగోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ అనుసంధానకర్తగా గరికపాటి సురేష్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.



రేపటి గురించి దిగులు చెందొద్దు

భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు వస్తాయో అని నిత్యం ఆందోళన చెందడం, పిల్లల కోసమూ ఇప్పుడే సంపాదించి పెట్టాలన్న ఆలోచనలతో చాలా మంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. రేపటి గురించి దిగులు చెందకుండా, దైనందిన జీవితంలోని చిన్న చిన్న అనుభూతులను ఆస్వాదించినప్పుడే ఆనందంగా ఉండగలమని, అందుకోసం ఎక్కువ డబ్బు అవసరం లేదని తెలుసుకోండి. ప్రశాంతంగా, ఆనందకరంగా జీవించినప్పుడే మనం సంపూర్ణంగా జీవితాన్ని ఆస్వాదించినట్లు.

– ముత్తుకృష్ణన్, ఫైనాన్షియల్ ప్లానర్

త్వరలో వైకాపాకు రాజీనామా చేస్తా

- మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



మలికిపురం, న్యూస్‌టుడే: తాను ఇకపై వైకాపాలో ఉండబోనని.. త్వరలో ఆ పార్టీకి రాజీనామా చేస్తానని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు స్పష్టం చేశారు. మలికిపురం మండలం కత్తిమండలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తాను తెదేపాలో చేరతానని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోందని.. తాను ఏ పార్టీలో చేరతానన్నది తర్వాత విషయమని, ప్రస్తుతం వైకాపాలో మాత్రం ఉండబోనని తేల్చిచెప్పారు. కష్టపడి పనిచేసినా పార్టీ తనను నమ్మలేదని చెప్పారు. 'గడప గడప'కు వంటి కార్యక్రమాలను నూరుశాతం పూర్తిచేసినా.. తెదేపా నుంచి వచ్చిన వ్యక్తికి టికెట్ ఇచ్చి తనను అవమానించారని పేర్కొన్నారు. పార్టీ పెద్దల సూచన మేరకే ఎంపీ అభ్యర్థిగా పోటీలోకి దిగాల్సి వచ్చిందని తెలిపారు. రాజోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు కూడా గొల్లపల్లి సూర్యారావుకు అప్పగించారని గుర్తుచేశారు. అభిమానులు, కార్యకర్తల సలహాలు తీసుకుని ఏ పార్టీలో చేరాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. 2019లో జనసేన తరఫున బరిలోకి దిగి ఆ పార్టీకి రాష్ట్రంలోనే ఒకే ఒక్క ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆరు నెలలు తిరక్కుండానే అప్పటి అధికార వైకాపాకు మద్దతుగా కొనసాగారు. 2024 ఎన్నికల్లో వైకాపా ఆఖరి నిమిషంలో రాపాకకు కాకుండా తెదేపాను వీడిన గొల్లపల్లి సూర్యారావుకు టికెట్ ఇచ్చింది. విధిలేని పరిస్థితుల్లో రాపాక అమలాపురం ఎంపీ స్థానానికి పోటీచేసి ఓటమి చెందారు. అప్పటి నుంచి పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్నారు.

మానసిక చికిత్సలకు అమెరికా, భారత్‌ల సమన్వయం అవసరం

- అమెరికా సర్జన్ జనరల్ డాక్టర్ వివేక్ మూర్తి



ఈనాడు, బెంగళూరు: ప్రపంచ మానసిక ఆరోగ్య పరిరక్షణకు అమెరికా, భారత్‌ల సమన్వయం ఎంతో అవసరమని అమెరికాకు చెందిన ప్రముఖ సర్జన్ జనరల్ డాక్టర్ వివేక్ మూర్తి అభిప్రాయపడ్డారు. ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఆయన బెంగళూరులోని నిమ్హాన్స్, జయదేవ గుండె ఆరోగ్య విజ్ఞాన సంస్థలో కీలకోపన్యాసం ఇచ్చారు. 'ప్రపంచ మానసిక ఆరోగ్యం, యువతలో ఒంటరితనం' అనే అంశంపై ప్రసంగిస్తూ, 'మానసిక ఆరోగ్య సమస్య అమెరికా, భారత్‌లకే పరిమితం కాలేదు. ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన రుగ్మతల్లో ఇదొకటి. ఆరు దశాబ్దాలుగా ఇరు దేశాలు సమన్వయంతో వైద్య రంగంలో ఎన్నో కార్యక్రమాలు రూపొందించాయి. ఇటీవల మానసిక ఆరోగ్యం కూడా ఈ జాబితాలో చేరింది. పొంగు, పోలియో, హెచ్‌ఐవీ, క్షయ, కరోనా వంటి మహమ్మారులకు భారత్-అమెరికాలు సంయుక్తంగా పరిష్కారాలు సూచించాయి. అదే సమన్వయంతో మానసిక రుగ్మతలకు చికిత్సపై పని చేయాల'ని సూచించారు. కొవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా యువత, మధ్య వయస్కులు ఒంటరితనం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రతి ముగ్గురిలో ఒకరు సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారారని డాక్టర్ మూర్తి ఆందోళన వ్యక్తంచేశారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వాలు విధానాలు రూపొందించాలన్నారు. 'అమెరికాలో మానసిక జబ్బుల నివారణకు ప్రత్యేకంగా ఏజెన్సీలున్నాయి. భారత్‌లో స్వచ్ఛంద సంస్థలు మానసిక ఆరోగ్యంపై ఉత్తమ సేవలందిస్తున్నాయి. విద్య, వైద్య సంస్థలు ప్రభుత్వానికి సహకరించాలి. ఉమ్మడి కుటుంబాలు, ఒత్తిడి లేని విధులు, సరిపడా మానసిక ఆరోగ్య నిపుణులు, చికిత్స వ్యవస్థలుంటే ఇక్కడ కూడా సమస్య నియంత్రణలోకి వస్తుంద'ని డాక్టర్ వివేక్ వివరించారు.

దసపల్లా భూముల్లో ఏమి జరిగింది..?

- సమగ్ర నివేదిక కోరిన ప్రభుత్వం

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విశాఖ దసపల్లా భూముల వ్యవహారంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఆయా భూములకు సంబంధించి సమగ్రంగా నివేదిక రూపొందించి అందజేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరింది. దీంతో దసపల్లా భూములకు సంబంధించి గతంలో జరిగిన న్యాయ పోరాటం, 2014 నుంచి వచ్చిన కలెక్టర్లు ప్రభుత్వానికి రాసిన లేఖలు, ఆయా సందర్భాల్లో న్యాయనిపుణులు వ్యక్తపర్చిన అభిప్రాయాలను సేకరిస్తున్నారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత 22ఏ (నిషేధిత భూముల జాబితా)లో ఉన్న ఈ భూములకు మినహాయింపు ఇవ్వడానికి దారితీసిన పరిస్థితులు, అప్పట్లో జిల్లా అధికారులు వ్యవహరించిన తీరుతెన్నులు తదితర అంశాలపై యంత్రాంగం నివేదిక సిద్ధం చేస్తోంది. వైకాపా హయాంలో దసపల్లా భూములకు సంబంధించి అడ్డగోలుగా 'డెవలప్‌మెంట్' ఒప్పందం జరిగిందని అప్పట్లో తెదేపా నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ వ్యవహారం లోగుట్టును రట్టు చేస్తామని ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో జులైలో విశాఖ పర్యటనకు వచ్చిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోదియా దసపల్లా భూములను సందర్శించారు. దీనికి సంబంధించిన మ్యాప్‌లు, రాతకోతలు, ఇతరత్రా అంశాలపై కలెక్టర్, జేసీతో చర్చించారు.

కేఏఐడీబీ స్థలాన్ని వెనక్కిచ్చిన ఖర్గే ట్రస్టు

- కాంగ్రెస్ అధ్యక్షుడి తనయుల నిర్ణయం

ఈనాడు, బెంగళూరు: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు రాహుల్ ఖర్గే అధ్యక్షుడిగా ఉన్న సిద్ధార్థ విహార్ ట్రస్ట్‌కు కర్ణాటక పారిశ్రామిక అభివృద్ధి మండలి (కేఐఏడీబీ) కేటాయించిన స్థలాన్ని తిరిగి ఇచ్చారు. ఈ మండలికి వందల దరఖాస్తులు వచ్చినా మల్లికార్జున ఖర్గే కుటుంబానికి ఉన్న పలుకుబడితో ఎంతో విలువైన ఏరోస్పేస్, హైటెక్ డిఫెన్స్ పార్క్‌లో 5 ఎకరాల సివిల్ ఆమ్నెటీస్ (సీఏ) స్థలాన్ని ఈ ట్రస్టుకు కేటాయించినట్లు భాజపా ఆరోపించింది. గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌కూ ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు కేఏడీబీ నుంచి వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి గవర్నర్ ఆదేశించారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ కోసం మల్టీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను స్థాపించాలని ఈ స్థలాన్ని తీసుకున్నామని.. రాజకీయ వివాదంగా మారిన కారణంగా ఈ స్థలాన్ని తిరిగి కేఏఐడీబీకి ఇస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు రాహుల్ ఖర్గే ప్రకటించారు. ఈ స్థలం కోసం తాము చేసిన ప్రతిపాదనను రద్దు చేయాలని ఆయన ఓ లేఖ ద్వారా మండలికి మనవి చేశారు. 'సిద్ధార్థ విహార్ ట్రస్ట్ వ్యాపారం కోసం ఏర్పాటైన సంస్థ కాదు. ప్రజాసేవ కోసం స్థాపించాం. ఈ సంస్థ వ్యవస్థాపకులెవరికీ వీటి ఆస్తుల్లో వాటాలు లేవు. పైగా ఎస్సీ, ఎస్టీలకు కేఏడీబీ కేటాయించే స్థలాల్లో 50 శాతం రాయితీ ఉన్నా ఈ సంస్థ ఆ సదుపాయాన్ని పొందలేదు. మార్కెట్ ధరతోనే ఈ స్థలాన్ని కొనుగోలు చేసినా కేవలం రాజకీయం కోసమే విపక్షాలు విమర్శిస్తున్నాయి' అని ఖర్గే మరో కుమారుడు రాష్ట్ర మంత్రి ప్రియాంక్ ఖర్గే ఆరోపించారు. ఇప్పటికే మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) స్థలాల కేటాయింపులు వివాదంగా మారి రాష్ట్ర ముఖ్యమంత్రిపై కేసు నమోదు కాగా ఆయన కుటుంబ సభ్యులు ఈ స్థలాలను తిరిగి ఇచ్చిన విషయం తెలిసిందే. ఇదే సందర్భంగా ఖర్గే కుటుంబ సభ్యులూ తమకు కేటాయించిన స్థలాలను తిరిగి ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

బోయ, వాల్మీకి సోదరులకు ఇచ్చిన హామీని నెరవేర్చాం

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: యువగళం పాదయాత్రలో భాగంగా వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తామని బోయ, వాల్మీకిలకు తానిచ్చిన హామీని నిలబెట్టుకున్నట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ నెల 17న వాల్మీకి జయంతిని అన్ని జిల్లా కేంద్రాల్లో అధికారికంగా నిర్వహించాలని ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. 'యువగళంలో నేనిచ్చిన హామీని చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నెరవేర్చింది. తెదేపా బీసీలకు పుట్టినిల్లు. వారి ఆత్మగౌరవాన్ని పెంచే దిశగా మా ప్రభుత్వం అడుగులు వేస్తోంది' అని వివరించారు.

రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి

ఈనాడు, అమరావతి: మహర్షి వాల్మీకి జయంతిని కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ఈ నెల 17న అన్ని జిల్లాల్లో వేడుకలను అధికారికంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశిస్తూ బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాలో రాష్ట్రస్థాయి వేడుక నిర్వహించనున్నారు. ప్రభుత్వం తరఫున ఇక్కడ ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పాల్గొననున్నారు.

ఇసుక ఉచితంగా ఎక్కడైనా లభిస్తే చెప్పగలరా?

ముఖ్యమంత్రిని ఎక్స్‌లో ప్రశ్నించిన జగన్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎక్కడైనా ఉచితంగా ఇసుక లభిస్తోందా? లభిస్తే ఎక్కడో చెప్పగలరా? అని ముఖ్యమంత్రి చంద్రబాబును వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఎక్స్‌లో ఆదివారం ప్రశ్నించారు. 'మా ప్రభుత్వంలో రాష్ట్ర ఖజానాకు కనీసం డబ్బులైనా వచ్చేవి. ఇప్పుడు అదీ లేదు. ఇసుక కొందామంటేనే మా ప్రభుత్వంలో కన్నా ధర రెండింతలు ఉంది. ఉచితంగా ఇసుక ఇస్తామని ఎన్నికల్లో ఊరూరా డప్పు వేసిన విషయాన్ని మరిచిపోయారా? ఇది ప్రజలను మోసం చేయడం కాదా? అధికార దుర్వినియోగంతో ఇసుక చుట్టూ ఒక మాఫియాను మీరు ఏర్పాటు చేయలేదా? భరించలేని రేట్లతో ప్రజలు నానా కష్టాలు పడుతున్నారా.. లేదా?' అని జగన్ ప్రశ్నించారు.

రాష్ట్ర పన్నుల ముఖ్య కమిషనర్‌గా బాబు.ఎ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పన్నుల ముఖ్య కమిషనర్‌గా బాబు.ఎ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఉద్యాన, ఆక్వా, మత్స్య శాఖల కార్యదర్శిగా ఉన్న ఆయన్ను శనివారం బదిలీ చేసింది. సహకార సంఘాల రిజిస్ట్రార్, సహకార కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

(c) eenadu



ఆలయం ఎదుట జస్టిస్ దుప్పల వెంకటరమణ. చిత్రంలో ప్రొటోకాల్ అధికారులు

శ్రీవారిని దర్శించుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ ఆదివారం దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీవారి నైవేద్య విరామ సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి మూలమూర్తి దర్శనం చేయించారు.

చంద్రయాన్-4తో విద్యార్థినులు రూపొందించిన ఉపగ్రహం

శ్రీహరికోట, న్యూస్‌టుడే: ఇస్రో త్వరలో నిర్వహించనున్న చంద్రయాన్-4 ప్రాజెక్టులో ప్రపంచవ్యాప్తంగా వేల మంది విద్యార్థినులు భాగస్వామ్యం కానున్నారు. చెన్నైకు చెందిన 'స్పేస్ కిడ్జ్ ఇండియా' అనే సంస్థ వారితో ఉపగ్రహాన్ని రూపొందించి, అంతరిక్షంలోకి పంపేందుకు సన్నాహాలు చేస్తోంది. కార్యక్రమానికి సంబంధించిన అధికార పోస్టర్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము త్వరలో ఆవిష్కరించనున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ కేసన్ ఆదివారం వెల్లడించారు. 'స్పేస్ కిడ్జ్ ఇండియా 'శక్తిశాట్ మిషన్' కింద 108 దేశాలకు చెందిన 12 వేల మంది విద్యార్థినులకు (14-18 ఏళ్లు) అంతరిక్ష సాంకేతికత, పేలోడ్ అభివృద్ధి, వ్యోమనౌక వ్యవస్థల గురించి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తాం. ప్రతి దేశం నుంచి 108 మందిని ఎంపిక చేసి వారు రూపొందించే ఉపగ్రహాన్ని చంద్రయాన్-4లో భాగం చేస్తాం' అని కేసన్ వెల్లడించారు.



రతన్ టాటా జీవితం నేర్పేది అదే..

రతన్ టాటా కొన్ని రూ.లక్షల కోట్ల విలువైన టాటా గ్రూప్‌ను ముందుండి నడిపించారు. కానీ ఆయన పేరు ఎప్పుడూ కుబేరుల జాబితాలో కనిపించలేదు. ఎందుకంటే ఆయన సంపాదనలో అత్యధిక భాగం దాతృత్వ కార్యక్రమాలకే వెచ్చించారు. రతన్ టాటా వ్యక్తిగత ఆదాయం వంద కోట్ల డాలర్ల కన్నా తక్కువే. కానీ ఆయన వంద కోట్ల భారతీయుల ప్రేమను, గౌరవాన్ని పొందారు. అసలైన సంపద అంటే మనం దాచుకొనేది కాదు, ఇతరులకు పంచేదని ఆయన జీవితం చాటిచెబుతుంది.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

నేడే మద్యం దుకాణాల కేటాయింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మద్యం దుకాణాల లైసెన్సుల జారీ కోసం సోమవారం లాటరీ తీయనున్నారు. 26 జిల్లాల పరిధిలో ఉదయం 8 గంటల నుంచే కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ప్రారంభిస్తారు. జిల్లా గెజిట్‌లో ప్రచురించిన దుకాణాల క్రమసంఖ్య ప్రకారం లాటరీ తీస్తారు. ఉదాహరణకు.. ఎన్టీఆర్ జిల్లాలో 113 దుకాణాలను నోటిఫై చేశారు. అందులో తొలుత ఒకటో నంబరు దుకాణానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో చూసి అన్ని నంబర్లను డబ్బాలో వేసి... వాటిలో నుంచి ఒకటి తీస్తారు. అందులో వచ్చిన నంబరు దరఖాస్తుదారుకు లైసెన్సు కేటాయిస్తారు. ఈ ప్రక్రియంతా దరఖాస్తుదారుల సమక్షంలోనే జరుగుతుంది. తర్వాత వరుస క్రమంలో అన్ని దుకాణాలకు లాటరీ తీస్తారు. అన్ని జిల్లాల్లో ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. రాష్ట్రంలో అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 40, అత్యధికంగా తిరుపతి జిల్లాలో 227 దుకాణాల్ని నోటిఫై చేశారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయ్యేసరికి మొత్తం 3,396 మద్యం దుకాణాలకు రాష్ట్రవ్యాప్తంగా 89,882 దరఖాస్తులు వచ్చాయి. నాన్ రిఫండబుల్ రుసుముల రూపంలో ప్రభుత్వానికి రూ.1,797.64 కోట్ల మేర ఆదాయం సమకూరింది. లక్ష వరకూ దరఖాస్తులు వస్తాయని, రూ.2వేల కోట్ల ఆదాయం వస్తుందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేశారు. తిరుపతి, శ్రీసత్యసాయి, బాపట్ల, అన్నమయ్య, ప్రకాశం, పల్నాడు వంటి జిల్లాల్లో దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. ఆయా జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాల్లో ముఖ్యనేతలు దరఖాస్తులు వేయనివ్వకుండా అడ్డుకోవటం, కొన్నిచోట్ల మద్యం వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడడంతో ఈ పరిస్థితి తలెత్తింది. తాడిపత్రి, కమలాపురం వంటి నియోజకవర్గాల్లో ఒక్కో దుకాణానికి రెండు, మూడేసి దరఖాస్తులే వచ్చాయి.

ఎన్టీఆర్ జిల్లాలో అత్యధిక పోటీ..

రాష్ట్రంలో సగటున ఒక్కో మద్యం దుకాణానికి 26 దరఖాస్తులు దాఖలయ్యాయి. అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లాలో సగటున ఒక్కో దుకాణానికి 51-52 దరఖాస్తులు పడ్డాయి. సగటున ఒక్కో దుకాణానికి ఏలూరు జిల్లాలో 38, తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల్లో 35, విజయనగరం జిల్లాలో 34, పశ్చిమ గోదావరిలో 32, కర్నూలు, డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 30 దరఖాస్తులు వచ్చాయి.

- సగటున ఒక్కో దుకాణానికి తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాలో 17 చొప్పున, బాపట్ల జిల్లాలో 18, అన్నమయ్య జిల్లాలో 19, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో 20, నంద్యాల, నెల్లూరు, కాకినాడ, చిత్తూరు జిల్లాల్లో 21 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఈ జిల్లాల్లో తక్కువ దరఖాస్తులు పడ్డాయి.

213 దుకాణాలకు 10 కంటే తక్కువ దరఖాస్తులు

రాష్ట్రంలో ఒక్క దరఖాస్తు రాని దుకాణాలు ఒక్కటీ లేవు. మూడేసి దరఖాస్తులు వచ్చినవి, 12, నాలుగేసి దరఖాస్తులు వచ్చినవి 5, ఐదేసి దరఖాస్తులు వచ్చినవి 12 దుకాణాలున్నాయి. 213 దుకాణాలకు పది, అంతకంటే తక్కువగా దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎక్కువ శాతం అనంతపురం, తిరుపతి, శ్రీసత్యసాయి, అన్నమయ్య, వైఎస్సార్, నంద్యాల జిల్లాల్లోనే ఉన్నాయి.

506 దుకాణాలకు 40 కంటే ఎక్కువ దరఖాస్తులు

రాష్ట్రంలో 4 దుకాణాలకు 100 కంటే ఎక్కువగా దరఖాస్తులు అందాయి. వీటిలో మూడు ఎన్టీఆర్ జిల్లాలోనివే. 2 దుకాణాలకు 90-99 మధ్య, 6 దుకాణాలకు 80-89, 17 దుకాణాలకు 70-79, 32 దుకాణాలకు 60-69, 124 దుకాణాలకు 50-59, 321 దుకాణాలకు 40-49 మధ్య దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 506 దుకాణాలకు 40 కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి.

ఏ జిల్లాలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయో వివరాలు..

జిల్లా	దుకాణాలు	దరఖాస్తులు	సగటున ఒక్కో దుకాణానికి
1. శ్రీకాకుళం	158	4,671	29.56
2. విజయనగరం	153	5,241	34.25
3. పార్వతీపురం మన్యం	52	1,393	26.78
4. అల్లూరి సీతారామరాజు	40	1,205	30.12
5. విశాఖపట్నం	155	4,139	26.70
6. అనకాపల్లి	136	3,291	24.19
7. కాకినాడ	155	3,332	21.49
8. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	133	4,087	30.72
9. తూర్పుగోదావరి	125	4,384	35.07
10. పశ్చిమగోదావరి	175	5,628	32.16
11. ఏలూరు	144	5,499	38.18
12. కృష్ణా	123	2,942	23.91
13. ఎన్టీఆర్	113	5,825	51.54
14. గుంటూరు	127	4,448	35.02
15. బాపట్ల	117	2,149	18.36
16. పల్నాడు	129	2,639	20.45
17. ప్రకాశం	171	3,466	20.26
18. నెల్లూరు	182	3,890	21.37
19. కర్నూలు	99	3,046	30.76
20. నంద్యాల	105	2,221	21.15
21. అనంతపురం	136	3,265	24.00
22. శ్రీసత్యసాయి	87	1,518	17.44
23. వైఎస్సార్	139	3,257	23.43
24. అన్నమయ్య	111	2,160	19.45
25. చిత్తూరు	104	2,266	21.78
26. తిరుపతి	227	3,920	17.26
మొత్తం	3,396	89,882	26.46

రఘురామకృష్ణరాజు కేసు... దర్యాప్తు అధికారిగా ప్రకాశం ఎస్పీ

- విజయపాల్ అరకొర సమాధానాలతో అసంతృప్తి

ఈనాడు, అమరావతి: మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజు కేసులో విచారణాధికారిగా(ఐవో) ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఐవోగా ఉన్న గుంటూరు జిల్లా పరిపాలనా విభాగం (అడ్మిన్) ఏఎస్పీ రమణమూర్తిని ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఈ కేసుకు సంబంధించిన దస్త్రాలను వెంటనే ప్రకాశం జిల్లా ఎస్పీకి అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశించగా వాటిని స్వాధీనపరచాలని పూర్వపు దర్యాప్తు అధికారి రమణమూర్తికి సూచించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో తనపై పోలీసు కస్టడీలో ఉండగానే హత్యాయత్నం జరిగిందని కూటమి ప్రభుత్వం వచ్చాక మాజీ నరసాపురం ఎంపీ, ప్రస్తుత ఉండి తెదేపా ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు జులై 11న గుంటూరు నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో తనపై హత్యాయత్నం జరగడానికి అప్పటి ముఖ్యమంత్రి జగన్ సహా నాటి సీఐడీ, నిఘా విభాగాధిపతులు పీవీ సునీల్‌కుమార్, పీఎస్సార్ ఆంజనేయులు, దర్యాప్తు అధికారి ఆర్.విజయపాల్ బాధ్యులని వారిని నిందితులుగా చేర్చి వారిపై హత్యాయత్నం కేసులు పెట్టి విచారణ జరపాలని తన ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి ఇప్పటికే విచారణ ప్రారంభించారు. ఈ కేసులో నాలుగో నిందితుడు, నాడు రఘురామపై కేసు నమోదు చేసిన దర్యాప్తు అధికారి విజయపాల్ తనను అరెస్టు చేయకుండా సుప్రీంకోర్టుకు వెళ్లి ముందస్తు రక్షణ పొందారు. కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 11న ఆయన గుంటూరు వెస్ట్ డీఎస్పీ కార్యాలయంలో జరిగిన విచారణకు హాజరయ్యారు. విచారణలో పోలీసులు అడిగిన పలు ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలివ్వలేదని, విచారణకు సహకరించలేదనే అభిప్రాయం వ్యక్తమైంది.

విజయపాల్ నోరు విప్పకుంటే దర్యాప్తు కష్టమే


నాడు రఘురామకృష్ణరాజు కస్టడీలో ఉండగా ఆయనను ఎలా కొట్టారు? కస్టడీలో చిత్రహింసలకు గురిచేస్తుంటే దర్యాప్తు అధికారిగా ఎందుకు స్పందించలేదు? ఇంతకీ ఆయన్ని కొట్టింది పోలీసులా? బయట వ్యక్తులా అన్న ఈ కీలకమైన సమాచారాన్ని విజయపాల్ చెబితే తప్ప తెలియదు. ఆయన నోరుమెదిపితే ఆనాటి పోలీసు ఉన్నతాధికారుల పాత్ర బయటపడుతుందని చెప్పి అసలు కొన్నాళ్ల పాటు విజయపాల్‌ను కనిపించకుండా అజ్ఞాతంలో గడిపేలా కొందరు పోలీసు ఉన్నతాధికారులే తెర వెనుక ఉండి సలహాలిచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.

భయపడుతున్నారా?: ఇటీవల విజయపాల్‌ను విచారించినప్పుడు గట్టిగా ప్రశ్నించలేకపోయారని.. అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానిలివ్వకపోయినా అధికారులు నోరుమెదపలేదని తెలిసింది. విచారణాధికారులు మౌనం వహించడానికి విజయపాల్ వెనుక కొందరు పోలీసు ఉన్నతాధికారులు ఉన్నారని, ఎప్పుడైనా భవిష్యత్తులో లక్ష్యంగా చేసుకుంటారేమోనన్న భయం వారిని వెంటాడుతోందని సమాచారం.

వరద బాధితులకు చిరంజీవి, రాంచరణ్ రూ.కోటి విరాళం

ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కుల అందజేత

ఈనాడు, అమరావతి: వరద బాధితుల సహాయార్థం సినీ నటులు చిరంజీవి, రాంచరణ్ రూ.కోటి విరాళం అందజేశారు. హైదరాబాద్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబును శనివారం కలిసిన చిరంజీవి ఆయన తరపున రూ.50 లక్షలు, కుమారుడు రాంచరణ్ తరపున రూ.50 లక్షల విరాళం చెక్కుల్ని సీఎంకు అందించారు. ఈ సందర్భంగా చిరంజీవిని చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు. భేటీ అనంతరం కారు వరకు వెళ్లి వీడ్కోలు పలికారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో చిరంజీవి ఎప్పుడూ ముందుంటారని చంద్రబాబు కొనియాడారు. ఈ మొత్తం బాధితుల పునరావాసానికి ఉపయోగపడుతుందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.



చంద్రబాబును కలిసి చెక్కులు అందిస్తున్న చిరంజీవి

సీఎంపై తప్పుడు పోస్ట్ పెట్టిన వ్యక్తిపై కేసు

తిరుమల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఎక్స్‌లో తప్పుడు పోస్ట్ పెట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించిన వీడియోను 'బ్లైండ్‌మ్యాన్' అకౌంట్ నిర్వాహకుడు చైతన్య ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ.. 'దేవుడికి ఇష్టం లేదని స్పష్టంగా కనిపిస్తోంది.. మళ్లీ చెబుతున్నా.. ప్రాణగండం ఉంది' అని క్యాప్షన్ పెట్టాడు. శ్రీవారి పవిత్ర కార్యక్రమంపై తప్పుడు పోస్ట్ పెట్టడంతో తితిదే చర్యలు చేపట్టింది. తితిదే ప్రతిష్ఠకు భంగం కలిగించడంతోపాటు భక్తుల మనోభావాలు దెబ్బతీశారంటూ చైతన్యపై తిరుమల వన్‌టౌన్ పోలీసులకు తితిదే విజిలెన్స్ వింగ్ ఏవీఎస్‌వో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అతనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కందిరీగల దాడిలో చిన్నారి మృతి



గౌరి మృతదేహంతో విలపిస్తున్న కుటుంబసభ్యులు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం జామిగుడ పంచాయతీ వై.కంతవరంలో ఆదివారం కందిరీగలు దాడి చేయడంతో నాలుగేళ్ల చిన్నారి వంతాల గౌరి మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు అందించిన వివరాల ప్రకారం.. వై.కంతవరంలో నివాసం ఉంటున్న బొజ్జయ్య, టికోలకు గౌరీ, విశ్వ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా.. గౌరీ, విశ్వ ఆడుకునేందుకు గ్రామ సమీపంలోని కొండపైకి వెళ్లారు. అక్కడ కందిరీగలు దాడిచేసి వారిద్దరిని తీవ్రంగా గాయపర్చాయి. పిల్లల కేకలు విని కొండపైకి వెళ్లిన, వారి బంధువు రాజేష్ కూడా కందిరీగల దాడిలో గాయపడ్డారు. దీనిపై తల్లిదండ్రులు, గ్రామస్థులు రూఢకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంబులెన్సు డ్రైవర్‌కు సమాచారమిచ్చారు. అంబులెన్సులో ఇంధనం లేదని, పాడేరు వెళ్లి నింపుకొని రావాలని చెప్పడంతో, గ్రామస్థులు ప్రైవేటు ఆటోలో రూఢకోట పీహెచ్‌సీకి తరలించారు. గౌరి పరిస్థితి విషమంగా ఉండటంతో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఆటోలో ఆ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలిక మృతి చెందింది.



EENADU Vol: 51, Iss: 64 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

(c) eenadu

హరియాణాలో ప్రభుత్వ ఏర్పాటు 17న

చండీగఢ్: హరియాణాలో విజయం సాధించిన భాజపా ఈ నెల 17న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. 15నే సర్కారు కొలువుదీరవచ్చని తొలుత వార్తలు వెలువడినా తాజాగా ముహూర్తం మారింది. ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ సీనియర్ నేతలు, భాజపా పాలిత రాష్ట్రాలకు చెందిన కొందరు సీఎంలు దీనికి హాజరుకానున్నారు. సీఎంగా నాయబ్ సింగ్‌సైనీకే అవకాశాలున్నాయని ఇప్పటికే సంకేతాలు వెలువడిన విషయం తెలిసిందే. భాజపా శాసనసభాపక్ష నేత ఎన్నిక కోసం పరిశీలకులుగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌లను నియమిస్తూ పార్టీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా జమ్మూకశ్మీర్‌లో శాసనసభాపక్ష నేత ఎన్నికకు పరిశీలకులుగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ వ్యవహరిస్తారు.

నేను భాజపాతోనే: రావ్ ఇంద్రజీత్

తొమ్మిదిమంది ఎమ్మెల్యేలతో కలిసి తాను తిరుగుబాటు అభ్యర్థిగా ఉన్నానని కొన్ని ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని కేంద్ర మంత్రి రావ్ ఇంద్రజీత్ సింగ్ స్పష్టంచేశారు. తాను, సహచర ఎమ్మెల్యేలు భాజపాతోనే ఉంటామని తేల్చిచెప్పారు. ఇటీవలి ఎన్నికల్లో సింగ్ కుమార్తె ఆర్తీ సింగ్ కూడా నెగ్గారు. అహీర్వాల్ ప్రాంతంలో నెగ్గినవారిలో ఎక్కువమంది ఇంద్రజీత్‌కు సన్నిహితులు. సీఎం కావాలని తాను భావించకపోయినా ప్రజలు మాత్రం కోరుకుంటున్నారని ఇటీవల విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు.

కాంగ్రెస్ ప్రేమ దుకాణాల్లో ద్వేషం అమ్మకాలు

- ఖర్గే విమర్శలపై భాజపా ప్రతివిమర్శ

దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలపై భాజపా ఆదివారం ఘాటుగా స్పందించింది. కాంగ్రెస్ తన 'ప్రేమ దుకాణాల్లో ద్వేషాన్ని విక్రయిస్తోం'దని విమర్శించింది. జాతీయవాదులను ఉగ్రవాదులుగాను, జాతివ్యతిరేకులను జాతీయవాదులుగాను ముద్ర వేస్తూ ధ్రువపత్రాలను అందించే 'బహుళజాతి పంపిణీ కేంద్రం'గా కాంగ్రెస్ తయారవుతోందని భాజపా సీనియర్ నేత ముఖ్తార్ అబ్బాస్ నక్వీ ఆరోపించారు. కాంగ్రెస్‌ను అర్బన్ కాంగ్రెస్ ముఠా నడిపిస్తోందంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే శనివారం మాట్లాడుతూ. .భాజపా ఉగ్రవాదుల పార్టీ అని పేర్కొన్నారు. అలాగే ప్రజలను వేధించే పార్టీ కమళ దళం అని ఎస్సీ, ఎస్టీలపై అకృత్యాలకు పాల్పడేదని అభివర్ణించారు.

సిద్ధాంతపరంగా దివాలా తీసిన ఖర్గే

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగులుతున్న వరుస వైఫల్యాలతో ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సిద్ధాంతపరంగా దివాలా తీశారని భాజపా అధ్యక్షుడు జె.పి.నడ్డా మంగళవారం విమర్శించారు. పాలకపక్షాన్ని ఉగ్రవాదులుగా అభివర్ణించడానికి తమ 'విఫల ఉత్పత్తి'(రాహుల్ ఉద్దేశించి)ని కాపాడుకోవాలనే కాంగ్రెస్ ఉద్దేశమే కారణమని ఆక్షేపించారు.

గోవుల షెడ్‌లో పడుకుంటే క్యాన్సర్ నయం: యూపీ మంత్రి

పీలీభీత్: గోవుల షెడ్‌లో పడుకోవడంతోపాటు దానికి క్లీన్ చేస్తే క్యాన్సర్ నయమవుతుందని ఉత్తర్‌ప్రదేశ్ మంత్రి సంజయ్ గంగ్వార్ వ్యాఖ్యానించారు. గోవు వెనుక భాగంలో సుతిమెత్తగా చరచడంవల్ల బీపీ తగ్గుతుందని పేర్కొన్నారు. ఆదివారం గోశాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'మీకు బీపీ ఉంటే ఉదయం సాయంత్రం ఆవులను వెనుకవైపున మెల్లగా చరచడంవల్ల అది తగ్గుతుంది. 20 ఎంజీ మెడిసిన్ తీసుకునేవారు 10 రోజుల్లో 10ఎంజీకి తగ్గించుకోవచ్చు. ఆవు పిడకలను మండించడంవల్ల దోమల నుంచి రక్షణ పొందవచ్చు. ఆవు నుంచి వచ్చేవన్నీ ఉపయోగకరమే' అని మంత్రి వ్యాఖ్యానించారు.

ఒమర్‌కు సాయం చేసేందుకు సిద్ధం: కేజ్రీవాల్

ఇంటర్నెట్ డెస్క్: జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎన్సీ- కాంగ్రెస్ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఒమర్ అబ్దుల్లా నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం అధికారాలు పరిమితంగా ఉండే దిల్లీని తాను పదేళ్లు పాలించానని.. ఈ క్రమంలోనే జమ్మూ కశ్మీర్ పాలన విషయంలో ఏమైనా సమస్యలు వస్తే తనను సంప్రదించాలని ఒమర్‌కు సూచించారు. 'జమ్మూ కశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా మరికొద్ది రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రభుత్వాన్ని నడపటంలో సంపూర్ణ మద్దతు అందిస్తాం. ఆయన నాయకత్వంలో జమ్మూ కశ్మీర్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ఆశిస్తున్నాం. ముఖ్యమంత్రికి పరిమిత అధికారాలు ఉన్న కారణంగా దిల్లీని 'హాఫ్ స్టేట్' అని పిలుస్తారు. ఇప్పుడు జమ్మూ కశ్మీర్‌నూ ఇలాగే మార్చేశారు. ఎన్నికైన ప్రభుత్వాని కంటే లెఫ్టినెంట్ గవర్నర్‌కే అధికారాలు ఎక్కువ. ఈ నేపథ్యంలో పాలనాపరంగా ఏదైనా సమస్య ఎదురైతే నన్ను సంప్రదించండి. దిల్లీ సీఎంగా పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపా' అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో దోడా స్థానం నుంచి విజయం సాధించిన ఆప్ ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్‌కు ఓటు వేసినందుకు ప్రజలకు కేజ్రీవాల్ ధన్యవాదాలు చెప్పారు.



✦ ధార్మిక లీలా కమిటీ ఆధ్వర్యంలో దిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించిన దసరా ఉత్సవాల్లో విల్లు ఎక్కుపెడుతున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ
✦ దిల్లీలోని ఎర్రకోట మైదానంలో ధార్మిక లీలా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన దసరా వేడుకల్లో బాణం సంధిస్తున్న కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ

యుద్ధ పరిస్థితుల అదుపులో హారిస్ కంటే ట్రంపే మెరుగు

- ఒపీనియన్ పోల్‌లో వెల్లడి



వాషింగ్టన్: నవంబరు నెలలో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య ఉత్కంఠ పోటీ నెలకొంది. సర్వేల్లో ఇద్దరికీ వచ్చే ఓట్లలో పెద్దగా తేడా ఉండడం లేదు. దాంతో అధ్యక్ష పీఠంపై కూర్చునేదెవరో అంచనావేయలేని పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ స్వల్ప ఆధిక్యాన్ని ప్రదర్శించారు. ఇజ్రాయెల్-హమాస్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలను డీల్ చేయడంలో డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ కంటే ఆయనే మెరుగని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒపీనియన్ పోల్‌లో వెల్లడైంది. ఏడు రాష్ట్రాల్లో ఒక్కోచోట 600 మంది నమోదిత ఓటర్లు ఇందులో పాల్గొన్నారు. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబరు 8 మధ్యలో దీనిని నిర్వహించారు. ఆరిజోనా, మిషిగన్, జార్జియాలో కమల హారిస్ ముందంజలో ఉండగా.. నెవెడా, పెన్సిల్వేనియాలో ట్రంప్ ఆధిక్యం ప్రదర్శించారు. నార్త్ కరొలైనా, విస్కాన్సిన్ రాష్ట్రాల్లో ఇద్దరి మధ్య పోటాపోటీ నెలకొంది. ఈ యుద్ధాల వేళ ట్రంప్ దేశాన్ని మెరుగ్గా నడిపిస్తారని సర్వేలో అభిప్రాయం వ్యక్తమైంది. ఆర్థిక వ్యవస్థ, వలసదారుల సమస్యను ట్రంప్ బాగా డీల్ చేయగలరని, హౌసింగ్, ఆరోగ్య సంరక్షణ అంశాల విషయంలో హారిస్ మెరుగైన నిర్ణయాలు తీసుకుంటారని వెల్లడైంది. అమెరికాలో ఓటర్లు చాలామంది తాము ఏ పార్టీకి మద్దతి స్తామో ముందే వెల్లడిస్తారు. రిపబ్లికన్లుగా, డెమోక్రాట్లుగా గుర్తింపు పొందుతారు కూడా! తద్వారా ఏయే రాష్ట్రాల్లో రిపబ్లికన్లకు, డెమోక్రాట్లకు మద్దతు ఉందనేది దాదాపుగా తెలిసిపోతుంది (అలానే ఓటు వేయాలన్న నియమం ఏమీ లేదు). అయితే కొన్ని రాష్ట్రాల్లో ప్రజలు మాత్రం పార్టీల సిద్ధాంతాలకు కట్టుబడకుండా తటస్థంగా ఉంటారు. ఏ పార్టీకీ గుడ్డిగా మొగ్గు చూపరు. ఇవే ఎన్నికల్లో కీలకంగా పరిణమించి... ఫలితాలను మార్చేస్తుంటాయి. వీటినే స్వింగ్ రాష్ట్రాలుగా పరిగణిస్తారు. పైన పేర్కొన్న ఏడు రాష్ట్రాలు అవే. ఈసారి స్వింగ్ రాష్ట్రాల్లో ట్రంప్, హారిస్ మధ్య పోరు పోటాపోటీగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

కమలా హారిస్ ఆరోగ్యం భేష్

- అధ్యక్ష పదవికి ఆమె ఫిట్
- వ్యక్తిగత వైద్యుడు సిమన్స్ ప్రకటన



వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షురాలు, డెమోక్రటిక్ పార్టీ తరఫున అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన కమలా హారిస్ ఆరోగ్యం భేష్ అని, అధ్యక్షురాలిగా విధులు నిర్వర్తించేందుకు ఫిట్‌గా ఉన్నారని ఆమె వ్యక్తిగత వైద్యుడు జాషువా సిమన్స్ వెల్లడించారు. హారిస్ దేశాధ్యక్షురాలిగా పనిచేసేందుకు శారీరకంగా, మానసికంగా దృఢంగా (ఫిట్‌గా) ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు హారిస్ వైద్య చరిత్ర, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితికి సంబంధించి రెండు పేజీల లేఖను శనివారం విడుదల చేశారు. మూడున్నరేళ్లుగా తాను హారిస్‌కు వ్యక్తిగత వైద్యుడిగా కొనసాగుతున్నట్లు యూఎస్ ఆర్మీ కర్నల్, ఫిజీషియన్ అయిన డాక్టర్ సిమన్స్ తెలిపారు. 59 ఏళ్ల కమలా హారిస్ ఆరోగ్యంగా, చురుకైన జీవన శైలిని కొనసాగిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. తన విధులను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఫిట్‌నెస్ ఆమె కలిగి ఉన్నారన్నారు. ఉపాధ్యక్షురాలికి అలర్జీ సమస్య ఉందని, దీని కోసం ఆమె అలర్జీ ఇమ్యునో థెరపీ చేయించుకుంటున్నట్లు వెల్లడించారు. కొన్నేళ్లుగా ట్రంప్ తన ఆరోగ్యానికి సంబంధించి పరిమితంగానే సమాచారం విడుదల చేస్తూ వస్తున్నారు. జులైలో తనపై హత్యాయత్నం జరిగినప్పుడు చెవికి బుల్లెట్ గాయమైన తర్వాత కూడా చాలా తక్కువ సమాచారమే ఇచ్చారు. ఈ నేపథ్యంలో తన వైద్యుడు విడుదల చేసిన లేఖను హారిస్ ప్రచార అస్త్రంగా ఉపయోగించుకొని తన ప్రత్యర్థి ట్రంప్‌ను మరింత ఇరకాటంలోకి నెట్టే అవకాశం ఉంది.



రాజస్థాన్‌లోని జైపుర్‌లో ఆదివారం మంటల్లో చిక్కుకున్న కారు రహదారిపై అలాగే ముందుకు వస్తుండటంతో వాహనదారులు భయంతో పరుగులు తీశారు

యుద్ధఖైదీల హత్య

- రష్యాపై ఉక్రెయిన్ ఆరోపణ
- అంతర్జాతీయ సమాజం స్పందించాలని విజ్ఞప్తి

కీవ్: రష్యా.. తనవద్ద బందీలుగా ఉన్న యుద్ధ ఖైదీలను హతమారుస్తోందని, దీనిపై అంతర్జాతీయ సమాజం స్పందించాలని ఉక్రెయిన్ విజ్ఞప్తి చేసింది. రష్యాలోని కర్స్క్ ప్రాంతంలో వారిని చంపేసిందని ఆదివారం ఆరోపించింది. బందీలుగా లొంగిపోయిన 9 మంది డ్రోన్ ఆపరేటర్లు, కాంట్రాక్టర్లను ఈ నెల 10వ తేదీన రష్యా హతమార్చిందని పేర్కొంది. ఇది రష్యా యుద్ధ నేరమేనని, దీనిపై ఐరాసకు, రెడ్‌క్రాస్‌కు ఫిర్యాదు చేశామని వివరించింది. దొనెట్స్క్ ప్రాంతంలో ఈ నెల మొదట్లో 16 మందిని ఇలాగే రష్యా హతమార్చిందని తెలిపింది.

✦ రష్యా ఆదివారం రాత్రి నుంచి 68 డ్రోన్లను ఉక్రెయిన్‌పై ప్రయోగించింది. వాటిలో 31 డ్రోన్లను తమ వైమానిక రక్షణ వ్యవస్థ అడ్డుకుందని ఉక్రెయిన్ ప్రకటించింది. ఈ డ్రోన్లను రష్యా.. కీవ్, పొల్టావా, ఛెర్నీవ్, సుమి, చెర్కాసీలపై ప్రయోగించిందని వెల్లడించింది. ఒడెసా, పొల్టావాలపై బాలిస్టిక్ క్షిపణులను, ఛెర్నీవ్, సుమిలపై గైడెడ్ క్షిపణులను రష్యా ప్రయోగించిందని వివరించింది.

✦ మూడు ప్రాంతాలపై ఉక్రెయిన్ ప్రయోగించిన 13 డ్రోన్లను కూల్చివేశామని రష్యా ప్రకటించింది.

వారంలో 900 గైడెడ్ బాంబులు

వారం రోజుల్లో 900 గైడెడ్ ఏరియల్ బాంబులను, 40 క్షిపణులను, 400 డ్రోన్లను రష్యా ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆదివారం వెల్లడించారు. ఈ నేపథ్యంలో గగనతల రక్షణ వ్యవస్థలను అందించాలని మిత్ర దేశాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. రష్యాపై ప్రయోగించేందుకు దీర్ఘ శ్రేణి క్షిపణులపైనా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

సీఎంతో తప్ప.. జానీలతో నేను మాట్లాడను

- కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్

తిరువనంతపురం: కేరళలో గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, పాలకపక్షమైన సీపీఎం నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నేత ఎం.వి.గోవిందన్ రెండు రోజుల కిందట ఆరిఫ్‌ను 'కేర్‌టేకర్ గవర్నర్' అన్నారు. తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన గవర్నర్ ఈ వ్యాఖ్యలపై స్పందించారు. "నేను ముఖ్యమంత్రి విజయన్‌తో నేరుగా మాట్లాడతా. ఈ జానీలతో నాకు పని లేదు'' అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న జాతి వ్యతిరేక నేరాల గురించి తనకు సీఎం ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని గత శుక్రవారం ఆక్షేపించిన ఆరిఫ్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు సమన్లు పంపారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రపతికి ఫిర్యాదు కూడా చేస్తానన్నారు. కేరళ రాష్ట్రానికి వ్యతిరేకంగా ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ దుష్ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధ్వజమెత్తారు. గవర్నర్ చర్యలను "ఉత్తుత్తి గర్జనలు"గా గోవిందన్ అభివర్ణించారు. గవర్నర్‌కు, సీపీఎం నేతలకు మధ్య సాగుతున్న ఈ సంవాదాన్ని కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ "డ్రామా"గా విమర్శించింది. అధికార పార్టీకి ఇబ్బంది ఎదురైనపుడు ఆ ఇద్దరూ మళ్లీ ఒకటైపోతారని ఎద్దేవా చేసింది.



పంజాబ్‌లోని పటియాలా జిల్లా ధబ్లాన్ రైల్వే స్టేషన్‌లో కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదివారం రైలు పట్టాలపై ఆందోళన చేస్తున్న భారతీయ కిసాన్ యూనియన్ ఏక్తా సభ్యులు

జూడాల దీక్షలకు ప్రజామద్దతు

కోల్‌కతా: జూడాల నిరవధిక నిరాహార దీక్షలకు బెంగాల్ ప్రజల నుంచి అపూర్వ మద్దతు లభిస్తోంది. వైద్యులకు మద్దతుగా పలుచోట్ల దీక్షా శిబిరాలు వెలిశాయి. దీక్షల శిబిరాల్లో ఆరోగ్యం క్షీణించిన కారణంగా కోల్‌కతా, సిలిగుడీలకు చెందిన ముగ్గురు జూడాలను ఆసుపత్రులకు తరలించారు. ఆర్‌జీ కర్ వైద్య కళాశాల మాజీ విద్యార్థులు సైతం జూడాలకు మద్దతుగా దీక్షలకు కూర్చునేందుకు ముందుకు రాగా, కోర్టు ఆదేశాలతో విధుల్లో ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది వారిని అడ్డుకొన్నారు. మరోవైపు.. ఆర్‌జీ కర్ ఆస్పత్రి సహా పలు ప్రభుత్వ ఆస్పత్రులకు చెందిన దాదాపు 200 మందికి పైగా సీనియర్ వైద్యులు దీక్షలకు సంఘీభావంగా ఇప్పటికే మూకుమ్మడి రాజీనామాలు చేయగా.. తాజాగా మరో 77 మంది సీనియర్ వైద్యులు రాజీనామాలకు సిద్ధమంటూ రాష్ట్ర ఆరోగ్య వర్సిటీ రిజిస్ట్రార్‌కు ఈ-మెయిల్ పంపారు. జూడాలకు సంఘీభావంగా 200 మంది సీనియర్ వైద్యులు చేసిన మూకుమ్మడి రాజీనామాలు చెల్లవని పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ప్రకటించింది. సర్వీసు నిబంధనలకు అనుగుణంగా వ్యక్తిగతంగా వైద్యులు రాజీనామాలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది.



కోల్‌కతాలోని ఓ దీక్షా శిబిరం వద్దకు చేరుకుని జూడాలకు సంఘీభావం తెలుపుతున్న ప్రజలు

✦ అక్టోబరు 15న దుర్గాపూజ ఊరేగింపులు ఉన్నందున, జూడాల దీక్షకు మద్దతుగా అదేరోజున నిర్వహిస్తామని ప్రకటించిన 'నిరసన కార్నివాల్'ను విరమించుకోవాలని పశ్చిమబెంగాల్ చీఫ్ సెక్రటరీ (సీఎస్) మనోజ్‌పంత్ ఈ-మెయిల్ ద్వారా వైద్యులను కోరారు. సోమవారం మధ్యాహ్నం చర్చలకు రావాల్సిందిగా జూనియర్ డాక్టర్లను కోరుతూ సీఎస్ మరో మెయిల్ చేశారు.



అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం గ్రోవ్ సిటీలో హరికేన్ కారణంగా ధ్వంసమైన భవనాలు

9/11 తరహా భారీ దాడికి హమాస్ కుట్ర!

జెరూసలెం: గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై చేసిన దాడితో గాజా యుద్ధం ప్రారంభమైంది. ఆ దాడిలో హమాస్ 1200 మందిని హతమార్చింది. 250 మందిని అపహరించింది. అయితే అంతకంటే పెద్ద మారణహోమాన్నే హమాస్ రచించిందా..? అమెరికాపై జరిగిన 9/11 తరహా దాడికి కుట్ర పన్నిందా..? ఇజ్రాయెల్‌లోని బహుళ అంతస్తుల భవనాలను లక్ష్యంగా చేసుకుందా..? అవుననే అంటోంది ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్). ఈ కుట్రకు సంబంధించిన రికార్డులను ఖాన్ యూనిస్‌లోని హమాస్ కమాండ్ సెంటర్ నుంచి ఐడీఎఫ్ స్వాధీనం చేసుకుంది. ఈ పత్రాల్లో టెల్ అవీవ్‌లోని 70 అంతస్తుల భవనం 'మోషె అవివ్', అజ్రాయిల్ టవర్‌లను నేలమట్టం చేసేందుకు హమాస్ కుట్ర పన్నిందనడానికి ఆధారాలు లభ్యమయ్యాయి. దీనిపై 'వాషింగ్టన్ పోస్ట్' కథనం ప్రచురించింది. ఈ కథనంలో హమాస్ రాజకీయ, సైనిక విభాగాలు రెండేళ్లుగా వరుసగా జరిపిన సమావేశాలకు సంబంధించిన సమాచారంతో పాటు.. ఇరాన్ అధికారులతో హమాస్ అగ్రనేత యాహ్యా సిన్వార్ జరిపిన సంభాషణలూ ఉన్నాయి. శనివారం 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక పది సమావేశాలకు సంబంధించిన మినిట్స్‌ను ప్రచురించింది. సిన్వార్‌తోపాటుతో పాటు అతడి సోదరుడు, మహమ్మద్ డెయిఫ్, మార్వన్ ఇస్సా ఈ సమావేశాలకు హాజరైనట్లు తెలిపింది. ఈ దాడులకు రైళ్లను, బోట్లు, గుర్రపు బగ్గీలను వినియోగించాలని హమాస్ నిర్ణయించినట్లు పేర్కొంది. 2021లో అలీ ఖమేనీ సహా ఇరాన్ కీలక నాయకులను సిన్వార్ కలిసినట్లు ఈ పత్రాల్లో ఉన్నాయి. ఈ సందర్భంగా ఆర్థిక మద్దతుతోపాటు.. సైనిక సాయం కూడా సిన్వార్ కోరినట్లు సమాచారం. హమాస్ వద్ద ఇజ్రాయెల్‌లోని కీలక ప్రదేశాలకు చెందిన భారీ డేటాబేస్ ఉన్నట్లు బయటపడింది. దీనిలో సుమారు 17,000 ఫొటోలున్నాయి. వీటిని డ్రోన్లు, శాటిలైట్లు తీసినట్లు తెలుస్తోంది. వీటిలో కొన్నింటిని సామాజిక మాధ్యమాల నుంచి సేకరించినట్లు సమాచారం.



దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లాకు చెందిన ఓ భూగర్భ బంకర్‌ను ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) కనిపెట్టింది. ఇది భూమిలోపల ఏడు మీటర్ల వరకు ఉంది. ఇందుకు సంబంధించిన ఒక వీడియోను ఐడీఎఫ్ విడుదల చేసింది. బంకర్‌లో ఉన్న ఓ హెజ్‌బొల్లా మిలిటెంట్‌ను ఐడీఎఫ్ అదుపులోకి తీసుకుంది.

ఇది భారత ప్రజాస్వామ్యానికే మచ్చ

- తన మద్దతుదారుల అరెస్టుపై వాంగ్‌చుక్

దిల్లీ: రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లోకి లద్దాఖ్‌ను చేర్చాలని డిమాండ్ చేస్తున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అనుచరులను ఆదివారం దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వాంగ్‌చుక్‌ను అరెస్టు చేశామని తొలుత ప్రకటించిన పోలీసులు.. తర్వాత తాము నిర్బంధించిన వారిలో ఆయన లేరని వివరణ ఇచ్చారు. అరెస్టులను వాంగ్‌చుక్ ఖండించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో మౌనంగా ఆందోళన చేసే హక్కు కూడా లేదా.. అని 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఇది భారత ప్రజాస్వామ్యానికి మచ్చ అని పేర్కొన్నారు. గత నెల 30న దిల్లీకి వచ్చిన వాంగ్‌చుక్, ఆయన అనుచరులను సింగు సరిహద్దు దగ్గర పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 2న విడుదల చేశారు. వీరు ప్రధాని సహా ప్రముఖ నేతలను కలవాలని డిమాండ్ చేస్తున్నారు. లద్దాఖ్‌కు రాష్ట్రహోదాతో పాటు.. ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమీషన్ కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో 33వ కోర్ ప్రధాన కార్యాలయంలో ఆయుధ పూజలో పాల్గొన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

పండగ వేళ దుర్గమ్మే ఇంటికి వచ్చింది

- చెత్తకుండీలో దొరికిన బిడ్డను దత్తత తీసుకున్న ఎస్సై

లఖ్‌నవూ: ఆడపిల్ల పుడితే ఇంట్లో మహాలక్ష్మి పుట్టిందని సంబరపడతారు. ఆది పరాశక్తిగా పూజిస్తారు. కానీ భూమ్మీద అడుగుపెట్టిన ఆ పసికందుకు చెత్తకుప్పే దిక్కైంది. తల్లి దగ్గర హాయిగా నిద్రించాల్సిన ఆ బిడ్డ.. వ్యర్థాల మధ్య గుక్కపట్టి ఏడుస్తోంది. చిన్నారి ఏడుపులను విన్న స్థానికుల సమాచారంతో పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని చిన్నారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ హృదయ విదారక ఘటన ఉత్తరప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో చోటుచేసుకుంది. కాగా ఈ ఘటనలో వెలుగు చూసిన మరో మానవీయ కోణం చూపరుల మనసులను కరిగించింది. పోలీసుల సంరక్షణలో ఉన్న చిన్నారి కుటుంబీకుల ఆచూకీ కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ వారి వివరాలు తెలియరాలేదు. దీంతో చిన్నారి పరిస్థితిని చూసి.. చలించిన సబ్‌ఇన్‌స్పెక్టర్ పుష్పేంద్ర సింగ్ దంపతులు దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చారు. సింగ్ మాట్లాడుతూ.. 2018లో తమకు వివాహం అయినా ఇప్పటికీ పిల్లలు లేరని.. విజయ దశమి నాడు స్వయంగా దుర్గమ్మే ఈ చిన్నారి రూపంలో తమ ఇంటికి వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారి దత్తత కోసం ఎస్సై, అతడి భార్య రాశి చట్టపరమైన ప్రక్రియను ప్రారంభించారని ఇన్‌స్పెక్టర్ అంకిత్ చౌహాన్ వెల్లడించారు. ప్రస్తుతం శిశువు దంపతుల సంరక్షణలో ఉందని తెలిపారు.

ప్రభుత్వ చేతలకు.. భాగవత్ మాటలకు పొంతనేదీ?: సిబల్

దిల్లీ: కేంద్రంలో భాజపా నేతృత్వంలోని సర్కారు పనులకు, ఆరెస్సెస్ అధిపతి మోహన్ భాగవత్ తాజా వ్యాఖ్యలకు ఏమాత్రం పొంతన కనిపించట్లేదని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ విమర్శించారు. నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యాక ప్రపంచంలో భారతదేశ గౌరవం.. విశ్వసనీయత పెరిగినా కొన్ని కుట్రలు-కుతంత్రాలు మాత్రం దేశ సంకల్పాన్ని పరీక్షిస్తున్నాయని భాగవత్ శనివారం ఆరెస్సెస్ సమ్మేళనంలో చేసిన వ్యాఖ్యల్ని ఆదివారం ఆయన ఖండించారు. దైవం పేరిట, ఆధ్యాత్మిక గురువుల పేరిట దేశాన్ని విభజించడం తగదని భాగవత్ చక్కని ప్రకటన చేశారని చెప్పారు. ప్రభుత్వానికి ఆరెస్సెస్ దన్ను ఉన్నా, సర్కారు చర్యలు మాత్రం భాగవత్ వ్యాఖ్యలకు సరిపోలడం లేదని విమర్శించారు. 2014 తర్వాత సమాజంలో అనేక చీలికలు వచ్చాయని, మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని బుల్డోజర్లను రంగంలో దించారని ఆరోపించారు. వివాదాస్పద ప్రకటనలు వెలువడినప్పుడు వాటిపై సంఘ్ ఎందుకు ప్రశ్నించదని నిలదీశారు. మహారాష్ట్ర, అస్సాంలలో కొన్ని ఘటనల్ని ఆయన ప్రస్తావించారు.

భారత్‌ను ముప్పుగా చూపేందుకు బంగ్లాదేశ్‌లో కుట్ర: భాగవత్

భారత్‌ను ముప్పుగా చూపించేందుకు బంగ్లాదేశ్‌లో కుట్రలు జరుగుతున్నాయని మోహన్ భాగవత్ తన ప్రసంగంలో ఆరోపించారు. 'హిందువులను శత్రువులుగా చూసే పరిస్థితి తీసుకువస్తున్నారు. బంగ్లాదేశ్‌లో నిరంకుశ ఛాందసవాదం రాజ్యమేలుతోంది. అక్కడి హిందువులతో సహా మైనారిటీల తలలపై కత్తి వేలాడుతోంది' అని అన్నారు.

(c) eenadu

స్వల్ప కాలంలో స్థిరీకరణకు అవకాశం!



సమీక్ష: గత వారం సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. అమెరికా కేంద్ర బ్యాంక్ వడ్డీరేట్లు తగ్గించినా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాత్రం తాజా సమీక్షలో కీలక రేట్లను సవరించలేదు. అయితే విధానాన్ని తటస్థ వైఖరికి మార్చడంతో, సమీప భవిష్యత్తులో రేట్లు తగ్గించే వీలుందనే సంకేతాలిచ్చింది. ఫలితంగా మార్కెట్ సెంటిమెంటు మెరుగైంది. ఎఫ్‌ఐఐలు దూకుడుగా విక్రయాలకు దిగడంతో, సూచీల రికవరీ జరగలేదు. డీఐఐల కొనుగోళ్లతో మార్కెట్లకు మద్దతు లభించింది. దేశీయంగా చూస్తే.. డిసెంబరు సమీక్షలో రేట్ల కోతకు ఆర్‌బీఐ సంకేతాలివ్వడం, 2024-25లో జీడీపీ వృద్ధిని 7.2%, రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4.5 శాతంగా అంచనా వేయడం కలిసొచ్చాయి. కార్పొరేట్ వార్తల నేపథ్యంలో షేరు/రంగం ఆధారిత కదలికలు సూచీలను నడిపించాయి. పశ్చిమాసియా భౌగోళిక-రాజకీయ పరిణామాలతో బ్యారెల్ ముడిచమురు ధర 1.3% పెరిగి 79 డాలర్లకు చేరింది. ఒకవేళ ఉద్రిక్తతలు పెరిగితే, చమురు ధరలు మరింత భగ్గుమనే అవకాశం ఉంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 84.10కు బలహీనపడింది. అంతర్జాతీయంగా చూస్తే.. ఆర్థిక గణాంకాలు స్థిరంగా ఉంటే, భవిష్యత్తులో మరిన్ని రేట్ల కోతలుంటాయని అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్ సంకేతాలిచ్చారు. అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 2.4 శాతానికి తగ్గింది. అమెరికా నిరుద్యోగ క్లెయిమ్‌లు ఊహించని విధంగా పెరిగాయి. బ్యాంక్ ఆఫ్ కొరియా 0.25% కోత ప్రకటించి, వడ్డీరేటును 3.25% చేసింది. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 0.4% నష్టంతో 81,381 పాయింట్ల వద్ద, నిఫ్టీ 0.2% కోల్పోయి 24,964 పాయింట్ల వద్ద ముగిశాయి. రంగాల వారీ సూచీల్లో లోహ, ఎఫ్‌ఎంసీజీ, చమురు-గ్యాస్ షేర్లు నష్టపోగా.. వాహన, ఆరోగ్య సంరక్షణ, భారీ యంత్ర పరికరాల షేర్లు లాభపడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్‌ఐఐలు) నికరంగా రూ.27,675 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా, డీఐఐలు రూ.31,364 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు. ఈ నెలలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) నికరంగా రూ.58,711 కోట్లు వెనక్కి తీసుకున్నారు.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 9:8గా నమోదు కావడం..

ఎంపిక చేసిన షేర్లలో కొనుగోళ్లను సూచిస్తోంది..

ఈ వారంపై అంచనా: గత వారం సెన్సెక్స్ స్వల్పంగా స్థిరీకరణకు గురైంది. 80,895 పాయింట్ల దిగువకు చేరితే 78,900; 78,300 పాయింట్లకు దిద్దుబాటు కావొచ్చు. సానుకూలంగా కదలాడితే 82,200; 83,400 వరకు పెరగొచ్చు. స్వల్ప కాలంలో మార్కెట్‌లో స్థిరీకరణకు అవకాశం ఉంది.

ప్రభావిత అంశాలు: రాబోయే రోజుల్లో అంతర్జాతీయ అంశాలు మన మార్కెట్లకు దిశానిర్దేశం చేయొచ్చు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల, మార్కెట్లలో ఒడుదొడుకులు కొనసాగే అవకాశం ఉంది. ముడిచమురు ధరలు మరింత పెరిగితే ఈక్విటీ మదుపర్ల సెంటిమెంట్ బలహీనపడనుంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువను గమనించాలి. ఎఫ్‌ఐఐలు విక్రయాలు కొనసాగి, ముడి చమురు ధరలు పెరిగితే రూపాయి బలహీనపడొచ్చు. ఈ వారం హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, కోటక్ బ్యాంక్, టాటా కన్జ్యూమర్, టెక్ మహీంద్రా, బజాజ్ ఆటో, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, పీవీఆర్ ఐనాక్స్, క్రిసిల్, ఎంఫసిస్, సియెట్, హావెల్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, టాటా కెమికల్స్, ఐసీఐసీఐ జనరల్ ఇన్సూరెన్స్, ఒబెరాయ్ రియాల్టీ, దాల్మియా భారత్, ఎంసీఎక్స్ ఫలితాలు వెల్లడిస్తాయి. సెప్టెంబరు రిటైల్ - టోకు ద్రవ్యోల్బణం, ఎగుమతులు-దిగుమతుల గణాంకాలపై కన్నేయొచ్చు. అంతర్జాతీయంగా.. ఈసీబీ వడ్డీ రేట్ల సమావేశం, ప్రెసిడెంట్ వ్యాఖ్యలు కీలకం కానున్నాయి. అమెరికా సెప్టెంబరు రిటైల్ విక్రయాలు, జపాన్ సెప్టెంబరు ద్రవ్యోల్బణం, చైనా మూడో త్రైమాసిక జీడీపీ గణాంకాలు, పారిశ్రామికోత్పత్తి, సెప్టెంబరు రిటైల్ విక్రయాలు రానున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలు, ఎఫ్‌ఐఐ పెట్టుబడులు, చమురు ధరల నుంచి సంకేతాలు తీసుకోవచ్చు.

తక్షణ మద్దతు స్థాయులు: 80,726, 80,000, 78,496

తక్షణ నిరోధ స్థాయులు: 82,320, 83,400, 84,100

స్వల్పకాలంలో సెన్సెక్స్ స్థిరీకరణకు అవకాశం ఉంది.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

విప్రో బోనస్ షేర్లపై 17న నిర్ణయం

దిల్లీ: దేశీయ సాంకేతిక దిగ్గజ సంస్థ విప్రో లిమిటెడ్, బోనస్ షేర్లు జారీ చేయనుంది. రెండో త్రైమాసిక ఫలితాలను చర్చించి, ఆమోదించడంతో పాటు బోనస్ షేర్ల జారీ ప్రతిపాదనపైనా బోర్డు డైరెక్టర్లు ఈనెల 17న జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఆదివారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఈ విషయమై కంపెనీ సమాచారం ఇచ్చింది.

అల్యూమినియం పెరగొచ్చు!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి అక్టోబరు కాంట్రాక్టు ఈవారం రూ.75,541 కంటే కిందకు దిగితే దిద్దుబాటుకు అవకాశం ఉంది. రూ.75,271; రూ.74,217; రూ.73,678 వద్ద మద్దతు లభించొచ్చు. ఒకవేళ పైకి వెళితే రూ76,864; రూ.77,403; రూ.78,457 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు.

వెండి



వెండి డిసెంబరు కాంట్రాక్టు రూ.88,866 కంటే దిగువన చలిస్తే కొంత బలహీనతకు అవకాశం ఉంటుంది. రూ.86,002; రూ.83,783 వద్ద మద్దతు లభించొచ్చు. అదేవిధంగా రూ.93,949 కంటే పైన చలిస్తే రూ.96,168; రూ.99,032 స్థాయికి చేరొచ్చు.

ప్రాథమిక లోహాలు



✦ రాగి అక్టోబరు కాంట్రాక్టుకు రూ.820.75 వద్ద మద్దతు ఉంది. ఈ స్థాయి దిగువకు చలిస్తే రూ.790.35 వరకు పడిపోవచ్చు. సానుకూలంగా కదలాడితే రూ.861.35 వద్ద నిరోధం ఎదురు కావొచ్చు. దీన్ని అధిగమిస్తే 882.65; రూ.902.25కు చేరే అవకాశం ఉంది. రూ.852.65 పైన షార్ట్ సెల్లింగ్‌కు దూరంగా ఉండటం మంచి వ్యూహం అవుతుంది.

✦ సీసం అక్టోబరు కాంట్రాక్టుకు రూ.184.40 దిగువన లాంగ్ పొజిషన్ల జోలికి వెళ్లకపోవడం మంచిది.

✦ జింక్ అక్టోబరు కాంట్రాక్టుకు రూ.278.85 వద్ద మద్దతు ఉంది. దీని కిందకు దిగితే రూ.269.15; రూ.264.05కు చేరొచ్చు. సానుకూలంగా కదలాడితే రూ.293.55 వద్ద నిరోధం ఎదురు కావొచ్చు. ఈ స్థాయిని దాటితే రూ.298.65; రూ.308.35కు వెళ్లే అవకాశం ఉంది.

✦ అల్యూమినియం అక్టోబరు కాంట్రాక్టుకు రూ.243.75 ఎగువన షార్ట్ సెల్ పొజిషన్లకు దూరంగా ఉండాలి. రూ.246.45 స్థాయిని అధిగమిస్తే రూ.251.25; రూ.259.45 స్థాయికి పెరగొచ్చు.

ఇంధన రంగం



✦ ముడి చమురు అక్టోబరు కాంట్రాక్టు రూ.6,571 కంటే దిగువన చలిస్తే రూ.6,774; రూ.7,054కు చేరొచ్చు. ఒకవేళ రూ.6,088 కంటే కిందకు వెళితే రూ.5,808; రూ.5,605 వరకు వెళ్లొచ్చు.

✦ సహజవాయువు అక్టోబరు కాంట్రాక్టుకు రూ.214.45 వద్ద మద్దతు ఉంది. ఒకవేళ దీని కంటే కిందకు దిగితే రూ.205.85; రూ.193.55 వరకు పడిపోవచ్చు. సానుకూల ధోరణిలో కదలాడితే రూ.235.35; రూ.247.65; రూ.256.25 స్థాయికి చేరొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



✦ పసుపు అక్టోబరు కాంట్రాక్టు రూ.14,000 కంటే పైన కదలాడకుంటే మరింతగా దిద్దుబాటు కావచ్చు.

✦ పత్తి క్యాండీ అక్టోబరు కాంట్రాక్టుకు రూ.56,513 వద్ద మద్దతు ఉంది. ఈ స్థాయిని కోల్పోతే రూ.56,026కు పడిపోవచ్చు. సానుకూలంగా కదలాడితే రూ.57,473; రూ.57,946 వరకు పెరగొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/(క్షీణత)
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (అక్టోబరు)	76,005	76,325	0.42
వెండి (డిసెంబరు)	93,161	91,730	-1.54
రాగి (అక్టోబరు)	856.00	840.10	-1.86
సీసం (అక్టోబరు)	186.10	183.80	-1.30
జింక్ (అక్టోబరు)	287.05	288.50	0.51
అల్యూమినియం (అక్టోబరు)	241.50	242.25	0.31
ముడి చమురు (అక్టోబరు)	6,263	6,368	1.68
సహజ వాయువు (అక్టోబరు)	238.20	223.10	-6.34
పసుపు (అక్టోబరు)	13,700	13,574	-0.92
పత్తి క్యాండీ (నవంబరు)	56,500	57,000	0.88



ఎంఎస్ఎంఈ తక్షణ రుణ పరిమితి పెంచుతాం: ఎస్‌బీఐ

దిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) రంగానికి సరిపడా రుణ లభ్యతను అందుబాటులోకి తెచ్చేందుకు, తక్షణ రుణ పరిమితి మొత్తాన్ని పెంచుతామని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ప్రస్తుతం ఈ రుణం కింద గరిష్ఠంగా రూ.5 కోట్ల వరకు ఇస్తున్నారు. తమ ఎంఎస్ఎంఈ శాఖకు వెళ్లి, తమ పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య) ఇచ్చి, జీఎస్‌టీ వివరాలు పొందేందుకు అంగీకారం తెలిపితే, 15-45 నిమిషాల్లో రుణం మంజూరు చేస్తున్నామని ఎస్‌బీఐ ఛైర్మన్ వెల్లడించారు.

ఈసారి దీపావళికి విమాన ఛార్జీలు 20-25% తగ్గాయ్

ఇక్సిగో సీఈఓ

దిల్లీ: ఈసారి దీపావళి సెలవులకు వెళ్లే వారికి విమాన ఛార్జీలు కొంత ఊరట కలిగిస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. అధిక మార్గాల్లో టికెట్ల ధరలు గతేడాది ఇదే సమయంతో పోలిస్తే, 20-25% తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఇక్సిగో పోర్టల్‌పై 30 రోజుల ముందుగా బుక్ చేసుకున్న టికెట్ల సగటు ధరల ఆధారంగా, ఈ విశ్లేషణ చేశారు. ఏడాది క్రితంతో పోలిస్తే విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరలు 15% తక్కువగా ఉండటం కలిసొచ్చింది. ముఖ్యంగా పలు మార్గాల్లో విమాన సర్వీసుల సంఖ్య పెరగడం ప్రధాన కారణమని పేర్కొంటున్నారు. గతేడాది దీపావళి సీజన్ కోసం నవంబరు 10-16 తేదీలను పరిగణనలోకి తీసుకోగా, ఈసారి పండగ తేదీ మారినందున.. అక్టోబరు 28 - నవంబరు 3ను



ఎంచుకున్నారు. ఈ నివేదిక ప్రకారం

✦ బెంగళూరు-కోల్‌కతా విమాన టికెట్ ధర గతేడాది రూ.10,195 కాగా, ఈసారి 38% తక్కువగా (రూ.6,319) ఉంది.

✦ చెన్నై- కోల్‌కతా టికెట్ కూడా రూ.8,725 నుంచి 36% దిగి వచ్చి రూ.5,604 పలుకుతోంది.

✦ ముంబయి-దిల్లీ మార్గంలో టికెట్ రూ.8,788 నుంచి 34% తగ్గి రూ.5,762కు పరిమితమైంది.

✦ హైదరాబాద్ - దిల్లీ, దిల్లీ - శ్రీనగర్ మార్గాల్లోనూ టికెట్ల ధరలు 32% తగ్గాయని నివేదిక పేర్కొంది.

గోఫస్ట్ విమానాలు ఆగడం వల్లే

'గతేడాది విమాన టికెట్ల ధరలు బాగా అధికం అయ్యేందుకు, సర్వీసుల సంఖ్య పరిమితంగా ఉండటమే కారణం. గోఫస్ట్ విమాన సేవలు సస్పెండ్ కావడం అప్పట్లో ఇబ్బంది పెట్టింది. ఈ ఏడాది అలాంటి ఇబ్బందులేమీ లేకపోగా, విమాన సర్వీసుల సంఖ్య పెరగడం వల్ల, పోయిన దీపావళితో పోలిస్తే, ఈసారి టికెట్ల ధరలు తక్కువగా ఉన్నాయ'ని ఇక్సిగో పోర్టల్ సీఈఓ అలోక్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. కొన్ని మార్గాల్లో మాత్రం విమాన టికెట్ల ధరలు 34% వరకు అధికంగా ఉన్నాయని తెలిపారు. అహ్మదాబాద్-దిల్లీ, ముంబయి-డెహ్రాడూన్ వంటి మార్గాల్లో ఇలా పెరిగాయన్నారు.

రూ.15.39 లక్షల కోట్లతో 208 గతిశక్తి ప్రాజెక్టులు

ప్రధాని మోదీ

దిల్లీ: పీఎం గతిశక్తి కింద ఇప్పటిదాకా రూ.15.39 లక్షల కోట్లతో 208 మౌలిక వసతుల ప్రాజెక్టులను సిఫారసు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో 101 రోడ్లు, 73 రైల్వే, 12 పట్టణాభివృద్ధి, 4 చమురు-గ్యాస్ ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపింది. ఇతర రంగాల్లో మిగిలిన ప్రాజెక్టులున్నాయి. దేశ మౌలిక వసతులతో పాటు పలు రంగాల్లో వేగవంత వృద్ధి సాధించేందుకు మూడేళ్ల కిందట చేపట్టిన పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ (పీఎంజీఎస్-ఎన్ఎంపీ) అనుకున్నట్లుగానే విప్లవాత్మక మార్పునకు చుక్కానిగా మారిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పీఎం గతిశక్తి మూడో వార్షికోత్సవం సందర్భంగా, భారత మండపంలోని అనుభూతి కేంద్రాన్ని ప్రధాని మోదీ ఆదివారం సందర్శించారు. రైల్వే, రోడ్లు, పోర్టులు, జల మార్గాలు, విమానాశ్రయాలు, మాస్ ట్రాన్స్‌పోర్టు, లాజిస్టిక్స్ మౌలిక వసతుల వంటి ఏడు ఇంజిన్ల ద్వారా మౌలిక వసతులను పరుగులు పెట్టించి ఆర్థికాభివృద్ధి సాధించాలనేది గతిశక్తి లక్ష్యం. అనుభూతి కేంద్రం సందర్శన అనంతరం ప్రధాని.. ఎక్స్‌లో తన అభిప్రాయాలను వెలిబుచ్చారు. 'ఏడు ఇంజిన్లను సమీకృతం చేయడం ద్వారా సరకు రవాణాకు ఊతం లభించింది. ఆలస్యం తగ్గింది. కొత్త అవకాశాలను సృష్టించింది. గతిశక్తికి కృతజ్ఞతలు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి అది సహకరిస్తోంది. ఆవిష్కరణలకూ అది దోహదపడుతోంద'ని మోదీ పేర్కొన్నారు.


రిటైల్ రుణాల జారీ వేగవంతం: ఐఓబీ

హైదరాబాద్ సహా 8 నగరాల్లో ప్రాసెసింగ్ కేంద్రాలు

చెన్నై: ప్రభుత్వ రంగ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) హైదరాబాద్ సహా 8 నగరాల్లో రిటైల్ రుణాల ప్రాసెసింగ్ కేంద్రాలను ఆవిష్కరించింది. రుణ ఆమోద ప్రక్రియలను క్రమబద్ధీకరించడంతో పాటు, రుణాల మంజూరు సమయాన్ని తగ్గించే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేసినట్లు బ్యాంక్ ఎండీ, సీఈఓ అజయ్ కుమార్ శ్రీవాస్తవ వెల్లడించారు. చెన్నై, బెంగళూరు, కోయంబత్తూర్, దిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, లఖ్‌నవూ, ముంబయిలలో వీటిని నెలకొల్పినట్లు పేర్కొన్నారు. 'మా కొత్త రిటైల్ రుణాల ప్రాసెసింగ్ కేంద్రాలు సౌలభ్యం కోసం మాత్రమే కాదు. డిజిటల్ సాధనాలు, అధునాతన విశ్లేషణలను ఉపయోగించడం ద్వారా రుణాల జారీ ప్రక్రియ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. నష్ట భయ నిర్వహణ వ్యవస్థను పటిష్ఠ పరచి, స్థిరమైన బ్యాంకింగ్ వ్యవస్థను సృష్టిస్తాయ'ని అజయ్ కుమార్ వివరించారు.

11,000 వజ్రాలతో రతన్‌టాటా రూపు

దిల్లీ: టాటా గ్రూప్ గౌరవ ఛైర్మన్, మానవతామూర్తి రతన్ టాటా మృతికి నివాళి అర్పిస్తూ, ఆయన చిత్తరువును 11,000 అమెరికన్ వజ్రాలతో రూపొందించారు గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఓ వజ్రాల వ్యాపారి. ప్రయోగశాలలో తయారు చేసిన ఈ వజ్రాలతో, రతన్ టాటా చిత్తరువును రూపొందిస్తూ వీడియో తీసి, సామాజిక మాధ్యమం ఇన్‌స్టాలో ఉంచారు. సూరత్‌కు చెందిన ఆ వ్యాపారి పేరు విపుల్‌భాయ్‌గా చెబుతున్నారు. ఈ వీడియోను రతన్ అభిమానులు విస్తృతంగా వైరల్ చేస్తున్నారు.



డీమార్ట్ లాభం రూ.659 కోట్లు

దిల్లీ: డీమార్ట్ బ్రాండ్‌పై రిటైల్ విక్రయశాలలను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్, సెప్టెంబరు త్రైమాసికానికి రూ.659.44 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.623.35 కోట్లతో పోలిస్తే, ఇది 5.78% అధికం. ఇదే సమయంలో సంస్థ ఆదాయం రూ.12,624.37 కోట్ల నుంచి 14.41% పెరిగి రూ.14,444.50 కోట్లకు చేరింది. ఇదే కాలంలో వ్యయాలు కూడా 14.94% అధికమై రూ.13,574.83 కోట్లుగా నమోదయ్యాయి. సమీక్షా త్రైమాసికంలో ఇతర ఆదాయాలతో కలిసి సంస్థ మొత్తం ఆదాయం 14.34% పెరిగి రూ.14,478.02 కోట్లకు చేరింది. సమీక్షా త్రైమాసికంలో ఆరంభించిన ఆరింటితో కలిసి మొత్తం విక్రయశాలల సంఖ్య 377కు చేరింది.

నగదు రిఫండ్ అవకాశం కల్పించాలి

ఓలాకు సీసీపీఏ ఆదేశాలు

దిల్లీ: నగదు రూపేణ రిఫండ్ అవకాశం కల్పించడంతో పాటు ప్రయాణ రుసుములకు సంబంధించి రసీదు పొందే వీలును వినియోగదారులకు కల్పించాలని రైడింగ్ ప్లాట్‌ఫాం ఓలాను, వినియోగదారుల హక్కుల రక్షణ సంస్థ (సీసీపీఏ) ఆదేశించింది. వినియోగదారులతో మరింత స్నేహపూర్వక వాతావరణం నెలకొనే చర్యలు తీసుకోవాలని ఆదివారం పేర్కొంది. ప్రస్తుతం ఓలా సంస్థ రిఫండ్ విధానంలో వినియోగదారులు ప్రశ్నలు అడిగే వీలు లేదని, భవిష్యత్తు రైడ్లకు వీలయ్యే కూపన్ కోడ్లు మాత్రమే ఇస్తోంది



కానీ, నగదును వారి బ్యాంక్ ఖాతాకు తిరిగి చెల్లించడం లేదని గుర్తించినట్లు సీసీపీఏ చీఫ్ కమిషనర్ నిధి ఖరే తెలిపారు. ఇది వినియోగదారుల హక్కులను ఉల్లంఘించడమే అని స్పష్టం చేశారు. ఓలా ప్లాట్‌ఫాం ద్వారా రైడ్ బుక్ చేసుకున్న వారు, చెల్లించిన మొత్తానికి రసీదు పొందలేకపోవడం అనైతిక వ్యాపార విధానమని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఈనెల వరకు 2061 ఫిర్యాదులు ఓలాపై సీసీపీఏకు అందాయి.

చేసిన మార్పులివీ: సీసీపీఏ జోక్యం తరవాత ఓలా కొన్ని మార్పులు చేసింది. వినియోగదారులు ఫిర్యాదు చేసేందుకు నోడల్ అధికారుల కాంటాక్ట్ వివరాలు, రైడ్ క్యాన్సిల్ చేసుకునే నిబంధనలు - మరిన్ని కారణాలు, బుకింగ్ చేసుకునేప్పుడే రుసుము తెలియడం, రుసుములో దేనికి ఎంత అనేది అనేది వెల్లడిస్తోంది. రైడ్ బుక్ చేసుకున్న వినియోగదారులు, గమ్యం చేరాల్సిన చిరునామాల వివరాలను బుకింగ్ సమయంలోనే డ్రైవర్లకు ప్రదర్శిస్తోంది.

కోడి గుడ్లు

14న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510	గోదావరి	525
వరంగల్	512	విశాఖపట్నం	525
విజయవాడ	525	చిత్తూరు	538

కార్పొరేట్ ఫలితాలే కీలకం

స్టాక్ మార్కెట్ ఈ వారం



వరుసగా రెండు వారాలు నష్టపోయిన దేశీయ సూచీలు, రాబోయే రోజుల్లో స్థిరీకరించుకుంటాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రధాన కంపెనీలు తమ సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలను ఈవారం ప్రకటించనున్నందున, స్క్రిప్ ఆధారిత కదలికలు ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణ గణాంకాలు, ముడి చమురు ధరలు కీలకం కానున్నాయి. మొత్తంమీద మదుపర్ల సెంటిమెంటు బలహీనంగానే ఉందని అంచనా. సెప్టెంబరులో ఉద్దీపనలు ప్రకటించిన చైనా మార్కెట్‌లోకి, ప్రపంచ పెట్టుబడులు కొంత మళ్లాయి. అయితే ఈనెల 12 నాటి ఆర్థిక సాయ ప్రకటనలో స్పష్టత లేకపోవడం, ఎలా దారితీస్తుందో చూడాలని సూచిస్తున్నారు. ఎఫ్‌ఐఐలు మళ్లీ దేశీయ మార్కెట్లో పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నా, షేర్ల విలువల దిద్దుబాటు కోసం చూస్తున్నారని భావిస్తున్నారు. టీసీఎస్ ఫలితాలు అంచనాలు అందుకోకపోవడంతో, సోమవారం వెలువడే రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఫలితాల కోసం చూస్తున్నారు. నిఫ్టీ 50కి సమీప నిరోధం 25250-25300 పాయింట్ల శ్రేణిలో ఉంటుందని అంచనా. దీనిని అధిగమిస్తే, మరింత రాణిస్తుంది. ఒకవేళ కిందకు వస్తే 24800-24700 శ్రేణిలో మద్దతు లభిస్తుందని చెబుతున్నారు. రూ.27,870 కోట్ల సమీకరణ కోసం వస్తున్న హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీఓ (ఈనెల 15-17 తేదీల్లో)పై మదుపర్లు ఆసక్తిగా ఉన్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● **టెలికాం** షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్ బాగుంటాయని, వొడాఫోన్ ఐడియా నష్టపోవచ్చని అంచనా వేస్తున్నారు. జూన్‌లో పెంచిన టారిఫ్‌ల ప్రభావం అక్టోబరు-మార్చిలో ప్రతిఫలిస్తుందనే విశ్వాసమే ఇందుకు కారణం.

● ప్రభావం చూపే అంశాలు లేనందున **సిమెంటు** కంపెనీల షేర్లు స్తబ్దుగా చలించొచ్చు. సెప్టెంబరు ఫలితాలు దిక్సూచి అవుతాయి.

● పశ్చిమాసియా పరిణామాలను బట్టి **చమురు** షేర్ల చలనాలు ఆధారపడి ఉండొచ్చు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఇప్పుడే ముగిసే పరిస్థితి లేకపోవడం, దేశీయ కంపెనీల లాభాదాయాలపై ప్రతికూల అంచనాల వల్ల, ఈ షేర్లు రాణించకపోవచ్చు.

● **యంత్రపరికరాల** కంపెనీల సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలపై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు. అయితే షేర్ల అధిక విలువలే ఇబ్బందిగా మారాయి.

● నెస్లే గురువారం నాడు ఫలితాలు ప్రకటించనున్న నేపథ్యంలో **ఎఫ్‌ఎంసీజీ** షేర్లు పరిమిత శ్రేణిలో కదలాడొచ్చు. కొన్ని కమొడిటీల అధిక ధరల నేపథ్యంలో, గిరాకీ ఎలా ఉందో గమనించాలి. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో వరదల వల్ల గిరాకీపై ఆందోళనలున్నా, మధ్య, దీర్ఘకాలానికి ఈ రంగం సానుకూలమే అనే అంచనా ఉంది.

● చైనా ఉద్దీపన ప్రకటనల నేపథ్యంలో **లోహాలకు** గిరాకీ పెరుగుతుందన్న అంచనాలున్నాయి. అయితే దేశీయ కంపెనీలకు ఎంతవరకు లాభిస్తుందన్నది పరిశీలించాలి. ఆర్థిక వ్యవస్థ ప్రగతి కోసం ఎంత మొత్తం కేటాయించామన్నది చైనా వెల్లడించకపోవడం గమనార్హం.

● **ఔషధ** కంపెనీలు వరుసగా మూడో వారంలోనూ మార్కెట్ కంటే మిన్నగా రాణించొచ్చు. అనిశ్చితుల మధ్య రక్షణాత్మక రంగంగా భావించే ఫార్మా వైపు మదుపర్లు దృష్టి సారిస్తుండడం ఇందుకు నేపథ్యం. అయితే స్క్రిప్ ఆధారిత కొనుగోళ్లే చోటుచేసుకోవచ్చని భావిస్తున్నారు.

● **ఐటీ** కంపెనీల షేర్లు పరిమిత శ్రేణిలో కదలాడొచ్చు. మొత్తంమీద ఈ రంగంపై సానుకూల ధోరణే ఉంది. ఐటీ సూచీకి 41,600 పాయింట్ల వద్ద మద్దతు లభించొచ్చు. సెప్టెంబరు ఫలితాల్లో అంచనాలను అందుకోని టీసీఎస్, 'ఖాతాదారుల నుంచి పెద్ద కాంట్రాక్టుల విషయంలో అనిశ్చితి నెలకొనడమే' కారణమంది. అమెరికా సహా పెద్ద దేశాల్లో వడ్డీరేట్ల కోత భవిష్యత్తులో కలిసి రావచ్చని పేర్కొంది.

● **బ్యాంకుల** రుణ వృద్ధికి అనుగుణంగా డిపాజిట్లు సమీకరించేందుకు తీసుకుంటున్న చర్యల వల్ల నికర వడ్డీ మార్జిన్లు, లాభదాయకత తగ్గే అవకాశం ఉంది. నిఫ్టీ బ్యాంక్ సూచీ 52,500-52,800 స్థాయిని పరీక్షించొచ్చు. ఒకవేళ కిందకు వస్తే 50,190 పాయింట్ల వద్ద గట్టి మద్దతు లభించొచ్చు.

● **వాహన** కంపెనీల షేర్లు పరిమిత శ్రేణిలో కదలాడొచ్చు. సెప్టెంబరులో రిటైల్ విక్రయాలు తగ్గినా కూడా, భవిష్యత్తులో వడ్డీరేట్ల కోతకు ఆర్‌బీఐ సంకేతాలివ్వడం వల్ల వాహన సూచీ గతవారం 2% లాభపడింది.

విశ్లేషకుల అంచనాలు

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,687.40	1710.40	1647.20
ఎమ్‌టీఎన్ఎల్	50.94	52.30	50.00
టాటా కమ్యూనికేషన్స్	1963.75	2009.60	1932.10
వొడాఫోన్ ఐడియా	9.18	9.40	9.00
సిమెంటు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
ఏసీసీ	2312.45	2346.60	2283.40
అంబుజా సిమెంట్స్	585.20	596.80	577.30
ఇండియా సిమెంట్స్	362.45	365.50	359.50
శ్రీ సిమెంట్	24337.05	24842.60	23967.20
అల్ట్రాటెక్ సిమెంట్	11421.30	11524.70	11308.50
చమురు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
రిలయన్స్ ఇండస్ట్రీస్	2744.20	2778.40	2720.60
బీపీసీఎల్	337.65	342.40	331.60
హెచ్‌పీసీఎల్	395.50	403.00	383.70
ఐఓసీఎల్	163.15	165.60	161.40
ఓఎన్‌జీసీ	292.55	296.10	287.80
ఆయిల్ ఇండియా	584.55	599.50	563.70
యంత్రపరికరాలు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భెల్	270.00	276.20	265.40
సీజీ పవర్	858.15	894.70	818.30
ఎల్ అండ్ టీ	3482.55	3525.70	3425.50
సీమెన్స్	7749.90	7917.90	7474.00
థెర్మాక్స్	5155.25	5257.50	4998.00
ఎఫ్‌ఎంసీజీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అదానీ విల్మర్	337.45	342.30	331.80
బ్రిటానియా ఇండస్ట్రీస్	5978.50	6071.40	5914.60
కోల్గేట్ పామోలివ్	3689.65	3734.40	3610.90
డాబర్ ఇండియా	570.85	577.40	565.90
ఇమామీ	730.25	754.80	716.70
హిందుస్థాన్ యునిలీవర్	2783.20	823.00	2717.10
ఐటీసీ	488.20	496.40	483.30
మారికో	685.50	698.90	674.60
లోహ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హిందాల్కో	747.35	760.40	726.60
హిందుస్థాన్ జింక్	504.15	516.10	496.10
ఎన్ఎమ్‌డీసీ	233.68	241.00	222.70
సెయిల్	134.03	138.20	127.90
టాటా స్టీల్	160.66	165.80	156.60
వేదాంతా	497.50	507.60	489.40

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1495.85	1514.40	1465.00
బయోకాన్	346.15	351.50	341.80
సిప్లా	1595.75	1634.50	1554.40
డాక్టర్ రెడ్డీస్	6599.20	6669.30	6510.00
గ్లెన్‌మార్క్ ఫార్మా	1790.65	1830.30	1740.00
లుపిన్	2224.50	2274.40	2133.70
ఐటీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హెచ్‌సీఎల్ టెక్	1839.65	1883.20	1778.90
ఇన్ఫోసిస్	1935.10	1967.60	1893.80
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5469.55	5675.20	5099.50
టీసీఎస్	4149.20	4297.40	4038.40
టెక్ మహీంద్రా	1647.05	1680.40	1586.40
విప్రో	528.30	541.70	513.60
బ్యాంకింగ్	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1651.00	1674.10	1631.70
ఐసీఐసీఐ బ్యాంక్	1223.00	1247.40	1209.80
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	72.37	73.70	71.20
ఇండస్ఇండ్ బ్యాంక్	1347.60	1384.90	1320.30
కోటక్‌మహీంద్రా బ్యాంక్	1882.40	1911.50	1846.60
పీఎన్‌బీ	104.91	106.50	102.50
ఎస్‌బీఐ	799.75	808.20	788.80
వాహన	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అశోక్ లేలాండ్	227.86	231.70	222.10
బజాజ్ ఆటో	11876.95	12062.80	11612.70
ఐషర్ మోటార్స్	4728.05	4880.20	4583.90
హీరో మోటోకార్ప్	5476.30	5516.60	5419.90
ఎం అండ్ ఎం	3134.35	3244.80	3065.80
మారుతీ	12776.65	13082.20	12572.20
టాటా మోటార్స్	930.70	940.60	923.60
టీవీఎస్ మోటార్	2794.35	2821.70	2751.00

(c) eenadu

ఈనాడు సినిమా

దసరా వచ్చింది. సినిమా సంబరాల్ని తీసుకొచ్చింది. విజయదశమి సందర్భంగా శనివారం పలు సినిమాల ప్రచార చిత్రాలు విడుదలతోపాటు... ప్రారంభోత్సవాలు జరిగాయి. మరికొన్ని సినిమాల్ని అధికారికంగా ప్రకటించారు. కొత్త సంగతులు, కొత్త సినిమాల హంగామాతో చిత్రసీమ కళకళలాడింది.

సినీ దశమి

పండగపూట హోరెత్తిన ప్రచార చిత్రాలు

'విశ్వంభర' యుద్ధం


చిరంజీవి

విర్రవీగుతున్న అరాచకానికి ముగింపు పలికే మహా యుద్ధం ఏ రూపంలో వచ్చిందో తెలియాలంటే 'విశ్వంభర' చూడాల్సిందే. చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. కునాల్ కపూర్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. వశిష్ఠ దర్శకుడు. యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మాతలు. విక్రమ్ రెడ్డి సమర్పకులు. ఈ సినిమా టీజర్‌ని దసరా సందర్భంగా విడుదల చేశారు. 'విశ్వాన్ని అలుముకున్న ఈ చీకటి విస్తరిస్తున్నంత మాత్రాన వెలుగు రాదని కాదు. ప్రశ్నలు పుట్టించిన కాలమే సమాధానాన్ని కూడా సృష్టిస్తుంది' అంటూ మొదలయ్యే టీజర్‌లో విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్దపీట వేశారు. సోషియో ఫాంటసీ కథతో రూపొందుతున్న చిత్రమిది. అనుకున్నట్టుగానే ఈ సినిమా విడుదలని, రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' కోసం వాయిదా వేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన టీజర్ విడుదల వేడుకని ఉద్దేశించి దర్శకుడు వశిష్ఠ మాట్లాడుతూ "చిరంజీవితో ఓ ఫాంటసీ సినిమా తీయాలనే కోరిక ఎప్పట్నుంచో ఉండేది. అది నెరవేరడం ఆనందంగా ఉంది. పురాణాల నుంచి స్ఫూర్తి పొందినా, ఇది పూర్తిగా కల్పిత కథ. భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నాం. అభిమానులు, ప్రేక్షకుల అంచనాలు మించేలా ఉంటుందీ చిత్రం" అన్నారు. చిత్ర సమర్పకులు విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ "అనుకున్న ప్రకారమే ఈ సినిమా దాదాపుగా పూర్తయింది. రామ్‌చరణ్ కోసం, నిర్మాత దిల్‌రాజు అడగడంతో 'విశ్వంభర' విడుదలని వాయిదా వేశాం" అన్నారు. ఈ కార్యక్రమంలో ఛాయాగ్రాహకుడు ఛోటా కె.నాయుడు, కళా దర్శకుడు ఎ.ఎస్.ప్రకాశ్, పంపిణీదారుడు శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీపావళికి టీజర్... సంక్రాంతికి సినిమా


బాలకృష్ణ 109వ చిత్రం సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. బాబీ కొల్లి దర్శకత్వంలో... సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ సినిమా పేరుతోపాటు, టీజర్‌ని దీపావళికి విడుదల చేయనున్నట్టు చిత్రబృందం తెలిపింది. దసరా సందర్భంగా శనివారం ఓ పోస్టర్‌ని విడుదల చేశారు. అందులో బాలకృష్ణ గుర్రంపై స్వారీ చేస్తూ, రాజసంతో కనిపించారు. బాలకృష్ణ శైలి మాస్, యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు బాబీ దేవోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.


బాలకృష్ణ

16న ప్రారంభం


బాలకృష్ణ - బోయపాటి శ్రీను మరోసారి చేతులు కలుపుతున్నారు. విజయవంతమైన ఈ కలయికలో నాలుగో చిత్రం ఈ నెల 16న ప్రారంభం కానుంది. 'సింహా', 'లెజెండ్', 'అఖండ' తర్వాత రూపొందుతున్న ఈ సినిమాని 14 రీల్స్ ప్లస్, ఎమ్.తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మాతలు.

● బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న అన్ స్టాపబుల్ సీజన్- 4 ట్రైలర్ విడుదల కార్యక్రమం శనివారం జరిగింది.


పవన్‌కల్యాణ్

వీరమల్లు పాట త్వరలోనే

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'హరిహర వీరమల్లు' పనులు చకచకా సాగుతున్నాయి. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ పునః ప్రారంభమైన సంగతి తెలిసిందే. హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ నిక్ పావెల్ నేతృత్వంలో భారీ యుద్ధ సన్నివేశాల్ని తెరకెక్కించారు. ఈ నెల 14 నుంచి మరో షెడ్యూల్ ఆరంభం కానుంది. ఈ సినిమా కోసం పవన్‌కల్యాణ్ ఓ పాట పాడారు. ఆ పాటని త్వరలోనే విడుదల చేయనున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. దసరా సందర్భంగా ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. నవంబరు 10 నాటికి చిత్రీకరణ పూర్తి చేసుకోనున్న ఈ సినిమాలో పవన్‌కల్యాణ్ సరసన నిధి అగర్వాల్ నటిస్తున్నారు. జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఎ.దయాకర్ రావు నిర్మాత. ఎ.ఎం.రత్నం సమర్పకులు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ సినిమాలోని తొలి భాగం మార్చి 28న తెలుగుతోపాటు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో విడుదల కానుంది.


రామ్ చరణ్

జనవరి 10న 'గేమ్ ఛేంజర్'


రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన 'గేమ్ ఛేంజర్' సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది. ముందుగా ఈ సినిమాని క్రిస్మస్‌కు విడుదల చేయాలనుకున్న విషయం తెలిసిందే. కానీ పంపిణీదారుల కోరిక మేరకు సంక్రాంతికి వాయిదా వేస్తున్నట్టు నిర్మాత దిల్‌రాజు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ "మూడేళ్లుగా నిర్మాణంలో ఉన్న భారీ బడ్జెట్ చిత్రమిది. అంచనాలున్న ఇలాంటి సినిమాలు క్రిస్మస్ కంటే సంక్రాంతికి వస్తేనే బాగుంటుందని నాతోసహా పంపిణీదారులంతా భావించాం. ఇదే విషయాన్ని కథానాయకుడు చిరంజీవితోనూ, యు.వి.క్రియేషన్స్ నిర్మాతలు వంశీ, ప్రమోద్, విక్రమ్‌తోనూ పంచుకున్నాం. వాళ్లు సానుకూలంగా స్పందించి, సంక్రాంతికి విడుదల చేయాలనుకున్న 'విశ్వంభర'ని వాయిదా వేశారు. 'గేమ్ ఛేంజర్' కోసం వాళ్లు తీసుకున్న ఈ నిర్ణయానికి కృతజ్ఞతలు'' అన్నారు. శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'గేమ్ ఛేంజర్' వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. ఇందులో రామ్‌చరణ్‌కి జోడీగా కియారా అద్వాణీ నటించారు.

దసరా తర్వాత మళ్లీ

విజయవంతమైన 'దసరా' తర్వాత ఆ కలయికలో మరో చిత్రం శనివారం మొదలైంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాని ఎస్.ఎల్.వి.సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. 'దసరా' సినిమాలోనే నానిని మాస్ అవతారంలో చూపించిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, ఈసారి మరో కొత్త రకమైన పాత్రని తీర్చిదిద్దారని, వీరోచితంగా కనిపించే ఆ పాత్ర కోసం నాని ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నారని సినీ వర్గాలు తెలిపాయి. నాని కెరీర్‌లోనే అత్యధిక వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా, 'దసరా' చిత్రం కంటే వంద రెట్లు అధికంగా ప్రభావం చూపిస్తుందని చిత్రబృందం ఓ ప్రకటనలో తెలిపింది.


నాని, శ్రీకాంత్ ఓదెల

రామ్ 22 ఖరారు


రామ్

కథానాయకుడు రామ్ పోతినేని 22వ చిత్రం మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కనుంది. దసరా సందర్భంగా శనివారం ఈ సినిమాని అధికారికంగా ప్రకటించింది నిర్మాణ సంస్థ. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ మహేశ్ బాబు పచ్చిగొల్ల ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. "రామ్ కెరీర్‌లో ఓ మైలురాయిలా నిలిచే చిత్రమిది. ఈమధ్య కాలంలో యాక్షన్ ప్రధానమైన సినిమాల్లో ఎక్కువగా నటించిన రామ్ ఇందులో ఓ విభిన్నమైన పాత్రలో సందడి చేస్తారు. సున్నితంగా హృదయాల్ని స్పృశించే అంశాలు, భావోద్వేగాలున్న ఈ కథని దర్శకుడు తీర్చిదిద్దిన విధానం చాలా బాగుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తామ"ని సినీ వర్గాలు తెలిపాయి.

సిద్ధు జొన్నలగడ్డ 'కోహినూర్'


సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' తర్వాత సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా మరో చిత్రాన్ని నిర్మిస్తోంది. 'కోహినూర్' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రానికి రవికాంత్ పేరేపు దర్శకుడు. ఇదివరకు ఆయన... సిద్ధుతో కలిసి 'కృష్ణ అండ్ హిజ్ లీల' తెరకెక్కించారు. ఈసారి కోహినూర్ వజ్రాన్ని తిరిగి తీసుకురావడం అనే అంశం ఆధారంగా సోషియో ఫాంటసీ కథతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దసరా సందర్భంగా ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు.


రెండు జంటల కథ... 'నా నిరీక్షణ'


లిషి, అమర్, చైతన్య, రమ్య

అమర్‌దీప్, లిషి గణేశ్ కల్లపు జంటగా సాయివర్మ దాట్ల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'నా నిరీక్షణ'. చైతన్యవర్మ, రమ్య ప్రియ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పి.సంతోష్ రెడ్డి నిర్మాత. ఈ చిత్రం విజయ దశమి రోజున హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత దిల్‌రాజు క్లాప్‌నివ్వగా, రాజా రవీంద్ర స్క్రిప్ట్ అందజేశారు. నిర్మాత గణపతి రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాత సురేశ్‌బాబు, నటుడు రాజా రవీంద్ర తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ "రెండు జంటల చుట్టూ సాగే కథ ఇది. తప్పకుండా ప్రేక్షకులకు మంచి అనుభవాన్ని పంచుతామ"న్నారు. మాటలు: తిరుమలేశ్ బండారు, సంగీతం: శేఖర్‌చంద్ర.

ప్రేమకథతో 'కాక్రోచ్'

పాత, కొత్తతరం నటుల మేళవింపుతో సీనియర్ దర్శకుడు పి.సునీల్‌కుమార్ రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం 'కాక్రోచ్'. విశాఖపట్నం నేపథ్యంలో సాగే ఓ ప్రేమకథతో దీన్ని రూపొందిస్తున్నారు. విజయదశమి సందర్భంగా సినిమా పేరుని, ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ కథాంశం విభిన్నంగా ఉంటుందని, ఈ కథకి 'కాక్రోచ్' అనే పేరు ఎందుకు పెట్టామన్నది తెరపైనే చూడాలన్నారు దర్శకుడు. బి.బాపిరాజు, ముతుకి నాగ సత్యనారాయణ నిర్మాతలు.


సునీల్ కుమార్

ఘనంగా నారా రోహిత్ నిశ్చితార్థం


నారా భువనేశ్వరి, నారా రోహిత్, శిరీష, నారా చంద్రబాబు నాయుడు

యువ కథానాయకుడు నారా రోహిత్ త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారు. ఆయన వివాహ నిశ్చితార్థం శిరీష లేళ్లతో ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. నారా, నందమూరి కుటుంబ సభ్యుల సమక్షంలో కాబోయే వధూవరులు ఉంగరాలు మార్చుకున్నారు. నారా రోహిత్ పెదనాన్న, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరి దంపతులతోపాటు, కథానాయకుడు బాలకృష్ణ, ఏపీ మంత్రి నారా లోకేశ్, నారా బ్రాహ్మణి, కుటుంబ సభ్యులు ఈ వేడుకకు హాజరయ్యారు. 'ప్రతినిధి2' సినిమాలో నారా రోహిత్ సరసన నటించారు శిరీష. ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యని అభ్యసించారామె. ఇద్దరూ ఒకరినొకరు ఇష్టపడి, పెద్దల్ని ఒప్పించి వివాహ బంధంలోకి అడుగు పెడుతున్నారు. "కలిసి లెక్కలేనన్ని ఆనంద క్షణాల్ని, సాహసాల్ని, జ్ఞాపకాల్ని పంచుకున్నాం. ఇప్పుడు శిరీషతో కలిసి జీవితంలో ఓ గొప్ప ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉంది" అంటూ నారా రోహిత్ ఎక్స్‌లో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు. డిసెంబరులో వీరిద్దరి వివాహం జరగనున్నట్లు తెలుస్తోంది.

పాన్ ఇండియా స్థాయిలో...


అరుణ్, తన్మయి, రామ్


సముద్ర దర్శకత్వంలో... ఆయన వారసులు అరుణ్ మహాశివ, రామ్ త్రివిక్రమ్ కథానాయకులుగా తెరకెక్కుతున్న చిత్రం 'దో కమీనే'. తన్మయి, శ్రీరాధ కథానాయికలు. చంద్ర పులుగుజ్జు నిర్మిస్తున్నారు. దసరా సందర్భంగా ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నటుడు సుమన్ క్లాప్‌నివ్వగా, నందమూరి మోహనకృష్ణ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు బి.గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. కథానాయకుడు శ్రీకాంత్ స్క్రిప్ట్‌ని అందజేశారు. అనంతరం దర్శకుడు వి.సముద్ర మాట్లాడుతూ ''పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా ఈ సినిమాని రూపొందిస్తున్నాం. నవంబర్ 3వ వారం నుంచి రెగ్యులర్ చిత్రీకరణను ప్రారంభిస్తాం'' అన్నారు. శ్రీరాధ, భవ్య, గీత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: శ్రీవెంకట్, సంగీతం: వినోద్.


విష్ణు, రియా, సాయికుమార్

సందేశంతో... పెన్ డ్రైవ్

విష్ణు వంశీ, రియా కపూర్ జంటగా... ఎం.ఆర్.దీపక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'పెన్ డ్రైవ్'. కె.రామకృష్ణ నిర్మాత. ఈ చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నటుడు సాయికుమార్ క్లాప్‌నివ్వగా, నిర్మాత కె.రామకృష్ణ కెమెరా స్విచ్చాన్ చేశారు. తుమ్మలపల్లి రామ సత్యనారాయణ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం దర్శకుడు మాట్లాడుతూ "అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికతని దుర్వినియోగం చేస్తూ నేరాలకి పాల్పడుతున్న వాళ్లు ఎంతోమంది. సాంకేతికతతో కూడిన నేరాలు సులువే కావొచ్చు కానీ, తప్పించుకోవడం కష్టం. సాంకేతికత గురించి ఓ మంచి సందేశాన్ని మా చిత్రంతో చెప్పబోతున్నాం. ఈ నెల 22 నుంచి రెగ్యులర్ చిత్రీకరణని ప్రారంభిస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వినోద్, ఛాయాగ్రహణం: విజయ్ ఠాగూర్.

వచ్చేశాడు బబ్బర్‌షేర్


జాకీ ష్రాఫ్

బాలీవుడ్ కథానాయకుడు వరుణ్ ధావన్, కీర్తి సురేశ్ జంటగా నటిస్తున్న చిత్రం 'బేబీ జాన్'. కాలీస్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. వామికా గబ్బీ కీలక పాత్ర పోషిస్తుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పోస్టర్లు అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. తాజాగా ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో విలక్షణ నటుడు జాకీ ష్రాఫ్ నటిస్తున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది చిత్రబృందం. "మీరు ఎప్పుడూ చూడని చీకటిని కలవడానికి సిద్ధంగా ఉండండి. 'బేబీ జాన్'కి శత్రువు.. బబ్బర్ షేర్ మీ కోసం వచ్చేశాడు" అని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో పొడవాటి జుట్టుతో సరికొత్త అవతారంలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు జాకీ ష్రాఫ్. ఈ ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌ను మురాద్ ఖేతానీ, ప్రియా అట్లీ, జ్యోతి దేశ్‌పాండే సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తమన్ సంగీతమందిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 25న విడుదల కానుంది.


పుట్టినరోజు సందర్భంగా...


ప్రభాస్

ప్రభాస్ కథానాయకుడిగా నటించిన తొలి చిత్రం 'ఈశ్వర్' సరికొత్తగా 4కే హంగులతో ముస్తాబై రీరిలీజ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 23న లక్ష్మీ నరసింహా మూవీస్ సంస్థ చిత్రాన్ని విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా శనివారం ట్రైలర్‌ని విడుదల చేశారు. జయంత్ సి. పరాన్జీ దర్శకత్వంలో, కె.అశోక్ కుమార్ నిర్మించిన చిత్రమిది. ప్రభాస్ సరసన శ్రీదేవి విజయ్ కుమార్ నటించారు.

పోస్టర్ల సందడి


విష్వక్‌సేన్


అశోక్ గల్లా


పండగ సందర్భంగా కొత్త సినిమాల ప్రచార చిత్రాల్ని విడుదల చేశాయి ఆయా చిత్రబృందాలు. అభిమానులు ఆయా ప్రచార చిత్రాల్ని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు.

● విష్వక్‌సేన్ కథానాయకుడిగా... రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మెకానిక్ రాకీ', అశోక్ గల్లా, మానస వారణాసి జంటగా.. అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'దేవకి నందన వాసుదేవ' ప్రచార చిత్రాల్నీ పండగ సందర్భంగా విడుదల చేశారు. 'మెకానిక్ రాకీ' ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుండగా, 'దేవకీ నందన వాసుదేవ' నవంబర్ 14న విడుదల కానుంది.

◆ తేజ సజ్జా కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'మిరాయ్' దసరా ప్రత్యేక ప్రచార చిత్రం కూడా విడుదలైంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై రూపొందుతున్న చిత్రమిది. వచ్చే ఏడాది ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.

◆ నితిన్, శ్రీలీల జంటగా తెరకెక్కుతున్న 'రాబిన్‌హుడ్' ప్రచార చిత్రం విడుదలైంది. అందులో నాయకానాయికలిద్దరూ వింటేజ్ లుక్‌తో సందడి చేశారు. వెంకీ కుడుముల దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

◆ ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వంలో రూపొందుతున్న కాన్సెప్ట్ ప్రధానమైన చిత్రం... '8 వసంతాలు'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'మ్యాడ్' ఫేమ్ అనంతిక సనీల్ కుమార్ ఇందులో కథానాయిక. ఆమె శుద్ధి అయోధ్య పాత్రలో కనిపించనున్నారు. ఆ పాత్రకి సంబంధించిన టీజర్‌ని ఆదివారం విడుదల చేశారు. సంతోషాలు, కన్నీళ్లు, విలువైన పాఠాలతో కూడిన ఓ మహిళ ఎనిమిదేళ్ల ప్రయాణంగా ఈ సినిమా రూపొందుతోంది.


తేజ సజ్జా


ప్రియదర్శి

'సారంగపాణి జాతకం' విడుదల ఖరారు

ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించిన 'సారంగపాణి జాతకం' విడుదల ఖరారైంది. డిసెంబరు 20న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో... శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న చిత్రమిది. 'జెంటిల్‌మేన్', 'సమ్మోహనం' తర్వాత ఈ దర్శకనిర్మాతలిద్దరూ కలిసి చేస్తున్న చిత్రమిది. నిర్మాత మాట్లాడుతూ ''పరిపూర్ణ హాస్యరస చిత్రమిది. మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేక చేసే చేతల్లో ఉంటుందా అనే ప్రశ్నకు జవాబు తనదైన శైలిలో చెప్పే ప్రయత్నం చేశారు దర్శకుడు. ఇంటిల్లిపాదీ కలిసి ఆస్వాదించేలా ఈ చిత్రం ఉంటుంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. క్రిస్మస్ సెలవుల్లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం'' అన్నారు. నరేశ్ విజయకృష్ణ, తనికెళ్ల భరణి, శ్రీనివాస్ అవసరాల, వెన్నెల కిశోర్, వైవా హర్ష తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్.

(c) eenadu



చిన్న వయసులోనే తక్కువ విద్యార్హతతో కేంద్రంలో కొలువుదీరే మేటి అవకాశం మీ ముందుకొచ్చింది. ఇందుకు భారతీయ రైల్వే వేదికయింది. ఈ దఫా ఇంటర్మీడియట్ వంతు. నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ (ఎన్‌టీపీసీ)లో 3693 పోస్టుల భర్తీకి రైల్వే నియామక బోర్డు (ఆర్‌ఆర్‌బీ)లు ఆహ్వానం పలుకుతున్నాయి. పరీక్షలో ప్రతిభ చూపితే ఉద్యోగంలో చేరిపోవచ్చు. ఆ తర్వాత ఉన్నత స్థాయికీ చేరుకోవచ్చు!

కొలువుల రైలు.. ఇంటర్ చాలు!

ఐటీఐ, డిగ్రీ, ఇంటర్.. ఇలా పలు విద్యార్హతలతో ఆర్‌ఆర్‌బీ ప్రకటనలు దశలవారీ వెలువడ్డాయి. అలాగే వీటికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు తేదీలనూ పొడిగించారు. ఎన్‌టీపీసీ ఇంటర్, డిగ్రీ పోస్టులకు పరీక్ష విధానం, సిలబస్ ఒకటే. అందువల్ల డిగ్రీ విద్యార్హత ఉన్నవారు రెండింటికీ పోటీ పడొచ్చు. పరీక్షలు మాత్రం విడిగానే నిర్వహిస్తారు. డిగ్రీతో పోలిస్తే ఇంటర్మీడియట్ పోస్టుల ప్రశ్నలు కొంచెం తక్కువ కఠినంగా ఉంటాయి. అయినప్పటికీ పోటీ మాత్రం వీటికే ఎక్కువ. ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్నవాళ్లే కాకుండా డిగ్రీ, పీజీ.. అర్హతలు ఉన్నవారూ పోటీపడటమే కారణం. ఇప్పటికే ఎస్ఎస్‌సీ, బ్యాంకులు, రైల్వే ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నవారు రాణించగలరు. తాజా అభ్యర్థులూ ప్రణాళిక, నిబద్ధతతో శ్రమిస్తే విజయాన్ని అందుకోవచ్చు. పరీక్ష కోసం తెలుగు మాధ్యమాన్నీ ఎంచుకోవచ్చు. అభ్యర్థులు ఏదో ఒక ఆర్‌ఆర్‌బీలో ఖాళీలకు పోటీ పడగలరు.

ఎన్‌టీపీసీ ఇంటర్‌లో.. కమర్షియల్ కం టికెట్ క్లర్క్-2022, అకౌంట్స్ క్లర్క్ కం టైపిస్ట్-361, జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్-990, ట్రెయిన్స్ క్లర్క్-72 ఖాళీలున్నాయి. దివ్యాంగుల కోసం 248 పోస్టులు చేర్చారు. వీటిలో కమర్షియల్ క్లర్క్ కమ్ టికెట్ క్లర్క్ కొలువులకు లెవెల్-3 జీతం చెల్లిస్తారు. వీరికి రూ.21,700 మూలవేతనం దక్కుతుంది. అన్నీ కలిపి సుమారు రూ.40 వేలు వీరు పొందవచ్చు. మిగిలినవి లెవెల్-2 ఉద్యోగాలు. వీటికి రూ.19,900 మూలవేతనం చెల్లిస్తారు. అన్నీ కలిపి సుమారు రూ.36 వేలు మొదటి నెల నుంచే అందుకోవచ్చు.

ఎంపిక

అన్ని పోస్టులకూ రెండు దశల్లో నిర్వహించే కంప్యూటర్ బేస్డ్ టెస్టు (సీబీటీ)లో ప్రావీణ్యం తప్పనిసరి. టైపిస్ట్ (అకౌంట్స్ క్లర్క్, జూనియర్ క్లర్క్) పోస్టులకు టైపింగ్ స్కిల్ టెస్టు(టీఎస్‌టీ) నిర్వహిస్తారు. ఆ తర్వాత ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు నిర్వహించి ఉద్యోగంలోకి తీసుకుంటారు.

స్టేజ్-1: వంద ప్రశ్నలు. వీటికి 90 నిమిషాలు. జనరల్ అవేర్‌నెస్ 40, మ్యాథమెటిక్స్ 30, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 30 ప్రశ్నలు వస్తాయి.

స్టేజ్-2: స్టేజ్-1లో అర్హత పొందినవారి నుంచి, కేటగిరీల వారీ ఉన్న ఖాళీలకు మెరిట్ ప్రకారం 15 రెట్ల మందిని స్టేజ్-2కు అవకాశమిస్తారు. దీన్ని 120 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. జనరల్ అవేర్‌నెస్ 50, మ్యాథమెటిక్స్ 35, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 35 ప్రశ్నలు వస్తాయి.

అర్హతకు: స్టేజ్-1, స్టేజ్-2 లలో అన్ రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్ 40, ఓబీసీ ఎన్‌సీఎల్, ఎస్సీ 30, ఎస్టీ 25 శాతం మార్కులు పొందాలి. పీడబ్ల్యూడీలైతే వారి కేటగిరీ ప్రకారం అదనంగా మరో 2 శాతం మినహాయింపు దక్కుతుంది. రెండు దశల్లోనూ ప్రతి తప్పు సమాధానానికీ 1/3 మార్కు తగ్గిస్తారు. టైపిస్ట్ పోస్టులకు పోటీ పడేవారికి.. స్టేజ్-2లో అర్హుల జాబితా నుంచి మెరిట్ ప్రకారం కేటగిరీల వారీ ఖాళీలకు 8 రెట్ల సంఖ్యలో టైపింగ్ స్కిల్ టెస్టు నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధిస్తే సరిపోతుంది. ఇంగ్లిష్‌లో నిమిషానికి 30 పదాలు టైప్ చేయాలి.

సిలబస్‌లో..

- **మ్యాథమెటిక్స్:** నంబర్ సిస్టం, డెసిమల్స్, భిన్నాలు, కసాగు, గసాభా, రేషియో అండ్ ప్రపోర్షన్, శాతాలు, మెన్సురేషన్, కాలం-పని, కాలం-దూరం, బారు, చక్ర వడ్డీలు, లాభ నష్టాలు, ఎలిమెంటరీ ఆల్జీబ్రా, చలన జ్యామితి, త్రికోణమితి, ప్రాథమిక సాంఖ్యకశాస్త్రం.
- **జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్:** అనాలజీలు, నంబర్ అండ్ ఆల్ఫాబెటికల్ సిరీస్, కోడింగ్ అండ్ డీకోడింగ్, మ్యాథమెటికల్ ఆపరేషన్స్, పోలికలు-భేదాలు, సంబంధాలు, అనలిటికల్ రీజనింగ్, సిలాజిజం, జంబ్లింగ్, వెన్ డయాగ్రామ్స్, పజిల్, డేటా సఫిషియన్సీ, స్టేట్‌మెంట్-కన్‌క్లూజన్, స్టేట్‌మెంట్-కోర్సెస్ ఆఫ్ యాక్షన్, డెసిషసన్ మేకింగ్, మ్యాప్‌లు, ఇంటర్‌ప్రెటేషన్ ఆఫ్ గ్రాఫ్స్.
- **జనరల్ అవేర్‌నెస్:** జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాముఖ్యం సంతరించుకున్న తాజా సంఘటనలు, క్రీడలు, భారతీయ కళలు, సంస్కృతి, సాహిత్యం, చరిత్రక, దర్శనీయ స్థలాలు, పదో తరగతి స్థాయిలో జనరల్ సైన్స్, లైఫ్ సైన్స్, భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమం, భారతదేశ, ప్రపంచ జాగ్రఫీ, భారత ప్రభుత్వం, రాజ్యాంగం, రాజకీయ వ్యవస్థ, సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్, ప్రపంచవ్యాప్త అభివృద్ధి, స్పేస్, న్యూక్లియర్ కార్యక్రమాలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పర్యావరణ సమస్యలు, కంప్యూటర్లు, వాటి అనువర్తనాలకు సంబంధించి ప్రాథమికాంశాలు, అబ్రివేషన్లు, దేశ రవాణా వ్యవస్థ, దేశ ఎకానమీ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖులు, ప్రభుత్వ ముఖ్య కార్యక్రమాలు, మన భూభాగంలోని వృక్షాలు, జంతువులు, దేశంలో ముఖ్యమైన ప్రభుత్వ, పబ్లిక్ సెక్టార్ సంస్థలు.

సన్నద్ధత ఎలా?

■ పరీక్షలో విజయానికి సిలబస్‌పై అవగాహన కీలకం. ఇందుకోసం నోటిఫికేషన్‌లో విభాగాల వారీ ఉన్న ప్రశ్నాంశాలు (సిలబస్) బాగా పరిశీలించాలి. మీ దగ్గర ఉన్న వనరులు (గైడ్లు, అకడెమిక్, రిఫరెన్స్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్) నుంచి ఆ అంశాలనే బాగా అధ్యయనం చేయాలి. వాటిలో లేనివి.. అంతర్జాలం, ఇతర మార్గాల్లో సేకరించి బాగా చదవాలి.

■ స్టేజ్-1, స్టేజ్-2 సిలబస్ ఒకటే. అందువల్ల ఒకే సన్నద్ధతతో రెండు దశలనూ ఎదుర్కోవచ్చు. స్టేజ్-1 కంటే స్టేజ్-2 ప్రశ్నల కఠినత్వం ఎక్కువ. అందువల్ల ముందు ప్రాథమికాంశాలు పూర్తిగా చదవాలి. తర్వాత తేలిక, మధ్య స్థాయి ప్రశ్నలు బాగా సాధన చేయాలి.

■ ఏదైనా విభాగంలోని ఒక అంశాన్నే తీసుకుని ఒక రోజు కేటాయించుకోవచ్చు. అందులో వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. అలాగే ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి.

■ 2 నెలల్లో సిలబస్ క్షుణ్నంగా చదివి, మాదిరి ప్రశ్నలు సాధన చేయడం పూర్తవుతుంది. అనంతరం పాత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. పరీక్ష కోణంలో ఆలోచించి, ఏ అంశాలకు ప్రాధాన్యమివ్వాలో తెలుసుకుని, మళ్లీ చదివి, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించాలి.

■ పరీక్షకు నెల ముందు నుంచీ రోజూ మాక్ టెస్టులు రాయాలి. ఫలితాలు విశ్లేషించుకుని, చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకుని, స్కోరు పెంచుకోవడానికి కృషి చేయాలి.

■ రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియనివి వదిలేయాలి.

■ స్టేజ్-1లో ప్రతి ప్రశ్నకు 54 సెకన్ల సమయం దక్కుతుంది. కొన్నింటికి ఈ వ్యవధి సరిపోకపోవచ్చు. అందువల్ల వేగానికి ప్రాధాన్యముందని గ్రహించాలి. మెలకువలు పాటించి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

■ మ్యాథమెటిక్స్ విభాగంలో ప్రశ్నలకు ఆబ్జెక్టివ్ అరిథ్‌మెటిక్ -ఆర్‌ఎస్ అగర్వాల్ పుస్తకం సరిపోతుంది. ఈ విభాగంలో త్రికోణమితి, ఆల్జీబ్రా.. మొదలైన అంశాల కోసం పదో తరగతి గణిత పుస్తకాన్ని బాగా చదివి, వీలైనన్ని ప్రశ్నలు సాధన చేయాలి.

■ జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ విభాగానికీ ఆర్‌ఎస్ అగర్వాల్ రీజనింగ్ పుస్తకం లేదా ఏదైనా తీసుకోవచ్చు. ఏ పుస్తకం చదివినప్పటికీ పరీక్షలో పేర్కొన్న అంశాలకే పరిమితమై, వాటినే బాగా సాధన చేయాలి.

■ స్టేజ్-1, 2ల్లో ఎక్కువ ప్రాధాన్యం జనరల్ అవేర్‌నెస్‌దే. అందువల్ల అధిక సమయం ఈ విభాగానికి కేటాయించాలి. సిలబస్‌లో పేర్కొన్న అంశాలకు చెందిన తాజా వార్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే సరిపోతుంది. వర్తమాన వ్యవహారాల కోసం ఏప్రిల్ 2024 నుంచి పరీక్ష తేదీ వరకు ముఖ్య సంఘటనలు గుర్తుంచుకోవాలి. పత్రికలు చదువుతున్నప్పుడే ప్రశ్నగా రావడానికి అవకాశం ఉన్నవాటిని నోట్సు రాసుకుంటే.. పరీక్షకు ముందు తక్కువ వ్యవధిలోనే మరోసారి పునశ్చరణ చేసుకోవచ్చు. సీబీఎస్ఈ 8,9,10 తరగతుల సైన్స్, సోషల్ పుస్తకాలు బాగా చదివి ముఖ్యమైన విషయాలు నోట్సు రాసుకోవాలి.

ముఖ్య వివరాలు

అర్హత: ఇంటర్మీడియట్ లేదా తత్సమానం.

వయసు: జనవరి 1, 2025 నాటికి 18 నుంచి 33 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు కేటగిరీ ప్రకారం 10-15 ఏళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: అక్టోబరు 27.

దరఖాస్తు ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ట్రాన్స్‌జెండర్, ఈబీసీలకు రూ.250. వీరు సీబీటీకి హాజరైతే బ్యాంకు ఛార్జీలు మినహాయించి, మిగిలిన ఫీజు వెనక్కి చెల్లిస్తారు. ఇతర వర్గాల వారికి ఫీజు రూ.500. వీరు సీబీటీకి హాజరైతే రూ.400ల్లో బ్యాంకు ఛార్జీలు మినహాయించి మిగిలినవి వెనక్కి ఇస్తారు.

పరీక్ష తేదీలు: తర్వాత ప్రకటిస్తారు.

వెబ్‌సైట్: www.rrbapply.gov.in/#/auth/landing

నోట్: ఆర్‌ఆర్‌బీ ఎన్‌టీపీసీ (గ్రాడ్యుయేట్) 8383 పోస్టులకూ దరఖాస్తు గడువు అక్టోబరు 20 వరకు పొడిగించారు. డిగ్రీ విద్యార్హతతో వీటికి పోటీపడొచ్చు. ఐటీఐ లేదా అప్రెంటిస్ అర్హతతో 13,206 గ్రేడ్-3 టెక్నీషియన్ పోస్టులకు అక్టోబరు 16 లోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

రైట్స్ లిమిటెడ్‌లో టెక్నీషియన్లు

గుడ్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ (రైట్స్).. లిమిటెడ్ 15 ఒప్పంద టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
అర్హత: పదో తరగతి, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ. అప్రెంటిస్ (సివిల్ ఇంజినీరింగ్) సర్టిఫికెట్ తప్పనిసరి. **వేతనం:** నెలకు రూ.22,000- రూ.66,000. **దరఖాస్తు ఫీజు:** రూ.600; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు రూ.300. **ఎంపిక:** రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూల ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 8-11-2024.
వెబ్‌సైట్: https://www.rites.com/

సికింద్రాబాద్‌లో మెడికల్ పోస్టులు

సికిందరాబాద్‌లోని ఎక్స్ సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ స్టేషన్.. ఒప్పంద ప్రాతిపదికన 102 మెడికల్, పారామెడికల్, నాన్ మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
● ఓఐసీ పాలీక్లినిక్: 06 ● మెడికల్ స్పెషలిస్ట్: 03 ● మెడికల్ ఆఫీసర్: 24 ● గైనకాలజిస్ట్: 01 ● డెంటల్ ఆఫీసర్: 08 ● డెంటల్ హైజీనిస్ట్: 03 ● ఫార్మసిస్ట్: 12 ● ల్యాబ్ టెక్నీషియన్: 07 ● ల్యాబ్ అసిస్టెంట్: 01 ● నర్సింగ్ అసిస్టెంట్: 03 ● ఫిజియోథెరపిస్ట్: 03 ● ఐటీ నెట్‌వర్క్ టెక్నీషియన్: 01 ● ఫిమేల్ అటెండెంట్: 02 ● చౌకీదార్: 06 ● డ్రైవర్: 05 ● సఫాయివాలా: 09 ● క్లర్క్: 05 ● డీఈఓ: 02 ● ప్యూన్: 01
అర్హత: ఎనిమిదో తరగతి, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, డిప్లొమా, బీఎస్సీ డిగ్రీ, ఎంబీబీఎస్/ బీడీఎస్/ బీఫార్మసీ/ జీఎన్ఎం /ఎండీ/ ఎంఎస్‌తో పాటు పని అనుభవం.
వేతనం: ఓఐసీ పాలీక్లినిక్, మెడికల్ ఆఫీసర్, డెంటల్ ఆఫీసర్ పోస్టులకు నెలకు రూ.75,000; మెడికల్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్ పోస్టులకు రూ.1,00,000; టెక్నీషియన్, క్లర్క్, డీఈఓ, ప్యూన్, సఫాయివాలా, చౌకీదార్, అటెండెంట్ పోస్టులకు రూ.16,800; డ్రైవర్ పోస్టులకు రూ.19,700; మిగతా పోస్టులకు రూ.28,100. **ఎంపిక:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, షార్ట్‌లిస్ట్, పని అనుభవం, ఇంటర్వ్యూల ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 20-10-2024. **వెబ్‌సైట్:** https://www.echs.gov.in/

అప్రెంటిస్‌షిప్

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో...

కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను కోరుతోంది.
● ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్: 299 ● టెక్నీషియన్ అప్రెంటిస్: 8
మొత్తం ఖాళీలు: 307
విభాగాలు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మ్యాన్ (మెకానికల్/ సివిల్), పెయింటర్ (జనరల్/ మెరైన్), అకౌంటింగ్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, ఫుడ్ అండ్ క్రాఫ్ట్ బేకర్ తదితరాలు.
అర్హత: పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, ఒకేషనల్ హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్. **వయసు:** 23-10-2024 నాటికి 18 ఏళ్లు నిండాలి.
స్టైపెండ్: ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌కు నెలకు రూ.8,000; టెక్నీషియన్ అప్రెంటిస్‌కు నెలకు రూ.9,000. **ఎంపిక:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, షార్ట్‌లిస్ట్ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 23-10-2024.
వెబ్‌సైట్: https://cochinshipyard.in/



తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

డిజిటల్ ఇప్సమ్‌లో

1. డిజిటల్ మీడియా

నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, అడోబ్ ఎక్స్‌డీ, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫిగ్మా, స్కెచ్, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/bcde97

2. మోషన్ గ్రాఫిక్స్

నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫ్లాష్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, యానిమేషన్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/348ce4

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: క్రాస్‌రోడ్స్ హెల్ప్‌లైన్
నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, కంటెంట్ రైటింగ్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, గూగుల్ యాడ్‌వర్డ్స్, గూగుల్ అనలిటిక్స్, హెటీఎంఎల్ అండ్ సీఎస్ఎస్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్
స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/ad7ba4

లా/లీగల్

సంస్థ: కంపెనీ 360.ఇన్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.3,000
☛ internshala.com/i/2053eb

ఎర్న్‌వెల్‌లో

1. ఫైనాన్షియల్ డేటా అనలిటిక్స్

నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్‌పాయింట్, స్టాటిస్టికల్ మోడలింగ్ స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/902d7f

2. రిసెర్చ్ అనలిటిక్స్ ఇన్ ఫైనాన్షియల్ మార్కెట్స్

నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్‌పాయింట్, ఎంఎస్-వర్డ్, స్టాటిస్టికల్ మోడలింగ్
స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/28f1e1

3. ఫైనాన్స్ అండ్ వెల్త్ మేనేజ్‌మెంట్

నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్‌పాయింట్
స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/43fbb9

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: నవంబరు 6

స్మార్ట్ నోట్స్ ఎందుకు.. ఎలా?

తరగతి గదిలో జరిగే పాఠాలను పుస్తకంలోకి ఎక్కించుకుంటాం. ఆఫీస్ మీటింగుల్లో చర్చించిన ముఖ్యమైన విషయాలను నోట్స్‌లోనో, ఆప్‌లోనో రాసుకుంటాం. ఇలా చేసినపుడు కేవలం మనకు అందిన సమాచారాన్ని సేకరించి ఒక ప్రతిని దాచుకుంటాం. కానీ సోంకే అహ్రెన్స్ రాసిన 'హౌ టు టేక్ స్మార్ట్ నోట్స్' పుస్తకం నోట్సు తీసుకునే విధానాన్ని సమాచార సేకరణగా కాక లోతైన ఆలోచన, సృజనాత్మకతలను పెంచే సాధనంగా పరిచయం చేస్తుంది.

ఈ పుస్తకంలో రచయిత 'జెటెల్‌కాస్టెన్' అనే విధానాన్ని వివరిస్తారు. ఇది నోట్సు తీసుకునేందుకు వాడే ఫ్లాష్ కార్డ్ తరహా పద్ధతి. జర్మన్ సమాజ శాస్త్రవేత్త నిక్లాస్ లుహ్మాన్ ఈ పద్ధతిని సమర్థంగా ఉపయోగించి వేల పరిశోధనా పత్రాలూ, వ్యాసాలూ రాశారు. ఈ పద్ధతిలో ప్రతి చిన్న అంశం ఒక విడి పాయింటుగా, ఒక కార్డు మీద/ కాగితపు ముక్క మీద రాసుకుంటాం. ఒక కార్డుకూ, మరొక కార్డుకూ మధ్య ఒక అంకె ద్వారా సంబంధం ఉంటుంది. ఈ అంశాలు పరస్పరం ముడిపడి ఉంటాయి. అందువల్ల వాటిని సరైన సందర్భంలో తిరిగి చూడటం ద్వారా కొత్త విషయాలో, ఆలోచనలో రూపొందుతాయి.

> “నోట్స్ అనేది పుస్తకాలకు మాత్రమే పరిమితమైనది కాదు. చూసే వీడియోలో ఉపయోగకరమైనవి ఉంటే నోట్స్ తీసుకోవచ్చు. ఏదైనా సంభాషణలో ముఖ్యమైన పాయింట్లు వచ్చినా, కొత్త ఆలోచన స్ఫురించినా నోట్ చేసుకోవడం ప్రయోజనకరం.”

ఆలోచనల దొంతర

నోట్సు తీసుకునేటప్పుడు అవి కాగితం మీద ఉన్న రాతలు మాత్రమే అనిపించవచ్చు. కానీ స్మార్ట్ నోట్స్ పద్ధతిలో మనం విభిన్న విషయాల గురించి రాసిన ప్రతి నోట్సూ కొత్త ఆలోచనై ఉంటుంది. ఈ ఆలోచనలను సంబంధిత అంశాలతో ముడిపెట్టి రాస్తే, అవి ఒక ఆలోచనల దొంతరగా తయారవుతాయి. అలా మనం పాఠాలను లోతుగా అర్థం చేసుకోవడమే కాకుండా, చదువుకున్న విషయాలను మరింత మెరుగ్గా గుర్తుపెట్టుకోగలుగుతాం.


ఏ ప్రయోజనాలు?

- **లోతైన అవగాహన:** ఏదైనా విషయం చదివినప్పుడు, ఆ విషయాన్ని చిన్న చిన్న అంశాలుగా విభజించుకొని, బోధపడిన అంశాలను చిన్న నోట్సు రూపంలో రాసుకుంటే, అర్థం కానివి కూడా అర్థమవుతాయి. ప్రతి చిన్న అంశాన్ని రాసినప్పుడు, దాన్ని సంబంధిత అంశాలతో అనుసంధానం చేస్తాము. అలా పూర్తి విషయం అవగాహనకు వస్తుంది. .
- **విస్తృత సమాచార గ్రహింపు:** రాసిన ప్రతి నోట్సూ కొత్త ఆలోచనగా ఉంటుంది. పునశ్చరణ చేసే సమయంలో, వాటి మధ్య పోలికలను గమనించి కొత్త విషయాలను తెలుసుకుంటాం. ఈ విధంగా... గ్రహించిన విషయాలను విస్తరించుకోవడం సహజంగా జరుగుతుంది.
- **సేకరణ సులభతరం:** స్మార్ట్ నోట్సు తీసుకునే విధానం ద్వారా.. అనవసర సమాచారం వదిలేసి అవసరమైన అంశాలపైనే దృష్టి పెట్టగలుగుతాము. ఇది సమాచార సేకరణను సులభతరం చేస్తుంది.

ఆలోచనాత్మక సాధనం

నోట్సు తీసుకోవడమంటే పుస్తకం నింపడం కాదు, ఆలోచనలను ప్రేరేపించేలా అంశాలను నిక్షిప్తం చేయడం. స్మార్ట్ నోట్స్ పద్ధతిలో రాయడం కేవలం సమాచారాన్ని రికార్డ్ చేయడం కాదు. అది ఆలోచనలను విస్తరించడం. రాసుకున్న అంశాల నుంచి ప్రశ్నలు తయారు చేసుకొని, వాటికి వివరణలు రాసుకొని, ఆ వివరణల కోసం వివిధ అంశాలను సమన్వయం చేయడాన్ని ఇది ప్రేరేపిస్తుంది. ప్రతి విషయంపై చిన్న నోట్సు రాసుకుంటే, అన్నీ కలిపి పెద్ద పరిశోధనకో, వ్యాసానికో మార్గం చూపుతాయి. ఇది విద్యార్థులకూ, పరిశోధకులకూ ముఖ్యమైన ఆలోచనాత్మక సాధనంగా ఉంటుంది.

పుస్తకం



ప్రస్తుతం విద్యార్థులు సమాచారాన్ని వెనువెంటనే గ్రహించడం కన్నా, దాన్ని రికార్డ్ చేసి తర్వాత వినవచ్చని దాటవేస్తున్నారు. నోట్సు రాసే పద్ధతిని చాలామంది మర్చిపోయారు. కానీ ఈ పుస్తకం మనకు చూపించే విధానం చదువులో కొత్త మార్గాలను ఏర్పరచగలదు. షార్ట్ నోట్సు తీసుకుంటే చదువుతున్న విషయాలను లోతుగా అర్థం చేసుకుని, వాటిని సృజనాత్మకంగా ఉపయోగించుకోవడం సాధ్యమవుతుంది. పైగా ఈ పద్ధతిని అలవాటు చేసుకుంటే కొత్త అంశంపై పరిశోధన చేయాలన్నా, సృజనాత్మక రచన చేయాలన్నా సహజంగా ఆలోచనలు వస్తాయి

జ్ఞానార్జనకు మార్గం

స్మార్ట్ నోట్స్ పద్ధతి ఆధునిక యుగంలో విద్యార్థులకూ, పరిశోధకులకూ అత్యంత ఉపయోగకరమైన పద్ధతిగా నిలుస్తుంది. చదువును ఒక పనిగా కాకుండా జ్ఞాన సేకరణ కోసం సృజనాత్మక ప్రయత్నంగా మార్చే సామర్థ్యంతో ఉంటుంది. అందువల్ల యువత ఈ పద్ధతిని అందిపుచ్చుకొని తమ విద్యలో, కెరియర్లో ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారు.

చిన్న నోట్స్ తీసుకోవడం ద్వారా పెద్ద ఐడియాలను ఎలా నిర్మించాలో ఈ పుస్తకం చూపిస్తుంది. ఈ పద్ధతి ద్వారా అభ్యాసాన్నీ, ఆలోచనలనూ మెరుగుపర్చుకోవచ్చు. ముఖ్యంగా విద్యార్థులూ, పోటీ పరీక్షలు రాసేవారూ, పరిశోధకులూ ఈ పద్ధతిని అలవర్చుకుంటే చదువులో, కెరియర్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.

– రహ్మాన్ & సంపత్

మెడికల్ కోడింగ్ మెరుగేనా?

బీఎస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్) పూర్తిచేశాను. మెడికల్ కోడింగ్ నేర్చుకోవాలనుకుంటున్నాను. భవిష్యత్తులో ఈ కోర్సుతో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? – కె.ప్రభాకర్, హైదరాబాద్



■ సాధారణంగా మెడికల్ కోడింగ్ కోర్సును బయాలజీ, మెడికల్, హెల్త్‌కు సంబంధించిన డిగ్రీలు చదివినవారు నేర్చుకుంటారు. మీరు డిగ్రీలో మ్యాథ్స్, ఫిజిక్స్‌లతోపాటు కంప్యూటర్ సైన్స్ కూడా చదివారు కాబట్టి మెడికల్ కోడింగ్ కోర్సును నేర్చుకోవడంలో ఇబ్బంది ఏమీ ఉండదు. కాకపోతే, మొదట్లో మెడికల్, హెల్త్, హాస్పిటల్స్‌కు సంబంధించిన సాంకేతిక పదాలను నేర్చుకోవాలి. మెడికల్ కోడింగ్‌లో శిక్షణ పొందినవారు మెడికల్ కోడర్, క్లినికల్ డాక్యుమెంటేషన్ స్పెషలిస్ట్, మెడికల్ కోడింగ్ ఆడిటర్, హెల్త్ ఇన్ఫర్మేషన్



టెక్నీషియన్, రిమోట్ కోడర్, మెడికల్ బిల్లింగ్ అండ్ కోడింగ్ కన్సల్టెంట్ హోదాల్లో ఉద్యోగాలు పొందొచ్చు. మెడికల్ కోడింగ్‌లో శిక్షణ పొందినవారికి మెడికల్ కోడింగ్ కంపెనీలూ, హాస్పిటల్స్, ఇన్సూరెన్స్ కంపెనీలూ, హెల్త్ కేర్ కన్సల్టింగ్ సంస్థలూ, టెలిహెల్త్ ప్రొవైడర్స్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. మెడికల్ కోడర్స్‌గా రాణించాలంటే- సూక్ష్మ పరిశీలన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం, విశ్లేషణ నైపుణ్యాలు, హెల్త్ కేర్ రంగంలో నిరంతరం వస్తున్న మార్పులపై అవగాహన చాలా ముఖ్యం.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్



(c) eenadu

ప్రిపరేషన్ టెక్నిక్

గణితంలో రకరకాల ప్రశ్నలను రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేయాలి. సూత్రాలు, సిద్ధాంతాలు, సంక్షిప్త పద్ధతులను ప్రధానంగా అధ్యయనం చేయాలి. క్లిష్టమైన ప్రశ్నలను స్టెప్ బై స్టెప్ చేయడం నేర్చుకోవాలి.

ఏపీపీఎస్సీ
జనరల్ స్టడీస్-అరిథ్‌మెటిక్
కోడింగ్ - డీకోడింగ్

కరెంట్ అఫైర్స్



■ 2024లో జెనీవాలో నిర్వహించిన 'కొలంబో ప్రాసెస్' సమావేశానికి ఏ దేశం నాయకత్వం వహించింది?
(2003లో ఏర్పాటు చేసిన 'కొలంబో ప్రాసెస్'లో 12 ఆసియా దేశాలు సభ్యులుగా ఉన్నాయి. అవి భారత్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, చైనా, కాంబోడియా, ఇండొనేసియా, నేపాల్, పాకిస్థాన్, ఫిలిప్పీన్స్, శ్రీలంక, థాయ్‌లాండ్, వియత్నాం. సురక్షితమైన, క్రమబద్ధమైన వలసల కోసం సహకారాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా 'కొలంబో ప్రాసెస్' పనిచేస్తుంది.) **జ:** భారత్

మాదిరి ప్రశ్నలు

■ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొత్తం ఎన్ని కేబినెట్ కమిటీలను ఏర్పాటు చేశారు? (కేంద్రమంత్రి మండలిలో ప్రధాని మోదీ సహా మొత్తం 72 మంది ఉన్నారు. వీరిలో 31 మంది కేబినెట్ స్థాయి మంత్రులు. వీరు కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీల్లో భాగంగా ఉంటారు.) **జ:** 8

■ 2024, జులై 21 నుంచి 27 వరకు 57వ ఆగ్నేయాసియా దేశాల (ఆసియన్) విదేశాంగ మంత్రుల సమావేశాన్ని ఎక్కడ నిర్వహించారు?
జ: వియాంటియాన్ (లావోస్ రాజధాని)

■ ప్రపంచంలోనే మొదటి సీఎన్‌జీ మోటార్ సైకిల్‌ను ఇటీవల ఏ సంస్థ ఆవిష్కరించింది? (దీనికి 'ఫ్రీడమ్' అని పేరు పెట్టారు.) **జ:** బజాజ్ ఆటో

మరింత సమాచారం

సీనియర్ ఇంటర్
వృక్ష శాస్త్రం



అల్పగాఢత వైపు అణువుల చలనం!

వృక్ష శరీర ధర్మశాస్త్రం - మొక్కల్లో రవాణా

ప్రశ్నలు జవాబులు

2 మార్కులు

1) పోరిన్‌లు అంటే ఏమిటి? విసరణలో వాటి పాత్ర ఏమిటి?
జ: ★ పోరిన్‌లు అనేవి ప్రొటీన్‌లు. ★ ఇవి పెద్ద సైజ్ రంధ్రాలను ఏర్పరుస్తాయి.
★ వీటి ద్వారా చిన్న సైజ్ ప్రొటీన్‌ల పరిమాణంతో, దాదాపు సమానంగా ఉన్న అణువులను ప్రయాణించడానికి అనుమతి ఇస్తాయి.

2) విసరణ, ద్రవాభిసరణకు మధ్య భేదం ఏమిటి?
జ: ★ అధిక గాఢత ప్రాంతం నుంచి అల్ప గాఢత ఉండే ప్రాంతానికి అణువులు చలించే ప్రక్రియ - విసరణ.
★ అర్ధపార గమ్యత్వచం ద్వారా అల్ప గాఢ ద్రావణం నుంచి అధిక గాఢ ద్రావణంలోకి ద్రావణి విసరణ చెందే ప్రక్రియ - ద్రవాభిసరణ.

3) అపోప్లాస్ట్, సింప్లాస్ట్ అంటే ఏమిటి?
జ: ★ మొక్కల్లో నీటి గమనం త్వచాల ద్వారా కాకుండా కణాంతరవకాశాల ద్వారా జరిగే విధానం - అపోప్లాస్ట్.
★ మొక్కల్లో త్వచాల ద్వారా జరిగే నీటి గమనమే సింప్లాస్ట్.

4) బాష్పోత్సేకం, బిందు స్రావానికి మధ్య భేదం ఏమిటి?
జ: ★ మొక్కల వాయుగత భాగాల నుంచి నీరు ఆవిరి రూపంలో వాతావరణంలోకి విడుదల అయ్యే ప్రక్రియ బాష్పోత్సేకం.
★ పత్రాల నుంచి నీరు ద్రవ రూపంలో విడుదల అయ్యే చర్య - బిందుస్రావం.

5) మొక్కల దారువు ద్వారా జరిగే ద్రవోద్గమానికి కారణమయ్యే నీటి భౌతిక ధర్మాలు ఏవి?
జ: సంసంజన బలాలు, అసంజన బలాలు, బాష్పోత్సేకాకర్షణ.

ముఖ్యమైనవి మరికొన్ని..

2 మార్కులు

1) మొక్కల కణాల్లో జరిగే ఆహార పదార్థాల రవాణాకు సంబంధించి వినియోగ కేంద్రం, ఉత్పత్తి కేంద్రంగా పనిచేసేవి ఏవి?
2) బాష్పోత్సేకం రాత్రివేళల్లో జరుగుతుందా? ఉదాహరణ ఇవ్వండి.
3) పత్ర రంధ్రాలు తెరుచుకున్న, మూసుకున్న సమయాల్లో రక్షక కణాల pHను సరిపోల్చండి.

జవాబుల కోసం

– టి. విజయలక్ష్మి

SUBSCRIBE CHANNEL

స్థిరమైన ఉపాధి.. మెరుగైన ఆదాయం!

వ్యవసాయ అనుబంధ వృత్తులు

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ

వ్యవసాయ ప్రధానమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనుబంధ రంగాల్లోనూ అభివృద్ధిని సాధిస్తోంది. ఇక్కడి భౌగోళిక, వాతావరణ అనుకూలతలతో రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సమర్థంగా వినియోగించుకుంటూ పాడి పరిశ్రమ, కోళ్లు, చేపల పెంపకం తదితరాల్లో గణనీయ ప్రగతి సాధిస్తున్నారు. ఫలితంగా దేశంలో పాలు, మాంసం, కోడిగుడ్లు, చేపలు, పట్టుగూళ్లను ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో ఏపీ తొలివరుసలో ఉంది. రైతులకు స్థిరమైన ఉపాధి, మెరుగైన ఆదాయాన్ని సమకూరుస్తూ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు అండగా నిలుస్తున్న ఈ వ్యవసాయ అనుబంధ రంగాల స్థితిగతులపై పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు సమగ్ర అవగాహన ఉండాలి. వాటికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవస్థాగత ఏర్పాట్లు, అభివృద్ధి కేంద్రాలతో పాటు వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులకు కేంద్రాలుగా మారిన ప్రాంతాలు, పట్టణాల గురించి తెలుసుకోవాలి.



రైతులు వ్యవసాయంతోపాటు అదనపు ఆదాయాలు సమకూర్చుకోవడానికి అనేక రకాల అనుబంధ వృత్తులపై ఆధారపడతారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ అనుబంధ పశుసంవర్థక వృత్తులైన పాడిపరిశ్రమ, గొర్రెల పెంపకం, పట్టుపురుగుల పెంపకం లాంటి వాటిపై శ్రద్ధ చూపుతారు. నీటిపారుదల సౌకర్యాలున్న ప్రాంతాల్లోని రైతులు చేపలు, రొయ్యల పెంపకం లాంటి వృత్తులు చేపడతారు. కోళ్ల పెంపకమూ ఈ రకమైనదే.

పశుగణాభివృద్ధి: 1948లో అధిక పాల దిగుబడిని ఇచ్చే మేలురకం ఆవులతోపాటు ఎద్దుల సంతతి పెంచేందుకు విశాఖపట్నంలో ఒక పశుక్షేత్రాన్ని ఏర్పాటుచేశారు. దక్షిణ భారతదేశంలో మొదటిసారిగా ప్రామాణీకరించిన వెన్న శాతం తగ్గించిన పాల తయారీ విశాఖపట్నంలో మొదలైంది. ఇక్కడ ముర్రా జాతి గేదెల పెంపకం చేపట్టారు. మేలు రకం ఒంగోలు జాతి ఎద్దులు రాయలసీమ జిల్లాలకు సరఫరా చేయడానికి 1954లో మహానందిలో ఒక క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. పేదల గోవుగా పేరొందిన పుంగనూరు పశువుల అభివృద్ధికి పలమనేరులో ఒక క్షేత్రాన్ని నెలకొల్పారు. చింతలదీవి వద్ద ఒంగోలు జాతి గిత్తలు, పుంగనూరు జాతి పశువుల అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. 1955-56లో గుంటూరు, కర్నూలులో పాల సరఫరా సహకార సంఘాలను ఏర్పాటు చేశారు. బాపట్లలో పశు విద్యా శిక్షణ కోసం కళాశాల స్థాపించారు. ఆంధ్రా ప్రాంతంలో 27 పశు విద్యాసంస్థలు, పశు వైద్యశాలలు, పశువైద్య ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు.

పాడి పరిశ్రమ: 1960-61 మధ్య ఆసక్తి కలిగిన వ్యవసాయదారులు, రైతులకు పాడిపరిశ్రమ లాంటి వృత్తులు చేపట్టడానికి రాయితీ రేట్లపై దీర్ఘకాల రుణాలు ఇచ్చారు. మూడో పంచవర్ష ప్రణాళిక కాలంలో విశిష్ట పాలసరఫరా పథకాన్ని నాటి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలకు విస్తరించారు. ఈ కార్యక్రమాల వల్ల రాష్ట్రంలో సగటు రోజువారీ పాలఉత్పత్తి 58 వేల లీటర్ల నుంచి 4.75 లక్షల లీటర్లకు పెరిగింది.

> 2019–20లో పశుగణాభివృద్ధిలో దేశంలో ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో ఉంది. ఇదే సంవత్సరంలో స్థూల రాష్ట్రీయ ఉత్పత్తిలో 11.30% ఈ రంగం నుంచి లభించింది. రాష్ట్రంలో గేదెలు, గొర్రెల సంఖ్య స్థిరంగా పెరుగుతోంది. 1999 నుంచి కోళ్ల సంఖ్య విపరీతంగా ఎక్కువైంది.

రూ.106.38 లక్షల వ్యయంతో విజయవాడ సంఘటిత పాలకేంద్రాన్ని ఆధునీకరించి రోజుకు 1.75 లక్షల లీటర్ల పాలఉత్పత్తి చేశారు. పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ ఏర్పాటుచేసి 1984-85 నాటికి పాల ఉత్పత్తి 2.7 మిలియన్ టన్నులను పెంచారు.

గొర్రెల పెంపకం పరిశ్రమ: 1966 పశుగణాంకాల ప్రకారం రాష్ట్రంలో 117.6 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయి. రాష్ట్ర పశుసంపదలో వీటి వాటా 37 శాతం. గొర్రెల సంఖ్యలో రాష్ట్రం దేశంలో ప్రథమ స్థానంలో ఉంది. రాయలసీమ ప్రాంతంలో క్షామపీడిత ప్రాంతాల కార్యక్రమం (డీపీఏపీ) కింద అనేక గొర్రెల పెంపకాల కేంద్రాలను నెలకొల్పి వాటికి అవసరమైన పచ్చిక, గ్రాసం సరఫరా ఏర్పాట్లు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థను స్థాపించి రూ.150 లక్షల వ్యయంతో గొర్రెల పెంపక పథకాలను చేపట్టారు.

కోళ్ల పెంపకం పరిశ్రమ: 1966 పశుగణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 147 లక్షల కోళ్ల సంఖ్యతో దేశంలో మొదటి స్థానంలో ఉంది. రాష్ట్రంలో గ్రామీణ కోడి నుంచి సగటున ఏటా లభించే గుడ్లు 66 అని అంచనా. రాష్ట్రంలో రాయలసీమ కోళ్ల పరిశ్రమలో ముందంజలో ఉంది. ఆరో పంచవర్ష ప్రణాళిక కాలంలో ఆంధ్రప్రదేశ్ మాంసాభివృద్ధి సంస్థను స్థాపించి బ్రాయిలర్ కోళ్లు, గుడ్లు అధికంగా ఉత్పత్తి చేశారు. 1985-90 మధ్య కాలంలో భారత్‌లో తలసరి గుడ్ల వినియోగం 21 అయితే, ఆంధ్రప్రదేశ్‌లో ఆ సంఖ్య 19గా ఉంది. రాష్ట్ర కోళ్ల పరిశ్రమకు సహాయం అనే పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వనరాజ, గ్రామప్రియ మల్టిఫికేషన్ ఫామ్ పేరుతో హేచరీ నెలకొల్పి ఉమ్మడి కడప జిల్లా ఊటుకూరు, ఉమ్మడి నెల్లూరు జిల్లా అల్లూరు, ఉమ్మడి విజయనగరం జిల్లా గరివిడి వద్ద ఫామ్‌లు ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రి పథకం కింద కోళ్ల పరిశ్రమ కార్యక్రమం ద్వారా ఒక్కో కోళ్ల పరిశ్రమ యూనిట్ మొత్తం ఖర్చు రూ.13,000. ఇందులో సగాన్ని రాయితీగా ఇస్తున్నారు.

చేపల పెంపకం పరిశ్రమ: మొదటి ప్రణాళిక కాలంలో రాష్ట్ర మత్స్య పరిశ్రమ శాఖ 288 టన్నుల చేపలు రవాణా చేసినట్లు అంచనా. విశాఖపట్నంలో చేపల నిల్వల కోసం ఐస్‌ప్లాంటును నెలకొల్పారు. 1956-61 మధ్యకాలంలో ఇక్కడ చేపలు పట్టడానికి మర నౌకలు తయారు చేశారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న 600 చెరువులను చేపల పెంపకానికి ఉపయోగించారు. 1974 -78 కాలంలో మంచినీటి రొయ్యల సంవర్థన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ప్రపంచబ్యాంకు సహకారంతో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ మెరైన్ ప్రాన్‌కల్చర్ ద్వారా చేపల పెంపకాన్ని చేపట్టారు. రాష్ట్రంలో చేపల పెంపకం ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 14.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఇందిరమ్మ పథకం ద్వారా 50 శాతం రాయితీతో మత్స్యకారులకు గృహనిర్మాణ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఓడరేవు, ఉమ్మడి కృష్ణాజిల్లా లక్ష్మీపురం, పల్లెపాలెం; ఉమ్మడిప్రకాశం జిల్లా గుండాయిపాలెం, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉప్పాయిపాలెం లాంటి ప్రదేశాల్లో ఫిష్‌లాండింగ్ కేంద్రాలను నెలకొల్పి చేపల పరిశ్రమ అభివృద్ధి చేస్తున్నారు. 2019-20లో మొత్తం సహకార సంఘాల్లో 60 శాతం ఇన్‌లాండ్ మత్స్యకారుల సంఘాలే. వీటిలో ఒక్కోదానిలో సగటున 98 మంది సభ్యులున్నారు.



ఆంధ్రప్రదేశ్ మత్స్య విధానం: ఆంధ్రప్రదేశ్ మత్స్యవిధానం 2015-2020ని 2015, అక్టోబరు 31న ప్రకటించింది. 2020 నాటికి చేపల ఉత్పత్తిని 19.64 లక్షల టన్నుల నుంచి 42 లక్షల టన్నులకు, ఎగుమతులను రూ.16,000 కోట్ల నుంచి రెట్టింపు చేయాలని నిర్దేశించింది. రాష్ట్రంలో మత్స్యకారుల జనాభా 6.05 లక్షలు ఉండగా ఇందులో చేపల వేటకు వెళ్లేవారు 1.5 లక్షలమంది ఉన్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీలో మత్స్యరంగం వాటా 6.01%. 2019-20 నాటికి దేశంలో ఏటా సగటు చేపల వినియోగం 11 కిలోలుండగా, ఏపీలో 7.4 కిలోలు మాత్రమే ఉంది.



పట్టు పరిశ్రమ: కరవు ప్రాంతాల్లో డీపీఏపీ పథకం ద్వారా మల్బరీ తోటలను పెంచుతున్నారు. ఇందులో ఉపాధి పొందుతున్న వారిలో 60% మంది మహిళలు. దేశంలో మల్బరీ లాసర్ పట్టుగూళ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో లాసర్, ఎరీ, మైగా మల్బరీ రకాల పట్టుదుస్తులు తయారవుతున్నాయి. పట్టును అధికంగా ఉత్పత్తి చేసే రాష్ట్రం కర్ణాటక. రెండోది ఆంధ్రప్రదేశ్. రాష్ట్రంలో శ్రీ సత్యసాయి జిల్లాలో పట్టు ఉత్పత్తి అధికంగా జరుగుతోంది. ఏపీలో పట్టు పరిశ్రమకు ప్రసిద్ధి చెందిన కేంద్రాలు హిందూపురం, ధర్మవరం, పెనుగొండ, కదిరి, గోరంట్ల (సత్యసాయి); ఉప్పాడ, పెద్దాపురం (కాకినాడ), వెంకటగిరి (తిరుపతి).

> కేంద్ర సిల్క్ బోర్డు బెంగళూరులో ఉంది. ఆంధ్రప్రదేశ్ సెరికల్చర్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌ను హిందూపురంలో 1995లో ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో 70,702 మంది రైతులు 1,24,983 ఎకరాల్లో మల్బరీ తోటలను పెంచుతున్నారు.



రచయిత: ధరణి శ్రీనివాస్

అతి సమృద్ధిగా లభించే అల్యూమినియం!

లోహసంగ్రహణ శాస్త్రం

ప్రకృతిలో లభించే ధాతువుల నుంచి లోహాలను సంగ్రహించడం, వాటిని శుద్ధి చేయడం, మిశ్రమ లోహాల తయారీ తదితర అంశాలను లోహసంగ్రహణ శాస్త్రం తెలియజేస్తుంది. నిత్య జీవితాలకు అవసరమయ్యే వినియోగ వస్తువులు, పారిశ్రామిక, రసాయన ఉత్పత్తులెన్నో ఈ శాస్త్ర పరిజ్ఞానం ఆధారంగానే తయారవుతున్నాయి. ఈ నేపథ్యంలో లోహ సంగ్రహ దశలు, లోహశుద్ధి పద్ధతులు, ముఖ్యమైన లోహాలు, వాటి ఉపయోగాలు, సాధారణ మిశ్రమాల్లో ఉండే వివిధ రకాల లోహాల శాతాల గురించి పోటీ పరీక్షల అభ్యర్థులకు అవగాహన ఉండాలి. వివిధ పదార్థ స్వభావాలు, క్షయకరణిలు, భిన్న ప్రయోజనాలు, ప్రధాన లోహాలు, మిశ్రమాల రసాయన ఫార్ములాలను గుర్తుంచుకోవాలి.



డీఎస్సీ - రసాయన శాస్త్రం

1. భూపటలంలో అతిసమృద్ధిగా లభించే లోహం?
   1) ఆక్సిజన్ 2) అల్యూమినియం 3) జింక్ 4) ఇనుము
2. ముడిఖనిజంతో కలిసిపోయి ఉన్న మలినాలను ఏమంటారు?
   1) గాంగ్ 2) ద్రవకారి 3) లోహమలం 4) ఖనిజం
3. గెలీనా అనేది దేని ధాతువు?
   1) Zn 2) Pb 3) Hg 4) Au
4. ప్లవన ప్రక్రియను ఏ రకమైన ధాతువు సాంద్రీకరణలో ఎక్కువగా ఉపయోగిస్తారు?
   1) సల్ఫైడ్ 2) ఆక్సైడ్ 3) కార్బొనేట్ 4) నైట్రేట్
5. లోహాలను శుద్ధి చేసే ప్రక్రియలో సరైంది ఏది?
   1) చేతితో ఏరివేయడం 2) పోలింగ్ 3) ప్లవన ప్రక్రియ 4) అయస్కాంత వేర్పాటు
6. కిందివాటిలో ప్రకృతిలో సహజసిద్ధంగా లభ్యమయ్యే లోహం?
   1) Pb 2) Au 3) Fe 4) Cu
7. కిందివాటిలో కార్బొనేట్ ధాతువు ఏది?
   1) మాగ్నసైట్ 2) బాక్సైట్ 3) జిప్సం 4) మాగ్నటైట్
8. కిందివాటిలో జిప్సమ్ ఫార్ములా ఏది?
   1) $CaSO_4.2\ H_2O$
   2) $CaSO_4\ 1/2\ H_2O$
   3) $CuSO_4.5\ H_2O$
   4) $CuSO_4 1/2\ H_2O$
9. ఎప్సం లవణంలో ఉన్న నీటి అణువుల సంఖ్య?
   1) 4 2) 5 3) 7 4) 6
10. ప్లవన ప్రక్రియలో ఉపయోగించే నూనె?
    1) కిరోసిన్ 2) పైన్ నూనె 3) కొబ్బరి నూనె 4) ఆలివ్ నూనె
11. థర్మైట్ ప్రక్రియలో క్షయకరణిగా ఉపయోగించేది?
    1) Mg 2) Fe 3) Al 4) Si
12. కిందివాటిలో ఉష్ణరసాయన ప్రక్రియ?
    1) భర్జనం 2) భస్మీకరణం 3) ప్రగలనం 4) పైవన్నీ
13. విద్యుత్తు క్షయకరణ పద్ధతిని కిందివాటిలో వేటిని సంగ్రహణం చేయడానికి ఉపయోగిస్తారు?
    1) అల్పచర్యాశీలతా లోహాలను
    2) అధిక చర్యాశీలతా లోహాలను
    3) మధ్యస్థ చర్యాశీలతా లోహాలను
    4) అర్ధ లోహాలను
14. భర్జనం, భస్మీకరణం ప్రక్రియలను నిర్వహించడానికి అనుకూలమైన కొలిమి?
    1) రివర్బరేటరీ కొలిమి 2) బ్లాస్ట్ కొలిమి 3) ఒపెన్‌హర్త్ కొలిమి 4) రిటార్ట్ కొలిమి
15. బ్లాస్ట్‌కొలిమిని ఏ ప్రక్రియకు ఉపయోగిస్తారు?
    1) భర్జనం 2) ప్రగలనం 3) భస్మీకరణం 4) స్వేదనం
16. ఏ పద్ధతిలో ద్రవస్థితిలో ఉన్న లోహాన్ని పచ్చికర్రలతో కలుపుతారు?
    1) పోలింగ్ 2) అంశ్విక స్వేదనం 3) ప్లవన ప్రక్రియ 4) గలనం
17. ఇనుప వస్తువులు తుప్పు పట్టకుండా ఉండేందుకు కింది పద్ధతుల్లో ఏది ఉపయోగకరమైంది?
    1) గ్రీజు పూయడం 2) పెయింట్ వేయడం 3) జింక్ పూత 4) పైవన్నీ
18. 'ఉక్కు' ఏ రెండు లోహాల మిశ్రమం?
    1) ఐరన్, జింక్ 2) ఐరన్, కార్బన్ 3) క్రోమియం, ఐరన్ 4) జింక్, క్రోమియం
19. కంచు తయారీలో ఉపయోగించే లోహాలు?
    1) కాపర్, టిన్ 2) కాపర్, సిల్వర్ 3) జింక్, టిన్ 4) క్యాల్షియం, టిన్
20. ఇనుము తుప్పు రసాయన ఫార్ములా గుర్తించండి.
    1) ఆర్ద్రఫెర్రిక్ ఆక్సైడ్ 2) ఐరన్ ఆక్సైడ్ 3) ఆర్ద్రఫెర్రస్ ఆక్సైడ్ 4) మాగ్నటిక్ ఆక్సైడ్
21. కిందివాటిలో కార్బొనేట్ ధాతువు కానిది?
    1) మాగ్నసైట్ 2) కార్నలైట్ 3) డోలమైట్ 4) ఏదీకాదు
22. కిందివాటిలో ఆక్సైడ్ ధాతువును గుర్తించండి.
    1) బాక్సైట్ 2) జింకైట్ 3) పైరోల్యూసైట్ 4) పైవన్నీ
23. లెడ్ : గెలీనా :: పాదరసం.......
    1) హార్న్‌సిల్వర్ 2) సిన్నబార్ 3) జింక్‌బ్లెండ్ 4) జింకైట్
24. ఐరన్ ఆక్సైడ్, అల్యూమినియంతో చర్య నొంది ద్రవ ఐరన్‌గా క్షయకరణం చెందే చర్యను ఏమంటారు?
    1) గాల్వనీకరణం 2) భర్జనం 3) థర్మిట్ చర్య 4) భస్మీకరణం
25. ద్రవరూప లోహ లవణాల విద్యుత్తు విశ్లేషణలో లోహం నిక్షిప్తమయ్యే ప్రదేశం?
    1) ఆనోడ్ 2) క్యాథోడ్ 3) పాత్ర పైభాగాన 4) పాత్ర అడుగున
26. టిన్ ముఖ్య ధాతువు టిన్‌స్టోన్. దానిలో వోల్ఫ్రమైట్ ($FeWO_4$) అనే మలినం కలిసి ఉంది. ధాతువు నుంచి మలినం తొలగించడానికి వాడే ప్రక్రియ?
    1) ప్లవన ప్రక్రియ 2) అయస్కాంత వేర్పాటు 3) పోలింగ్ 4) చేతితో ఏరివేయడం
27. లోహనిష్కర్షణ క్రియలో క్షయకరణిగా వాడేది?
    1) కోక్ 2) O_2 3) $KMnO_4$ 4) ఏదీకాదు
28. సాధారణంగా లోహ ఆక్సైడ్‌లను లోహాలుగా మార్చే ప్రక్రియ?
    1) భర్జనం 2) భస్మీకరణం 3) ఆక్సీకరణం 4) క్షయకరణం
29. విద్యుత్తు విశ్లేషణలో క్యాథోడ్ వద్ద జరిగే చర్య?
    1) ఆక్సీకరణం 2) క్షయకరణం 3) రెడాక్స్ చర్య 4) విద్యుత్తు సంశ్లేషణం
30. రైల్వేట్రాక్‌లోని రైలు పట్టాలను కలపడానికి వాడే క్షయకరణి?
    1) Al 2) CO_2 3) SO_2 4) NO_2
31. ధాతువును సాంద్రీకరించడంలో సరికాని అంశం?
    1) నీటితో కడగడం 2) ప్లవన ప్రక్రియ 3) అయస్కాంత వేర్పాటు 4) స్వేదనం
32. కిందివాటిలో కాపర్ ఐరన్ పైరైటీస్ ఫార్ములా?
    1) CuFeS 2) $CuFeS_4$ 3) $CuFeS_2$ 4) $CuFeS_3$
33. ఖనిజ మాలిన్యం క్షార స్వభావం కలిగి ఉండటానికి కలపాల్సిన ద్రవకారి?
    1) CaO 2) MgO 3) SiO_2 4) CuO
34. కింది ధాతువుల్లో సల్ఫైడ్ ధాతువు కానిది?
    1) జింక్‌బ్లెండ్ 2) సిన్నాబార్ 3) గెలీనా 4) హెమటైట్
35. సల్ఫైడ్ ధాతువు స్వయం క్షయకరణం ద్వారా ఏ లోహాన్ని సంగ్రహిస్తారు?
    1) మెగ్నీషియం 2) కాపర్ 3) ఐరన్ 4) సీసం
36. 22 క్యారెట్ల బంగారం వేటి మిశ్రమ లోహం?
    1) 2 భాగాలు వెండి, 22 భాగాలు బంగారం
    2) 2 భాగాలు రాగి, 22 భాగాలు బంగారం
    3) 4 భాగాలు వెండి, 18 భాగాలు బంగారం
    4) 20 భాగాలు వెండి, 2 భాగాలు బంగారం
37. అత్యధిక ఉష్ణాన్ని తట్టుకుని కరిగిపోకుండా ఉండగల పదార్థాలు?
    1) దుర్గలనీయ పదార్థాలు 2) పారదర్శక పదార్థాలు 3) చర్యాశీల పదార్థాలు 4) ఉత్పతన పదార్థాలు
38. అగ్ని గది, హర్త్ విడివిడిగా ఉండే కొలిమి?
    1) బ్లాస్ట్ కొలిమి 2) రిటార్డ్ కొలిమి 3) రివర్బరేటరీ కొలిమి 4) పైవన్నీ



39. నిత్యజీవితంలో థర్మైట్ ప్రక్రియ ఉపయోగం?
    1) రైల్వేట్రాక్‌ల వెల్డింగ్ 2) పగిలిన యంత్ర పరికరాలు అతికించడం 3) విద్యుత్తు క్షయకరణం 4) పైవన్నీ
40. కార్నలైట్ రసాయన ఫార్ములా?
    1) $KCl/MgCl_2 6H_2O$ 2) $MgCO_3$ 3) $MgSO_4 7H_2O$ 4) $CaCO_3\ MgCO_3$
41. ప్రగలనంలో ధాతువును ఏం చేస్తారు?
    1) ఆక్సీకరణం 2) క్షయకరణం 3) తటస్థీకరణం 4) విద్యుత్తు విశ్లేషణం
42. వాక్యం (ఎ): అల్పబాష్పీభవన స్థానాలున్న లోహాలను శుద్ధి చేయడానికి స్వేదన పద్ధతిని వాడతారు.
    వాక్యం (బి): అల్ప ద్రవీభవన స్థానాలున్న లోహాలను శుద్ధి చేయడానికి గలనం చేసే పద్ధతిని వాడతారు.
    1) ఎ, బి లు సత్యం 2) ఎ సత్యం, బి అసత్యం 3) ఎ అసత్యం, బి సత్యం 4) ఎ, బి లు అసత్యం
43. వాక్యం (ఎ): లోహం పొందడానికి అత్యంత అనుకూలమైన ఖనిజాన్ని ధాతువు అంటారు.
    వాక్యం (బి): ధాతువులన్నీ ఖనిజాలే కానీ, ఖనిజాలన్నీ ధాతువు కానవసరం లేదు.
    1) ఎ, బి లు సత్యం 2) ఎ సత్యం, బి అసత్యం 3) ఎ అసత్యం, బి సత్యం 4) ఎ, బి లు అసత్యం
44. కిందివాటిని జతపరచండి.
    1) సిన్నబార్ — ఎ) Pb
    2) గెలీనా — బి) Mg
    3) కార్నలైట్ — సి) Hg
    4) బాక్సైట్ — డి) Al
    1) 1-సి, 2-ఎ, 3-బి, 4-డి
    2) 1-సి, 2-బి, 3-ఎ, 4-డి
    3) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి
    4) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ
45. కిందివాటిని జతపరచండి.
    1) అల్పచర్యాశీలతా లోహం — ఎ) Cu
    2) మధ్యస్థ చర్యాశీలతా లోహం — బి) Na
    3) అధిక చర్యాశీలతా లోహం — సి) Au
    1) 1-సి, 2-బి, 3-ఎ 2) 1-సి, 2-ఎ, 3-బి 3) 1-ఎ, 2-బి, 3-సి 4) 1-ఎ, 2-సి, 3-బి

సమాధానాలు

1-2; 2-1; 3-2; 4-1; 5-2; 6-2; 7-1; 8-1; 9-3; 10-2; 11-3; 12-4; 13-2; 14-1; 15-2; 16-1; 17-4; 18-2; 19-1; 20-1; 21-2; 22-4; 23-2; 24-3; 25-1; 26-2; 27-1; 28-4; 29-2; 30-1; 31-4; 32-3; 33-3; 34-4; 35-2; 36-2; 37-1; 38-3; 39-4; 40-1; 41-2; 42-1; 43-1; 44-1; 45-2.

(c) eenadu

మాదిరి ప్రశ్నలు

1. ఒక పక్షి నిమిషంలో 1 కిలోమీటరు ఎగురుతుంది. అయితే పక్షి వేగం మీ./సె.లలో ఎంత?

1) $\frac{16}{3}$ 2) $\frac{25}{3}$ 3) $\frac{50}{3}$ 4) ఏదీకాదు

సాధన: వేగం = $\frac{\text{దూరం}}{\text{కాలం}} = \frac{1 \text{ కి.మీ.}}{1 \text{ ని.}} = \frac{1000 \text{ మీ.}}{60 \text{ సె.}} = \frac{50}{3}$ మీ./సె.

సమాధానం: 3

2. ఒక కారు గంటకు 60 కి.మీ. వేగంతో ప్రయాణిస్తే గమ్యాన్ని చేరడానికి 2 గంటల సమయం పడుతుంది. ఒకవేళ ఆ కారు గంటకు 80 కి.మీ. వేగంతో ప్రయాణిస్తే గమ్యాన్ని చేరడానికి ఎంత సమయం పడుతుంది?

1) $\frac{8}{3}$ గం. 2) $2\frac{2}{3}$ గం. 3) 2 గం. 40 ని. 4) పైవన్నీ

సాధన: 60 కి.మీ. ⟶ 2 గంటలు

80 కి.మీ. ⟶ ?

$\frac{80}{60} \times 2 = \frac{8}{3}$ గంట $= 2\frac{2}{3}$

= 2 గంటల 40 నిమిషాలు

సమాధానం: 4

3. ఒక దుకాణదారుడు తమ అన్ని వస్తువుల అమ్మకాల్లో ప్రకటన వెలపై 10% రాయితీ ప్రకటించాడు. ఒక జత జీన్స్‌పై రూ.1450, రెండు చొక్కాలపై ఒక్కొక్కటి రూ.850 ప్రకటన వెల ఉంటే వినియోగదారుడు ఎంత మొత్తం చెల్లించాలి?

1) రూ.2535 2) రూ.2635
3) రూ.2735 4) రూ.2835

సాధన: జీన్స్ ⟶ 1450

చొక్కాలు ⟶ 1700

$1450 + 1700 = 3150$

$3150 \times \frac{90}{100} = 2835$

సమాధానం: 4

4. ఒక వస్తువు ధర 18% జీఎస్టీతో కలిపి రూ.1239 గా ఉంది. అయితే జీఎస్టీ కలపక ముందు వస్తువు వెల ఎంత? (రూ.లలో)

1) 950 2) 1050 3) 1150 4) 1250

సాధన: 118% = 1239

100% = ?

$\frac{100}{118} \times 1239 = 1050$

సమాధానం: 2

5. రూ.15000లపై సంవత్సరానికి వడ్డీరేటు 5% చొప్పున రెండేళ్ల తర్వాత చెల్లించాల్సిన మొత్తం ఎంత?

1) రూ.16,400 2) రూ.16,500
3) రూ.16,600 4) రూ.16,300

సాధన: $I = \frac{PTR}{100} = \frac{15000 \times 2 \times 5}{100}$

= 1500 + 15000 = రూ.16,500

సమాధానం: 2

6. రామ్ అనే వ్యక్తి విశ్వక్ వద్ద రూ.12,000లను 6% వడ్డీరేటు చొప్పున సాధారణ వడ్డీకి రెండేళ్ల కాలానికి అప్పుగా తీసుకున్నాడు. రామ్ అదే మొత్తాన్ని 6% వడ్డీరేటుకు ఏడాదికొకసారి వడ్డీ చెల్లించే పద్ధతిలో చక్రవడ్డీకి అప్పుగా తీసుకుంటే ఎంత సొమ్ము అదనంగా చెల్లించాల్సి వస్తుంది?

1) రూ.24.2 2) రూ.41.3
3) రూ.43.2 4) రూ.44.5

సాధన: $D = \frac{PR^2}{100^2} = \frac{12000 \times 6 \times 6}{100 \times 100} = 43.2$

సమాధానం: 3

7. బ్యాంక్ క్యాషియర్ వద్ద రూ.100, రూ.50, రూ.10ల విలువైన నోట్లు ఉన్నాయి. ఈ నోట్ల నిష్పత్తి 2 : 3 : 5. క్యాషియర్ వద్ద ఉన్న మొత్తం సొమ్ము రూ.4,00,000. అయితే అతడి వద్ద రూ.100 నోట్లు ఎన్ని ఉన్నాయి?

1) 1000 2) 2000
3) 1500 4) 1200

సాధన: 2 : 3 : 5

2x, 3x, 5x

$100(2x) + 50(3x) + 10(5x) = 400000$

$200x + 150x + 50x = 400000$

$400x = 400000$

$x = 1000$

$2x = 2 \times 1000$

$= 2000$

సమాధానం: 2



ఆ కారు వేగాన్ని మారిస్తే...
గమ్యం చేరే సమయం?

ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

అరిథ్‌మెటిక్

8. ఒక వ్యాస రచన పోటీలో గెలిచిన వారికి రూ.100, గెలవని వారికి రూ.25 ఇవ్వాలని నిర్వాహకులు నిర్ణయించారు. బహుమతుల కోసం పంచాల్సిన మొత్తం రూ.3000. పోటీలో మొత్తం 63 మంది పాల్గొన్నారు. అయితే గెలుపొందిన వారి సంఖ్య ఎంత?

1) 17 2) 18 3) 19 4) 20

సాధన: మొత్తం = 63

గెలిచినవారు = x

ఓడినవారు = 63 − x

$100x + 25(63 - x) = 3000$

$4x + 63 - x = 120$

$3x = 57$

$x = 19$

సమాధానం: 3

9. ఒక జింకల గుంపులో సగం పొలంలో మేస్తున్నాయి. మిగిలిన వాటిలో నాలుగులో మూడోవంతు ఆడుకుంటున్నాయి. మిగిలిన 9 జింకలు కొలనులో నీరు తాగుతున్నాయి. అయితే గుంపులోని మొత్తం జింకల సంఖ్య?

1) 52 2) 62 3) 42 4) 72

సాధన: గుంపులోని జింకల సంఖ్య = x అనుకోండి

సగం జింకలు పొలంలో మేస్తున్నాయి = $\frac{x}{2}$

మిగిలిన వాటిలో నాలుగులో మూడోవంతు

$= \frac{x}{2} \times \frac{3}{4} = \frac{3x}{8}$

మిగిలినవి = $\frac{x}{2} - \frac{3x}{8} = \frac{x}{8}$

$\therefore \frac{x}{8} = 9 \Rightarrow x = 72$

సమాధానం: 4

10. ఆర్తి తల్లి వయసు ఆమె ప్రస్తుత వయసుకు 6 రెట్లు. అయిదేళ్ల తర్వాత ఆర్తి వయసు ఆమె తల్లి ప్రస్తుత వయసులో $\frac{1}{3}$ వ వంతు. అయితే వారి ప్రస్తుత వయసు ఎంత?

1) 5, 30 2) 6, 36 3) 4, 24 4) ఏదీకాదు

సాధన: ఆర్తి వయసు = x

ఆమె తల్లి వయసు = 6x

$x + 5 = 6x \times \frac{1}{3}$

$x + 5 = 2x$

$x = 5$

ఆర్తి (x) ప్రస్తుత వయసు = 5

ఆమె తల్లి ప్రస్తుత వయసు = 6 × 5 = 30

సమాధానం: 1

11. ఈశ్వర్ తండ్రి, ఈశ్వర్ తాత కంటే 26 సంవత్సరాలు చిన్నవాడు. ఈశ్వర్ కంటే 29 సంవత్సరాలు పెద్దవాడు. ఆ ముగ్గురి వయసుల మొత్తం 135 సంవత్సరాలు. అయితే ఈశ్వర్ వయసు ఎంత?

1) 17 2) 18 3) 19 4) 20

సాధన: ఈశ్వర్ వయసు = x

ఈశ్వర్ తండ్రి వయసు = x + 29

ఈశ్వర్ తాత వయసు = x + 29 + 26

$x + x + 29 + x + 29 + 26 = 135$

$3x + 84 = 135$

$3x = 51 \Rightarrow x = 17$

సమాధానం: 1

12. శైలు తోటలోని ఒక వరుసలో 4 మొక్కలు నాటింది. పక్కపక్కనే ఉన్న రెండు మొక్కల మధ్య దూరం $\frac{3}{4}$ మీ. అయితే మొదటి, చివరి మొక్కల మధ్య దూరం ఎంత?

1) $\frac{3}{4}$ మీ. 2) $\frac{12}{4}$ మీ. 3) $\frac{9}{4}$ మీ. 4) 4 మీ.

సాధన: |—$\frac{3}{4}$—|—$\frac{3}{4}$—|—$\frac{3}{4}$—|

$\frac{3}{4} + \frac{3}{4} + \frac{3}{4} = \frac{9}{4}$ మీ.

సమాధానం: 3

13. ఒక వ్యక్తి గంటకు 30 కి.మీ. వేగంతో తన బైక్ నడిపితే 5 నిమిషాలు ఆలస్యంగా గమ్యాన్ని చేరుకుంటాడు. కానీ అతడు గంటకు 40 కి.మీ. వేగంతో ప్రయాణిస్తే 10 నిమిషాలు ముందుగా గమ్యాన్ని చేరుకుంటాడు. అయితే ప్రారంభ స్థానం నుంచి గమ్యం ఎంత దూరంలో ఉంది? (కి.మీ.ల్లో)

1) 15 2) 25 3) 30 4) 20

సాధన: $\left(\frac{40 \times 30}{40 - 30}\right) \times \frac{15}{60} = \frac{40 \times 30}{10} \times \frac{15}{60} = 30$ కి.మీ.

సమాధానం: 3

14. ఒక పరీక్షలో 20 ప్రశ్నలు ఉన్నాయి. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు ఇస్తారు. ప్రతి తప్పు సమాధానానికి $\frac{1}{2}$ మార్కు కోత ఉంటుంది. కుందన్ 13 సరైన సమాధానాలు, 7 తప్పు సమాధానాలు రాసినట్లైతే అతడు పొందిన మొత్తం మార్కులు ఎన్ని?

1) 9.5 2) 10.5 3) 11.5 4) 8.5

సాధన: మొత్తం = 20; సరైనవి = 13

తప్పు సమాధానాలు = 7

$13 \times 1 + 7\left(-\frac{1}{2}\right)$

$13 - \frac{7}{2} = \frac{19}{2} = 9.5$

సమాధానం: 1



రచయిత
యర్రమాద నర్సిరెడ్డి
విషయ నిపుణులు

439 Word of the Day

Mendicancy

Telugu meaning: పేదరికం, ఒంటరితనం

English meaning: The word 'mendicancy' is a noun that describes the practice of begging or living off charity.

Synonyms: Begging, Destitution

Antonyms: Affluence, Prosperity

Usage: **1.** Mendicancy was a common sight in the poverty-stricken streets of medieval cities.

2. The government's social programs were aimed at reducing the need for mendicancy among the homeless.

Latest Updates

Managerial Posts

Bharat Earth Movers Limited (BEML), Bangalore, is inviting applications for 40 Managerial posts on a contract basis. The application fee is Rs.500. Eligible candidates can apply online before 25 October 2024.

CSL, Kerala

Cochin Shipyard Limited (CSL), Kerala invites applications to fill the vacant supervisory posts. The total number of posts is 20. The application fee is Rs.700. The last date for online application is 30 October 2024.

Hospitality Monitor Posts

Indian Railway Catering and Tourism Corporation Limited (IRCTC), North Zone invites applications for Hospitality Monitors on a contract basis. Eligible candidates can appear for an interview on 25 October 2024.


Did You Apply..?

Today (October 14) is the last date for the following Posts/ Admissions

- 39,481 Constable (GD)/ Rifleman (GD) posts. ***Qualifications:*** Matriculation/ 10th Class examination from a recognized Board/ University.
- 2050 Nursing Officer posts in TG MHSRB. ***Qualifications:*** General Nursing and Midwifery (GNM) or B.Sc (Nursing).
- Software Developer posts in EdCIL, Delhi. ***Qualification:*** BCom, B.Sc, MBA, MCA, M.Com, B.Tech/ M.Tech.
- 1,511 Specialist Cadre Officer posts in SBI. ***Qualifications:*** B.E/B.Tech, MCA, M.Tech., M.Sc. in a relevant Engineering discipline with experience.
- B.Sc.(Nursing) 4 years Degree course in KNRUHS, Warangal. ***Eligibility:*** Intermediate.
- M.Sc. and Ph.D. courses in SKLTSHU, Siddipet.

For more information and other notifications - scan QR code

ఈ-బుక్ (సైన్స్ అండ్ టెక్నాలజీ)



దేశంలోని వివిధ భౌగోళిక ప్రాంతాల్లో నివసించే, వివిధ స్థాయిల్లో ఉన్న ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు, వారికి కావాల్సిన కనీస అవసరాలను మరింత వేగంగా అందించడంలో ఇస్రో ప్రముఖ పాత్ర పోషిస్తోంది. ఇది దేశంలో నెలకొన్న వివిధ ప్రాంతీయ కేంద్రాల ద్వారా అంతరిక్ష విభాగం ఆధ్వర్యంలో తన కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

☛ ఇస్రో ఆధ్వర్యంలో దేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తోన్న వివిధ సంస్థలు, వాటి విధులు, అవి తయారు చేసే పరికరాలు మొదలైనవాటి గురించి ఈ-బుక్‌లో వివరించారు.

చదవడం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

కరెంట్ అఫైర్స్



దక్షిణ కొరియా రచయిత్రి హాన్ కాంగ్ (53) 2024 ఏడాదికి సాహితీ నోబెల్ పురస్కారం గెలుచుకున్నారని నోబెల్ కమిటీ 2024, అక్టోబరు 10న ప్రకటించింది. ఆమె రచనల్లో చారిత్రక పరిణామాలు తెచ్చిపెట్టిన మనో వ్యాఘాతాలు, మానవ జీవితంలోని దుర్బలత ప్రగాఢంగా చిత్రితమవుతాయని వివరించింది. కాంగ్ సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందిన మొట్టమొదటి ఆసియా రచయిత్రి, దక్షిణ కొరియా సాహితీవేత్త.



భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 2024, అక్టోబరు 8న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 70వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో విజేతలకు పురస్కారాలు అందించారు. నటుడు మిథున్ చక్రవర్తిని భారతీయ చలన చిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మక 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డుతో సత్కరించారు.

- 'కాంతార' చిత్ర కథానాయకుడు రిషబ్ శెట్టి ఉత్తమ నటుడి పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ నటిగా నిత్యామేనన్ (తిరుచిత్రాంబళం), మానసీ పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్) అవార్డులు స్వీకరించారు.

లావోస్ రాజధాని వియంటియాన్‌లో 2024, అక్టోబరు 10న జరిగిన 21వ భారత్-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సును ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. భారత్-ఆసియాన్ మధ్య సమగ్ర భాగస్వామ్య బలోపేతానికి 10 సూత్రాల ప్రణాళికను మోదీ ప్రకటించారు. ఆసియా భవిష్యత్తుకు ఈ ప్రాంతీయ దేశాల కూటమితో సంబంధాలు కీలకమని వ్యాఖ్యానించారు.

- గత దశాబ్దకాలంలో భారత్-ఆసియాన్ దేశాల మధ్య వాణిజ్యం రెట్టింపై 130 బిలియన్ డాలర్లకు చేరుకుందన్నారు.

కరెంట్ అఫైర్స్ ఈబుక్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

One Word Substitution

SSC Exams
English

Directions (Qs. 1 - 25): *Choose the correct one-word substitution of the given phrase/sentence.*

1. One who is all-powerful:
A) Omniscient B) Omnipresent
C) Omnipotent D) Pessimist

2. A speech delivered without any preparation:
A) Dialogue B) Extempore
C) Monologue D) Lecture

3. A person who loves books:
A) Bibliophile B) Bibliophagist
C) Bibliographer D) Philanthropist

4. A person who does not believe in the existence of God:
A) Theist B) Pious
C) Agnostic D) Atheist

5. A place where coins are made:
A) Foundry B) Mint
C) Factory D) Furnace

6. A person who studies human societies and cultures:
A) Anthropologist B) Sociologist
C) Biologist D) Archaeologist

7. The practice of having more than one spouse at a time:
A) Monogamy B) Bigamy
C) Polygamy D) Celibacy

8. An official public announcement:
A) Declaration B) Bulletin
C) Manifesto D) Proclamation

9. A person who cannot be corrected:
A) Incredible B) Infallible
C) Incorrigible D) Irresponsible

10. A large-scale departure of people:
A) Evacuation B) Emigration
C) Banishment D) Exodus

11. A person who walks in their sleep:
A) Somnambulist B) Insomniac
C) Lunatic D) Hypnotist

12. A person who has great enthusiasm for something:
A) Cynic B) Fanatic
C) Stoic D) Pragmatist

13. A short, amusing story about a real incident or person:
A) Novel B) Parable
C) Fable D) Anecdote

14. A person who is obsessed with themselves:
A) Egoist B) Narcissist
C) Introvert D) Altruist



15. The belief that all events are predetermined and inevitable:
A) Fatalism B) Optimism
C) Stoicism D) Pragmatism

16. One who enjoys inflicting pain on others:
A) Philanthropist B) Masochist
C) Sadist D) Ascetic

17. A person who composes poems:
A) Novelist B) Playwright
C) Poet D) Critic

18. A government run by the wealthy:
A) Monarchy B) Theocracy
C) Plutocracy D) Bureaucracy

19. An exact copy, especially of written material:
A) Replica B) Facsimile
C) Counterfeit D) Imitation

20. A person who studies languages:
A) Geologist B) Linguist
C) Biologist D) Lexicographer

21. A woman who remains unmarried:
A) Spinster B) Widow
C) Bachelorette D) Virgin

22. A person who can speak two languages fluently:
A) Bilingual B) Trilingual
C) Multilingual D) Monolingual

23. One who studies the evolution of mankind:
A) Ecologist B) Ornithologist
C) Archaeologist D) Anthropologist

24. The custom of having only one husband or wife at a time:
A) Polygamy B) Bigamy
C) Celibacy D) Monogamy

25. The act of killing one's own father:
A) Infanticide
B) Homicide
C) Parricide
D) Patricide

Scan the QR code for Key

Writer:
P. Manoj Kumar, Subject Expert

(c) eenadu

గ్రామీణ రోడ్ల ప్రాజెక్టు గడువు రెండేళ్లు పొడిగించాలి

- రాష్ట్ర వాటా 30-10 శాతానికి తగ్గించండి
- రుణం విడుదలలో పాత విధానాన్ని అమలు చేయాలి
- ఏఐఐబీకి కేంద్రం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి
- గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిన ప్రాజెక్టును గాడిలో పెట్టే యత్నం

అంచనా వ్యయం: రూ.4,976 కోట్లు
మొత్తం రహదారులు: 3,665
పనులు ప్రారంభమైనవి: 3,252
ఇంకా చేపట్టాల్సిన పనులు: 413
ప్రాజెక్టు గడువు ముగిసేది: 2024 డిసెంబరు

ఈనాడు, అమరావతి: గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) రుణంతో చేపట్టిన ప్రాజెక్టు పనులను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది డిసెంబరుతో ముగియనున్న ప్రాజెక్టు గడువును రెండేళ్లు పొడిగించాలని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. బ్యాంకు నుంచి అడ్వాన్స్ ఇప్పిస్తే పెండింగ్ పనులు పూర్తిచేస్తామని తెలిపింది. ప్రాజెక్టుకు రాష్ట్రవాటా 30% నుంచి 10%కు తగ్గించాలని కేంద్రాన్ని కోరింది. తెదేపా హయాంలో 2019లో ఏఐఐబీ రుణసాయంతో రూ.5,026 కోట్లతో చేపట్టిన గ్రామీణ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టును వైకాపా ప్రభుత్వం భ్రష్టుపట్టించింది. రాష్ట్రప్రభుత్వ వాటా సరిగా ఇవ్వకపోగా బ్యాంకు విడుదల చేసిన రుణం కూడా ఇతర అవసరాలకు వాడేసింది. ఫలితంగా ప్రాజెక్టు గడువు ఈ ఏడాది డిసెంబరుతో ముగిసిపోతున్నా తొలి దశలో ప్రారంభించిన రహదారుల పనులు పూర్తికాలేదు. గుత్తేదారులకు రూ.600 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో పెట్టారు.

బ్యాంకును ఒప్పించే ప్రయత్నం

వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో ప్రాజెక్టుకు మిగిలిన రుణం ఇచ్చేందుకు అంగీకరించని ఏఐఐబీని కేంద్రం ద్వారా ఒప్పించేందుకు రాష్ట్రప్రభుత్వం యత్నిస్తోంది. మిగతా రుణం విడుదల చేస్తే 2026 డిసెంబరులోగా పనులన్నీ పూర్తిచేస్తామని చెబుతోంది. ప్రాజెక్టులో భాగంగా రూ.4,976 కోట్లతో 7,213 కిలోమీటర్ల 3,665 రహదారుల నిర్మాణ పనుల పూర్తికి రాష్ట్రప్రభుత్వం, ఏఐఐబీ మధ్య తొలుత ఒప్పందం జరిగింది. ఇందులో బ్యాంకు రుణం 70%, రాష్ట్రప్రభుత్వ వాటా 30%గా అప్పట్లో నిర్ణయించారు. గత ఐదేళ్లలో బ్యాంకు రూ.908 కోట్ల రుణం విడుదల చేసింది. ఈపాటికే బ్యాంకు రుణం రూ.3,418 కోట్లు వినియోగించుకోవాలి. రాష్ట్రప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన రూ.1,608 కోట్లలో రూ.594 కోట్లే సమకూర్చింది. మిగతా నిధులు ఇవ్వకపోవడంతో ఏఐఐబీ కూడా మిగతా రుణం విడుదల చేయలేదు. అందుకే ప్రాజెక్టు జాప్యమైందని బ్యాంకు ప్రతినిధుల బృందం ఇచ్చిన నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రవాటా నిధులు కేటాయించి గడువులోగా ప్రాజెక్టు పూర్తిచేయాలని వైకాపా ప్రభుత్వానికి ఏఐఐబీ లేఖలు రాసినా ఫలితం లేకపోయింది.

రూ.1,000 కోట్ల అడ్వాన్స్ కోసం విజ్ఞప్తి

తొలిదశలో ప్రారంభించి నిలిచిపోయిన 3,290 కిలోమీటర్ల 1,698 రహదారుల పనులు పూర్తిచేసేందుకు రాష్ట్రానికి ఇంకా రావల్సిన రుణంలో నుంచి రూ.1,000 కోట్లు అడ్వాన్స్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం బ్యాంకును కోరింది. 2026 డిసెంబరులోగా మిగిలిన 959 కిలోమీటర్ల 959 రహదారుల పనులనూ రూ.488 కోట్లతో పూర్తిచేస్తామని తెలిపింది. బ్యాంకు రుణం పాత విధానంలో లాగే తొలుత విడుదల చేసేలా చూడాలని కేంద్రానికి విజ్ఞప్తిచేసింది. ప్రాజెక్టు ప్రారంభంలో రుణంలో కొంత మొత్తాన్ని బ్యాంకు ఇచ్చాక రాష్ట్రప్రభుత్వ వాటా సమకూర్చేవారు. గత ప్రభుత్వం బ్యాంకు ఇచ్చిన రుణాన్నీ ఇతర అవసరాలకు మళ్లించడంతో రాష్ట్రవాటా నిధులు మొదట ఖర్చు చేశాకే బ్యాంకు రుణం ఇస్తామని ఏఐఐబీ మెలికపెట్టింది.



డబ్బింగ్ జానకికి సూర్యకాంతం జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ప్రముఖులు

సినీ, నిజ జీవితాల్లో సూర్యకాంతం ఆదర్శం

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- డబ్బింగ్ జానకికి సూర్యకాంతం జీవన సాఫల్య పురస్కారం ప్రదానం

కాకినాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: వంటల పుస్తకం రాయడంతో పాటు ఇంటికి వచ్చిన వారికి కడుపు నిండా భోజనం పెట్టిన విలక్షణ నటి సూర్యకాంతం అందరికీ ఆదర్శప్రాయురాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రస్తుతించారు. కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో ది యంగ్‌మెన్స్ హ్యాపీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ప్రముఖ నటి సూర్యకాంతం శతజయంతి సభ నిర్వహించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రుల అభిమాన అత్తగా ఆమె తెలుగువారి గుండెల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. 'సూర్యకాంతం సినీ జీవితం, నిజ జీవితం ఆదర్శనీయం. ఆమె వద్ద అనేక మంది కళాకారులు తెలుగు నేర్చుకున్నారు. ఆమె పాటలు బాగా పాడేవారు. వెంకటకృష్ణారాయపురం నుంచి యంగ్‌మెన్స్ హ్యాపీక్లబ్‌కు సైకిల్‌పై వచ్చి రిహార్సల్ చేసేవారని గుర్తుచేశారు. సూర్యకాంతం కుమారుడు అనంత పద్మనాభమూర్తి మాట్లాడుతూ సొంతూరిలో తన తల్లిగారి శతజయంతి ఉత్సవాలు నిర్వహించడం, పురస్కారం ఇవ్వడం ఆమెకు అసలైన నివాళిగా పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు మాట్లాడుతూ క్లబ్ సభ్యురాలిగా సూర్యకాంతం ఇక్కడే నాటకాలు వేసి, సినీరంగంలోకి ప్రవేశించి గొప్ప నటిగా ఎదిగారని స్మరించుకున్నారు. కాకినాడ సీపోర్ట్స్ సీఈవో మేర్ల మురళీధర్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ వాడ్రేవు రవి, ఎన్టీఆర్ కళాపరిషత్ కార్యదర్శి కె.సాంబశివరావు హాజరయ్యారు.

నవంబరులో ప్రజాపోరు: సీపీఎం

ఈనాడు, అమరావతి: అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నవంబరు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపోరు పేరుతో ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు తెలిపారు. జిల్లా కలెక్టరేట్లు, మండల కార్యాలయాల వద్ద 8న నిరసన ప్రదర్శనలు చేపడతామని చెప్పారు. విజయవాడలో ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. "గత నెల రోజుల్లోనే ధరలు భారీగా పెరిగాయి. దసరా పండుగ రోజు సరుకుల కొనుగోళ్లలోనూ ధరల ప్రభావం కనిపించింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్న యువత నిరాశకు గురవుతోంది. డీఎస్సీ వాయిదా పడింది. ఏపీపీఎస్సీకి ఛైర్‌పర్సన్‌ను నియమించలేదు. విద్యుత్తు ట్రూఅప్ ఛార్జీల పద్ధతిని రద్దు చేయాలి. గత ప్రభుత్వ హయాంలో వేసిన ట్రూఅప్ ఛార్జీలను ఉపసంహరించుకుంటూ రెగ్యులేటరీ కమిషన్‌కు తెలియజేయాలి. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 18న అన్ని విద్యుత్తు కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నాం" అని తెలిపారు.

జూట్ మిల్లు కబ్జా చేసిన వైకాపా నేత అంబటి


- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల ధ్వజం



పొన్నూరు, న్యూస్‌టుడే: వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణను ఏలూరు జూట్ మిల్లు డైరెక్టరుగా తీసుకున్న తరవాత కబ్జా చేశారని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపించారు. పొన్నూరులో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మురళీకృష్ణ గత ప్రభుత్వ కాలంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. గుంటూరు కార్పొరేషన్ అధికారులు నుంచి గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్ నిర్మాణానికి జీ+5 అనుమతులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా 15 అంతస్తులు నిర్మించారని పేర్కొన్నారు. ఈ భవన నిర్మాణానికి రైల్వే శాఖాధికారులు నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులూ లేవని వెల్లడించారు. రాజకీయ ముసుగులో వైకాపా నేత చేసిన పాపాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వినియోగదారులు నుంచి కుట్రపూరితంగా వైకాపా నేత అంబటి రూ.లక్షలు వసూలు చేసిన మాట వాస్తవం కదా అని ప్రశ్నించారు. సంగం డెయిరీపై 30 సంవత్సరాల కిందట ఏదో జరిగిందని కేసు నమోదు చేసి జైలుకు పంపారని, అయినా దీటుగా ఎదుర్కొన్నానని చెప్పారు. సంగం డెయిరీపై అనాటి వైకాపా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, గత ఎన్నికల వైకాపా అభ్యర్థి అంబటి మురళీకృష్ణ మరలా నరేంద్రకుమార్‌ను జైల్లో వేస్తామని బహిరంగంగా చెప్పారని, ఎటువంటి తప్పూ చేయకపోయినా ఎన్ని సార్లైనా జైలుకు వెళ్లడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆనాడే వెల్లడించానని తెలిపారు. రాజకీయంగా కక్ష సాధించాల్సిన అవసరం తనకు లేదన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు, దసరాను వేడుకగా నిర్వహించాం

- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి




ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, ఇంద్రకీలాద్రి దసరా వేడుకల్ని విజయవంతంగా, వైభవోపేతంగా నిర్వహించినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. భక్తులందరికీ సులువుగా దర్శనం అయ్యేలా, వారికి సుసంపన్న ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా ఏర్పాట్లు చేసినట్టు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. "తిరుమల బ్రహ్మోత్సవాల్లో శ్రీవారిని ఆరు లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. వాహనసేవల్ని 15 లక్షల మంది వీక్షించారు. తితిదే గతంలో 16 లక్షల మందికి అన్నప్రసాదం అందించగా ఈ ఏడాది 26 లక్షల మందికి అందజేసింది" అని సీఎం పేర్కొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి వామపక్షాల సంతాపం

ఈనాడు, అమరావతి: పౌరహక్కుల నేత ప్రొఫెసర్ సాయిబాబా మృతి పట్ల సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, రామకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. సాయిబాబా కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. "చక్రాల కుర్చీకే పరిమితమైన సాయిబాబాను దీర్ఘకాలంపాటు ఉపా చట్టం కింద చేయని నేరానికి జైల్లో ఉంచారు. బెయిల్‌పై విడుదలైన కొద్ది నెలలకే మరణించడం దురదృష్టకరం. ఇప్పటికైనా పౌర హక్కులపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి" అని పేర్కొన్నారు.

పండగకొచ్చారు... పట్నం బాట పట్టారు



విజయవాడ-హైదరాబాద్ రహదారిపై చౌటుప్పల్ వద్ద...



వరంగల్-హైదరాబాద్ రహదారిపై బీబీనగర్ టోల్ ప్లాజా వద్ద ఆదివారం బారులు తీరిన వాహనాలు

దసరా పండగకు పల్లెలకు వచ్చిన ప్రజలు ఆదివారం నుంచే పట్నం బాట పట్టారు. వరంగల్-హైదరాబాద్ రహదారిపై బీబీనగర్ టోల్ ప్లాజా వద్ద, విజయవాడ-హైదరాబాద్ మార్గంలో చౌటుప్పల్ వద్ద వందల సంఖ్యలో కార్లు, ఇతర వాహనాలు బారులు తీరాయి. బతుకమ్మ సంబరాలు, దసరా పండగ, దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో జనం తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు, ప్రయాణికులకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు.

– ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, చౌటుప్పల్

సింగరేణి బొగ్గు ధర మండుతోంది!

- దేశంలోకెల్లా అత్యధికం ఇక్కడే
- మహానది, వెస్టర్న్ గనులకన్నా 2 రెట్లు ఎక్కువ
- విద్యుత్ సంస్థలపై ఆర్థికభారం
- ఉత్పాదక వ్యయం తగ్గించాలని తెలంగాణ ప్రభుత్వ ఆదేశాలు



ఈనాడు, హైదరాబాద్: సింగరేణిలో బొగ్గు ఉత్పాదక వ్యయం అధికంగా ఉన్నందున దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ సంస్థలపై ఆర్థికభారం ఎక్కువగా ఉంటోంది. ఈ మేరకు బొగ్గు సరఫరా చేస్తున్న మహానది కోల్‌ఫీల్డ్స్, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ సంస్థలతో పోలిస్తే సింగరేణి బొగ్గు ధర సగటున వివిధ గ్రేడ్‌లను పరిశీలిస్తే దాదాపు 2 రెట్లు ఎక్కువగా ఉంది. ఇది దేశంలోనే అత్యధికమని అధికార వర్గాలు చెబుతున్నాయి. సింగరేణి బొగ్గు ధరలను దేశంలోని ఇతర కంపెనీలతో పోల్చి రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించింది. నాణ్యతను బట్టి బొగ్గును గ్రేడ్‌లవారీగా ధరలు నిర్ణయించి విక్రయిస్తారు. ఈ మేరకు మట్టి, బూడిద శాతాలు తక్కువగా ఉండే జీ5 గ్రేడ్ బొగ్గును (టన్నుకు) సింగరేణి రూ.5,685కి విక్రయిస్తే.. మహానది, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్‌లు రూ.2,970కే అమ్ముతున్నాయి. అలాగే జీ16 గ్రేడ్‌ను సింగరేణి రూ.1,620కి విక్రయిస్తుంటే మహానది రూ.514, వెస్టర్న్ రూ.614కే ఇస్తున్నాయి. ఇలా జీ5 నుంచి జీ17 దాకా ఒక్కోగ్రేడ్ ధర టన్నుకు ఎంతనేది వివరిస్తూ సింగరేణి సంస్థ తాజాగా తెలంగాణ ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. సింగరేణిలో ఖర్చులు చాలాఎక్కువగా ఉండటంతో పాటు.. కార్మికులు, భారీయంత్రాల వినియోగ సమయం చాలా తక్కువగా ఉన్నందున బొగ్గు టన్నుకు సగటు ఉత్పాదక వ్యయం అధికంగా ఉన్నట్లు వివరించింది. ఈ వ్యయాన్ని గణనీయంగా తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఎక్కువగా జీ9, జీ10, జీ11, జీ12 గ్రేడ్‌ల బొగ్గును సింగరేణి సరఫరా చేస్తోంది. ఈ గ్రేడ్‌ల బొగ్గులో నాణ్యత తక్కువగా ఉండటం వల్ల విద్యుదుత్పత్తి కోసం మండించినప్పుడు అధిక పరిమాణంలో వినియోగించాల్సి వస్తోందని విద్యుత్ ఇంజినీర్లు తెలిపారు. సింగరేణి నుంచి సరఫరా అవుతున్న బొగ్గులో నాణ్యత లేక బూడిద ఎక్కువగా వెలువడుతోందని, మట్టిని తొలగించి నాణ్యమైంది పంపాలని తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో) కూడా ఇటీవల సింగరేణికి రెండుసార్లు లేఖలు రాసింది.


డిస్కంలపై భారం..

సింగరేణి గనులు తెలంగాణలోనే ఉన్నాయనే కారణంతో రాష్ట్ర విద్యుదుత్పత్తి ప్లాంట్లు కొంటున్నాయి. ఇతర గనులు దూరంగా ఉన్నందున తక్కువధరకు కొన్నా రవాణావ్యయం ఎక్కువగా ఉంటుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత నిర్మించిన భద్రాద్రి విద్యుత్ ప్లాంటులో ఒక యూనిట్ కరెంటు ఉత్పత్తికి సగటున రూ.5.50కి మించి వ్యయమవుతోంది. 2024-25లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ తెలంగాణ విద్యుదుత్పత్తి ప్లాంట్లకు సింగరేణి నుంచి సరఫరా చేసిన బొగ్గుకు టన్నుకు సగటున రూ.5,369 చొప్పున వసూలు చేశారు. కొత్తగూడెం 7వ దశ కొత్తప్లాంటుకు సరఫరా అయిన బొగ్గుకు టన్నుకు ఏకంగా రూ.6,449 చొప్పున సింగరేణికి జెన్‌కో చెల్లించింది. ఇలా అధిక ధరలకు కొనడం వల్ల విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లపై అధికంగా ఆర్థికభారం పడుతోంది. ప్రజలకు కరెంటు సరఫరా చేయాలంటే సగటున యూనిట్‌కు రూ.7.37 వ్యయమవుతున్నట్లు డిస్కం వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో కరెంటు ఛార్జీలు పెంచాలని.. లేకపోతే డిస్కంలు నష్టాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇంజినీర్లు వివరించారు. బొగ్గు సగటు ఉత్పాదక వ్యయం తగ్గించడానికి కార్మికులతో ఇటీవల అవగాహన సదస్సులు నిర్వహించినట్లు సింగరేణి సీఎండీ బలరాం 'ఈనాడు'కు చెప్పారు. బొగ్గు సగటు ఉత్పాదక వ్యయం అధికంగా ఉందని, తగ్గించకపోతే పోటీమార్కెట్‌లో నిలబడలేక భవిష్యత్తులో సింగరేణికి ఇబ్బందులు వస్తాయని, ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టివిక్రమార్క సూచించారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

- విపత్తు నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా

ఈనాడు, అమరావతి: నైరుతి బంగాళాఖాతంలో శనివారం ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా మారే అవకాశం ఉండటంతో కోస్తాలో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తెలిపారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని సూచించారు. రాబోయే 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



మీపై మీకు ప్రేమ ఉంటే ఇవి చేయండి

తమను తాము ప్రేమించేవారు రోజూ 8 గంటలు నిద్రపోతారు. ప్రకృతిలో ఎక్కువ సమయం గడుపుతారు. క్రమం తప్పక వ్యాయామం, ధ్యానం చేస్తారు. పోషక విలువలతో కూడిన మితాహారాన్ని తీసుకుంటారు. ప్రతికూల ఆలోచనలతో తమ మనసును కలుషితం చేసే వ్యక్తుల నుంచి దూరంగా ఉంటారు. భావోద్వేగాల నియంత్రణపై పట్టు సాధిస్తారు. వీటన్నింటికీ క్రమశిక్షణ అవసరం.

– డాన్ గో, హై పర్‌ఫార్మన్స్ కోచ్

తెలంగాణ ఉద్యమంలో ఐకాస ఏర్పాటుకు స్ఫూర్తి

అలయ్ బలయ్

- ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి
- ప్రజలు అసహ్యించుకునేలా రాజకీయాలను తయారు చేయకండి: కిషన్‌రెడ్డి

నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధన ప్రక్రియ ఆలస్యమవుతున్నప్పుడు రాజకీయ పార్టీల జెండాలు, ఎజెండాలకు అతీతంగా ఐకాస ఏర్పాటుకు బండారు దత్తాత్రేయ నిర్వహించిన 'అలయ్ బలయ్' స్ఫూర్తినిచ్చిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో దసరా సందర్భంగా హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గతంలో అలయ్ బలయ్ లాంటి కార్యక్రమాలు పార్టీల వారీగా ఉండేవన్నారు. కానీ దత్తాత్రేయ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని 19 ఏళ్ల క్రితం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఉద్యమకాలంలో ఆర్‌ఎస్‌ఎస్ నుంచి ఆర్‌ఎస్‌యూ వరకు, కమ్యూనిస్టుల నుంచి కాంగ్రెస్ వరకు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, చాకలి, మంగలి ఇలా అన్ని సామాజిక వర్గాలను కార్యోన్ముఖుల్ని చేయడానికి సహకరించిందని పేర్కొన్నారు. దత్తాత్రేయ అందించిన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వారసత్వాన్ని ఆయన కుమార్తె విజయలక్ష్మి కొనసాగించాలని, అందుకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ సంస్కృతి గొప్పదనాన్ని నవతరానికి తెలియజెప్పే కార్యక్రమం ఇదని చెప్పారు. త్రిపుర, తెలంగాణ రాష్ట్రాల్లోని సంస్కృతికి సారూప్యత ఉందని పేర్కొన్నారు. భారతీయ పండగలు ఐకమత్యానికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 'రాజకీయ పార్టీలకు సిద్ధాంతాలు, కార్యక్రమాలుంటాయి. ఎన్నికలప్పుడు పరస్పరం విమర్శలు చేసుకోవచ్చు. ఎన్నికల తరువాత పేదలు, బడుగు బలహీనవర్గాల సంక్షేమం, రాష్ట్రం, నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి సారించాలి. దురదృష్టవశాత్తు తెలంగాణలో ఆ స్ఫూర్తి లోపించింది. ప్రజలు అసహ్యించుకునేలా రాజకీయాలను తయారు చేయకండి' అని వ్యాఖ్యానించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ నిరంతరం రాజకీయాల్లో విమర్శలు చేసుకునే వారిని ఒక వేదికపైకి తీసుకురావడం గొప్ప ప్రయత్నమని చెప్పారు. ఇదే స్ఫూర్తితో విభేదాలు మరచి అంతా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు. చిత్రంలో విజయలక్ష్మి

పండగలంటే పూజలు, ఆరాధనలే కాదు.: వెంకయ్యనాయుడు

పండగలకు ఆధ్యాత్మికతతోపాటు సామాజిక ప్రాముఖ్యం కూడా ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. పండగలంటే పూజలు, ఆరాధనలే కాదు. అంతా కలిసి మెలిసి కబుర్లు చెప్పుకోవడం. బంధాలు, అనుబంధాలు, మైత్రి పరిపుష్టి చేసేదే పండగ అని పేర్కొన్నారు. రాజస్థాన్, మేఘాలయ, ఉత్తరాఖండ్ గవర్నర్లు హరిభౌ బాగడే, సీహెచ్ విజయశంకర్, లెఫ్టినెంట్ జనరల్ గుర్మిత్‌సింగ్, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు మాట్లాడారు. దత్తాత్రేయ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఏపీ మంత్రి సత్యకుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీలు ప్రొ.కోదండరాం, సురభి వాణీదేవి, గోరటి వెంకన్న, ఎంపీలు డా.కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ పాల్గొన్నారు.

'స్టార్టప్ ఆంధ్ర'... పరిపాలన విధానాన్ని మార్చే ప్రక్రియ

- వరదల విపత్తు నిర్వహణకు

పలు అంకుర సంస్థల భాగస్వామ్యం: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ఇటీవల రాష్ట్రంలో వరద విపత్తు సంభవించినప్పుడు దానికి ఎదుర్కోవడానికి కొన్ని అంకుర సంస్థలు ప్రభుత్వానికి సహకరించాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. 'స్టార్టప్ ఆంధ్ర' కేవలం నినాదం మాత్రమే కాదని...పరిపాలన విధానాన్ని మార్చే ప్రక్రియని 'ఎక్స్' వేదికగా ఆదివారం స్పష్టం చేశారు. వరదల్ని సమర్థంగా ఎదుర్కోవడంలో అంకుర సంస్థల వినియోగం ఓ నూతన అధ్యాయమని అభివర్ణించారు. "విశాఖలో ఉన్న ఫ్లూయంట్ గ్రిడ్ అనే స్టార్టప్, హైదరాబాద్ ఆధారిత రింట్- ఎస్ఎస్, సాట్-స్క్వేర్, కోప్టార్లు అనే స్టార్టప్ సంస్థలు వరద తీవ్రతను లెక్కించడానికి, దోమలు, అంటువ్యాధులు ప్రబలకుండా నివారించడానికి, ఆహారం సరఫరా, బాధితుల గణన, పరిహారం అందించడానికి సహాయపడ్డాయి" అని లోకేశ్ వెల్లడించారు.

'గుడ్‌బుక్'లో మీ పాలనలో జరిగిన అకృత్యాలు, అరాచకాల గురించి రాయండి

- మాజీ సీఎం జగన్‌పై లంకా దినకర్ ధ్వజం

ఈనాడు, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి జగన్ రాస్తానన్న 'గుడ్ బుక్'లో ఆయన పాలనలో జరిగిన అకృత్యాలు, అరాచకాలు, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రతికూలంగా ప్రభావితం చేసిన నిర్ణయాల గురించి ప్రస్తావించాలని భాజపా ముఖ్యఅధికార ప్రతినిధి లంకా దినకర్ డిమాండ్ చేశారు. ఈ ఉదాహరణలతో భవిష్యత్తు పాలకులు ఎలా ఉండకూడదో ఆయన చెప్పగలిగితే, తప్పకుండా అది 'మంచి పుస్తకం' అవుతుందని ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. "గత వైకాపా ప్రభుత్వం 'రూల్ బుక్' ప్రకారం పాలించకపోవడం, అణచివేత, నిరంకుశధోరణితో వ్యవహరించడంతో 'రెడ్‌బుక్' రూపొందింది. 2019-24 మధ్య ఆర్థికంగా, పాలనాపరంగా అవకతవకలు జరిగాయి. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టారు. నేడు ప్రతిపక్షంలోనూ అదే ధోరణితో వ్యవహరిస్తున్నారు" అని లంకా దినకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ చేపట్టిన 'వికసిత్ భారత్' సంకల్పంలో రాష్ట్రాన్ని భాగస్వామ్యం చేస్తూ 'స్వర్ణాంధ్ర' సాధన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు 'విజన్ డాక్యుమెంట్' తయారు చేస్తున్నారని స్పష్టం చేశారు. "జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందించడం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యాచరణకు ఉపక్రమించారు. టీసీఎస్ వంటి సంస్థల్ని ఆహ్వానించడం ద్వారా యువతకు ఉపాధి కల్పించడానికి నారా లోకేశ్ కృషి చేస్తున్నారు" అని లంకా దినకర్ పేర్కొన్నారు.

ఇద్దరు పోలీసుల బలవన్మరణం

- పురుగుల మందు తాగి ఒకరు.. తుపాకీతో కాల్చుకొని మరొకరు..
- తెలంగాణలోని రెండు జిల్లాల్లో ఘటనలు



సాగర్



శ్రీనివాస్

ఏన్కూరు, బూర్గంపాడు, నెహ్రూ సెంటర్, న్యూస్‌టుడే: గంజాయి చోరీ కేసులో తనను ఇరికించారంటూ సెల్ఫీవీడియో తీసుకుని కానిస్టేబుల్, కుటుంబంలో విభేదాలతో హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు ఆదివారం తెలంగాణలోని ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో జరిగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఏన్కూరుకు చెందిన భూక్యా సాగర్(34) 2013 నుంచి కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో పనిచేస్తున్న సమయంలో ఠాణాలోని గంజాయి చోరీకి గురైంది. విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు సాగర్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం ఇటీవలే పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం ఠాణాలో పోస్టింగ్ ఇచ్చారు. అక్కడ 13న (ఆదివారం) విధుల్లో చేరాల్సి ఉండగా సాగర్ శనివారం పురుగు మందు తాగారు. కుటుంబసభ్యులు హైదరాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందారు. సాగర్ పురుగు మందు తాగుతూ సెల్ఫీవీడియో చిత్రీకరించి కుటుంబసభ్యులకు పంపించారు. అందులో.. గంజాయి కేసులో తనను అన్యాయంగా ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలతోపాటు బూర్గంపాడుకు చెందిన ఓ వ్యక్తి పేరును వీడియోలో ప్రస్తావించారు. సస్పెండ్ చేశారన్న మనస్తాపాన్ని తట్టుకోలేకపోతున్నానని కన్నీటిపర్యంతమయ్యారు. హైదరాబాద్ ఆసుపత్రిలోనూ తన వాంగ్మూలాన్ని కుటుంబసభ్యుల ఎదుట వెల్లడించారు. సాగర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తన కుమారుడు వాంగ్మూలంలో చెప్పిన వ్యక్తుల కారణంగానే బలవన్మరణానికి పాల్పడ్డాడంటూ మృతుడి తండ్రి కిషన్ ఏన్కూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నలుగురిపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేశారు.

కుటుంబంలో విభేదాలతో.. మహబూబాబాద్‌లోని ఎన్జీవోస్ కాలనీలో నివసిస్తున్న గుడిబోయిన శ్రీనివాస్(59) కలెక్టరేట్ స్ట్రాంగ్‌రూం వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 4.40 గం.ల ప్రాంతంలో అక్కడ పెద్దశబ్దం వినిపించడంతో కార్యాలయ సిబ్బంది వెళ్లి చూడగా శ్రీనివాస్ రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించారు. పక్కనే తుపాకీ ఉంది. గత ఐదేళ్లుగా శ్రీనివాస్ కుటుంబంలో విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా ఆయన తన భార్య, కుమారుడికి దూరంగా ఉంటున్నారు. మానసిక ఆవేదనకు గురై ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. శ్రీనివాస్ 1990లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై వరంగల్‌లో విధులు నిర్వర్తించారు. 2016 నుంచి మహబూబాబాద్‌లో పనిచేస్తున్నారు. 2018లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించింది.

(c) eenadu